   Why invest in your hometown when it comes to multiplication of wealth instead of going to cities where your money can multiply much faster & to a much greater extent?

6. I am not sure when I will relocate and hence will decide after 5 years or more (VETERANS who decide to settle down in USA/other countries have infact closed their minds totally to the idea of investing in India even though good opportunities exist, due to fear of NON-REPATRIABILITY).

   Since repatriation of any amount is now possible, you can invest and keep multiplying your wealth as you can repatriate your wealth in India at any point of time.

**Continued on next page….**

# Patrons, Sponsors & Donors
# For TFAS 30 Year Celebrations

## SPONSORS (up to $500.00)

Biryani Pot
Bharatavarapu, Srinivas
Bupathi, Kishore
Chatakondu, Suresh & Priya
Chintamani, Balaji
Gopu, Kishore
Karamsetty, Ravi
Myneni, Mohan & Aruna
Neppalli, Rao
Peddi, Ravi & Kavitha
Seethala, Rama Krishna
Suwarna, Pradeep
Vemparala, Sujatha
Bupathi, Bhaskar
Chandra, Ramesh
Cheruvu, Srinivas
Gopu, Praveen
Jayaraman, Bala
Maruwada, Raj
Nemana, Satya & Padma
Paluri, Anand
Pogaku, Mahesh
Sriramaneni, Arun
Uppala, Anantha Sudhaker & Shailaja

## Donors ($250.00)

Bhargava, Manju
Eleswarapu, Rama Krishna
Maganti, Ramesh
Puskar, Ravi & Jamuna
Vinjamuri, Ramesh
Chintawar, Prashant & Saritha
Kommidi, Balwant
Presingu, Hemant
Velishala, Naga Mahender & Rani





7. I may relocate in 2 years & hence want to buy a flat or villa for my stay on return.

   Many NRIs dump their life savings just to acquire an asset in India 1 or 2 years prior to their relocation back to India only to discover upon arrival that what they bought is no longer suitable to their current standard of living and particularly from their children's school access angle.

8. I already have my parents' / Inlaws' house & hence not interested to invest any further.

   But why lose the opportunity of earning 50% to 300% ROI once every 3 years?

9. I am not aware that I can take a home loan in India while living abroad.

   With just Rs.20 lakhs, you can buy property worth Rs.1 crore, and when this becomes Rs.2 crore, you make a killing.

10. I don't want to bother my old parents or oblige my relatives & hence will not invest although I may miss good opportunities.

    The G&C team has replaced the role of parents/relatives/friends and can do the same for you too.

11. Consulting colleagues / friends / neighbours / relatives even after listening to the best experts in the industry (like G&C or any such professional experts) & finally not taking a decision in time & in the bargain totally losing out on best opportunities of life at their own cost.

12. My money is invested in FDs and I don't want to break them because I may have to pay a penalty or lose interest benefit.

    Breaking an FD and losing 1% interest in the bargain is peanuts compared to the 50% legally guaranteed returns that you can earn in 18 months.

All the above common mistakes can be rectified by adopting the world famous
G&C MODEL PORTFOLIO @ www.gcglobal.in/mp

**Message To Readers:**
Readers are welcome to contact the author via mail or over the phone for free advice as support to the TFAS community.




**Article Authored By**

A.V.R.Chowdary
Founder Chairman – G&C Global

Email : avrc@gcglobal.in
Mobile : +91 9980380000






*Best wishes from*

Bhaskar Bupati

& Family

*With Best wishes*



**Suresh Chatakondu & Family**

*With Best wishes*



**Hemanth Presingu & Family**

*With Best wishes*




**Naga Mahendar Velishala & Family**

*Best wishes from*



**Prashanth Chinthawar & Family**

*Best wishes from*



**Raj Kothamasu & Family**

*With best wishes*



**Ram Vedantham & Family**

*Best wishes from*



**Kishore Gopu & Family**

*Best wishes from*



**Sudhin Baru & Family**

*With Best wishes*



**Kishore Bupathi & Family**

# Pediatric Care

## Kavita Bupathi, M.D.

### Board Certified Pediatrician

**Mission: Excellence, Quality and Personal Care for Children**

**Dr. Bupathi is a board certified children's specialist with many years of practice in pediatric care.**

1 Woodbridge Center, Suite #700
(Jewelry Exchange Building Woodbridge Mall)
Woodbridge, NJ 07095
Ph: 732-326-0363

2 Ethel Road
Suite # 206B
Edison, NJ 08817
Ph: 732-650-0350

*With Best wishes*



**Ramesh Maganti & Family**

*Best wishes from*



**Rami Reddy Malladi & Family**

*Best wishes from*



**Mahender Musuku & Family**

*With Best wishes*



**Ravi Peddi & Family**

*With Best wishes*



**Srinivas Cheruvu & Family**

*With best wishes,*



**Balaji Chinthamani & Family**

*With Best wishes*



**Pradeep Suwarna & Family**

*With best wishes,*



**Srinivas Bharatavarapu & Family**

*With Best wishes*



**Santhosh Pathuri & Family**

*With best wishes,*



**Krishna Rani & Family**

*With Best Wishes*



Praveen Tadakamalla & Family

IT America
We Think Globally

**100 Metroplex Drive, Suite #207, Edison, NJ, 08817 www.itamerica.com**
**Contact: hr@itamerica.com or 732-985-5100 X 401**

# FREE TRAINING AND PLACEMENT

**Java/BI/ETL/QlikView/DWH/UI/UX/SAS/.NET/SharePoint/ SalesForce/WebSphere Admin/Hadoop**

**Eligibility:** Masters/Bachelors in any major with good communication skills
US Citizen/Green Card/EAD/H1/OPT/CPT/L2 status only

**6 WEEKS OF TRAINING – ABSOLUTELY FREE – DAILY 4-5 HOURS**

Certified WBENC Women's Business Enterprise

Inc. 5000

New Jersey's 2011 FIFTY Fastest Growing Companies NJBIZ

*With Best wishes*



**Purnachander Rao Sirikonda & Family**

*Best wishes from*



**Mahesh Pogaku**

**& Family**

*With Best Wishes*




Sai Nanduri & Family

Enterprise Portals

Commerce Application Development

CINERGY

www.cinergytech.com

Enterprise Content Management

Custom Application Development & SOA Practices

Social Collaboration

Advanced Business Partner IBM

BPM

**Cinergy Technology, Inc, 40 Wall Street, 28th Floor,**
**New York, NY - 10005, Ph: 1-888-968-1555, sales@cinergytech.com**




**CONGRATULATIONS**
**TELUGU FINE ARTS SOCIETY**
**CELEBRATING 30 YEARS**
**AND THANKING HUNDREDS OF VOLUNTEERS**
**WHO HELPED THE ORGANIZATION GROW**

**Rajeswara R and Vindhya Vasini Maruvada**

## RAJ MARUVADA & ASSOCIATES, P.C

**Providing wide range of accounting, Tax and Financial Planning Services**

**Ph: 856-346-7141** **Fax: 856-309-3500**

**www.cparaj.com**




MIRCHI

INDIAN HOMESTYLE CUISINE

Edison Mirchi : 1 877 964 7244

For catering please contact Ravi at 919 670 6640

Contact Us

Garden State Physicians

Garden State Physicians

We are located just off Route 1 in South Brunswick.

10 Jefferson Plaza Ste 100, Raymond Road,
South Brunswick, NJ 08540
Phone: (732) 274-1274
Fax: (732) 355-0321

1002 Amboy Ave,
Edison, NJ 08837
Phone: (732) 274-1274
Fax: (732) 355-0321

Congratulations to Telugu Fine Arts Society for 30 years of bringing arts and culture to the new and next generation!

**Ravi S. Chennapragada, MD, FAAP**

*Board Certified in Pediatrics*

Experienced and individualized care

**Daytime, evening, and weekend appointments available**

On call 24 hours a day, 7 days a week for emergencies

Free pre-natal consultation

Most insurance plans accepted

Attending pediatrician at:

Robert Wood Johnson University Hospital-New Brunswick and Somerset

St. Peter's Medical Center * JFK Medical Center

*Two convenient locations*

**676 Route 202-206 North, Building 2**
**Bridgewater, NJ**

**904 Oak Tree Road, Suite P**
**South Plainfield, NJ**

(908) 927-1155




# NEPPALLI FINANCIAL

## Accounting, Tax, & Advisory Services

Would like to Congratulate The Telugu Fine Arts Society on its 30th Year Anniversary!
Thank you for embodying the Telugu Culture for the past, present, and future generations!

With Regards,

The Neppalli Family




28 Kennedy Blvd Suite 150 East Brunswick, NJ 08816
Office 732.846.2400

visit us at www.neppallifinancial.com

# మా మాట

తెలుగు కళా సమితి సభ్యులకు, అతిథులకు, రచయితలకు తెలుగు కళా సమితి 30వ వార్షికోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు. అమెరికాలో మన సంస్కృతి చిరకాలం వర్ధిల్లాలి అనే ధ్యేయంతో తెలుగు కళా సమితిని జనవరి 1984లో ప్రారంభించారు. తొలి అధ్యక్షులు శ్రీ జొన్నాడ రామకృష్ణ నుంచీ, ప్రస్తుత అధ్యక్షులు శ్రీ గండి శ్రీనివాస్ దాకా మన సంస్థ దినదినాభివృద్ధి సాధిస్తోందంటే దానికి మన సభ్యుల సహకారమే ప్రధాన కారణం. ఈ సందర్భంగా వారందరికీ తెలుగు కళా సమితి తరపున, తెలుగు జ్యోతి తరపున మా ధన్యవాదాలు.

తెలుగు కళా సమితి మూడోతరం ఈనాటి సంబరాల్లో పాలుపంచుకోవడం మనకి గర్వ కారణం. మాతృభూమికి సుదూర తీరాన వున్నా మన భాష, మన సంస్కృతి మన తరవాతి తరాలకి అందించడంలో చూపిస్తున్న చొరవకి మీ అందరికీ మరో మరు మా ధన్యవాదాలు.

తెలుగు కళా సమితి 30 వ వార్షికోత్సవ సందర్భంగా తెలుగు జ్యోతి సంపాదకవర్గం తరపున మీకు ఈ జ్ఞాపిక "ప్రతిభ" ని సమర్పిస్తున్నాం. వ్యవధి తక్కువయినా తమ అమూల్య రచనలని పంపిన రచయితలకు మా కృతజ్ఞతలు. ఈ జ్ఞాపిక మీ అందరి మన్ననకీ పాత్రమవుతుందని మేం ఆశిస్తున్నాం.

పద్యం తెలుగు భాష సొత్తు. తెలుగుకి మాత్రమయిన ప్రత్యేకమయిన పద్యం ఆదరణకి నోచుకోక మరుగున పడిపోవడం శోచనీయం. నాలుగు పాదాల్లో నవరసాల్నీ అందించిన గొప్ప కవులెందరో ఈనాటికీ వున్నారు. మరుగున పడుతున్న పద్యాన్ని, పద్య సాహిత్యం గొప్పతనాన్ని మీకందించాలనే ఆశయంతో ఈ సంచికలో మహా కవులు పోతన మరియు శ్రీనాధుడి రచనలనుంచి మేలి ముత్యాల్లాంటి పద్యాల్ని వాటి సొబగుల తీరు తెన్నుల్ని మీ ముందుంచడానికి చిన్నప్రయత్నం చేసాం. అలాగే "నిత్య జీవితంలో పద్యం" , అమెరికాలో వున్న రచయితల పద్యాలూ మీ కందిస్తున్నాం. "అమ్మో పద్యమే ... మనకేం అర్ధమవుతుం"దనుకునే వారందరికీ తెలుగు పద్యాలు చదవాలనే ప్రేరణ కలిగితే మా ప్రయత్నం సఫలత చెందినట్లే.

అలాగే గత 30 సంవత్సరాల్లో తెలుగు కళా సమితి ప్రగతి, చరిత్ర గురించి అమూల్యమయిన చిత్రాలతో , వివరాలు, విశేషాలను సంపుటీకరించిన పూర్వ అధ్యక్షులు డా. భావరాజు మూర్తి గార్కి , శ్రీ ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ గార్కీ, వారికీ సహకరించిన వారందరికీ పేరుపేరునా మా కృతజ్ఞతలు.

ఈ సందర్భంగా గుర్తు చేసుకోవలసిన మరో వ్యక్తి శ్రీ తురగా చలం. ప్రతిఫలం ఆశించకుండా గత మూడు దశాబ్దాలుగా మన తెలుగు జ్యోతికి అనేక ముఖచిత్రాలు, మన సావనీర్లలో కధలు, కవితలకు బొమ్మలు వేసిన శ్రీ చలం గారు "మన మనిషి" – మహా మనీషి. ఈ జ్ఞాపిక "ప్రతిభ" కి కూడా అడిగిన తక్షణమే ముఖ చిత్రంతో బాటు, లోపలి బొమ్మలు గీసిచ్చిన శ్రీ చలంగారికి మా సంపాదక వర్గం తరపున, తెలుగు కళా సమితి తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు. చంద్రునికో నూలుపోగులా ఆయన గురించి ఒక చిన్న పరిచయ వ్యాసాన్ని ఈ సంచికలో అందిస్తున్నాం.

ఈ జ్ఞాపిక తయారుచేయడంలో నాకు సహాయం చేసిన మా కమిటీ సభ్యులు శ్రీమతి భారతి భావరాజు, మూర్తి భావరాజు, డా. అపర్ణ యేలూరిపాటి, ఊటుకూరి విజ్ఞాన్ కుమార్, శ్రీమతి శ్యామలాదేవి దశిక, శ్రీమతి రాధ కాశీనాథుని, డా. వైదేహి శశిధర్, పుస్తకాన్ని అందంగా తయారు చేసిన శ్రీ సుధాకర్ ఉప్పల, ఈ ప్రచురణకి ప్రాణవాయువులాంటి ప్రకటనల్ని సమకూర్చిన ట్రస్టీ శ్రీ వసంత్ గారికీ, కోర్ కమిటీకి మాకు వారధిలా పనిచేసిన మరో ట్రస్టీ శ్రీ మధు రాచకుళ్ళ గారికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

ఈ మా ప్రయత్నంలో దోషాలు జరిగితే పెద్ద మనసుతో క్షమిస్తారని, మీ అభిప్రాయాల్ని tjsouvenir@gmail.com ద్వారా తెలియజేస్తారని ఆశిస్తూ

భవదీయుడు

దివాకర్ పేరి



శ్రీమతి శ్యామలాదేవి దశిక | డా. వైదేహి శశిధర్ | శ్రీమతి రాధ కాశీనాథుని | డా. అపర్ణ యేలూరిపాటి | శ్రీమతి భారతి భావరాజు | డా. మూర్తి భావరాజు | సుధాకర్ ఉప్పల | దివాకర్ పేరి

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| తె.క.స. - తె.జ్యో తో నా అనుబంధం | తెలుగు జ్యోతి ఎడిటోరియల్ కమిటీ | 4 |
| అమెరికాలో శ్రీవారి ఇక్కట్లు | డా. భావరాజు మూర్తి | 6 |
| నడివయస్సు | ఫణి డొక్కా | 8 |
| బుర్రలందు బట్టబుర్రలు వేరయా! | అనుపమ గుళ్ళపల్లి, | 9 |
| చివరికి | చంద్ర కన్నెగంటి | 11 |
| సివిలిజేషన్ | దివాకర్ పేరి | 11 |
| అమ్మో! విదేశయానమా ? | నోరి రాధిక | 12 |
| డిప్రెషన్ | పాలపర్తి ఇంద్రాణి | 13 |
| మనోహర దృశ్య కావ్యం | డా. అపర్ణ యేలూరిపాటి | 14 |
| పం (ఫన్) చ రత్నాలు | జె. శ్యామల | 17 |
| నీ స్వరం - నీ జ్ఞాపకం | భూషణ్ తమ్మినేని | 20 |
| మన మిత్రుడు తురగా శేషాచలం | 'తెలుగు జ్యోతి ' | 21 |
| వసంతానికి స్వాగతం | కోవెల వసుధ | 22 |
| అద్వైతం | డా. ముక్తేవి భారతి | 23 |
| కొత్త మెరపులు | కె. మమత | 26 |
| చదువు (ఒక పరిశీలన) | డా. వైదేహి శశిధర్ | 27 |
| తావో తే చింగ్ | తమ్మినేని యదుకుల భూషణ్ | 30 |
| గుబురు కొమ్మల చెట్టు | నిషిగంధ | 31 |
| మనము - పిల్లలు - భాష | దాసరి అమరేంద్ర | 32 |
| 'గాధాసప్తశతి' లో గ్రామజీవనం | డా. పుట్టపర్తి నాగ పద్మిని | 34 |
| ఒక నది స్వగతం | డా. నారాయణ గరిమెళ్ళ | 37 |
| ఏ దేశమేగినా ... | పంతుల నారాయణ రావు | 38 |
| ప్రాణ ప్రతిష్ఠ | విన్నకోట రవిశంకర్ | 41 |
| జ్ఞాపకాలు | భారతి భావరాజు | 42 |
| మన్మధ ఉగాది—తెలుగు పలుకు | డా. వేమూరి రామనాధం | 44 |
| థాంక్స్ టు అంబేద్కర్ | డా. కలశపూడి శ్రీనివాస రావు | 45 |
| శ్రావణమాసం స్పెషల్ | శ్యామలాదేవి దశిక | 48 |
| లోపల వెలిగే దీపం | ప్రసూన రవీంద్రన్ | 50 |

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| పునర్నిర్మాణం | అరుణ పప్పు | 51 |
| వేదికలు - పాదుకలు | వసుంధర | 55 |
| రాజు - కవి | డా. భాస్కర్ కొంపెల్ల | 57 |
| వేపపూత - కోయిల కూత | దర్భా బాబూ రావు | 60 |
| తెలుగమ్మాయి | మనోహర బోగా | 61 |
| తూర్పయినా - పడమరయినా | సుజాత | 62 |
| సముద్రం | హెచ్చార్కే | 66 |
| My advise to Youth | డా. గవరసాన సత్యనారాయణ | 67 |
| జడ (అష్టవిధ నాయికలు ) | డా. జెజ్జాల కృష్ణ మోహన రావు | 68 |
| కార్య సాధక లక్షణం | ఆకెళ్ళ బాల భాను | 69 |
| నా దైవం | జయ రాయపూడి | 70 |
| నిత్య జీవితంలో పద్యం | భైరవభట్ల కామేశ్వరరావు | 71 |
| రెడ్డి గారి భార్య | కొమరవోలు సరోజ | 75 |
| ప్లాట్ ఫారం | పి.కె.శ్రీనివాస్ | 77 |
| టేకోవర్ సుగ్రీవ అండ్ కంపెనీ | డా. యేలురిపాటి ఆంజనేయ శర్మ | 79 |
| కాల చతురస్రం (Times Square) | అనంత సుధాకర్ ఉప్పల | 80 |
| ఒంటరైన ప్రపంచం | డా. కేతవరపు రాజ్యశ్రీ | 81 |
| వర్షం కురిసిన రాత్రుల్లో ... | మానస చామర్తి | 82 |
| జెముడు | కొమరగిరి అనంత ప్రమీలా రాణి | 83 |
| బంగారు కొండ | ముకుంద రామారావు | 85 |
| గురు శిష్య సంవాదము | అరుణాచల భారతం | 86 |
| ఏ మనసు | జి.వి.ఆర్.కె. శర్మ | 88 |
| శ్రీ నాధుని హరవిలాసం | కాశీనాధుని రాధ | 89 |
| రచయిత(త్రు)ల పరిచయం | | 94 |


**ముఖ పత్రాలంకరణ** : శ్రీ తురగా చలం (హైదరాబాద్) & శ్రీ హర ప్రసాద్ సింహాద్రి (న్యూ జెర్సీ)

**సాంకేతిక సహకారం** : నియో ఏరా ప్రింట్ మీడియా, హైదరాబాద్ (ఇండియా)

# తెలుగు కళా సమితి - తెలుగు జ్యోతి తో నా అనుబంధం

### డా. భావరాజు మూర్తి మరియు శ్రీమతి భారతి భావరాజు



మూర్తి భావరాజు, వారి శ్రీమతి భారతి భావరాజు న్యూజెర్సిలో 50 సంవత్సరాలుగా నివసిస్తున్నారు. మూడు తరాలుగా తెలుగు కళా సమితితో దగ్గర సంబంధం. మూర్తి భావరాజు తెలుగు కళాసమితి కి 1989-1993 అధ్యక్షులు గాను, 2003-2013 తెలుగుజ్యోతి సంపాదకులుగా వున్నారు. మూర్తి, భారతి భావరాజు తయారుచేసిన "తరతరాల తెలుగు చరిత్ర" 25 పోస్టర్స్ ప్రదర్శన ను తెలుగు కళా సమితి కార్యక్రమాలలోనూ, అట్లాంటా (1991), న్యూయార్క్ (1993) జరిగిన 'తానా' సభలలో ప్రదర్శించారు. భారతి భావరాజు 1989-1993 సంవత్సరాలలో తెలుగు కళాసమితికార్యక్రమాలలో మిత్రుల సహాయంతో విందుభోజనాలు సమకూర్చారు. 1990 నుండి తెలుగుజ్యోతి పత్రిక టైపింగ్, కొంతకాలం పత్రిక ప్రచురణ, పోస్ట్ లో పంపడానికి సహాయం పడడం ఒక ప్రత్యేకత. అమ్మాయిలు రజిత, వసుధ కూడాతెలుగు కళా సమితి కార్యక్రమాలలో పాల్గొనడం, తెలుగుజ్యోతి పత్రికలో వ్యాసాలు వ్రాయడమే కాక కొంతకాలం యువతకు ఉపయోగపడే "A Step in the Right Direction"అనే శీర్షికని నడిపారు. ప్రస్తుతం మనుమరాలు అంజలి తెలుగు కళా సమితి కార్యక్రమాలలో పాడుతుంటుంది.

### శ్రీమతి రాధ కాశీనాథుని



ఎనభైల్లో అమెరికాలో అడుగుపెట్టినా కారణాంతరాల వల్ల తెలుగు సమితులు, సంఘాలతో పరిచయం తొంభైల నుంచి. మొదటి పరిచయం అప్పట్లో 'తెలుగుజ్యోతి' ఎడిటర్ శ్రీ కిడాంబి రఘునాథ్ గారితో అది కూడా ఫోను మీద. ఆ రోజు ఆయనతో సంభాషణ చేస్తున్నప్పుడు భవిష్యత్తులో 'తెలుగు జ్యోతి' అనే ఈ పత్రికకి సహాయ సంపాదకురాలిని అవుతాను – అని నేను ఊహించ లేదు. ఇది నా జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు అని చెప్పాలి. దానికి కారణం నాతో కలిసి పనిచేసే నా తోటి సంపాదకులు. మంచి మనుషులతో పరిచయం, స్నేహం ఇంత సులువుగా లభించడం అదృష్టం. ఏనాడో రాత కోతలకు ఫుల్ స్టాప్ పెట్టిన నేను, అప్పటినుంచి తెలుగు జ్యోతి, ఈ మాట, కౌముది, వంగూరి ఫౌండేషన్ వారి పుస్తకాలు, పుస్తకం డాట్ నెట్ – వీటికి వ్యాసాలు, కథలు రాయడం జరిగింది. ఇక 'తెలుగు కళాసమితి'తో నా సంబంధం. 2000 నుంచి 2003 దాకా తెలుగు కళాసమితి కార్యవర్గసభ్యురాలిగా పని చేశాను. ఆ రోజుల్లోనే 'తెలుగు జ్యోతి' సంపాదక వర్గంలో భాగంగా కావడం జరిగింది. నాటి నుంచి నేటి వరకు, 'తెలుగు జ్యోతి' కూడా నాకుటుంబంలో ఒక పుస్తకంగా కాదు ఒక వ్యక్తిగా అనుకోవడం అలవాటు అయిపోయింది. ప్రచురణకు వచ్చిన వ్యాసాలు చూడడం, టైపు చేయలేని వారికి సహాయం చెయ్యడం ఒక అలవాటుగా మారింది. ఏం చేస్తున్నానన్నది కాదు, ఎవరితో కలిసి చేస్తున్నానన్న విషయం తెలుచుకున్నప్పుడు నాలో ఒక చిన్నగర్వరేఖ తళుక్కుమని మెరుస్తుంది.

### డా. వైదేహి శశిధర్



తెలుగుజ్యోతితో నా అనుబంధం మొట్ట మొదట సారి స్వర్గీయ కిడాంబి రఘునాథ్ గారిని 1998 లో కలిసినప్పుడే మొదలయ్యిందని చెప్పాలి . ఎప్పుడు కనబడ్డా ఆప్యాయంగా పలుకరించి నా కవితలు తెలుగు జ్యోతి కి ఇవ్వమని అడిగేవారు . అప్పట్లో రెసిడెన్సీ లో ఉండి సమయం లేక వారు అడిగినంత తరచుగా రాయలేకపోవటం నాకు ఇప్పటికీ లోటే . 2001 లో ఫిలడెల్ఫియా లో జరిగిన 13 వ తానా కాన్ఫరెన్స్ లో "సురభి" జ్ఞాపిక వెలువడినపుడు న్యూజెర్సీ నుంచి కిడాంబి రఘునాథ్ గారి సారథ్యం లో ఔత్సాహికులం కొందరం ఆ సూవనీర్ బోయీలవడం ఇంకా గుర్తు.ఇకపోతే తెలుగు జ్యోతి పట్ల వారి ప్రేమ, తపన,అంకిత భావం ఎప్పటికీ మర్చి పోలేనివి .వారి ఆకస్మిక మృతి తర్వాత సంపాదక వర్గ బాధ్యతలు స్వీకరించిన భావరాజు మూర్తి గారి ఆహ్వానం మేరకు నేను సంపాదకవర్గం లో చేరటం జరిగింది . మూర్తి గారి సారథ్యం లో దాదాపు పదేళ్ళు ఒక కుటుంబం లాగా కలిసి పనిచేస్తూ సుహృద్భావ వాతావరణం లో చర్చలు, సంఘీభావం తో నిర్ణయాలు తీసుకుంటూ "ప్రేమ", "ప్రగతి" జ్ఞాపికలు తీసుకురావడం మరువలేని జ్ఞాపకం.అదే సంస్కృతిని కొనసాగిస్తూ తెలుగుజ్యోతి ప్రతి సంచికను శ్రద్ధాసక్తుల తో రూపొందిస్తున్న మిత్రులు, ప్రస్తుత సంపాదకులు దివాకర్ గారితో ,నా సహ సంపాదకుల తో కలిసి "ప్రతిభ" జ్ఞాపిక రూపొందించటం మరొక చక్కని అనుభవం .

# తెలుగు కళా సమితి-తెలుగు జ్యోతి తో నా అనుబంధం

## శ్రీమతి శ్యామలా దేవి దశిక



ఇండియాలో నా చదువు పూర్తి అవుతూనే 1976 లో నేను ఇక్కడికి అంటే న్యూజెర్సీ కి రావడం జరిగింది. 1984 లో ఇక్కడ వున్న తెలుగువారిని దృష్టిలో పెట్టుకుని తెలుగు కళాసమితి ఏర్పడటం దానిలో భాగంగా తెలుగు జ్యోతి పత్రిక ప్రారంభించటం నాకు తెలుసు. అప్పట్లో ఆ తెలుగు జ్యోతి కోసం ప్రతి నెలా ఉత్సాహంగా ఎదురు చూస్తుండే దాన్ని. కిడాంబి రఘునాధ్ గారి ఎడిటోరియల్ నాకు చాలా నచ్చేది. నా రచనలకు నేను శ్రీకారం చుట్టింది తెలుగు జ్యోతి లోనే. 1992 లో తెలుగు జ్యోతి నూరవ సంచికలో నా కథ ప్రచురించబడటం నాకు బాగా గుర్తుంది. ఇప్పుడు నేను ఆ తెలుగు జ్యోతి పత్రికా సంపాదక వర్గంలో ఉండటం, మూడు ప్రత్యేక సంచికల ప్రచురణలో పాల్గొనడం అనేది గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. తెలుగు కళా సమితికి పునాది వేసి సంస్థ అభివృద్ధికి కారకులైన భావరాజు దంపతులు, ప్రభా రఘునాద్ గారు, చలికొండ రామకృష్ణ గారు, బండారు రాజారావు గారు మాకు ఎంతో ఆత్మీయులు. సంపాదక వర్గంలో చేరిన తర్వాత రామకృష్ణ సీతాల, దాము గేదెల, ఆనంద్ పాలూరి, మంజు భార్గవి గార్లతో పరిచయం ఏర్పడింది. 2014 లో తెలుగు కళా సమితి ప్రస్తుత కార్యవర్గం బాధ్యత చేపట్టిన వెంటనే అందరిని ఆహ్వానించి చక్కగా పరిచయం చేసుకోవటం. అన్ని కార్యక్రమాల్లో తెలుగు జ్యోతి సంపాదకుల్ని కూడా భాగస్వాములుగా చెయ్యడం వలన, వ్యక్తిగతంగా తెలుగు కళాసమితితో నా అనుబంధం మరింత పెరిగిందని చెప్పొచ్చు. శ్రీని గండి గారి సారధ్యంలో తెలుగు కళాసమితి 30 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా వారికి ఇవే నా శుభాభినందనలు !

## అనంత సుధాకర్ ఉప్పల



తెలుగు జ్యోతి , తెలుగు కళా సమితితో గత పదిహేను సంవత్సరాలకు పైగా అనుబంధం ఉంది. కళా సమితి కార్యక్రమాల్లో , తెలుగు జ్యోతి ప్రచురణలో ఉత్సాహంగా పాల్గొనటం, తగిన సహాయం చెయ్యటం నా అభిరుచి. గురువర్యులు స్వర్గీయ కిడాంబి రఘునాథ్ గారితో పరిచయం 1999లో జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు తెలుగు జ్యోతితో అనుబంధం కొనసాగుతోనే ఉంది. తెలుగు జ్యోతి కూర్పు, సాంకేతిక సహకారం, అడపా దడపా ఆర్టికల్స్ వ్రాయడం మరియు ఈ పత్రికను 'ఈ' పత్రిక (అంతర్జాలం)గా కూడా పెట్టడం నేను చేసిన/ చేస్తున్న పనులు. ప్రత్యేక సంచికల (ప్రేమ, ప్రగతి, ప్రతిభ వగైరా) కూర్పు నాకు నచ్చిన పని. తెలుగు కళా సమితి కార్యవర్గంలో 5 సార్లు పనిచేసాను. ఉపాధ్యక్షుడిగా, IT Services ట్రస్టీ గా, membership ట్రస్టీగా,annual events ట్రస్టీ గా పనిచేసాను. 30 వసంతాల పండగ ఘనంగా నిర్వహిస్తున్న తెలుగు కళా సమితి కార్య వర్గానికి హార్దిక శుభా కాంక్షలు.

## దివాకర్ పేరి



ఈ దేశం విద్యార్థిగా 1990 లో వచ్చిన నాకు కిడాంబి రఘునాథ్ గారితో పరిచయం, తెలుగుకళాసమితి, తెలుగు జ్యోతి తో నా అనుబంధానికి నాంది. తెలుగు జ్యోతి, తెలుగు కళా సమితి ద్వారా అనేకమంది పెద్దల పరిచయం జరిగింది. ఆనాటినుండి 2003 వరకూ రఘునాథ్ గారి సారధ్యంలో తెలుగు జ్యోతి, తెలుగు కళా సమితితో కలసి పనిచేస్తూ తెలుగు కళా సమితి కుటుంబంతో మమేకం కావడం జరిగింది. శ్రీ కిడాంబి రఘునాథ్ గారి హటాన్మరణంతో తెలుగు జ్యోతి కి దూరం కావడం, భావరాజు మూర్తి గారు 2010 లో తెలుగు జ్యోతి కి పని చెయ్యమని అడగడంతో, అప్పటినుంచి మళ్ళీ పూర్తి స్థాయిలో పని చెయ్యడం జరుగు తోంది. ప్రస్తుతం తెలుగు జ్యోతి ఎడిటర్ గా వున్నాను. 2001 లో ఫిలడెల్ఫియా లో జరిగిన 13 వ తానా కాన్ఫరెన్స్ లో "సురభి" సావనీర్ కమిటీ లో కో చైర్ గా, ఇప్పుడు తెలుగు కళాసమితి 30 వ వార్షికోత్సవం సావనీర్ "ప్రతిభ" కమిటీ చైర్మన్ గా తెలుగు వాళ్ళకి సేవ చేసే అవకాశం వచ్చింది. తెలుగు వాడిగా పుట్టడం – తెలుగు కళా సమితి, తెలుగు జ్యోతి కి పనిచేయాడం నా అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగు సాహిత్యం చదవడం, చదివించడం, సాటి తెలుగు వాళ్ళలో సాహిత్యాభిలాష పెంచడం, సామర్థ్యం వున్నవాళ్ళతో తెలుగులో రచనలు చేసేలా ప్రోత్సహించడం నా ప్రవృత్తి. తెలుగు కళాసమితి 30 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా వారికి మా తెలుగు జ్యోతి సంపాదక వర్గం తరపున శుభాభినందనలు !

# అమెరికాలో శ్రీవారి ఇక్కట్లు

డా. భావరాజు మూర్తి

ఈ రచనకి, 'తెలుగుజ్యోతి' పత్రికలో "అమెరికా ఇల్లాలి ముచ్చట్లు" రచనలకి ఏదో సంబంధం ఉందని అనుమాన పడుతున్నారా? ఎందుకు లేదూ? ఉంది. 'అమెరికా ఇల్లాలు' అమెరికా శ్రీవారి మీద ఎప్పుడూ ఎన్నో ఫిర్యాదులు చేస్తుంది. ఆ రచనలని చదివిన ప్పటినుంచి అమెరికా శ్రీవారి ఇక్కట్ల గురించి చెప్పాలని అనుకుం టూనే వున్నాను. ఆ ప్రయత్నమే ఇది.

నేను రాస్తోన్న విషయాలవలన నాకు వచ్చే ప్రమాదాలు, ఇబ్బందులు తెలియక కాదు, అయినా సాహసిస్తున్నా! ఉదాహరణకి, ఈరోజు రాత్రి నాకు భోజనం ఉండకపోవచ్చు.

సరే ఎక్కడ, ఏవిషయాలు మొదలు పెట్టాలి? పెళ్ళయిన కొత్తలోనా? పిల్లల పెంపకమా? పిల్లల పెళ్లిళ్ళా? మనవల హడావిడా? ఇవన్నీ కాకుండా వయసు వస్తూన్నా ఇంకా ఉద్యోగం విరమించక పోవడం వల్ల వచ్చే బాధలా? ఇవన్నీ మొత్తం రాసేస్తే ఇది ఒక నవల అయిపోతుంది. ఇప్పుడు అన్ని విషయాలు రాయడానికి నాకు, చదవడానికి మీకు కాలం సరిపోదు. అందుకని, కొన్ని ముఖ్యమయిన విషయాలే మీతో పంచుకుంటాను.




★★★

ఇది మా శనివారం సమస్య. అమ్మాయిలు పెళ్ళిళ్ళయి, ఇల్లు విడిచి, వాళ్ళ ఇళ్ళకి వెళ్ళారు. పాత కాలపు 'శనివారం' లాగా పిల్లల కార్యక్రమాలు, అదేవయసు పిల్లల తల్లిదండ్రులని భోజనానికి పిలవడం, లేక వాళ్ళ ఇళ్ళకి వెళ్ళడం ఇప్పుడు లేవు. లాన్ మోవింగ్, షాపింగ్ లాంటి పనులు కూడాలేవు ఇప్పుడు టౌన్-హౌస్ కి మారడం వలన. ఐదు రోజులు కష్టపడి ఆఫీసు పనులు చేసుకున్నాక శనివారం కోసం ఎంతో ఆశగా చూస్తాను. అమెరికా ఇల్లాలు ప్రొద్దున్నే లేచి ఏదో కొంప మునిగినట్టు, ఇద్దరూ గుడికి వెళ్ళి దేముణ్ణి తెల్లవారకుండానే "సుప్రభాతం" తో లేపితే "ప్రశాంతంగా" ఉంటుంది అటుంది. ఆవిడ గుడికి వెళ్ళాక మరికొంచెంసేపు నిద్రపోయి, నెమ్మదిగా కాఫీ తాగుతూ,ఈ-మెయిల్స్ చూసుకుంటే "ప్రశాంతంగా" ఉంటుందని అమెరికా శ్రీవారు అనుకుంటారు. ఈదేశంలో చర్చికి వెళ్ళే భక్తుల లాగా నెమ్మదిగా తోచినప్పుడు వెళ్ళచ్చుగా గుడికి. అప్పుడు దేముడు కూడా పెందరాళే లేవనక్కరలేదు మన దర్శనానికి.

★★★

టౌన్ హౌస్ కి వచ్చాక హోమ్ డిపో కి వెళ్ళే అవసరం తగ్గింది. కానీ కాస్ట్ కో, అప్నా బజార్ తప్పలేదు. ఈ ప్రదేశాలకి వెళ్ళాలంటే శ్రీవారికి ఇష్టం ఉండదు. అందుచేత, అమెరికా ఇల్లాలికి పూర్తిగా స్వేచ్చను, క్రెడిట్ కార్డ్ ను ఇచ్చి మరీ పంపిస్తారు ఈ షాపులకి శ్రీవారు. ఆ 'స్వేచ్ఛ' వలన కాబోలు కారు నిండిపోయినన్ని వస్తువులు వస్తాయి ఇంటికి. కాస్ట్ కోలో అసలే పెద్ద పేకేజిలు, అదేకాక రెండు కొంటే ఇంకా చవక అని అమెరికా ఇల్లాలు నాలుగు పేకేజీలు కొనడం జరుగుతుంది. అవి ఇంట్లో పెట్టడానికి చోటుండదు. వంటగది చిన్నది, కేబినెట్లు ఎక్కువ లేవు. టౌన్-హౌస్ కి రాకముందు "మనమున్న ఇంట్లో బోలెడు చోటు ఉండేది" అని మళ్ళీ అమెరికా శ్రీవారు వినవలసి వస్తుంది. "అసలు కాస్ట్ కో లేకపోతే మనమంతా ఇంకా చిన్న ఇళ్ళకి మారవచ్చు, ఎనర్జీ వాడుక తగ్గించ వచ్చు కూడా!" అని శ్రీవారి జవాబు.

ఇక అప్నా బజార్ నించి తెచ్చుకునే వస్తువులు అనేక రకాలు. నేను ఇండియాలో ఎప్పుడో చూసిన తేగలు, వేపపువ్వే కాక అరటిదూట, అరటి పువ్వు లాంటి కూరగాయలు, జామ, పనస, సీతాఫలం లాంటి పళ్ళు, ఊరగాయలు, రకరకాల చిరుతిండి. వండిన పదార్థాలు కూడా ఉంటాయి. అవి తినేముందు మైక్రో-వేవ్ లో వేడిచేసుకోవడమే. అమెరికా ఇల్లాలు రెండు నెలలు ఇండియా వెళ్తే శ్రీవారు పస్తుండనవసరం లేదు.

★★★

ఈమధ్యనే ఒక Financial consultant డబ్బు, ఇన్వెస్ట్-మెంట్స్, రిటైర్మెంట్ ప్లానింగ్ గురించి మాట్లాడడం జరిగింది, తెలుగు 'సీనియర్స్' సమావేశంలో. ఆయన ఆడవాళ్ళ వేపు చూసి, మీరంతా పది, పదిహేను సంవత్సరాలు ఒంటరిగా ఈ పనులు చూసుకోవలసిన అవసరం రావచ్చు ముందు ముందు అన్నారు. అదివిని నేను అమెరికా ఇల్లాలివైపు తీక్షణంగా చూశాను. ఎందుకంటే, ఆవిడకు ఇవేవి పట్టవుగా! బ్యాంకు అకౌంట్స్, క్రెడిట్

కార్డ్ బిల్ల్స్, ఇన్సూరెన్స్ పాలసీలు, టాక్సెస్ ఇవన్నీ అమెరికా శ్రీవారి బాధ్యత. ఏదైనా ఫారం మీద సంతకం పెట్టమంటే, నామీద నమ్మకంతో వెంటనే పెట్టేస్తుంది, అసలు ఆ ఫారంలో ఏముందో చూడకుండా. అది డైవోర్స్ అగ్రిమెంట్ అని నేను జోక్ చేస్తుంటాను.

ఆ Financial consultant చెప్పిన సమస్యకి కారణం ఆడవాళ్ళ జీవిత పరిమాణం (life expectancy) మగవాళ్ళ జీవిత పరిమాణం కంటే కొన్ని సంవత్సరాలు ఎక్కువట. మన దేశాచారంలో శ్రీవారు శ్రీమతి కన్నా కొన్ని సంవత్సరాలు పెద్ద అయి ఉండాలిట. ఈ సమస్యకి నాకు తోచిన సులభమైన పరిష్కారం ఏమంటే, పెళ్ళి చేసుకున్నప్పుడు శ్రీమతి కంటే శ్రీవారు కొన్ని సంవత్సరాలు చిన్నయి ఉంటే సరిపోతుంది. అల్లా అయితే ఇద్దరూ కలకాలం కలిసే ఉండచ్చు.



★★★

కంప్యూటర్లు వచ్చిన కొత్తలో (1990's) కుటుంబానికొక ఈ-మెయిల్ ఖాతా ఉండేది. శ్రీవారే ఇంట్లో సెక్రటరీగా పనిచేస్తూ అమెరి కా ఇల్లాలికి, పిల్లలకి ఈ-మెయిల్ వార్తలు చెప్తూండేవారు. తరువాత 'కేబుల్' వచ్చాక (2000's) కుటుంబంలో ఒక్కొక్కళ్ళకి ఒకటో, రెండో ఈ-మెయిల్ ఖాతాలు ఏర్పాటు చేసుకోవడం మామూలయిపోయింది. అమెరికా ఇల్లాలికి కూడా ఒక ఈ-మెయిల్ ఖాతా వెలిసింది. దీని వలన వచ్చిన శ్రీవారి ఇక్కట్లు మరొకరకం. ఉదాహరణలు:

ఒకరోజు మిత్రుడు సుబ్బారావు ఫోను చేసి అడిగాడు, "మీరు మాఇంటికి భోజనానికి వస్తున్నారా ఇవ్వాళ" అని. "నాకు తెలీదే మీరు భోజనానికి పిలిచినట్టు" అన్నాను. సుబ్బారావు వెంటనే "మాఆవిడ మీకు పంపిన ఈ-మెయిల్ అందలేదా?" అనడిగాడు. నాకు ఈ-మెయిల్ రాలేదు కనుక మా అమెరికా ఇల్లాలిని అడిగాను తనకు వచ్చిందేమో ఆ email. "నాకేం తెలుసు, రెండు వారాల యింది నేను కంప్యూటరు దగ్గరకి వెళ్లి" అంది మా ఇల్లాలు. "పోనీ ఇప్పుడన్నా చూడు" అని అడిగాను. "మరి నా పాస్-వర్డ్ మర్చిపోయాను; రెండు వారాలయిపోయింది కంప్యూటర్ ముట్టుకుని" అంది. "నువ్వు పాస్-వర్డ్ తెలుగులో రాసుకున్నావుగా కాగితం మీద ఎక్కడో తెలుగు దొంగలు ఉండరనే ధైర్యంతో!" అన్నాను. "నిజమే కానీ, ఆ కాగితం ఎక్కడ పెట్టానో కనిపించడం లేదు..." ఇల్లా జరుగుతుంది మా సంభాషణ.

మరొక సంఘటన: "ఏమండీ, మొన్న మాతమ్ముడు పంపించిన ఫోటో నా కంప్యూటర్ లో సేవ్ చేశాను. అది ఎక్కడా కనిపించడం లేదు," అంది మా అమెరికా ఇల్లాలు. "ఎక్కడ సేవ్ చేశావో గుర్తు పెట్టుకో లేదా?" అనడిగాను. "కంప్యూటర్ 'సేవ్' అనగానే నొక్కేశాను. ఎక్కడ 'సేవ్' అయి ఉంటుందో చూసి పెట్టండి," అని జవాబు. "పోనీ మళ్లీ డౌన్-లోడ్ చేసుకో. ఎక్కడ సేవ్ చేశావో గుర్తుంచుకో ఈమాటు," అన్నాను. ఇంటి పరిశుభ్రతకి అలవాటు పడి మా అమెరికా ఇల్లాలు, వాళ్ళ తమ్ముడి ఈ-మెయిల్ చూసిన వెంటనే కంప్యూటర్ లోంచి పెర్మనెంట్ గా తొలగించేసిందట.

మరోమాటు: సీతగారు ఫోను చేసి చెప్పారు "మీ ఈ-మెయిల్ అందింది మీ అమ్మాయి బేబీషవర్ కి ఆహ్వానిస్తూ. కానీ మేము రాలేము," అని. ఫోను పెట్టేశాక అడిగాను మా అమెరికా ఇల్లాలిని సీతగారిని ఎందుకు పిలిచావని. "అయ్యో నేను పిలవలేదు," అని గెస్ట్ లకి పంపిన ఈ-మెయిల్ చూసుకుంది. సీత గారికి వెళ్ళింది ఈ-మెయిల్. ఆలోచిస్తే తెలిసిన విషయం ఏమిటంటే ఆ సీత గారి ఇంటిపేరు 'అ' తో మొదలౌతుంది. అడ్రస్ బుక్ లో ఆవిడది మొదటి పేరు. మా అమెరికా ఇల్లాలు అనుకోకుండా ఆవిడకి చాల ఈ-మెయిల్స్ పంపుతుందట.

ఇల్లాంటివి రాస్తూ పోతే చదివాక నిజంగానే మా ఆవిడ ఈపూటకి వంట మానేసే ప్రమాదం ఉంది!

★★★

ఒక కంపెనీలో 35 సంవత్సరాలు పనిచేసి రిటైర్ అయ్యాక, మరొక కంపెనీ పిలిచి నాకు ఉద్యోగం ఇచ్చింది. ఒకటో, రెండో సంవత్సరాలు పని చేద్దాంలే అనుకున్న నేను పదేళ్ళ తరువాత ఇంకా అక్కడే పని చేస్తున్నాను. "నాకు నువ్వు నచ్చావు" అని మా బాస్ సినిమా డైలాగ్ చెప్తుంటాడు నాతో. అయితే ఉద్యోగం చెయ్యడం శ్రీవారికి సమస్య ఎలా అవుతుందంటారా? ఇదీ కథ. వినండి. అమెరికా ఇల్లాళ్ళు కబుర్లు చెప్పుకుంటూన్నప్పుడు, కొంతమంది తమ శ్రీవారితో ఎన్ని ప్రదేశాలకి వెళ్తుంటారో, ఇండియా వెళ్లి ఎన్ని నెలలున్నారో, తోచినప్పుడల్లా రెస్టారెంట్ లో ఎన్నిసార్లు భోజనం చేశారో, కలసి ఎన్ని షాపింగ్ లకి వెళ్తారో గొప్పగా చెప్పుకుంటారు. రాత్రి ఎంత లేటుగా పడుకుని, ఎంత లేటుగా లేస్తారో చెప్తారు. అవన్నీ వింటుంటే మా అమెరికా ఇల్లాలికి మా చెడ్డ 'అసూయ'.

"మీరు ఉద్యోగం విరమిస్తే మనం కూడా ఇవన్నీ ఎంజాయ్ చెయ్యవచ్చు కదా," అంటుంది. శ్రీవారు అంటారు, వయసు వస్తున్నా ఉద్యోగం చేస్తూంటే శరీరానికి, మెదడుకి ఆరోగ్యం. ఎక్కువ డబ్బు అంత పెద్దగా అవసరం లేకపోయినా, వచ్చే డబ్బు ఎప్పుడూ ఉపయోగమే. పెద్ద విరాళాలు ఈయవచ్చు, పిల్లలకి, మనుమలకి బహుమానంగా ఇవ్వవచ్చు. కాని ఈ మాటలు అమెరికా ఇల్లాలికి పట్టవు. అమెరికా శ్రీవారి ఇక్కట్లు ఇప్పట్లో తగ్గే సూచనలు లేవు. మచ్చుకు చెప్పిన నా "ఇక్కట్లు" ఓపికతో చదివినందుకు నా ధన్యవాదాలు. వీలయితే మీ ఇక్కట్లు కూడా చెప్పుకోండి తెలుగు జ్యోతి వచ్చే సంచికలో!

## నడివయస్సు

- ఫణి డొక్కా

ఇది వసంతం కాదు
ఈ చిగుళ్ళన్నీ ఎప్పుడో గట్టి పడ్డాయి .

ఇది గ్రీష్మమూ కాదు
తాపాగ్ని కీలలు ఈ శరీరాన్ని
సంపూర్ణంగా దహించలేక పోతున్నాయి

వర్షార్తవమసలె కాదు
కష్టాల కరి మబ్బులూ కన్నీళ్ళ కుండపోతలూ
ఈ కళ్ళకి అలవాటైపోయాయి

ఇది శరత్తు కాదు
నిర్లిప్తత నీడలు మనసు లోని
వెన్నెలలను మింగేస్తున్నాయి

పోనీ హేమంతమూ కాదు
చలిరాత్రి దుప్పట్లో ఒక్కడినే ఉన్నా
నిద్ర పట్టేస్తూనే ఉంది

అలాగని శిశిరమూ కాదు
పంచప్రాణ పత్రాలు ఈ కట్టెని ఇంకా
గట్టిగా పట్టుకునే ఉన్నాయి

మారుతున్న కాలంతో బాహ్యశరీరం మారినా
లోపల మాత్రం స్థితప్రజ్ఞతో ,చిరకాల జడత్వమో
ఏదో తెలీని భావం స్థిరంగా పేరుకు పోతుంది






# బుర్రలందు బట్టబుర్రలు వేరయా!

అనుపమ గుళ్ళపల్లి, హైదరాబాద్ (ఇండియా)

పండక్కి నాన్నమ్మగారింటికి వెళ్తున్నాడు చారుకేశ. ఎప్పుడో స్కూల్లో ఉండగా ఇలా సెలవులకి అమ్మమ్మల ఇళ్ళకీ, నాన్నమ్మల ఇళ్ళకీ వెళ్ళేవాడు. టెన్త్ పూర్తయిన ఏడాది నుండీ ప్రతి సెలవులకీ ఏదో ఒక కోచింగ్ ఉండటంతో కుదరనేలేదు. మళ్ళీ ఇప్పుడు, పీజీలో చేరాక పదిరోజులు సెలవులు వచ్చేసరికి ఎలాగైనా వెళ్లాలని తీర్మానించుకున్నాడు.



నాన్నమ్మ, తాతగారు, తాతమ్మ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. అందరు మనవలతో గోరుముద్దలు తినిపిస్తోంది నాన్నమ్మ రోజూ. చిన్ననాటి రోజులన్నీ తిరిగి వచ్చినట్లుంది చారుకేశకి. కాకపోతే ఇప్పుడు తను ఇదివరకటిలా ఆడి పాడి చిందులు వేయలేడు కదా? పైగా తన ఈడు వాళ్ళు ఎవరూ ఇక్కడ లేరు. అందుకే బాబాయిల పిల్లలతో కాసేపు క్రికెట్ ఆడినా, వాళ్ళు దాగుడుమూతలు లాంటివి ఆడుకుంటుంటే చూస్తూ సంతోషిస్తున్నాడు. కాసేపు తాతగారితో చెస్ ఆడుతూ, ఇంకాసేపు తాతమ్మతో కబుర్లు చెప్తూ, మరికాసేపు నానమ్మ వంట చేస్తుంటే రుచులు చూస్తూ, కాసేపు ఏదో పుస్తకం చదువుతూ, కాసేపు టీవీ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. ఒకరోజు పిల్లల అల్లరి ఆపటానికి తాతమ్మ కథ చెప్తా రమ్మని పిలిచింది. అందరూ ఆవిడ చుట్టూ చేరారు. అక్కడే పుస్తకం చదువుతూ కూర్చున్న చారుకేశ కూడా కథ విందామని పుస్తకం మూసేశాడు.

ఆవిడ మొదలుపెట్టిన కథ చిన్నప్పుడు తను విన్నదే. "అనగనగనగనగనగనగనగా ఒక ఊళ్ళో ఒక రాజుకి ఇద్దరు భార్యలు ఉన్నారుట. పెద్దరాణికి ఒక్క వెంట్రుక, చిన్నరాణికి రెండు వెంట్రుకలు ఉండేవిట. అందుకని రాజుకి చిన్నరాణి అంటే ఎక్కువ ప్రేమ ఉండేదిట. చిన్నరాణి రాజుతో చెప్పి పెద్దరాణిని బైటకి గెంటేసిందిట. పెద్దరాణి ఏడుస్తూ బాధగా వెళ్తుంటే, ఒక సన్యాసి ఎదురొచ్చి "ఎందుకమ్మా ఏడుస్తున్నావు? ఇక్కడ ఒక నది ఉంది. అందులో మూడుసార్లు మునిగితే జుట్టు వచ్చేస్తుంది" అన్నాడుట. ఆవిడ అలాగే చేసేసరికి మోకాలు వరకు పొడవైన జుట్టు వచ్చేసిందిట. ఆవిడ మళ్ళీ రాజు దగ్గరకి వెళ్ళిందిట. రాజుగారు ఇప్పుడు చిన్నరాణిని బైటకి గెంటేశాడుట. ఆవిడ కూడా ఏడుస్తూ నడుచుకుంటూ వెళ్తుంటే, మళ్ళీ అదే సన్యాసి కనిపించి "ఎందుకమ్మా ఏడుస్తావ్? ఈ నదిలో మూడుసార్లు మునిగితే జుట్టు వచ్చేస్తుంది" అని చెప్పాడుట. చిన్నరాణికి కూడా అలాగే జుట్టు వచ్చేసిందిట. అప్పుడు చిన్నరాణి "మూడుసార్లు మునిగితేనే ఇంత జుట్టు వచ్చింది అంటే నాలుగు సార్లు మునిగితే ఇంకెంత జుట్టు వస్తుందో" అనుకుని మళ్ళీ మునిగిందిట. అప్పుడు మొత్తం జుట్టంతా పోయిందిట. ఇదివరకు ఉన్న రెండు వెంట్రుకలు కూడా పోయాయిట. అందుకే దురాశ, అసూయ పనికి రావు." అంటూ కథ ముగించింది తాతమ్మ.

చిన్నప్పుడు ఈ కథ వింటే నవ్వొచ్చేది. తరువాత కొన్నాళ్ళకి రకరకాల సందేహాలు పుట్టుకొచ్చేవి.

"అసలు అలా ఒక్క వెంట్రుక, రెండు వెంట్రుకలు ఎవరికైనా ఉంటాయా?"

"నదిలో మునిగితే అంత జుట్టు ఎలా వచ్చేస్తుంది?"

"రాజుకి కొంచెం తిక్కాఏంటి? లేకపోతే అసలు ఒకటీ-రెండు వెంట్రుకలు ఉన్నవాళ్ళని ఎందుకు పెళ్లి చేసుకున్నాడు? మళ్ళీ ఎందుకు గెంటేశాడు?"సమాధానాలు లేని ఇలాంటి ప్రశ్నలు వేసేవాడు.

కానీ ఇంకాస్త పెద్దయ్యాక ఇలాంటి కథలని 'పెద్దరికం' గా చూడటం అలవాటయ్యింది. "పిల్లలకి నీతి చెప్పటం కోసం రకరకాల కథలు అల్లేవారు పూర్వకాలం వాళ్ళు. ఇందులో మనం ఈకలు పీకక్కర్లేదు. పిల్లలు నాలుగు మంచి విషయాలు నేర్చుకుంటున్నారు కదా?" అనుకునేవాడు. కానీ విచిత్రంగా ఈసారి కోపం వచ్చింది. దగ్గర దగ్గర రక్తం ఉడికిపోయినంత పనయ్యింది. పిల్లలు అందరూ నవ్వుతుంటే తనను చూసి నవ్వుతున్నారేమో అనిపించి మొహం ఎర్రబడిపోయింది.

ఎందుకంటే, చూస్తూండగానే గత రెండేళ్లుగా నెమ్మది నెమ్మదిగా తన బుర్ర పైనంతా ఒక మైదానం ఏర్పాటు అయ్యింది మరి. ఆ కథలో రాణులకీ తనకీ పెద్ద తేడా ఏమీ లేదు ఇంక. ఐతే, అలా ఉపాయాలు చెప్పే సన్యాసులూ, జుట్టుని పుట్టించే నదులూ లేవాయే! ఎవరు అర్థం చేసుకుంటారు తన ఇబ్బంది? అమ్మ-నాన్న అయితే "అవన్నీ పట్టించుకోకు, చదువు మీద ధ్యాస పెట్టు" అనే

అంటారు. తాతగారికి చెప్తేనేమో "నా పోలికేరా నీది" అంటూ మురిసిపోతారు. ఆయనకి నాన్నమ్మ సపోర్ట్. "మీకు యాభయ్యిల్లో వచ్చింది, నాకు ఇరవయ్యిల్లోనే వచ్చింది స్వామీ" అని చెప్తే మాత్రం ఏం ఒప్పుకుంటారు? అన్నయ్య మాత్రం ఏదో ఒక పాయింటులో ఆ 'పోలిక' తప్పించుకున్నట్లున్నాడు. నడుస్తుంటే ఎగిరెగిరి పడే హెయిర్ స్టైల్ వాడిది. తనకే గనక శాపం పెట్టే పవరుంటే ఎప్పుడో పెట్టేసేవాడు 'అన్నయ్యకి నాలుగు వెంట్రుకలే మిగులుగాక' అని. అసలు తను మంచివాడు కాబట్టి ఆ నాలుగు వెంట్రుకలైనా ఉండనిస్తాను అంటున్నాడు. మరి వాడు కొట్టే బడాయి అంతా-ఇంతానా? కాఫీ తాగుతున్నా అద్దం ముందే, చదువుకుంటున్నా అద్దం ముందే, ఫోన్ మాట్లాడుతున్నా అద్దం ముందే ఉంటాడు ఆ కేశసంపదని దువ్వెనతోనో, వేళ్ళతోనో సరిచేసుకుంటూ. తను రోజు మొత్తంలో ఒకసారి తల దువ్వాలన్నా దువ్వెన కూడా బద్ధకిస్తుంది "ఇంతోటి తలకట్టుకి కూడా నేను కావాలా" అన్న ట్లు. వీటన్నిటికీ తోడు ఈమధ్య 'ఫోటోఫోబియా' ఒకటి మొదల య్యింది. లైటున్న చోట నుంచుంటే నెత్తి మీదున్న ఖాళీ నిగనిగలాడుతూ ఎక్కడ బైటపడుతుందో అని!

నిజానికి తను చెప్పుకోదగిన అందగాడే. కానీ ఈ రెండేళ్లలో అంతా మారిపోయింది. అందరూ అంటున్నట్టుగా రేపు పెళ్లి అవ్వటం, అవ్వకపోవటం మాట అటు ఉంచినా, మామూలుగా రోడ్డు మీద నడుచుకెళ్ళాలి అంటేనే ఆలోచిస్తున్నాడు...ఒక రకంగా చెప్పాలి అంటే తప్పించుకుని తిరగాలని చూస్తున్నాడు. బైటికి వెళ్తే అందరూ తన నెత్తినే చూస్తున్నట్లు అనిపిస్తోంది. పైన ఉండాల్సినది కూడా లేకపోయినా "శిరోభారం" ఎక్కువైపోతోంది. కనీసం "చారుకేశ" అన్న పేరు పెట్టుకున్నందుకైనా ఆ మర్యాద నిలపలేదు తన జుట్టు!

ఇలా ఇక్కడే కూర్చుంటే ఇంకా చిరాకు పెరిగేటట్లు ఉంది చారుకేశకి. అలా గోదావరి వరకు వెళ్లివద్దామని పాలేరు సైకిల్ తీసుకుని బయల్దేరాడు. గోదావరి గట్టున ఒక్క అరగంట కూర్చుంటే చాలు... ఎవరికైనా ఎలాంటి చిరాకులున్నా ఇట్టే పోతాయి. తనకి చిన్నప్పటి నుండి అలవాటుగా ఉన్నదే గోదారితో ఈ స్నేహం. పిల్లగాలికి సలాం కొట్టి పక్కకు తప్పుకునే సిపాయిల్లా గోదావరి అలలు, ఆ చల్లదనానికి వేసవి పగటి వేడి నుండి మేము విముక్తి పొందామని ప్రకటిస్తున్న పక్షుల గొంతులు, నీళ్ళు ముంచుకు తీసుకుపోవటానికి వచ్చిన ఆడవాళ్ళు, ఈత నేర్చుకోవటానికి వచ్చిన పిల్లగాళ్ళు, వాళ్ళకి నేర్పటానికి వచ్చిన తండ్రులు-తాతలు, ఊసులాడుకోవటానికి వచ్చిన జంటలు, ఊరికే గాలి పీల్చుకోవటానికి వచ్చిన పెద్దవాళ్ళు, ఈ చుట్టాలందరినీ పలక రించటానికి పైకి వచ్చి మళ్ళీ లోపలకి మునుగుతున్న చేపపిల్లలు... అంతా ఒక అందమైన చిత్రం... చిత్రమైన అందం.

ఎప్పట్లాగే పది నిముషాల్లో కోపం, చిరాకు పోయి, మనసు నిర్మలంగా తయారయ్యింది. లాంచీ అవతలి ఒడ్డుకి వెళ్ళటానికి బయల్దేరుతోంది. గబగబా మెట్ల మీద నుండి లేచి వెళ్లి లాంచీ ఎక్కాడు. అది ఒక సరదా ప్రయాణం, పని ఉన్నా లేకపోయినా లాంచీ లో అవతలి ఒడ్డుకి వెళ్లివస్తే ఆ ఇదే వేరు. లాంచీలో ఎక్కి చల్లగాలి పీల్చుకుంటూ ఉండగా గమనించాడు. లాంచీ చక్రం తిప్పుతున్న కుర్రాడికి ఒక కాలు, ఒక చెయ్యి లేవు. అన్నీ బాగున్న వాళ్ళకే ఇది చాలా కష్టమైన పని. అలాంటిది తను ఎలా అంత సమర్థవంతంగా తిప్పేస్తున్నాడో! అడిగితే అలవాటైపోయింది బాబుగారూ అన్నాడు హుషారుగా. ఏ పని చేయాలన్నా కాలు, చెయ్యి చాలా అవసరం కదా? అంతెందుకు? ఒక్క వేలుకి దెబ్బ తగిలితేనే మనం విలవిలలాడిపోతాము. ఈ కుర్రాణ్ణి చూస్తే చాలా ఆశ్చర్యం కలిగింది. కొద్దిగా సిగ్గుగా కూడా అనిపించింది. తనకి లేనిది జుట్టు మాత్రమే. కాలూ, చేయీ కూడా లేని ఆ కుర్రాడే "అలవాటైపోయింది" అంటూ ఉత్సాహంగా గడిపేస్తున్నాడు. ఆలోచించే కొద్దీ ఏదో ఉత్సాహం పెరిగింది.

లాంచీ ప్రయాణం ముగించి సైకిల్ మీద ఇంటికి బయల్దేరాడు. అసలు బట్టతల శాపం కాదు సరికదా బోలెడంత పెద్ద వరం అనుకున్నాడు. ఆలోచిస్తున్న కొద్దీ బట్టతల యొక్క లాభాల లిస్టు పెరిగిపోయింది.

బట్టతల ఉంటే నూనె ఖర్చు తగ్గుతుంది, షాంపూ ఖర్చు తగ్గుతుంది. రకరకాల టోపీలు పెట్టుకునే అవకాశం ఉంటుంది. జుట్టు చెరిగిపోయిందేమో అని కంగారు పడి అస్తమానం దువ్వ క్కర్లేదు. హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు చెరుగుతుందనే భయం అసలే అక్కరలేదు. జేబులో దువ్వెన మోయక్కర్లేదు. అదో అడ్డం కాదూ? అందరూ తనని తెలివైన వాడిగా చూస్తారు. పెద్దమనిషిగా గౌరవిస్తారు. సలహాలూ అవీ అడగటం మొదలు పెడతారు. బస్సుల్లో రైళ్ళలో సులభంగా సీట్ దొరుకుతుంది. తన పక్కనున్న కుర్రాళ్ళు అల్లరి చేస్తే తనని కూడా కలిపి తిట్టటం ఇక ఉండనే ఉండదు. రేపు చదువయ్యాక ఉద్యోగం ఇంటర్వ్యూలకి వెళ్తే తన మీద పడే "మేధావి", "మెచ్యూర్డ్" అభిప్రాయాలు బాగా ఉపయోగపడచ్చు. అందరిలోనూ మనల్ని గుర్తుంచుకోవడానికి ఒక మాంచి కారణం ఉంటుంది జనానికి. రేపన్న రోజున తెల్ల జుట్టు వస్తే ఉన్నట్టుండి ముసలి వాలకం రాదు. బుర్ర వెనుక నల్ల జుట్టు ఉన్నా తెల్ల జుట్టు ఉన్నా ఒకటే కదా? ఇన్ని ఉపయోగాలు ఉన్న బట్టతల మీద ఇన్నాళ్ళూ ఏహ్య భావం పెంచుకున్నానా?

అనుకున్నాడు చారుకేశ. కుదరదు గానీ ఒక్కసారి ఆ నున్నటి బట్టతలకి సుతారంగా ఒక ముద్దు ఇచ్చుకోవాలి అనిపించింది. ఈ నూతనోత్సాహంతో సైకిల్ వేగం పెంచుతూ ఇంటికి చేరి రామాయణం చదువుకుంటున్న తాతయ్య బట్టతలకి ఒక చిన్ని ముద్దు పెట్టి సున్నితంగా నిమిరాడు. ఎప్పుడూ లేని ఈ సన్నివేశానికి నివ్వెరపోయి చూశారు తాతయ్య, నాన్నమ్మ.

## చివరికి

**చంద్ర కన్నెగంటి**

వరస వీడ్కోళ్ల పిదప
వెనుదిరిగి మెల్లగా లోపలికి
చలిగాలినీ, చీకటినీ బయటే వదిలేసి

మెచ్చుకోళ్ళు సూటివీ వంకరవీ
నవ్వులు పాపలవీ పెద్దలవీ
ఇంకా తలలో గాల్లో తచ్చాడుతూ

పిల్లల్ని కవ్వించి కవ్వించి
కప్పుకు చేరిన గాలిబుడగలన్నీ
డస్సి నేలపై వెల్లకిలా పడి

అలసి బొమ్మల్లో బొమ్మలల్లే
పిల్లలు పడి నిద్రపోతూ

ఏం చేయాలో తెలీక తెల్లమొహాలేసి
కాగితపు రుమాళ్ళు ఎక్కడివక్కడే
అక్కడక్కడా వదిలిన
సగం నీరూ సగం తిండీ
ఒకదాన్నొకటి ఓదార్చుకుంటూ

అజీర్తితో తేపుతూ చెత్త డబ్బా
తొట్టిలో ముక్కు మూసుకుని
కడగని గిన్నెలూ, ఎంగిలి కంచాలూ

శుభ్రపరిచే భద్రపరిచే
రెండు చేతుల కోసం ఎదురుచూస్తూ

## సివిలిజేషన్

**దివాకర్ పేరి**

నగరాలు నవ్వుతున్నాయ్
తమని చుట్టుముడుతున్న
కాలుష్యాన్ని చూసి
పెరిగే కార్లు
తరిగే ఇంధనం
ఊరంతా పొగ
పెరుగుతున్న జనం
నగరాలు నవ్వుతున్నాయ్
పొగ మింగుతూ
పెరుగుతున్న జనాభాని చూసి

నదులు నవ్వుతున్నాయ్
తమలో కలిసే కాలుష్యాన్ని చూసి
ఫ్యాక్టరీలు వదిలే వేస్టు
జనం కడిగే డస్టు
నదుల అపవిత్రతకది ఫీస్టు
పెరిగే మాలిన్యాలకవి హోస్టు

నదులు నవ్వుతున్నాయ్
తమ మాలిన్యాన్ని కడుక్కోడానికి
తమలో మునిగే పాపుల్ని చూసి
పాపాలు చేస్తూ
పెరుగుతున్న జనాభాని చూసి

# అమ్మో! విదేశయానమా ?

- నోరి రాధిక

పిల్లలు పెద్దవాళ్ళయి పెళ్ళిళ్ళు చేసుకుని వాళ్ళ వాళ్ళ ఇళ్ళకి వెళ్ళిన తర్వాత ఎపుడైనా వాళ్లకి అవసరం వస్తే తల్లితండ్రులు వాళ్ళ దగ్గరికి వెళ్లి వాళ్లకి సహాయం చేయటం మన సంస్కృతిలో చాలా సహజమైన విషయం. కానీ ఆ పిల్లలు విదేశాలలో ఉంటే మాత్రం పెద్దవాళ్ళకి కొంచెం చిక్కు సమస్యే ఎదురవుతుంది. ఎందుకంటే టిక్కెట్టు కొనుక్కుని బస్సులోనో ,రైలులోనో గభాలున వెళ్ళే ప్రదేశం కాదు. పోనీ చుట్టం చూపుగా వారమో పదిరోజులో ఉండి కావాలంటే మళ్ళీ వద్దాములే అనుకుని వెనక్కి వెళ్ళగలిగే ప్రదేశం కూడా కాదు. విమానంలో ఎగిరి వెళదామనుకున్నా రెండు, మూడు గంటల ప్రయాణం అయితే ఫరవాలేదు కానీ ఎక్కువ సేపు ఆ విమానాలలో కదలకుండా కూర్చుని ఎగరాలంటే కూడా పెద్దవాళ్ళకు కష్టమే. కాళ్ళు,నడుములు పట్టేసి పాదాలు వాచే ప్రమాదం ఉంది. ఇక ఎయిర్ ప్రెషర్ లో తేడా వలన గొంతు,చెవులలో వచ్చే నొప్పులు సరే సరి. ఇంకా మన రోజులు సరిగా లేక కనెక్టింగ్ ఫ్లయిట్ మిస్సయ్యారంటే ఇంక వాళ్ళ ఇబ్బందులు ఇంతా అంతా కాదు .ఖర్మ కొద్దీ వారికి ఇంగ్లీషు రాక పోయినా, వారి వెంట ఎవరూ లేకపోయినా, ఆ ఒంటరి ప్రయాణం లో వారు పడే బాధలు ఆ దేవుడికే తెలుసు .

ఇన్ని కష్టాలు పడి గమ్యం చేరాక ఎదురయ్యే కష్టాలు మరోరకం. సాధారణంగా తల్లిదండ్రులు, అత్తమామలు వారి వారి పిల్లల పురిటి సమయంలో సహాయం చేయటానికి విదేశయానం చేస్తారు. ఇలాంటి అవసరాలలో ఆడవారికి చేతి నిండా పని ఉంటుంది . కానీ మగవారికి చేయటానికి ఏ పనీ లేక కాలం గడవటమే కష్టం గా ఉంటుంది. అందుకే ఇక్కడకు వచ్చిన తర్వాత ఆడవారికంటే మగవారే వెంటనే వెనక్కు వెళ్లిపోతామని మనసు మార్చుకుంటారు. ఇక వయసు దాటిన తర్వాత పెద్దవాళ్ళు పిల్లల దగ్గరనుండి ఏమీ ఆశించరు. కాస్త మనసు విప్పి ప్రేమగా వారితో మాట్లాడితే చాలు, ఇక వారి ఆనందానికి అంతే లేదు . కానీ ఈ విదేశీ జీవనంలో మాట్లాడటం సంగతి దేవుడెరుగు ,కనీసం నిలకడగా నాలుగు నిముషాలు నిల్చోడానికి కూడా సమయం ఉండదు .అందుకే పాపం పెద్దవారు కబుర్లు చెప్పే తోడు కోసం ఎదురు చూస్తారు. ఇండియాలో అయితే ఇంటి నిండా జనం, బయటి కెళితే ఇరుగు-పొరుగు. పలకరించి కుశలం కనుక్కోవ టానికి అప్పుడప్పుడూ వచ్చే స్నేహితులు, బంధువులు ఉంటారు. కానీ ఇక్కడెవరుంటారు? బయటివాళ్ళ సంగతి సరే, ఇంట్లో వాళ్ళే ఎప్పుడో ఉదయం ఆఫీస్ కి వెడితే మళ్ళీ రాత్రికి కానీ ఇంటికి రారు. పిల్లల చదువులు, వారి ఇతర వ్యాపకాలు చూడటానికే టైం చాలదు, ఇంకా అశ్రద్ధ చేయకుండా ప్రత్యేకంగా పెద్దవాళ్ళతో కబుర్లు చెప్పే టైం ఎక్కడ ఉంటుంది? విసుగొచ్చి వాళ్లకి ఇండియా మీద ధ్యాస మళ్ళుతుంది మరి. ఇంటర్నెట్, టి.వి.లతో ఎంత కాలం పొద్దు పుచ్చుతారు? సాయంత్రం పూట ఇండియాలోలా కాస్త అలా షికారుకు వెళ్ళటానికి ఉండదు, ఎవరైనా తీసుకెళ్ళాలి . వీకెండ్ లో పార్టీలు ఉంటాయి కాని అవి అందరికీ నచ్చవు .ఆ పార్టీలలో ఎవరి గొడవ వారిదే. వీరి తో పని కట్టుకుని ఎవరు మాట్లాడతారు? పైగా ఆ పార్టీలలో డ్రింక్స్, డాన్స్ వీరికి నచ్చక పోవచ్చు కూడా .

ఇక ఇంట్లో పిల్లలతో కులాసాగా కాలక్షేపం చేయాలన్నా, కబుర్లు చెప్పాలన్నా, ఇంకో రకమైన ఇబ్బంది . ఆ పిల్లలకి తెలుగు రాకపోతే ఇక ఇంగ్లీషు ఒకటే మార్గం . కానీ ఆ పెద్దవాళ్ళకు ఇంగ్లీషు రాకపోతే వాళ్ళు ఎంత ముచ్చట పడినా కమ్యూనికేషన్ ఉండదు. ఆ చిట్టి చిన్నారులకు తమ చేతులతో రకరకాల పిండి వంటలు చేసి పెడదామన్న కోరిక కూడా వారికి తీరదు. ఇక్కడి ఫుడ్స్ తప్ప మన భోజనం, మన వంటకాలు ఆ పిల్లలకి నచ్చకపోతే ఇక తినుబండారాల ద్వారా వాళ్లకి దగ్గరయ్యే అవకాశం కూడా ఉండదు. వాళ్ళు విజిట్ చేస్తున్న ఊరు చిన్నదైనా పెద్దదైనా ఏదో ఒక చిక్కు ఉండనే ఉంటుంది. పెద్దవూరయితే వెళ్ళాల్సిన ప్రదేశాలు చాలానే ఉంటాయి. కానీ తీసుకెళ్ళేవారే కావాలి .ఒక్క మాటలో చెప్పాలంటే అన్నీ అందుబాటులో ఉంటాయి కానీ అందుకునే అవకాశమే ఉండదు .ఏ పండగ రోజో గుడికి వెళదామనుకుంటే చిన్న ఊళ్లలో గుడులు కూడా ఉండవు. స్నేహితులు నలుగురూ కలిసి ఏ పండగో చేసుకున్నా, ఏదో కలిసి భోజనం చేయడం, ఆ తర్వాత సరదాగా పాటలు పద్యాలు పాడుకోవటం తప్ప ఇండియాలో ఉండే పండగ స్పిరిట్ ఇక్కడ ఎంత ప్రయత్నం చేసినా రాదు . పెద్ద ఊళ్లలో గుడులయితే చాలా ఉంటాయి, ఏ దేవుడిని చూడాలో మనమే ఎంచుకోవచ్చు. కానీ ఆ గుడి దాకా వెళ్ళటమే కష్టం. అందుకే ఏదైనా విదేశ పర్యటన చేయాలంటే ముందుగా గుర్తు పెట్టుకోవలసినవి రెండు. ఒకటి డ్రైవింగ్ వచ్చి ఉండటం, లేకపోతే కాళ్ళు కట్టేసినట్లయి స్వాతంత్ర్యం పోయినట్లవుతుంది. డ్రైవ్ చేయాలన్నా , పోనీ ఆ విద్య నేర్చుకోవాలన్నా వయసు

విషయం కూడా ఆలోచించాలి మరి ! సరే రెండో విషయం ఇంగ్లీషు మాట్లాడగలగటం. భాష రాకపోతే ఇక కమ్యూనికేషన్ ఉండదు . స్వంత మనుషుల వద్ద కూడా మౌనమే శరణ్యం! అలాగే భార్యా భర్తలిద్దరూ ఉద్యోగం చేస్తున్నట్లయితే పగలంతా ఈ పెద్దవారు ఇంట్లోనే ఉండాలి. ఇరుగు-పొరుగుతో ఇండియాలో మాదిరి పరిచయాలు స్నేహాలు ఉండవు. హటాత్తుగా ఏమైనా మెడికల్ ఎమర్జన్సీ వచ్చినా కూడా పలికే దిక్కు ఉండదు. ఇంక ఆ భార్యా భర్తలకు ఆఫీసులో శాంతిగా పని చేసుకోవటం కూడా కష్టమే. మెడికల్ ఇన్సురెన్స్ విషయానికి వస్తే అదొక విషవలయం. విజిటర్ ఇన్సూరెన్స్ లు ఎంత మంచివి తీసుకున్నా, ఖర్మ కొద్దీ ఏదైనా అవసరం వచ్చి వాడాల్సిన దుస్థితి వస్తే వాటి అసలు బండారం తెలుస్తుంది. చిన్నది పెద్దది అనే తేడా లేదు. ఏ అవసరం అయినా, అది ఏ కారణం అయినా అది ప్రీ ఎగ్జిస్టింగ్ కండిషన్ అని కవర్ చేయరు. ఈ మాయాజాలాన్ని ఛేదించటం ఏ మాంత్రి కుని వశం కాదు . కాలం కలిసి రాక ఏ సర్జరీనో చేయాల్సి వస్తే ఇక ఆ పిల్లలకి ధర్మసంకటమే! ఈ రిస్కులకి కూడా సిద్ధపడి తమ వయసుని, ఆరోగ్యాన్ని ఇంకా అనేక రకాలైన ఇబ్బందులని కూడా లెక్క చేయకుండా పాపం, మన తల్లితండ్రులు, అత్తమామలు ఇక్కడకు వస్తారు. మనకు, మన పిల్ల లకు సహాయం చేయటానికి సేవలు చేయటానికి వెనుకాడకుండా. వారిని అలా ఉపయోగించుకోవడం ఎంత వరకు న్యాయం? కానీ పరిస్థితుల ప్రభావం వల్ల ఒక్కొక్కసారి తప్పదు.

అమ్మా-నాన్నా, అత్తా,-మామా, మమ్మ ల్ని, ఈ మీ పిల్లల్ని క్షమించండి. మా స్వార్ధాన్ని మన్నించండి . మీరు మాకు చేస్తున్న దాంట్లో వెయ్యో వంతైనా మేము మా పిల్ల లకు చేయగలమో లేదో తెలియదు. అయినా మీ స్ఫూర్తితో మా బాధ్యతలను మేము చక్కగా నిర్వహించాలని, మా పిల్లల్ని మంచి పద్ధతిలో పెంచగలగా లని మమ్మల్ని దీవించండి .

## డిప్రెషన్

**పాలపర్తి ఇంద్రాణి**

సీతాకోక చిలుకలు

చిలుక ముక్కుల్లాంటి

చిగురుటాకులు

ఇళ్ళపై కప్పుల మీదుగా

తేలిపోతూ చిరునవ్వుల నురగలు

అన్నీ అక్కడే ఉన్నాయి

అందుకోలేను.

దిగులు పరదాల

చింతల మందిరాన

బందీని

విచారాల కందకాలని

దాటుకు వచ్చి

విడిపించవూ

నేనూ.

# మనోహర దృశ్య కావ్యం

డా. అపర్ణ యేలూరిపాటి

మా అబ్బాయి చెప్పినట్టు మా కోడలు శాస్త్రాల్లో పూర్ కాదు కానీ, పురాణాల్లో బాగా స్ట్రాంగ్. ఆ అమ్మాయికి చిన్నప్పుడు విన్న కథలు కూడా బాగా గుర్తుంటాయి. పైగా వాళ్ళమ్మగారి నుంచి, అమ్మమ్మ నుంచీ టీవీల్లో వచ్చే ప్రవచనాలు వినడం అలవాటు అయిందిట. చాలా పురాణకథలు, స్థలపురాణాలు కూడా చెప్పేస్తుంటే, ఇవన్నీ "ఈ అమ్మాయికి ఎలా తెలుసబ్బా!" అని నాలో నేను ఆశ్చర్యపోతూ ఉంటాను.

తనకి ఉన్న భగవద్భక్తికి తోడు పురాణాలు, ఇతిహాసాలు వింటే పిల్లలకి మంచి గుణాలు అబ్బి ప్రహ్లాదుడిలాంటి పిల్లలు



పుడతారని నమ్మకం. శ్యామలగారిని " ఏమండీ ... గజేంద్ర మోక్షం తెలుగు అర్థాలతో ఉన్న ప్రతి మీ ఇంట్లో ఉందా?" అని అడిగిందట గుళ్ళో కలిసినప్పుడు. ఆ విషయం నాతో చెపుతూ, "గజేంద్రమోక్షం చాలా గొప్ప గ్రంధం అత్తయ్య గారూ! అందులో 'సిరికిన్ చెప్పడు ... పద్యం శ్రీరాముడే స్వయంగా రాశాడట" అంది. నేనుకూడా చిన్న ప్పుడు 'పోతన ఒక పద్యం విషయంలో ఎలా రాస్తే బాగుంటుందా అనీ, ఎంత అందంగా రాయాలా అనీ రాత్రంతా ఆలోచిస్తూ, పొద్దున్నే సంధ్యావందనానికి వెళ్ళగా శ్రీరాముడే స్వయంగా వచ్చి ఆ పద్యాన్ని పూరించాడు' అని విన్నాను కాని, అది ఈ పద్యమో, కాదో నాకు గుర్తు లేదు. చెప్పద్దూ ...

అలాగే, ఇదే పద్యం చదివిన శ్రీనాథుడు "ఏమిటీ? గజేంద్రుడు వేడుకుంటే, శ్రీమన్నారాయణుడు ఉన్నవాడు ఉన్న ట్టుగా వెళ్ళిపోయాడా రక్షించడానికి!" అని వెటకారం చేస్తే, అది విన్న పోతనామాత్యుని కొడుకు ఒక పెద్దరాయిని బావిలో పడేసి, "మామయ్యా, మీ అబ్బాయి బావిలో పడిపోయాడు" అని చెప్పగా, ఆయన కంగారుగా బావి దగ్గరకు పరుగు పెట్టాడనీ, "మరి బావిలో పడ్డవాడిని పైకి లాగే సాధనాలేమీ లేకుండా, ఉన్నవాడివి ఉన్నట్టుగా పరిగెత్తుకుని ఎలా వచ్చావు మామయ్యా"! అని అనేసరికి, తను పోతన పద్యాన్ని వెటకారం చేసినందుకు క్షమించమని పోతనను వేడుకున్నాడనీ విన్నాను.

పోతన సహజకవి మాత్రమే కాదు, భక్త కవి కూడా. అసలు నన్నయాదులు రచించలేదు కనుకనే, భాగవతాన్ని తాను రచించగలిగే అవకాశం వచ్చిందని పోతన స్వయంగా చెప్పుకున్నాడు. నిజానికి ఆయా కావ్యాలతో పోలిస్తే, తెలుగువారికి చాలా దగ్గరయింది భాగవతం. అందులో కొన్ని కొన్ని ఘట్టాలు చదివితే కష్టాలు తొలగుతాయనీ, కొన్నిఘట్టాలు చదివితే శుభాలు జరుగుతాయనీ మన నమ్మకం. నన్నయ్యగారు భారతావతారికలో "సారమతిం గవీంద్రులు ..." పద్యంలో తన కవిత్వంలో కథాకలితా ర్థయుక్తి, అక్షరరమ్యత, గొప్పగొప్ప సూక్తులు ఉన్నాయని పేర్కొన్నట్టుగా, పోతనగారి పద్యాలలో ముఖ్యరసమైన భక్తితో పాటు, వర్ణనలు, అలంకారాలు, నీతులు, లోకరీతులు ఎన్నో ఘట్టాలలో కనిపిస్తాయి. అదొక మహానిధి. కావాల నుకున్న వారికి కావాల్సినంత, తీసుకున్న వారికి తీసుకున్నంత నిధి దొరుకుతుంది. అందుకే నేను భాగవతంలోని వర్ణనాచాతుర్యాన్ని, దృశ్యచిత్రీకరణ విధానాన్ని వివరించడానికి కొన్ని పద్యాలను ఉదాహరణలుగా ఎన్నుకొన్నాను ఇక్కడ ...

ముందుగా, ఇందాక చెప్పుకున్న గజేంద్రమోక్షఘట్టమే తీసుకుంటే, గజేంద్రుడు తన పరివారంతో సరస్సులో స్నానార్థం ప్రవేశించడం, ఆ బృందం చేసిన కలకలం ఇలా వర్ణిం చాడు.

**"ఇభ లోకేంద్రుఁడు హస్త రంధ్రముల నీరెక్కించి పూరించి చం**
**డభ మార్గంబున కెత్తి నిక్కి వడి సుడ్డాడించి పింజింప నా**
**రభటిన్ నీరములోన బెల్లెగసె నక్రగ్రాహపాఠీనముల్**
**నభమం దాడెడు మీన కర్కటములన్ బట్టెన్ సురల్ మ్రాన్పడన్**".

గజేంద్రుడు తన తొండంతో నీరు పీల్చి, తొండాన్ని పైకెత్తి ఆ నీటిని వదలగా, ఆ నీటిలోనుంచి బయటపడిన చేపలు, ఎండ్రకాయలు ఆకాశంలోని మీనరాశిని, కర్కాటక రాశిని గుర్తు తెచ్చాయట. అది చూసిన దేవతలు "ఆకాశంలో రెండు మీనరాశులు, రెండు కర్కాటకరాశులు ఉన్నాయేమిటబ్బా"! అని ఆశ్చర్యపోయారట. ఇక్క డ అసఖ్యాకంగా బయటికి రాశులుగా అన్నన్ని రాగలిగాయంటే, అసలు ఆ తొండం ఎంత పెద్దది,! అందులోనుండి నీళ్లు ఎన్ని వచ్చా యి! అందులో ఈ ప్రాణులు ఎన్ని పట్టాయి! అనే దృశ్యమే కాక

డా, ఆ గజరాజు ఆకాశ పర్యంతంనీటిని చిమ్మగలిగినంత శక్తి కలిగిన వాడనే అర్థం కూడా కనబడుతోంది. గజేంద్రుడు పరివారంతో చేసిన ఆ కలకలానికి కోపించిన మకరం గజేంద్రుని చేరి అతని కాలిని ఒడిసి పట్టిన సందర్భంలో, '**భానుబింబాన్ని కబళించిన స్వర్భానువులాగా మకరం కరిని పట్టింది**' అంటాడు పోతన. కరి-మకరుల పోరు సందర్భంలో

**"అలయక సొలయక వేసట, నొలయక కరి మకరితోడ నుద్దండత రాత్రులు సంధ్యలు దివసంబులు, సలిపెం బోరొక్క వేయి సంవత్సరముల్".**

అంటూ, ఆ పోరాటదృశ్యాన్ని కళ్ళకు కట్టించినట్టు వర్ణించాడు. ఎన్నాళ్ళు పోరాడినా, ఎంత ప్రయత్నించినా, మకరం బారినుంచి తప్పించుకోలేకపోయిన గజరాజు చివరికి ఆర్తత్రాణ పరాయణు డైన శ్రీమన్నారాయణుని గురించి ప్రార్థిస్తూ,

**"లోకంబులు లోకేశులు, లోకస్థులు దెగినఁ దుది నాలోకం బగు బెం**

**జీకటి కవ్వల నెవ్వం, డే కాకృతి వెలుఁగు నతని నే సేవింతున్"**

అంటూ పరిపరివిధాలుగా ప్రార్థిస్తాడు. చివరికి,

**"లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్ ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడున్ ...**

అంటూ ఇంక నీవు తప్ప మరొక శరణం లేదు లేదూ అంటూ మొరలు పెట్టాడు. ఆసమయంలో ఆపన్నప్రసన్నుడైన శ్రీమహావిష్ణువు వైకుంఠపురములో రమావినోదియై పరివేష్టించి ఉన్నాడట. గజేంద్రుని ప్రార్థన విన్న వెంటనే, తానున్న పరిస్థితిలోనే, వివాదంలో వినోదంకోసం పట్టిన లక్ష్మీదేవి చెంగును కూడా విడవకుండా, ఆమెతో విషయం చెప్పకుండా, కనీసం గరుడుని కూడా పిలవకుండానే బయలుదేరాడట. ఇంక చేసేదేముంది,

**"తన వెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధవ్రాతమున్, దానివెన్కను బక్షీంద్రుడు** ... "అందరూ బయలుదేరారట. మకరిని ఖండిచడం కోసం కరుణాసింధుడైన హరి చక్రాయుధాన్ని ప్రయోగించగా, "**భీమంబై తలద్రుంచి బ్రాణముల బాపెం జక్ర మాశుక్రియన్**" అలా చక్రము మకరిని సంహరించగా, "**మకరమొకటి రవి జొచ్చెను, మకరము మఱియొకటి ధనదు మాటున డాగెన్, మకరాలయమున దిరిగెడు, మకరంబులు కూర్మరాజు మరువున కరిగెన్**". ఇక్కడ మొదటి మకరంలో సూర్యుడు మకరాశిలో ప్రవేశించాడనే అర్థం రాగా, రెండో మకరంలో విష్ణువుకు, శివునకు సఖుడైన కుబేరుణ్ణి మొసలి శరణు వేడిందనే అర్థం రాగా, మూడో మకరంలో సముద్రంలో ఉన్న మిగిలిన మొసళ్ళన్నీ మహాకూర్మరూపంలో ఉన్న శ్రీమహా విష్ణువునే శరణు చొచ్చాయనే అర్థం లో వివరించి కరికి మోక్షణాన్ని, మకరికి నిజరూప దర్శనాన్ని ప్రసాదించిన ఘట్టాన్ని పోతన కన్నులవిందు చేశాడు.

బలిచక్రవర్తిని మూడడుగులు దానంగా కోరిన



మహావిష్ణువు త్రివిక్రముడై విక్రమించిన ఘట్టంలో —

**ఇంతింతై వటుఁడింతయై మఱియు దానింతై నభోవీథిపై**

**నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**

**నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై**

**నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై".**

వామనుడుగా 'ఇంత' ఉన్న హరి ఇంతై, అంతై, మరింతయై, క్రమక్రమంగా పెరుగుతూ ఆకాశమార్గమంతా నిండిపోతూంటే, సూర్యబింబం ఆయనకు గొడుగుగా, శిరోరత్నంగా, కర్ణాలంకా రంగా, గళసీమలో ఆభరణంగా, వడ్డాణంగా, కంకణంగా, నూపురంగా, పాదపీఠంగా అవుతూంటే, ఆయన బ్రహ్మాండమంతా నిండిపోయాడట. ఎంత అందమైన కల్పన! ఎంత అద్భుతమైన వర్ణన!

అమృతోత్పాదనం కోసం దేవదానవులు క్షీరసాగర మథనం చేస్తూంటే, ముందుగా భయంకరమైన విషం ఉద్భవిం చిందట.

**"ఆలోల జలధి లోపల, నాలో నహి విడిచి సురలు నసురలు బరవం, గీలాకోలాహలమై, హాలాహలవిషము పుట్టె నవనీనాథా"**

అంటూ, హాలాహల ఉద్భవాన్ని వర్ణించిన పోతన, అమృతాన్ని తెచ్చిన దేవ వైద్యుడైన ధన్వంతరిని వర్ణిస్తూ,

**"భూరి యాగ భాగభోక్త ధన్వంతరి, యనగ నమృత కలశ హస్తుఁడగుచు**

**నిఖిల వైద్యశాస్త్ర నిపుణుడాయుర్వేది, వేల్పు వెజ్జు గడలి వెడలి వచ్చె".**

అమృతం వచ్చింది కదా అని సంబరపడుతున్న దానవులకు

**"ఒక్క బొట్టు చిక్కకుండగ, సకల సుధారసము నమరసంఘంబునకుం బ్రకటించి పోసి హరి దన, సుకరాకృతి దాల్చె నమర శూరులు బెడగన్".**
ఇలా ఆ ఘట్టాన్ని సుఖాంతం చేశాడు.

కృష్ణావతార ఘట్టంలో కృష్ణుడు కాళీయమర్దనం చేసే ఘట్టాన్ని వర్ణిస్తూ, "**పద్మారాగాదిత ప్రభాసమాన మహిత కాళియ ఫణిఫణా మండపమున నళినలోచన విఖ్యాత నర్తకుండు, నిత్య నైపుణ్యమున జేర్చి నృత్యమాడె**" అంటాడు పోతన.

కృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తి, గోపకులాన్ని ఘోరవర్షం బారినుంచి రక్షించినప్పుడు,

"**రాజీవాక్షునిచే నొక, రాజీవము భంగి శైల రాజము మెఱసెన్ రాజేంద్ర! మీద మధుకర, రాజిక్రియన్ మేఘరాజి రాజిల్లె గడున్.**"

అని వర్ణించాడు.

మన్ను తిన్న కృష్ణుని మందలించబోయిన తల్లికి తన నోటిలో విశ్వాన్ని సందర్శింప చేసినప్పుడు ఆమె విస్మితమతియై "**కలయో వైష్ణవ మాయయో, యితర సంకల్పార్థమో, సత్యమో**" అంటూ మహాశ్చర్యాన్ని పొందిన ఘట్టం మనందరికీ ఆశ్చర్యకరమే కదా! గోపికలు యశోదకు బాలకృష్ణుని అల్లరిపనుల గురించి ఆరోపణ చేస్తూ, "ఒకరి ఇంట్లో పాలమీగడలు తినడానికి దొంగతనంగా ప్రవేశించి, తనకు ఆ ఉట్టి అందకపోవడంతో, రోళ్ళు, పీటలు పోగు చేసి, పైకెక్కి, అయినా అందకపోవడంతో ఆ కుండకు పెద్ద తూటు పెట్టి ఆ పాలను, మీగడను చేరలతో పట్టి తాగాడు అని చెప్పారని వర్ణించాడు. చివరికి "**ఓ యమ్మ మీ కుమారుడు మా ఇండ్లను పాలు పెరుగు మననీడమ్మా, పోయెద మెక్కడి కైనను**" అని బెదిరించారట కూడా ఆ గోపవనితలు. ఈ ఘట్టంలో కృష్ణుని చేష్టలను తమ పిల్లల అల్లరి పనులకు ఆపాదించని తల్లులు అరుదేమో.

ప్రహ్లాదచరిత్ర ఘట్టంలో ప్రహ్లాదుడు తల్లికడుపులో ఉండగానే సర్వశాస్త్రాలు నేర్చాడనీ, పసితనంలోనే భక్తిభావంలో మునిగి తేలుతూ, అందరినీ తనలాగే సమానంగా మెలగేవాడనీ, పెద్దలను చూడగానే సేవకునివలె నమస్కరించేవాడనీ, అన్య కాంతలు ఎదురైనప్పుడు తల్లివలె భావించి తొలగిపోయేవాడనీ వర్ణించాడు.

కృష్ణుడు అంపశయ్యపై నున్న భీష్ముని వద్దకు వెళ్ళగా ఆయన కృష్ణుని స్తుతిస్తూ, కురుక్షేత్రయుద్ధ సమయంలో తన పైకి ఆయన చక్రాయుధంలా రథచక్రాన్ని ప్రయోగించబోయిన సందర్భాన్ని గురించి చెపుతూ వర్ణించిన పద్యం గొప్ప ఆణిముత్యం.

"**కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి గగనభాగంబెల్ల గప్పికొనగ** " అనే పద్యంలో 'కుప్పించి ఎగసిన కృష్ణుల వారి కుండలాల కాంతి గగనభాగాన్ని అంతా కప్పివేసిందనీ, ఆ ఉరికిన ఉరుకుకు ఆయన గర్భంలో ఉన్న జగములన్నీ కదలిపోయాయనీ, చక్రాన్ని చేతపట్టి తనపైకి వేగంగా వస్తుంటే, ఆయన పైబట్టగా ధరించిన పీతాంబరం జారి పడిపోతూ ఉండగా, మా అన్నదమ్ముల ప్రతిజ్ఞలకు భంగం కలిగించవద్దని అర్జునుడు వేడుకొంటూండగా, ఏనుగుపై లంఘించే మృగరాజులాగా గర్జిస్తూ, "ఈ రోజు ఈ భీష్ముని చంపి నిన్ను రక్షిస్తానని అర్జునుని నుంచి విడిపించు కొంటూ నావైపు వచ్చిన భగవంతుడే నాకు శరణం" అన్నాడని వర్ణించాడు పోతన.

ఇలా ఎన్నో పద్యాలు, ఎన్నో ఘట్టాలతో నిండిన పోతనభాగవతాన్ని తమ సొంతంగా భావించని తెలుగువారు ఉండరు. పూర్వంరోజుల్లో పండితులకే కాక, పనిపాటలు చేసుకునే సామాన్యులకు కూడా చాలామందికి ఆయన పద్యాలు నోటికి రావడం కూడా నిజం. దానికి కారణం ఆయన కవిత్వం ద్రాక్షాపాకంలో ఉండడమో, ఆ వర్ణనలు సహజంగా ఉండడమో, లేక అసలు ఎన్నో కావ్యాలు రాసి, వేదాలను విభజించిన వ్యాసులవారికే భాగవత రచనతో మానసిక శాంతి కలిగిందనే ఐతిహ్యమో, లేక మరణానికి ఒక వారం మాత్రమే వ్యవధి ఉన్న పరీక్షిత్తు చేత భాగవత శ్రవణం ద్వారా మోక్షాన్ని పొందాడని విన్న కథలో.... ఏదైనా, భాగవతం మన కావ్యం, మనోహర దృశ్యకావ్యం.





# పం (ఫన్) చ రత్నాలు

జె. శ్యామల , హైదరాబాద్ (ఇండియా)

వేసవి కాల ప్రభాతాన చెట్లకు పైపుతో నీళ్ళు పోస్తున్న వసుధ సెల్ రింగవడంతో పైపుని కొబ్బరి చెట్టు పాదులో ఉంచి కాల్ రిసీవ్ చేసుకుంటూ "హలో" అంది.

"హలో వసుధ గారు! గుడ్ మార్నింగ్. నేను లక్కీ లక్ష్మిని మాట్లాడుతున్నానండీ. మా సంస్థ "ఇస్తినమ్మ వాయనం" గురించి మీకు తెలుసని నాకు తెలుసు. ఎందుకంటే లాస్ట్ టైం వాగీశ్వరి గారు మిమ్మల్ని మా ప్రోగ్రామ్ కు తీసుకు వచ్చారు". అంటూ ఒక క్షణం ఆగింది.



"ఆ, అవునవును గుర్తొచ్చింది. "సాహిత్య కారులకు కొండంత ప్రోత్సాహం " మీ ట్యాగ్ లైన్ నాకు బాగా గుర్తుంది.

ఆ మాటను అంది పుచ్చుకుంటూ లక్కీ లక్ష్మి " ఆ , చాలా కరెక్ట్ గా చెప్పారు. ఇంతకూ సంగతేమిటంటే వచ్చేవారం మా సంస్థ కార్యక్రమం ఉంది. ప్రతిసారి ఐదేసి పుస్తకాల ఆవిష్కరణ జరుపు తుంటాం. అయితే పుస్తక పరిచయకర్తగా ప్రస్తుతి గారిని పిలిచాం. కానీ అనుకోకుండా వాళ్ళత్త గారు బాల్చీ తన్నేశారట. ఆమె రాలే నని ఇందాకే చెప్పారు. వాగీశ్వరీ ఊళ్ళో ఉండటం లేదట. మరెలా అంటే వాగీశ్వరే మీ పేరు సజెస్ట్ చేశారు. మీరు పుస్తకాభిమానులని చెప్పింది. మీరేమీ అనుకోకుండా మా కార్యక్రమంలో పాల్గొని పుస్తక పరిచయం చేయాలి" ఆగింది లక్కీ లక్ష్మి.

"నాకు పుస్తకాభిమానం ఉన్నమాట నిజమే కానీ సభల్లో మాట్లాడే అలవాటు అంతగా లేదు. అందులోనూ అయిదు పుస్తకాల గురించి మాట్లాడాలంటే . . . " అర్థోక్తిలో ఆగింది.

"మాట్లాడడానికి అనుభవం ఎందుకండీ, మైకు పట్టుకుంటే మాటలవే తన్నుకుంటూ వచ్చేస్తాయి. ఇంక పుస్తకాలంటారా ఐదు పుస్తకాలు ఒక లెఖ్ఖా, నేనివాళే ఎక్స్ ప్రెస్ కొరియర్స్ ద్వారా పంపిస్తాను. రేపు మీకు అంది తీరుతాయి. ఐదు రోజుల టైమ్ చక్కగా సరిపోతుంది. అయినా మీరు అక్షరం, అక్షరం ఏం చదవ క్కర్లేదు. మెతుకు పట్టుకుంటే చాలదూ అన్నం ఉడికిందో, లేదో చెప్పటానికి? పుస్తకాలతో పాటే ఇన్విటేషన్ కూడా పంపిస్తాను. ఇక మరి కాదనకండి. వాగీశ్వరి మీరెంతో మంచి వారని చెప్పింది" ఆగింది లక్కీ లక్ష్మి.

'అంతగా అడుగుతుంటే కాదంటే బాగుండదేమో , తనకు పొగరనుకోవచ్చు" మనసులో అనుకుంటూ, "మీరు మరీ మొహ మాట పెట్టేస్తున్నారు" అంది వసుధ.

"ఇప్పుడలా అంటున్నారు కానీ ముందు ముందు మీకూ బాగా అలవాటయిపోతుంది. అంత దాకా ఎందుకు, వాగీశ్వరి కూడా ఒకప్పుడు మాట్లాడడానికి మొహమాటపడేది. ఆ తర్వాత ఏ కార్యక్రమమైనా, ముందుగా తెలియకపోయినా క్షణాల్లో అల్లుకు పోయి, మాటలతో మైకును, ఆహుతుల్ని కూడా అదరగొట్టేస్తోంది. మీకు ఇంకో సంగతి తెలుసా, ఆవిడ అసలు పేరు వరలక్ష్మి. మేమే వాగీశ్వరి అనే బిరుదునిచ్చాం. అప్పట్నుంచీ ఆ పేరుతోనే ఆవిడ పాపులర్ అయ్యారు " చెప్పింది లక్కీ లక్ష్మి. మాట్లాడుతూనే అటు చూసిన వసుధకి నీళ్ళు పాదు నిండి నేల పైన పారుతూ కనిపించా యి. ఉలిక్కిపడి పైపు మరో చెట్టుకు మార్చి " సరేలెండి, మీరు అంతగా చెబుతున్నారు. అలాగే కానీయండి" అంగీకారం తెలియ జేసింది వసుధ.

"థాంక్యూ, థాంక్యూ " ఆనందంగా అరిచినంత పనిచేసి, " అయితే ప్రోగ్రామ్ కార్డులో మీ పేరు వేసేస్తాను. మీ ఇంటి పేరు చెబుతారా? " అడిగింది లక్కీ లక్ష్మి.

"హరిశ్చంద్రుల " చెప్పింది వసుధ.

"భలేగా ఉందండీ మీ ఇంటి పేరు. అన్నట్లు మీ పోస్టల్ అడ్రస్ చెప్పండి. కొరియర్ చేయాలి కదా " అంది లక్కీ లక్ష్మి.

వసుధ తమ అడ్రస్ చెప్పింది.

"ఓకే అండీ. ఉంటానిక. చాలా పనులున్నాయి. వన్స్ అగైన్ థాంక్యూ " అంటూ ఫోన్ పెట్టేసింది.

"పుస్తకాలు చదవటం వేరు, వాటి గురించి మాట్లాడటం వేరు. క్షుణ్ణంగా చదివి, పాయింట్లు నోట్ చేసుకొని, వాటి గురించి చక్కగా

మాట్లాడి నలుగురినీ మెప్పించాలి " మనసులోనే అనుకుంది వసుధ

★★★

మర్నాడు మధ్యాహ్న సమయంలో కొరియర్ రానే వచ్చింది. సంతకం పెట్టి కొరియర్ మనిషిని పంపించేసి, కుతూహలంగా ఆ కవర్ ను తెరిచింది. సోఫాలో కూర్చుని ఒక్కొక్క టీ పరిశీలించసాగింది.

మొదటిది 'లేఖాయణం' అని తాటికాయంత అక్షరాలతో ఉంది. దాని కిందే కిటుకుల కుమారి అని ఉంది. ఆ రచయిత్రే కాబోలు ఉత్తరాలు రాస్తున్నట్లుగా ఒక ఫోటో. 'ఇదేం రామాయ ణం?' అనుకుంటూ పుస్తకం వెనుక అట్టను చూసింది. మళ్ళీ దానిమీద రచయిత్రి పెన్నుని బుగ్గకు ఆనించుకుని ఆలోచి స్తున్నట్లుగా పోజు పెట్టిన ఫోటో, కింద ఆమె వివరాలు, భర్త., కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు, మనమలు వగైరా అందరి పేర్లు, డిగ్రీలు, ఉద్యోగ వివరాలు. . . ఆమె రాసిన రచనల వివరాలు, వ్యాపకాలు, ఇష్టాలు, వగైరా. ఇంతకూ ఏం లేఖలో అని లోపలి పేజీల్లోకి తొంగి చూసింది. వివిధ పత్రికలకు కథలను మెచ్చుకుంటూ, వ్యాసాలను మెచ్చుకుంటూ క్రమం తప్పకుండా రాసిన ఉత్తరాలు. ఆ తర్వాత ఆ ఉత్తరాలు చదివినవారు ఆమెతో పరిచయం కోరుతూ ఆమెకు రాసిన ఉత్తరాలు, ఆమె ఉత్తరాల్లోని సారాంశంతో ఏకీభవిస్తూ, ఆమెను పొగుడుతూ రాసిన ఉత్తరాలు కనిపించాయి. హితకామ్ అనే ఆయన ముందుమాట రాస్తూ అసలు ఆ ఉత్తరాలు చూస్తేనే ఆమెకు సాహిత్యం మీద ఎంతటి అభిమానం ఉందో అర్థం చేసుకోవచ్చని, ఈ పుస్తకం వెనుక ఏళ్ళ తరబడి ఆమె చేసిన కలం కృషిని హృద యంతో అర్థం చేసుకోవాలని తెగ మెచ్చుకుని ఆశీస్సులందించాడు.

వసుధ ఒక్క క్షణం ఆలోచనలో పడింది. ' ఈ పుస్తకం చదివి పాఠకులు ఏం తెలుసుకోవాలి? పత్రికలకు ఏనాడో రాసిన ఉత్తరాలను పదిల పరచుకొని వాటన్నిటినీ పుస్తకంగా వేయడం వెనుక పరమార్థమేమిటి? దీని గురించి తానేమి చెప్పగలదు? ' అన్న ప్రశ్నలు తలెత్తి వసుధకు ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చింది. 'సరే దీని సంగతి అలా ఉంచుదాం. ఇంకో పుస్తకం చూద్దాం' అనుకొని మరో పుస్తకం అందుకుంది.

దాని పేరు ' నిశిత నేత్రం' సమీక్షల సంపుటి. ఓ తీక్ష్ణమైన కన్ను పెయింటింగ్ బొమ్మ, దానికింద రచయిత పేరు భూతద్దం వామనరావ్. 'భూతద్దంలోంచి చదివే సమీక్షలు రాశాడేమో' అను కుంటూ లోపలి పేజీలు తిరగేసింది. అవన్నీ కూడా కొన్ని సంవత్సరా ల తరబడి వివిధ పత్రికల్లో రాసిన క్లుప్త సమీక్షలు. ముందుగా ఆప్తవాక్యం చదివింది. . . . . ' పేరుకు వామనరావే అయినా ఆయన సమీక్షలకు బ్రహ్మ వంటి వాడని, సమీక్షలు రాయడమంటే మాటలు కాదని, అందునా ఎంత పెద్ద పుస్తకాలకైనా ఓ పేరాలో సమీక్ష రాయడమంటే వామనరావ్ కుశాగ్రతను మెచ్చుకోకుండా ఉండలే మనీ, ఈయన సమీక్షలతోనే ఆయా రచయితలు మరింత వాసికె క్కారని, సమీక్షలు రాయాలనుకునేవారు ముందుగా ఈ సమీక్షలు చదవాలని, వర్ధమాన సమీక్షలకు ఇదొక బాలశిక్ష వంటిదని, అక్షులున్న ప్రతి ఒక్కరూ ఈ సమీక్షలను సాకల్యంగా చదవాలని, ఇంకా చెప్పాలంటే పుస్తకానికి నిశితనేత్రమనే పేరు చక్కగా కుదిరిందని రాసుకొచ్చాడు.

ఇదెక్కడి గొడవ? వివిధ రచయిత్రుల, వివిధ పుస్తకాలపై ఈ పేరా, పేరా సమీక్షలను సంకలనంగా తెచ్చినందువల్ల పాఠకుల కు ఏం ఉపయోగం? కనీసం ఓ పెద్ద రచయిత పుస్తకాలన్నిటి పై సమీక్షలను ఒక పుస్తకంగా వేశారంటే అది సదరు రచయిత రచనలపై అవగాహన కలిగిస్తుందనుకోవచ్చు. కానీ ఈ పుస్తకం అలా కాదే అనుకుంటుంటే వసుధకు కళ్ళు నొప్పులుగా అనిపించాయి. ఒక్క క్షణం కళ్ళు మూసుకుంది. వెంటనే చిన్న కునుకు పట్టేసింది.

ఓ అయిదు నిముషాలు గడిచాయో లేదో, సెల్ మోగింది. ఉలిక్కిపడి సెల్ అందుకుంది వసుధ. చూస్తే లక్కీ లక్ష్మి నుంచి కాల్.

' హలో' అంది వసుధ.

"వసుధ గారూ ! నేను లక్కీ లక్ష్మిని. పుస్తకాలందాయా? "

"ఇందాకే అందాయండి " అంది వసుధ.

" ఇంకేం మరి. మీరు వాటి పనిలో ఉండండి "

"ఆ, ఆ . . . ఇప్పుడే చూస్తున్నాను " అంది ఏమనాలో తోచక.

"గుడ్. చాదస్తంగా ఏం కష్టపడకండేం. ఉంటాను మరి. రెండ్రోజుల్లో ఇన్విటేషన్ కూడా పంపిస్తాను. సరేనా" అంది లక్కీ లక్ష్మి.

"సరేనండి " అంది వసుధ.

" రైట్ మరి " లక్కీ లక్ష్మి ఫోన్ పెట్టేసింది.

"చూసిన పుస్తకాలు రెండు ఇలా ఉన్నాయి. మిగతా వాటి సంగతేమిటో చూడాలి " అనుకుంటూ లేచి మంచినీళ్ళు తాగొచ్చి మరో పుస్తకం అందుకుంది.

పుస్తకం పేరు 'మా ఇంటి పేరు కవిత'. 'ఓర్నాయనో' అనుకుంటూ చూపులు సారించింది. కవి కలం పేరు పెన్ గన్. బ్రాకెట్లో అసలు పేరు తుపాకుల హనుమంతు. ఒక స్త్రీ సగం ముఖం, కంటినుంచి కారుతున్న కన్నీళ్ళు ... కింద నీళ్ళు ... అది కన్నీళ్ళ చెరువనుకోవాలేమో. అందులో ఓ రాక్షసి చేప వికృతంగా పైకి చూస్తునట్లుగా బొమ్మ. 'ఇది కవిత్వమా, కపిత్వమా' అనుకుం

టూనే చూడసాగింది. అది నూట పది పేజీల పుస్తకం. అందులో మొదటి పేజీలో ఆ పుస్తకం అచ్చేయడానికి ఆర్థిక సహాయం చేసిన పెరుమాళ్ళు గారి పెద్ద ఫోటో ఉంది. దానికింద నవనీతంలాంటి ఆయన మనసును, సాహిత్యం పట్ల ఆయనకున్న మక్కువను పొగుడుతూ ఓ నాలుగు లైన్లు ... శిరసా, మనసా, వచనా ... నమో వాకాలు ... మీ తుపాకుల హనుమంతు. 'బాగుంది' అనుకుంటూ మరో పేజీ తిప్పింది. పెన్ గన్ కవిత్వమెంత గొప్పదో వివరిస్తూ అభయేశ్వరి అనే ఆవిడ తెగ పొగిడేసింది. 'హతోస్మి' అనుకుంటూ మరో రెండు పేజీలు తిప్పింది. కవి తాత, నానమ్మల ఫోటోలు, ఆ తర్వాత పేజీల్లో కవి అమ్మా, నాన్నల ఫోటోలు, ఆ తర్వాత తన చిన్నప్పటి గురువుగారి ఫొటో. అందరికీ వందన చందనాలు. ఆ తర్వాత 'నాలోని కవి నిద్ర మేల్కొన్న వేళ' అంటూ తొలిసారిగా బాల్యంలో, హోమ్ వర్క్ చేయలేదని స్కూల్లో పంతులు బెత్తం దెబ్బలు వేసినప్పుడే తన మనసులో పంతుళ్ళు కాదు, పిశాచాలంటూ తనలోని కవి మేల్కొన్నాడని, అది మొదలుగా ఎన్నో భావాలు అలల్లా ఎగసిపడినా, టెన్త్ క్లాస్ స్కూల్లో మేగజైన్లో రాసిన కవితతో అసలైన నాంది పలికానని చేంతాడంత జాబితా ఇచ్చాడు. ఆ తర్వాత ... ఆకాశానికి చిల్లుపడింది, కోపం వచ్చిన సూరీడు, చలి చంపేస్తుంటే, బూజుకర్ర, చెత్తచేట, పేలిన బెలూను, చిలకమ్మ జాతకం, కులాసా బిచ్చగాడు, సత్తుగిన్నెలో వెన్నెల ... ఏమిటేమిటో శీర్షికలు. చివరిగా 'కవితే నా సర్వస్వం' అనే కవిత. అందులో... విపరీతంగా ఆకలేసింది.. టిఫిన్ చేశాను.. ఉహూ ఆకలి తీరలేదు. ....కవిత రాశాను ... కడుపు నిండిపోయింది. ... మళ్ళీ రాత్రి . . . ఎంతకూ నిద్ర రాదే ... లేచాను ... లైటేశాను ... కలం అందుకున్నాను ... కవిత గిలికేశాను ... ఇంకేముంది ... నిద్రమ్మ కరుణించింది. ఆకలి తీర్చినా, నిద్రబుచ్చినా అది కవితకే సాధ్యం. కవితా ... నా కవితా ! "

కవితలంటే ఇలా కూడా రాస్తారా అనుకుంటూ మరో పేజీ తిప్పింది. తన కుటుంబంలోని అందరి ఫుల్ సైజు ఫోటోలు, వారంతా ఎక్కడెక్కడ ఉన్నదీ, ఏం చేస్తోందీ, వారందిస్తున్న ప్రోత్సాహం, పెద్దయ్యాక కవినవుతానని మనమడు చెప్పిన మాట, తన మనస్సు ఆనందంతో పరవళ్ళు తొక్కడం, మళ్ళీ జన్మంటూ ఉంటే కవినే కావాలన్న తన స్థిర మనోవాంఛ ... ఇలా ఏమిటేమిటో ఉన్నాయి.

'భగవంతుడా! నాకు ఇదేం శిక్ష' అనుకుంది వసుధ. 'ఓ కప్పు కాఫీ పడాల్సిందే' అనుకుని వంటింట్లోకి వెళ్ళి అర్జెంటుగా కాఫీ కలుపుకొని తాగడం మొదలుపెట్టింది. 'తను నేరకపోయి ఒప్పుకుందేమో. మూడు పుస్తకాలు తనకు రుచించలేదు. ఇంకా రెండున్నాయి. కనీసం అవైనా కాసింత చదివి, మాట్లాడగలిగేవిగా ఉంటాయో, లేదో' అనుకుంటూ కప్పు తొలిచి, సింకులో పెట్టేసి మళ్ళీ వచ్చి ఇంకో పుస్తకం అందుకుంది. 'మరుగునపడ్డ మన కథలు. ... పాటలు'

టైటిల్ కింద రాజకుమారుల బొమ్మ ఒకటి, ఆ పక్కనే చందమామ బొమ్మ ఒకటి. ఆ కింద భోషాణం భద్రావతి అని రచయిత్రి పేరు. 'బాగుంది, బాగుంది. ఈ కథలన్నీ ఏ భోషాణం లోంచి తీసిందో' అనుకుంటూ పేజీ తిప్పింది. 'నా మాట' లో మనకు ఎంతటి విలువైన సాహిత్యమో ఉందని, ఎన్నో పిల్లల కథలు, పాటలు ఇప్పటివారికి తెలియకుండా పోయాయని, వాటన్నిటిని తిరిగి వెలుగులోకి తీసుకురావాలని తన ప్రయత్నమని, తన అమ్మమ్మ, నానమ్మ, అత్త, పెద్దమ్మ, పిన్నమ్మ, పక్కింటి ముసలమ్మ, ఇంకా వారిని, వీరిని అడిగి వాటన్నిటిని తాను రాసుకొని, అందరికీ మేలు చేయాలని ఈ పుస్తకం ప్రచురించానని చెప్పింది. ఇంకా ముందు పేజీలు తిప్పితే ... రాజుగారు – ఏడుగురు కొడుకులు, ఏడు చేపల కథ ; ఇంకో కథ 'అనసూయమ్మ అల్లుడు' ... 'చదువురాని అల్లుడు టెలిగ్రాం చదవలేక కన్నీళ్ళు పెట్టుకోవడం, అందరూ ఎవరో పోయారని అపార్థం చేసుకోవడం ... తీరా పక్కింటి పిల్లవాడు వచ్చి అది శుభవర్తమానమే అని చెప్పడం. అదీ కథ. మోసం చేసిన మిత్రుడు, చాకలి – గాడిద . . . .ఇలాంటివే కొన్ని కథలున్నాయి. అవన్నీ చాలావరకు అందరికీ తెలిసినవే. అయితే అవన్నీ తాను సేకరించినవని రచయిత్రి నిజాయితీగా చెప్పుకోవడం మాత్రం కొంతలో కొంత మేలనిపించింది.

'సరే, ఇక ఒక్కటే మిగిలింది. అదీ చూద్దాం ' అనుకుంటూ చివరి పుస్తకం అందుకుంది. 'వహ్వా – జిహ్వా' రచయిత్రి పాకం అన్నపూర్ణ. కవర్ పేజీపై చూడగానే తినాలనిపించే రకరకాల ఆహారపదార్థాల ఫోటో మాత్రం బాగుంది. అయినా వంటలంటే తనకు పెద్దగా ఆసక్తి లేదు. పాకం అన్నపూర్ణ 'తినబోతూ రుచి. ...అని రాస్తూ, అందులో తనకు పెళ్లయ్యేనాటికి వంటలో ఏమాత్రం ప్రవేశం లేదని, తన వంటల గురువు పతిదేవుడేనని, అలా తనకు వంటల మీద ఆసక్తి ఆయనవల్లే కలిగిందని, అయితే ఇప్పటికీ తనతో పోలిస్తే శ్రీవారిదే వంటల్లో అందెవేసిన చేయి అని, గురుభక్తితో, పతిభక్తితో ఈ 'వహ్వా – జిహ్వా' ను ఆయనికే అంకితం ఇస్తున్నానని రాసింది.

పక్కపేజీలో అన్నపూర్ణ భర్త సుబ్బారావు 'అర్ధాంగికి అభినందనలు' అంటూ ఒక పేజీ రాశాడు. తన పెళ్లినాటికి గంటె అంటే ఏమిటో, గిన్నె అంటే ఏమిటో తెలియని తన ఇల్లాలు అన్నపూర్ణ అంతకంతకూ ఎదగడం తనకెంతో సంతోషాన్నిచ్చిందనీ , అయితే వంటల్ని లోకమంతటికకీ పరిచయం చేయాలన్న బృహత్తర

బాధ్యతను తీసుకుని కలం చేతబట్టిందని, ఆమెకు అండదండగా ఉండాలని తాను గంటెను విడవకుండా అలాగే పట్టుకున్నానని, ఆత్మీయులకు వండడంలో ఉన్న ఆనందమే వేరని, ఏమైనా ఇన్నాళ్ళ కు అన్నపూర్ణ రచయిత్రి కావడం, తాను రచయత్రి భర్తను కావడం అంతా ఆ సరస్వతీదేవి కటాక్షమని ఏదేదో రాశాడు. పుస్తకంలో అచ్చులు, హల్లుల క్రమంలో ఆహారపదార్థాల తయారీ ఉంది. అ – అన్నం దగ్గరనుంచి హ – హల్వా వరకు ఎన్నెన్నో పదార్థాలు. ఇవన్నీ చదివి చెప్పేందుకు ఏముంటుంది. పుస్తకం మాత్రం ఇంత లావున ఉంది. ప్రతి పదార్థానికి దాని బొమ్మ, కావలిసిన వస్తువులు, చేసే విధానం, దాని ప్రత్యేకత, నిలువ ఉంచే పద్ధతి. ... ఏమిటేమిటో ఉన్నాయి. దీన్ని గురించి తను గొప్పగా ప్రసంగించేందుకు, పరిచయం చేసేందుకు ఏముంది? వసుధకు ఎక్కడలేని నీరసం వచ్చింది. ఇంతలో వసుధ భర్త సమర్ధ రానే వచ్చాడు.

'"ఏంటోయ్ వసూ ! ఎందుకంత దిగులుగా ఉన్నావు?" అడిగాడు.

"చెప్తాలెండి. ముందు మీరు రిఫ్రెష్ అయి రండి. కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం'" అంది.

"చిత్తం" నాటకీయంగా అంటూ లోపలికి నడిచాడు మిష్టర్ సమర్ధ.

వసుధ ఈ లోపల కాఫీ కలిపి డ్రాయింగ్ రూమ్ లోకి వచ్చి కూర్చుంది. సమర్ధ వచ్చి కాఫీ కప్పు అందుకుని "ఇప్పుడు చెప్పవోయ్" అన్నాడు. వసుధ పుస్తకాల సంగతంతా వివరించి "లక్కీ లక్ష్మికి మాటిచ్చాను. ఇప్పుడు తప్పుకోవడానికి లేదు. ఇందులోంచి బయటపడడమెలాగా? ఈ ఒక్కసారికి ఎలాగో నెగ్గితే, ఇకముందు చస్తే ఒప్పుకోను" అంది. "పిచ్చి వసూ! ఇదో పెద్ద సమస్యా? నీక్కావాలంటే ఈ పుస్తకాల గురించి నేను చదవకపోయినా రాసివ్వగలను. ఈసారికి ఇలా కానిచ్చేసెయ్ సరేనా" అన్నాడు.

"హమ్మయ్య, ఎంత మంచివారండీ. నిజంగా మీరు సర్వసమర్థులు" అంది మెచ్చుకోలుగా.

'ఇన్నాళ్ళకు నన్ను గుర్తించావు.' కినుకగా అన్నాడు సమర్థ.

★★★

అన్నట్లుగానే సమర్ధ పుస్తక పరిచయాలు రాసిచ్చాడు. వసుధ వాటిని చదివి, ఈ అర్థంలేని పొగడ్తలన్నీ సభలో చదవాలా అనుకుని, తప్పేదేముంది అని ధైర్యంగా ఆ కార్యక్రమానికి వెళ్ళి ఆ పుస్తక పరిచయ ప్రసంగం చేసేసింది. వసుధకు ఓ పుష్పగుచ్ఛం, శాలువా అందించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. లక్కీ లక్ష్మి ఎంతో ఆనందించింది. వసుధ సెలవు పుచ్చుకోబోతుంటే " మాట్లాడటమే తెలియదన్నారు. అమ్మదొంగా, ఇకనుంచి మా కార్యక్రమాల్లో మీరు శాశ్వత ప్రసంగకర్తగా ఉండాల్సిందే" అని బాంబు పేల్చింది.

వసుధ అవాక్కయింది. సమర్ధ చిలిపిగా నవ్వాడు!!

## నీ స్వరం

విశాల నేత్రాలలో
ఆశలాంటి ఎండ మెరుపు
నిమేష మాత్రం

నల్లని కురులను విరబోసుకొని
చల్లని నీడల స్పర్శతో
ప్రవేశిస్తుంది సాయంసంధ్య

నిద్ర పట్టని రాత్రి
నీ స్వరమే వినిపిస్తుంది.
మేఘాల మధ్య
మెరుపు తీగలా

## నీ జ్ఞాపకం

ఒక్క పూవు రాలింది
మెరిసే కన్నీటి చుక్క

తడిపేసిన వాన
తుడిచి వెళ్ళింది
వీధులను

గోధూళి వేళ
పారే నీటిలో
సాగే సూర్యబింబం
నీ జ్ఞాపకం

**భూషణ్ తమ్మినేని**

# మన మిత్రుడు తురగా శేషాచలం

'తెలుగు జ్యోతి'



ఈ ఏటికి మన "తెలుగు కళాసమితి", దానికి జంట అయిన "తెలుగు జ్యోతి" ప్రారంభమయి 30 సంవత్సరాలు అయింది. "Do not judge the book by its cover" అన్నమాట ఎన్నో సార్లు మనం అందరం విన్నాము, అన్నాము. కానీ కొన్ని సార్లు ముఖచిత్రంమే పుస్తకం చదవాలన్న కుతూహలాన్ని రేకెత్తిస్తుంది. అందమైన ముఖచిత్రం సాధారణంగా పుస్తకానికి అందం, చందం, ఆరవ ప్రాణం కూడా అవుతుంది.

కొన్నేళ్ళ పాటు మాసపత్రిక గాను, అటుతరువాత ద్వైమాస పత్రిక గాను వస్తున్న మన అందాల ఈ తెలుగుజ్యోతికి ముస్తాబులు చేసిన వాళ్ళలో హైదరాబాదు నివాసి శ్రీ తురగా శేషాచలం ఒకరు. సుదూరాన ఉంటూ కూడా ఈ సంస్థను, పత్రికను ఎంతో ఆత్మీయంగా తనది అనుకున్న నిజమైన తెలుగువాడు చలం. తాను అందించిన సేవకు ప్రతిఫలాన్ని ఆశించని చలం, 'సొంత లాభం కొంత మానుకు పొరుగు వాడికి' తోడుపడాలని పాటుపడే వారిలో ఒకరు.

తెలుగు కళాసమితి వారి రజితోత్సవ సంచిక "ప్రగతి" కి తెలుగు తల్లిని, అమెరికా దేశపు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు గుర్తైన 'స్టాట్యూ-ఆఫ్-లిబర్టీ'తో కలిపి చక్కని ముఖచిత్రాన్ని సమకూర్చడంతో బాటు, అందులోని రచనలకి కూడా చిత్రాలు వేశారు. ఈ ముప్ఫై వసంతాల సంచిక "ప్రతిభ"కు కూడా ముచ్చటైన ముఖచిత్రం, లోపలి పుటల్లో ఉన్న చిత్రాలు వీరి కల్పనలే. ఇవే కాకుండా ఇంత కుముందు మన సంచికలు మరో 45 కూడా ఈయన గీసిన బొమ్మలతో ముస్తాబు చేసుకున్నాయి. మనకు ఇంత ఆత్మీయుడైన తురగా చలం గురించిన విశేషాలను 'తెలుగు కళాసమితి' చరిత్రలో ఒక మైలురాయి అయిన ఈ ప్రత్యేక సంచికలో భాగంగా ప్రచురించడం మనకు, చలం గారికి కూడా గర్వకారణం అయిన విషయం.

శ్రీ తురగా చలం బొంబాయిలో బహుకాలం నివసించి ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడ్డారు. విద్యాభ్యాసం బొంబాయిలో. అక్కడ చలం కమర్షియల్-ఆర్ట్ లో డిప్లొమాని ప్రతిష్ఠాత్మకమయిన జె. జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుంచి, 'Advertising and Mass Communications' లో డిప్లొమాని సిద్దార్ధ్ కాలేజీ నుంచి పొందారు. అటు తరువాత పోలిడోర్ (తదుపరి మ్యూజిక్ ఇండియా లిమిటెడ్ గా మారింది) లో 22 ఏళ్ల పాటు పనిచేశారు.

**చలం గారు పొందిన అవార్డులు:**

- Directorate of Advertising & Visual Publicity (D.A.V.P) – 4 times
- President award from Govt. of India for designing and printing techniques.

వీరు చాలా గ్రామ్ ఫోన్ రికార్డులకు, ఆడియో కాసెట్లకు, సి.డి. లకు కవర్ల చిత్రీకరణ సమకూర్చారు. వీరి చిత్రకళా ప్రదర్శనలు, బొంబాయి, హైదరాబాదు, తెలుగు కళాసమితి కార్యక్రమాలలో (న్యూజెర్సీ) జరిగాయి.

బొంబాయిలో ఉండగా నాటకప్రదర్శనలలో భాగంగా ఉండి, రంగాలంకరణలు చేయడమే కాకుండా ప్రత్యేక సంచికలను కూర్పు చెయ్యడంలో కూడా పాల్గొన్నారు. ఆంధ్ర మహాసభ, తెలుగు మహాసభ వంటి ప్రముఖ సంస్థలలో చిత్రకళా ప్రదర్శనలు జరపడమే కాకుండా 'వివాహ వేదిక', 'విజ్ఞాన పీఠం', 'సాహిత్య వేదిక' వంటి సభలను ప్రారంభించారు. వీరికి చిత్రలేఖనంపట్ల ఎంత ప్రీతి ఉందో సాహిత్యం మీద కూడా అంతే మక్కువ ఉంది. స్వయంగా కవితలు,గేయాలు రచించారు. అవధాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

హైదరాబాదు చేరుకున్న తరువాత "ప్రభవ" అనే అడ్వర్టైజ్ మెంట్ కంపెనీ ద్వారా శ్రీ దాసరి నారాయణరావు గారి 'మేఘసందేశం' , 'బొబ్బిలి పులి' సినిమాలకు పనిచేశారు. ప్రస్తుతం హైదరాబాదులోనే ఉంటూ, స్వచ్ఛందంగా చిత్రలేఖనాలు చెయ్యడం, పుస్తకాలకు బొమ్మలు వెయ్యడం, కార్టూన్ బొమ్మలు వెయ్యడం చేస్తున్నారు.

"Creativitea Is My Cup of Tea! Please order now to taste it!" అని సగర్వంగా, భావోద్వేగంతో చెప్పుకునే తురగా చలం అన్న ఈ మంచిమనిషి మన తెలుగుకళాసమితి సభ్యులందరికి మిత్రుడు, ఆత్మీయుడు. **ఈ సందర్భంగా తెలుగుజ్యోతి సంపాదకవర్గం తరపున తురగాచలంగారికి శుభాకాంక్షలు, శుభాభివందనాలు.**




**1987 తెలుగు కళా సమితి - తురగా చలం ఆర్ట్ ఎక్జిబిషన్**

# వసంతానికి స్వాగతం

**కోవెల వసుధ**

వసంతమా ఏం మాయ చేసిందో నీ రాక
మంచులో కప్పుకొనిపొయిందీ నేల
నిన్నమొన్నటి దాక
మబ్బుచాటున ఉదయభానుడిపుదు పెందరాళె
తొంగిచూస్తున్నాడిక
మగతగా ఉన్న ప్రపంచం ఉరకలు పెడుతూ పరుగెడుతోందిక
వసంతమా నీకు స్వాగతం, అందుకో మా సుస్వాగతం!
తెల్లవారిందన్న సూచనగా వినిపించే పక్షుల కిలా కిలా రావాలు
గడ్డకట్టుకొనిపోయినది  కాస్త కరిగి
గలా గలా పారే సెలయేళ్ళు
చలితో ముడుచుకుపోయినవి మెల్లిగా విచ్చుకొని
చిగురించే లేత చిగుళ్ళు
మొడువారిన భూమంతా చినుకుతో చేరి పచ్చగా మారిన
పచ్చికబయళ్ళు
వసంతమా నీకు స్వాగతం, అందుకో మా సుస్వాగతం!
ఊత్సాహంతో ఉరకలు వేస్తూ చిందులు తొక్కుతున్న
చిన్నారులు
పడుచుపిల్లలతో పొటీ పడుతూ చిరుగాలిని పలకరిస్తున్న
పూలమొక్కలు
చిగురాకుల చిగుళ్ళను తినేస్తూ తొంగి తొంగిచూస్తున్న
జింకపిల్లలు
ఆకు కనిపించకుండ చెట్టునిండా విరబూసి అలరించే
చెర్రీపూలచెట్లు
వసంతమా నీకు స్వాగతం, అందుకో మా సుస్వాగతం!
వసంతమా ఏం మాయ చేసిందో నీ రాక తెలిసాక
వడివడిగా సాగె పైరగాలితో ప్రకృతి పాడుతోంది ఆనంద గీతిక!!

# అద్వైతం

డా. ముక్తేవి భారతి , హైదరాబాద్ (ఇండియా)

జయ చికాగోలో వున్న కూతురింటి కొచ్చి ఆర్నెల్లు అవుతోంది. మనుమరాలు ఒళ్ళు చేసి బొద్దుగాఉంది. స్కైప్ లో స్నేహితురాలు సుబ్బలక్ష్మితో మాట్లాడి మనుమరాలిని చూపించింది జయ. స్నేహి తురాలు సుబ్బలక్ష్మి ఇంట్లో ఓ రోజు ఉండి, న్యూయార్క్ నుంచి ఇండియా వెళ్ళి పోవటం అని నిశ్చయించుకున్న జయ, ప్రయాణాని కి సిద్ధమయిపోయింది.

ఎయిర్ పోర్ట్ కెళ్ళి స్నేహితురాలిని ఇంటికి తీసుకొచ్చింది సుబ్బలక్ష్మి. భోజనాలు చేస్తూ స్నేహితురాళ్లిద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. విజయనగరం కాలేజీలో చదువుకున్న రోజుల్ని ... ఎంతమంది సంగీతజ్ఞులు అక్కడినుంచి వచ్చారో అని. ఘంటసాల గురించి ... గురజాడ గురించి ఎన్నెన్నో చెప్పుకెళ్ళి పోతున్న జయ, ఒక్కసారి సుబ్బలక్ష్మి ముఖంలోకి చూసింది. తన మాటలు వింటోందా? అసలు తను మాట్లాడినదంతా అరణ్య రోదనమేనా అనిపించింది జయకి.



"నేను విజయనగరంలో గురజాడ ఇల్లు, గురజాడ కుర్చీ చూశాను" అంది జయ. సుబ్బలక్ష్మి వినడం లేదు. పైగా ఏదో ఆలోచనలో పడిపోయింది.

"ఏమిటాలోచిస్తున్నావు" అంది సుబ్బలక్ష్మిని కుదుపుతూ

"అదే నా బాధ" అంది వెంటనే సుబ్బలక్ష్మి.

"ఏమిటీ....గురజాడ కుర్చీ".....నవ్వింది జయ.

"అబ్బా...అదికాదు" అంది సుబ్బలక్ష్మి.

"ఏమిటి నీ బెంగ" అంది జయ.

"నీకేం హాయిగా నీ కూతుర్ని నీ తమ్ముడి కిచ్చి పెళ్ళి చేసే శావు...నా బాధ నీకేం అర్థమవుతుందే" అంది సుబ్బలక్ష్మి ముఖం దిగాలుగా ఉంచి.

"అర్థమయింది నీ బాధ ... అయినా సుబ్బూ ఇన్నేళ్ళుగా ఇక్కడున్నా నీ ఆలోచనలు మారలేదు. ఎక్కడున్నామన్నది కాదు ... ఎలా వున్నామన్నది ముఖ్యం అనేవారు నాన్నగారు. అయ్యో! నా మనుమరాలు, నేను వున్న ఫోటో నీ కివ్వాలని బ్యాగ్ లో పెట్టా చూశావా, మతి మరుపు" అంటూ జయ బ్యాగ్ లోంచి మనుమరాలి ఫోటోలు సుబ్బలక్ష్మి చేతికిచ్చింది. ఎల్లుండీ పాటికి మా ఊర్లో ఉంటా! ఆనందంగా అని జయ లోపలికెళ్ళింది. ఆరాత్రే జయ వెళ్ళిపోయింది. సుబ్బలక్ష్మి కి మనసు బాగాలేదెందుకో.

సుబ్బలక్ష్మికి గతం కళ్ళ ముందు కదులుతోంది.

"అదృష్ట మంటే నీదేనే సుబ్బా" అంది పెద్దమ్మ కూతురు నీరజ. నీరజ ఏం. ఏ పాసయింది, తెల్లగా అందంగా ఉంటుంది. ఎందుకో ఏ సంబంధమూ కుదరలేదు. "ఆ గొంతెమ్మ కోరికలూ" అనేది సుబ్బలక్ష్మి తల్లి.

అబ్బాయి అమెరికాలో ఇంజనీరుట. పైగా గ్రీన్ కార్డు కూడా వచ్చేస్తుందిట...అదృష్టమంటే మన సుబ్బు దే అన్నారంతా.

నిజమే మరి...నల్లగా పొట్టిగా ఉండే సుబ్బలక్ష్మి బి.ఎ పాసైంది. పల్లెత్తూ. అతనో... పెళ్ళికొడుకు ఆనంద్ పొడుగ్గా తెల్లగా వున్నాడు. కాకి ముక్కుకి దొండపండంటే ఇదే అనుకుంది నీరజ. జాతకాలు కుదిరాయట..అదీ! అంది పెద్దమ్మ నీరజతో. మొత్తం మీద సుబ్బలక్ష్మి పెళ్ళి అయిపోయింది...అమెరికా భర్తతో వెళ్ళిపోయింది.

సుబ్బలక్ష్మికి ఊపిరాడనంత ఉక్కిరిబిక్కిరిగా ఉంది చాలా నెలలు ఆ దేశంలో. ఆనంద్ చాలా మంచివాడు. చాలా ప్రేమగా చూస్తాడు ... అయినా ఏమిటో ... సుబ్బలక్ష్మి ఈ పెళ్ళి చేసుకుని ఈ దేశం వచ్చినందుకు ఎన్నో సార్లు బాధపడింది కూడా. భర్తని సాధి స్తూనే ఉంది. తెల్లవారకుండానే లేచి ఫ్రిజ్ లో నుంచి బ్రెడ్ తీసుకుని పాలల్లో కలిపి తినేసి "సుబ్బూ తలుపేసుకో" అంటాడు ఆనంద్.

"అయ్యో నేను ఉప్మా చేసి పెడతా కదండీ" అంటుంది సుబ్బూ. కారు స్టార్ట్ అవుతుంది. ఛీ....తనకి కారు డ్రైవింగ్ ఇంకా రాలేదు. చిన్నప్పుడు సైకిలు నేర్చుకుంటానంటే "సైకిలేసుకుని రోడ్లంట తిరుగుతావా? ఆడపిల్లవి మీ నాన్న ఒప్పుకోరు" అంది తల్లి! ఉన్నట్టుండి కారు డ్రైవింగ్ వచ్చేస్తుందా? ఈ ఫ్రిజ్ ఓ పెద్ద సైజు బీరువా అంత. ఓ చిన్న సైజు సూపర్ మార్కెట్ అది. అన్నీ అందులోనే!! కొత్తిమీర తెచ్చుకుందుకని ... నిమ్మకాయలు కొనుక్కో

వాలని హాయిగా రోడ్డుమీద కొచ్చే తను ఇలా పంజరంలో ఉండి పోయింది.

ఆ రాత్రి సుబ్బలక్ష్మి ఆనంద్ పక్కన కూర్చుని "ఓ మాట వినండీ" అంది. "చెప్పండీ" అన్నాడు చేతిలో రిమోట్ తగులు తుంటే."మనం వెళ్ళిపోదామండీ" ఉలిక్కిపడ్డాడు ఆనంద్ వెళ్ళిపో వటమేమిటీ? ఎక్కడకీ ? "

"అదే మన ఊరువెళ్ళి పోదాం ఇక్కడ నేనుండలేను బాబూ"

ఆనంద్ ఓ క్షణం ఆగి "అలాగే, ఓ ఏడాది అయ్యాక వెళ్ళిపోదాం...నాకూ అలాగే అనిపిస్తోంది. మన కనకదుర్గమ్మ గుడి, మన బెంజి సర్కిల్, మన కృష్ణానది మన కూరగాయల మార్కెట్...ఓహ్! సుబ్బూ నిజంగానే ఓ ఏడాది ఓపిక పట్టు అంతే!!"

సుబ్బలక్ష్మి భర్త మాట నమ్మింది! ఇంకొక్క రెండేళ్లాగు అన్నాడు ఆనంద్. సుబ్బలక్ష్మి అమ్మమ్మ చేసే రోటి కంది పచ్చడిని ... పిన్ని మేడమీద పెట్టే వడియాల్ని తల్చుకుంటూ ఈ ఏడాది అవగానే వెళ్ళిపోతాం అనుకునేది. పోస్ట్ పోన్ చేయడం గొప్ప రాజనీతి అని నవ్వుకుంటాడు ఆనంద్!

★★★

కాలం పరిగెత్తింది ... సుబ్బలక్ష్మి, ఆనంద్ ల కూతురు సత్య ఎదిగిపోయింది. ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న సత్య, తండ్రిలా చాలా అందంగా ఉంటుంది. ఆ పిల్లని చూస్తుంటే ఇటు ఆనందం అటు భయం రెండూ ఒకేసారి కలుగుతాయి. ఆడబిడ్డ కొడుకు చంద్రం వున్నాడు. అతనంటే సత్యకి ఇష్టమని కూడా సుబ్బలక్ష్మికి తెలుసు. కానీ ఆ పిల్ల పొట్టి లాగు ... చిట్టిగౌనులు అవే కోపం తెప్పిస్తాయి ఆడబిడ్డకని లోపల భయం సుబ్బలక్ష్మికి.

"మమ్మీ"....ఉలిక్కిపడ్డది సుబ్బలక్ష్మి. "నేను ఊరెడుతున్నా" అంది సత్య ఫ్రిజ్ లోంచి కోక్ తీసుకుని బల్లదగ్గర కొచ్చి.

"ఊరేమిటీ" అంది

"విజయవాడ" అంది సత్య. సుబ్బలక్ష్మికి తెలుసు ఈ మధ్య చంద్రం అదివరుకులా సత్యతో చాటింగ్ లు...ఈ మెయిల్ లో...స్కైప్ లో కనిపించటాలు తగ్గించేశాడని...నిజానికి సుబ్బలక్ష్మికి ఓ విధంగా ఇది బావుంది...అయినా బయట సంబంధం కుదిరేదా! సుబ్బలక్ష్మి పిల్ల పెళ్ళి విషయం అనుకుంటుంది కానీ ఆనంద్ ఆ విషయమే పట్టించుకోడు! అదో బాధ సుబ్బలక్ష్మికి!! ఇలాంటివన్నీ బాధలే సుబ్బలక్ష్మికి. "మమ్మీ" సత్య తల్లి వైపు చూసింది.

"చంద్రం ఇక్కడే వున్నాడు. ఏదో ఆఫీసు పనిమీద వచ్చాడు. రెండు రోజుల్లో వెళ్ళిపోతాడుట". అంది సుబ్బలక్ష్మి.

"ఏమిటీ" అరిచింది సత్య. "మీ నాన్న చెప్పారు" అంది సుబ్బలక్ష్మి.

"ఊళ్ళోకొచ్చి ఫోన్ చేయక...మెసేజ్ ఇవ్వకా"... సత్య ముఖం కోపంతో కందిపోయింది. గబగబా కారు స్టార్టు చేసింది సత్య.

"ఎక్కడికెడుతుందో చెప్పదుగా... నా ఖర్మ ఇంతే. ఆనాడు రెండేళ్ళవగానే వెళ్ళిపోదాం అంటే విన్నారా?" సుబ్బలక్ష్మికి ఎప్పుడు ఎవరిమీద కోపం వచ్చినా ఈ మాట తప్పకుండా అనుకుంటుంది మనసులో!!

ఆ రాత్రి స్నేహితుడింట్లో వున్న చంద్రం మనసు సరిదిద్దు కోలేకపోయాడు. స్నేహితుడు రాజు అతని గర్ల్ ఫ్రెండ్ ఎలిజిబెత్ లివింగ్ టుగెదర్ ... "అంతేరా చంద్రం ఒక్కమాట విను, అక్కడ పుట్టిపెరిగిన అమ్మాయిల్ని ఇక్కడ మనవాళ్ళు పెళ్ళి చేసుకుని హాయిగా ఉంటున్నారు. కానీ"... గ్లాసులో ఐస్ ముక్క వేసుకుంటూ "... కానీ"...రాజు ఆగాడు. "ఏమిటో చెప్పు" అన్నాడు చంద్రం. అప్పటికే చైల్డ్ మదర్స్...అబార్షన్లు...డైవోర్సులు లాంటివి విని విస్తుబోయాడు కూడా. చంద్రం "చెప్పరా ఏమిటి కానీ" అని రెట్టించాడు.

"ఏముంది....ఇక్కడ అమ్మాయిలకు బోయ్ ఫ్రెండ్స్...డేటింగ్ చాలా చాలా కామన్. బోయ్ ఫ్రెండ్ లేకపోతే అది న్యూనతే. ఆఫ్ కోర్స్ డేటింగ్ అనేది కూడా" ఏదో చెప్తూ గ్లాసులోది నోట్లో పోసు కున్నాడు రాజు. చంద్రం ముఖంలో కళ మారింది. అంటే సత్యకి కూడా బాయ్ ఫ్రెండు...డేటింగ్, చంద్రం కనుబొమ్మలు చిట్లించాడు. ఆ తర్వాత రాజు అమెరికా ఎలక్షన్ల గురించి షేర్ మార్కెట్ గురించి చాలా విషయాలు చెప్పినా చంద్రం మనసుకి ఒక్కటీ ఎక్కలేదు.

★★★

రెండేళ్లు గడిచిపోయాయి. సత్య తనతో పని చేసే అమెరికన్ కుర్రాడిని పెళ్ళాడింది. చంద్రం విజయవాడలో తల్లి చూపించిన మంచి సంబంధం చేసుకున్నాడు. "ఎంతో బుద్ధిమంతురాలు చంద్రం భార్య" అంది సుబ్బలక్ష్మి పెద్దమ్మ. సుబ్బలక్ష్మి స్నేహితురాలు జయ కూతురి పురిటికి మళ్ళీ అమెరికా వచ్చింది. "ఈ మాటు నువ్వే రావాలి ఇక్కడికి" అంది జయ సుబ్బలక్ష్మి తో . ఆ మాటా ఈ మాటా అయ్యాక ఓ ముఖ్య విషయం చెప్పాలనుకున్నా ఏమిటో మతిమరుపు...విను విను చంద్రం భార్య గురించి విన్నావా? అంది.

"ఆ. బంగారు తల్లటగా. అత్తని మామని మొగుడ్ని చక్కగా చూసుకుంటుందటగా" అంది సుబ్బలక్ష్మి.

జయ గలగలా నవ్వి "ఆ తర్వాత విషయం చెప్తా...చంద్రం భార్య అతన్నొదిలేసింది. విడాకులు కూడా అయ్యాయి".

"అయ్యోపాపం" అంది సుబ్బలక్ష్మి.

"అయ్యో ఏమిటీ ... " అని అదే చంద్రం భార్య మళ్ళీ పెళ్ళి చేసుకుంది అంది జయ. సుబ్బలక్ష్మి చేతిలో ఫోను జారిపోయింది. ముఖాన చెమట పట్టింది. "ఎక్కడున్నామన్నది కాదు, ఎలా వున్నామన్నది

ముఖ్యం సుబ్బూ, ఏ దేశంలో వున్నా ఆనందంగా బతక గలగాలి" అని ఎన్నిసార్లు ఆనంద్ అన్నాడో తల్చుకుని ఏదో తప్పు చేసినట్టు బాధ పడి పోయింది సుబ్బలక్ష్మి.

★★★

ఆర్నెల్లయింది. సుబ్బలక్ష్మి ఒడిలో అమెరికన్ మనుమడు నిద్ర పోతున్నాడు. ఆ పసివాడి బ్లాండ్ హెయిర్...ఎర్రని పెదాలు చూస్తూ ఎంత ముద్దుగా వున్నాడో అని మురిసిపోయింది సుబ్బలక్ష్మి. స్మిత వారం రోజులుగా అంటీ! వస్తానని ఫోన్ చేయడం సుబ్బలక్ష్మి రేపురా అనడం అయ్యాక స్మిత ఇవాళ వచ్చేసింది. సుబ్బలక్ష్మి మేస్టారి మనుమరాలు స్మిత. పెళ్లయి అమెరికా వచ్చేసి ఆర్నెల్లయింది. ఇక్కడ తెలిసిన పెద్ద దిక్కు సుబ్బలక్ష్మి. "నేనిక్కడుండలేనాంటీ..నాకు భయమేస్తోంది. ఈ దేశంలో మాత్రం నేను పిల్లని కనను అంటీ ... హమ్మో!! మన ఊరెళ్ళి పోతా...మా ఆయన చూద్దాంలే..చూద్దాంలే అంటారు. నేనిక్కడ ఇమడలేను ఆంటీ! " కళ్ళు తుడుచుకుంది స్మిత.

సుబ్బలక్ష్మికి పాతికేళ్ళనాటి గతం కళ్ళ ముందు కదిలింది. జీవితం ఒక ప్రవాహం....అలా సాగిపోతుంది. "ఆంటీ ... మీరైనా ప్రసాద్ కి చెప్పండి. అక్కడ మా నాన్నది పెద్ద నర్సింగ్ హోం, ఈయన అక్కడే డాక్టరుగా ఉండచ్చుగా" అంది స్మిత.

సుబ్బలక్ష్మి పాతికేళ్ళ నాటి తననే ఈ రోజు స్మితలో చూస్తోంది. "చెప్పండి అంటీ ప్రసాద్ రాకపోతే నేను వెళ్ళిపోతానంతే" అంది స్మిత. సుబ్బలక్ష్మి ఓ నిముషం మాట్లాడలేదు. ఒళ్ళో వున్న పసివాడు వాడి ఎర్రటి పెదాలు ... వాడి నీలికళ్ళు ... అలా చూస్తూ పకపకా నవ్వేసింది సుబ్బలక్ష్మి. స్మిత విస్తుపోయింది. తనింత కష్టం చెప్పుకుందుకొస్తే నవ్వుతుందేమిటీ? "ఒక్క నిముషం... వస్తా" అంటూ పిల్లాడిని లోపల పడుకోపెట్టి పూజ గదిలో కెళ్ళి దేవుడి ముందు నిల్చింది సుబ్బలక్ష్మి. ఎన్నిసార్లు ఈ దేశం వదిలి వెళ్ళిపోదామని తను భర్తను బాధించిందో. అతను ఎంతో ఓర్పుతో తనకి సర్దిచెప్పాడో అన్నీ ఒకటొకటీ గుర్తొచ్చి. ఆనంద్ ఓర్పుతో తనని అర్థం చేసుకున్నాడు కనుక తన కాపరం నిలబడింది. ఒకవేళ ఈ ప్రసాద్ కోపంతో "సరే వెళ్ళు" అని ఉండుంటే ... బాబోయ్! భయపడిపోయింది సుబ్బలక్ష్మి. ఈ పిల్ల మనసు మరో రకంగా మరల్చాలి అనుకుంది. ఉపాయంగా ఏదో చేయాలి అనుకుంది సుబ్బలక్ష్మి. "నువ్వు కూడా తాగు" అని ఫ్రిజ్ లో నుంచి కోక్ తీసి ఇచ్చి స్మిత పక్కగా కూర్చుంది సుబ్బలక్ష్మి.

"నేవెళ్ళి పోతానాంటీ" అంది స్మిత. సుబ్బలక్ష్మి గొంతు మార్చింది. "నామాట శ్రద్ధగా విను. మీ అంకుల్... అదే ఆనంద్! పెళ్ళి చేసుకుని నన్ను ఇక్కడికి తీసుకొచ్చారా! మా వాళ్ళు అదృష్టం అంటే సుబ్బుదే.. అమెరికా వెళుతోందని మురిసిపోయారా! తీరా మావారు ఉన్నట్టుండి,సుబ్బూ, ఇక్కడ నాకు బాగాలేదు – వెళ్ళిపోదాం మనవూరు" అని రోజూ గోలే అనుకో." ... ఆగింది సుబ్బలక్ష్మి .

"అంకుల్ వెళ్ళిపోదామన్నారా? ... మీరన్నారు అనుకుంటున్నా" అంది ఇంకేం చెబుతుందో విందాం అని ఆసక్తిగా స్మిత..

"నేనెందుకంటాను — ఈ దేశంలో అడుగు పెట్టినప్పట్నించీ ఎంత ఆనందంగా వున్నానో, అసలు నా వూరు నాకు గుర్తు రాలేదంటే నమ్ము. ప్రతి ఏడాది మావారితో గొడవే — ఉద్యోగం మానేస్తున్నా, వెళ్ళి పోదాం అని" సుబ్బలక్ష్మి స్మిత ముఖం లోకి చూస్తో.

"మీరెలా వొప్పించారాంటీ ? " అంది స్మిత .

" భూదేవంత ఓర్పు మరి - బతిమాలి, ముద్దుచేసి...గారాబం చేసి అలా కారులో రెస్టారెంట్లకి తీసికెళ్ళి — ఒకటా — ఇక్కడ ఆనందంగా హాయిగా ఉన్నవాళ్ళని చూడు అని నేను ఎన్ని అగ్ని పరీక్ష లెదుర్కున్నానో."

"అన్ని పరీక్షలా ఆంటీ ? "

"అలాంటివే — ఓ రోజు ఫ్లైటు టిక్కెట్టు కొనుక్కుందుకు వెడుతున్నా అన్నారు. ఇంకేముంది, ఆయనక్కడా-నేనిక్కడా నా కన్నీళ్ళా గలేదంటే నమ్ము స్మితా " .

ఇలా అల్లి అల్లి చెప్తుంటే, గదిలో వున్న ఆనంద్ వింటూనే వున్నాడు. "అవును స్మితా, మీ ఆంటీ చెప్తున్నవన్నీ అక్షరాలా నిజం — లేకపోతే నేను మా ఊర్లో, మీ ఆంటీ అమెరికాలో ఉండేవాళ్ళం." ఆనంద్ వచ్చే నవ్వు ఆపుకుంటూ నోటికి చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు. సుబ్బు వంకే చూస్తూ. ఆనంద్ మీ ఆంటి చెప్తునవన్ని నిజమే అన్నట్లు నవ్వి. "పాతికేళ్ళయి పోయాక ఇప్పుడు విజయగర్వం. నవ్వే మరి " అంది భర్తకు వినిపించేలా సుబ్బలక్ష్మి.

ఈ ఆంటి దగ్గరకొచ్చి తన బాధ చెప్పుకో బట్టే కదా పెద్ద ఆపద తప్పిందనిపించి స్మిత మనసు తేలికైంది. ఎన్నో రకరకాల ఆలోచనలతో మనసు ఉక్కిరి బిక్కిరి అవుతుంటే తల వంచుకుని చేతి గడియారం చూస్తోంది.

"అబద్ధాలు కూడా ఇంత తియ్యగా ఉంటాయా సుబ్బూ?" అన్నాడు రహస్యంగా ఆనంద్!

★★★

రెండు రోజులయింది. "మా స్నేహితుడి భార్యది మీ వూరే. వాళ్ళ నాన్నగారి షష్టిపూర్తట. ఓ వారం రోజుల్లో వచ్చేస్తుంది. నిన్ను ఆమెతో మీ వూరు పంపేస్తున్నా". "ఉలిక్కి పడింది" స్మిత!

"నిన్ను అంత బాధ పెట్టి ఇక్కడ ఉంచితే నాకు మహా పాపం కూడా వస్తుంది. ఒక్కర్తివీ వెళ్ళలేవని ఆవిడతో పంపిస్తున్నా. నేను టిక్కెట్టు కొనడానికి వెళ్ళాలి." అన్నాడు గడియారం చూసుకుంటూ ప్రసాద్.

స్మిత గలగలా నవ్వి భర్త భుజంపై చెయ్యేసి “చాల్లేండి! అలనాడు సీతమ్మ తల్లి ఏం చెప్పింది” అంది వాలుజడ ముందుకేసుకుని. “నాతో ఏం చెప్పలేదు” అన్నాడు ప్రసాద్ వాచ్ చూస్తూ గంభీరంగా. “నాతో చెప్పింది లేండి, తన భర్త శ్రీరామచంద్రుడు అడవిలో ఉంటే అదే తన అంతఃపురం అని. నేనూ.. అంతే! మీ ఫ్రెండ్ భార్యని ఒక్కర్తి నీ వెళ్ళమనండి” అంది కళ్ళు తిప్పుతూ. తను సుబ్బలక్ష్మి ఆంటీ దగ్గర కెళ్ళి ఏడవటం తన భర్త ప్రసాద్ కి తెలియదు కదా అనే ధైర్యం తో స్మిత. కానీ ప్రసాద్ అన్న, ఆనంద్ ప్రాణ స్నేహితులని ఈ నాటకంలో ప్రధాన సూత్రధారి తన భర్తేనని ఎప్పటికీ తెలుసుకోలేదు తన ఇల్లాలు అనే విజయగర్వం ప్రసాద్ కళ్ళలో తొణికిసలాడింది ఆ క్షణం.

## కొత్త మెరపులు

**కె. మమత**

నిజమే సుమా
నిస్సిగ్గుగా వప్పుకుంటున్నాను
ప్రేమించేశాను
అమితంగా నిన్ను

నాకోసమే
నువ్వు సృష్టించిన
ప్రత్యేక నందనవనం
ఆహా, ఇక ఎప్పటికీ నాదే
ఈ చిన్ని ప్రపంచం
అయినా
ఎంతకీ అందదే ఆ మెత్తని పువ్వు

నా రెక్కలకింద గాలివనుకుని
ఎంత ఎగిరినా
అవే క్లోవర్ పూలు, గడ్డిపోచలు
మధ్య
గాజువలయంలో
నేను

నేలబారు కలుపుమొక్కలే
మహావృక్షాలని మనసావాచా నమ్మి
ఇంకాఎంతకాలం గడిపేస్తాననుకున్నావో

నాకు నేను
మిగిలిన ఒకే ఒక్క క్షణాన
ఆకాశాన్ని కలగంటున్న తెల్లని నీడనై
తేలిపోయినప్పుడు
అదాటుగా సోకిన వెచ్చని కిరణాన్ని
అనుభవించేశానిక

మెలమెల్లగనే, అపుడప్పుడూ
కత్తిరించేశావనుకున్న రెక్కలపై కొత్త
మెరుపులు
ఎందుకెందుకని
నోరెళ్ళబెట్టిన నిన్ను చూసి
ఇప్పుడిక
నవ్వొస్తోంది
పొగిలి పొగిలి

# చదువు (ఒక పరిశీలన)

డా. వైదేహి శశిధర్

ఏ భాషా సాహిత్యంలో నైనా కొంతమంది ప్రసిద్ధ రచయితలుంటారు. వారి పేరు వినగానే వారి పుస్తకం ఒకటి ప్రత్యేకంగా స్ఫురిస్తుంది. కల్పవృక్షం వంటి కావ్యాన్ని వ్రాసిన విశ్వనాధ అనగానే చాలా మందికి గుర్తు వచ్చేది "వేయిపడగలు". కాళీపట్నం అనగానే గుర్తుకు వచ్చేది 'యజ్ఞం". అలాగే కొడవటి గంటి అనగానే గుర్తుకు వచ్చేది వారి నవల "చదువు ".



కొ.కు. నాలుగు వందల పైగా కథలు,ఎనభై దాకా గల్పికలు, ఏడు వందలకు పైగా వ్యాసాలూ, ఇరవై నవలలు, వంద రేడియో నాటకాలు అన్నీ కలిపి అచ్చులో పదహారువేల పేజీలకు పైగా వ్రాసినవారు. ఇంత విస్తృతంగా రాసిన రచనలలో ఒక ఫలానా రచన ప్రత్యేకంగా ఆ రచయిత పేరుతో ముడిపడటానికి కారణం ఏమిటి? ఒక రచయిత తాలూకు సాహిత్యంలోకెల్లా ఆ రచన ఉత్తమ స్థాయి కలిగి ఉండటమా? లేక మిగతా రచనలలోకెల్లా ఆ రచన ఎక్కువ ప్రాచుర్యం పొందటమా? మనందరికీ తెలిసిన విషయం ఒకే రచయిత వ్రాసిన పుస్తకాలలో ప్రాచుర్యతలో తేడా ఉండటం. అలాగే ఒక రచయిత తాలూకు రచనల్లో సాహిత్య స్థాయిలో తేడాలు ఉండటం కూడా అసాధారణం కాదు .అయితే ఈ సాహిత్యంలో స్థాయీ భేదాలకి, ప్రాచుర్యతలో స్థాయీ భేదాలకి ఉన్న సంబంధం ఏమిటి? అనులోమమా? విలోమమా? అసలు సంబంధమే లేదా? ఇవన్నీ చదువు నవల చదివాక నాకు కలిగిన సందేహాలు .

అయితే వారి మిగతా నవలలు అన్నీ నేను చదవలేదు కాబట్టి తులనాత్మకంగా చదువుకి, ఆయన ఇతర రచనలకి సాహిత్య స్థాయిలో కానీ, ప్రాచుర్యతలో కానీ ఉన్న వ్యత్యాసాల గురించి నేను చర్చించబోవటం లేదు. చదువుని ఒక సాహిత్య రూపంగా పరిగణించి నపుడు ఈ నవల చదివాక నాలో కలిగిన అభిప్రాయాలు,ఈ నవల లో ఉన్న ఏ ప్రధాన లక్షణాల వల్ల ఈ నవల ఇంతగా ప్రాచుర్యం పొందింది అన్న విషయంపై నా పరిశీలన ఈ వ్యాసం లోని ప్రధాన విషయాలు.ముందుగా చదువు గురించిన కొన్ని విశేషాలు .చదువు రచనా కాలం 1952. స్వర్గీయ చక్రపాణి సారధ్యం లో వెలువడిన ఆంధ్రజ్యోతి మాసపత్రికలో సీరియల్ గా వచ్చింది. ఇది నూట డెబ్బయి అయిదు పేజీల నవల. కొ.కు. నవలలలో ఇది పెద్దది. 1969 లో సృజన కిచ్చిన ఒక ఇంటర్వ్యూ లో ఆయనే ఇది సీరియల్ గా రాకపోతే ఇంత పెద్దది అయ్యేది కాదనీ సీరియల్ గా రావటం వల్ల పొడిగించాల్సి వచ్చిందనీ చెప్పటం జరిగింది. కథాకాలం 1915 -1935 మధ్య .అంటే రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలం. మన దేశ రాజకీయ చరిత్రలో చాలా ముఖ్యమైన కాలం. కధంతా ప్రధాన పాత్ర సుందరం చుట్టూ అల్లబడుతుంది. అయిదేళ్ళ సుందరం కు అక్షరాభ్యాసం చేసి చదువు మీద శ్రద్ధను కలిగించి, అతను బాగా చదువుకోవాలనే అతని తల్లి తపనతో మొదలైన ఈ కథ, వీధి బడులలో సుందరం అనుభవాలు, చేదు జ్ఞాపకాలు, తండ్రి మరణంతో తారుమారైన ఆర్ధిక పరిస్థితిలో హైస్కూల్ చదువు, పరోక్షంగా దేశ రాజకీయాలతో పరిచయం, బాల్యవివాహం,కాలేజీ విద్య, యూనివర్సిటీ మూతబడటం, ఆర్ధిక సంక్షోభం వల్ల, అప్పుల పాలవటం వల్ల చదువు మధ్యలో ఆగిపోవటంతో, మూడవతరమైన తన నాలుగేళ్ళ కొడుకు అక్షరాలు నేర్చుకుంటుంటే సుందరం ముచ్చట పడటంతో ముగుస్తుంది. ఒక రకంగా చూస్తే ఇందులో సృజనాత్మక నైపుణ్యంతో కధను కొనసాగించటం, నాటకీయతతో చమక్కుమనిపించి పాఠకులని తన కధన ప్రవాహవేగంతో ఉక్కిరి బిక్కిరి చేయటం, ఒక ఉద్వేగపూరిత రచనానుభావాన్ని మనకివ్వటం జరగదు. అయితే అది కొ.కు. పద్ధతి కాదు కూడా. కధకుడిగా ఆయన లోని బలం, బలహీనత కూడా ఇదే. గొప్ప ఆకర్షణీయంగా కథ చెప్పాలని ప్రయత్నించక పోవటం వల్ల ఎఫెక్ట్ కోసం అనవసర ప్రయాసపడి కృతకంగా ఉండటం లేదు . నింపాదిగా, సరళంగా, ఉద్వేగరహితంగా ఆయన కధనం సాగుతుంది . ఇది ఆయన శిల్పం మలిచే తీరు, శైలిలో లక్షణం. ఆయన స్టాంప్, ఒకరకంగా ఆయన కధనంలో ఆకర్షణ కూడా. బలహీనత అని ఎందుకన్నానంటే చదివినప్పుడు గొప్ప ఉద్వేగానికి గురై కళ్ళు చెమర్చటం, ఒక బలమైన రసానందానికి లోనవటం, పదేపదే చదవాలనిపించటం ,పదిసార్లు ఒక సంఘటన ని గుర్తు చేసుకోవటం వంటి అనుభవాలు ఈయన

రచనలతో సాధ్యం కాదు కాబట్టి. అయితే చక్కటి వచనంలో సాఫీగా, సరళమైన భాషలో కథ చెప్పే అవకాశం ఉన్న కథా వస్తువును ఎన్నుకోవటంలో కూడా ఆయన ప్రతిభ ఉందని ఒప్పుకోక తప్పదు. చదువులో కథావస్తువు అటువంటిదే. ఈ కథకు బలాన్నిచ్చి, ఈ నవల ప్రాచుర్యం పొంద టానికి ఈ కథాకాలం 1915-1935 దోహదం చేసిందని నా నమ్మకం. మనదేశ చరిత్ర లోనే ఉజ్వలమైన జాతీయోద్యమ కాలం లో జరిగిన కథ పై ఉండే సహజమైన ఉత్కంఠ, పరాధీనమైన దేశ పరిస్థితి పట్ల దుఃఖం, అంతలోనే మన స్వాతంత్రోద్యమ స్ఫూర్తి పట్ల గర్వం మనందరికీ ఉంటాయి. ఆ రకంగా ఈ కథకు ఒక ఎవర్-గ్రీన్ అప్పీల్ ఉంటుంది. ప్రపంచయుద్ధానంతరం డిప్రెషన్, జాతీ యోద్యమం తాలూకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ ప్రభావాలు, పరిణామాలు, అవి మధ్యతరగతి కుటుంబాలలో తెచ్చిన మార్పులు, ఘర్షణలు అన్నీ అప్రయత్నంగా కథలో భాగమయ్యేట్లు చేయటం, కథాగమనానికి అడ్డుపడకుండా కథలో చొప్పించటం కేవలం రచయిత నేర్పు, ప్రతిభ మాత్రమే. అయితే కొంతమేరకు ఆయన ఎన్నుకున్న కథావస్తువును బట్టి ఇది సులభమయి ఉండవచ్చు. ఇదే కాలంలోని ఓ ప్రేమకథని వ్రాసి, ఆ కథ మధ్యలో ఈ విషయాలను కథాగమనానికి అడ్డు రాకుండా చొప్పించటం కష్టమైనపనే అయి ఉండేది. ఎంతో శిల్పవైవిధ్యం ఉంటే తప్ప.

ఇకపోతే నవలలో కొన్ని విశేషాలు చూస్తే నవలలో యుద్ధం గురించి స్కూల్ పిల్లలు మాట్లాడుకునే సందర్భం ఒకటి ఉంటుంది. చాలా తమాషాగా. బ్రిటీష్ వాళ్ళ దగ్గర ఉన్న బంగారు కొండ కోసం జర్మనీ వాళ్ళు యుద్ధం చేస్తున్నారని, జర్మనీ వాళ్ళు కోడిలో బాంబులు కూరి పంపిస్తే అవి పేలి బ్రిటీష్ వాళ్ళు చనిపోయారని ఒకరు, జర్మనీ గెలిస్తే బ్రిటీష్ వాళ్ళు ఇండియా వదలి వెళ్లి పోతారని ఒకరు, అప్పుడు ఇంగ్లీష్ బదులు అందరూ జర్మన్ నేర్చుకోవాల్సి వస్తుందని మరొకరు మాట్లాడుకుంటూ ఉంటారు. ప్రపంచ రాజకీయాల్ని పిల్లల మాటల లో చెబుతున్నప్పుడు, వారి అమాయకత్వం, తెలిసీ తెలియని జ్ఞానం, పిల్లలకు సహజమైన అతిశయోక్తుల ద్వారానే దేశంలో యుద్ధకాలంలో వున్న పరిస్థితులు, ప్రజల నాడి చక్కగా చెప్పటం జరిగింది. అలాగే కరువు కాలంలో అందరూ ఇళ్లలో కూరగాయలు పండించటం వంటి చిన్న విషయాలను కథలో చొప్పించటం నుండీ జాతీయోద్యమంలో భాగంగా ఉన్నవారు కూడా సంఘానికి వెరచి పన్నెండేళ్ళ లోపు ఆడపిల్లలకి పెళ్లి చేయటం, అదికూడా డబ్బు లేకపోయినా అప్పుచేసి అయిదు రోజుల పెళ్ళిళ్ళు చేయటం, నాటకాలని వినోదాత్మక సాధనాలుగా మాత్రమే కాకుండా కళారూపాలుగా పరిగణించటం వంటి విషయాలనన్నీ నవలలో ప్రస్తావించటం వల్ల అప్పటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులపై కొంత అవగాహన కలుగుతుంది. కథాకాలం నాటి పరిస్థితులను ప్రతిబింబించటం సాహిత్యం చేయవలసిన ముఖ్యమైన పనులలో తప్పనిసరిగా ఒకటి.

అలాగే సహాయ నిరాకరణోద్యమ సమయంలో స్థానికులైన పోలీసులు ఆర్భాటంగా పరిగెట్టుకు వచ్చినా, ఉద్యమకారుల్ని అరెస్టుచేయటానికి మనసు రాక "వెళ్లి పొండి బాబూ" అని ఉద్యమకారుల్ని చేతులు జోడించి ప్రాధేయపడటం ద్వారా ఉద్యమస్ఫూర్తి అన్ని వర్గాల వారినీ ప్రత్యక్షంగానే కాక, పరోక్షంగా కూడా ఎలా తాకిందో చెప్పకనే చెప్పటం జరిగింది. విదేశీ వస్తు బహిష్కరణ సమయంలో గుమికూడిన బీదా బిక్కీ ఆ బట్టలు కాల్చేసే బదులు తమకివ్వమని బ్రతిమిలాడినపుడు చాలా ఆర్ద్రంగా అనిపిస్తుంది . సహాయనిరాకరణోద్యమం సమయంలో జరిగిన వాలంటరీ అరెస్టుల గురించి , అవి ఒక తంతులా జరపటం గురించి ప్రస్తావన కూడా నవలలో ఉంటుంది. ఎంతో ఉన్నత లక్ష్యం కలిగిన ఉద్యమంలోనైనా నిబద్ధత, వివిధవ్యక్తులలో వివిధస్థాయిలలో ఉంటుందన్న సామాన్య విషయం మనకర్థమవుతుంది. మరొక చోట విధవా పునర్వివాహాల గురించి ప్రస్తావన ఉంటుంది. సుందరం తన చెల్లెలి స్నేహితురాలి భర్త చిన్నవయసులో చనిపోయినపుడు ఆమె పునర్వివాహం విషయం గురించి సుముఖంగానే ఆలోచించినా తన తల్లి ని మళ్ళీ వివాహితగా, పూలు, రంగు చీరలలో ఊహించుకుని కలత చెందుతాడు. అతనికి శరీరమంతా కారం రాసుకున్నట్లవుతుంది. అంటే ఒక సాంఘిక మార్పు ఎంత అవసరమైనా, ఆదర్శప్రాయమైనా, అనివార్యమైనా తొలినాళ్ళలో ఆ మార్పుని తమ విషయంలో అంగీకరించటానికి సంఘజీవులైన మానవులు పడే సంఘర్షణని ఆ ఒక్కమాటలో కొ.కు. సూచించారు .

నా ఉద్దేశ్యంలో కథాపరంగా లోపం ఏంటంటే నవలలో సగభాగం పైగా సుందరం బాల్యం గురించి వ్రాసి మిగతా సగభాగంలో అతని ఎదుగుదల, కీలకమైన కాలేజీ, యూనివర్సిటీ చదువు, వివాహం వంటి విషయాలని కుదించటం. బహుశా దీనికి కారణం విస్తృతిని తగ్గించటమే అయినా అందువల్ల నవలలో సంతులనం తగ్గినట్లనిపించింది. ఇకపోతే ఈ నవలలో కొకు మరొక సందర్భంలో అంటారు "విద్య అంటే జ్ఞాన సముపార్జన. జ్ఞానం రెండు రకాలు. పుస్తక జ్ఞానమూ, అనుభవ జ్ఞానమూ. ఈ రెండు రకాల జ్ఞానమూ విద్య ద్వారా లభ్యం కావాలి" అని. కానీ ముఖ్య పాత్ర అయిన సుందరాన్ని విశ్లేషిస్తే ఈ రెండు రకాల జ్ఞానమూ అతను సంపాదించినట్లు మనకు అనిపించదు. ఎమ్మే ఎల్లెల్బీ చేయాలన్నది అతని ఆశయం. అయితే ఈ ఆశయసాధనకు అతను

ప్రత్యేకంగా చేసినది ఏమీ లేదు. మిగిలిన ఆస్తి ఒక్కటొక్కటిగా అమ్మి తల్లి తనను చదివిస్తూ "నీకు ఉద్యోగం వచ్చినపుడు అప్పులు తీరతాయి కదా నాయనా" అని ఆరాటపడ్డప్పుడు దానికి సమాధానం చెప్పటం కానీ ఆమె ఆరాటాన్ని చూసి చలించటం కానీ లేక పోగా, ఆమె ఆరాటాన్ని ఉపశమించటానికి ప్రయత్నించడు కూడా. తన చదువు ఆగిపోతే తల్లి మీద, బంధువుల మీద కినుక వహిస్తాడు చదువు ఉద్యోగం కోసం కాదు అని అభిప్రాయపడతాడే కానీ, ఏ జీవనోపాధి లేని తనకి భార్యాబిడ్డలను పోషించటానికి తగిన ఉద్యోగంలో స్థిరబడటం కనీస బాధ్యత అన్న ఆలోచన కూడా అతనికి తట్టదు. పైపెచ్చు తను కాశీ వెళ్తుంటే కళ్ళనీళ్ళు పెట్టుకున్న భార్యతో "నాకు ఎమ్మే ఎల్లెల్బీ వస్తుందని నీకు విచారమా అంటాడు, ఆమె హృదయాన్ని అర్థం చేసుకోనకుండా. చారిత్రకంగా, రాజకీయంగా ఒక ఉజ్వలమైన కాలంలో పుట్టి, ఏ ఉన్నతమైన జాతీయోద్యమ ప్రభావానికి పూర్తిగా లోనవ్వక, మద్దతు నివ్వక, తల్లి కష్టనష్టాల గురించి ఆలోచించక, భార్య ప్రేమను అర్థం చేసుకోలేక కేవలం తన చదువు, డిగ్రీల మీద మాత్రమే జీవితమంతా దృష్టి పెట్టిన సుందరం పాత్రలో అనుభవజ్ఞానశూన్యత మాత్రమే కాదు, ఒక రకమయిన నిర్దయ, స్వార్థం, మానవ సంబంధాల పట్ల కరుణ లేకపోవటం కనబడుతుంది. ఈ నవల ఉద్దేశ్యం ఏమిటి? డిగ్రీల వెనుక పరుగులెత్తే మన విద్యావిధానం లోని లోపాల్ని చూపటమా?లేక సుందరం వంటి వాళ్ళ వ్యక్తిత్వ లోపాల్ని చూపటమా? బహుశా రెండూనేమో.


కొడవటిగంటి కుటుంబరావు (1909-1980)

కధాగమనానికి, పాత్ర చిత్రణకి ఏ మాత్రం సంబంధం లేక పోయినా ఈ నవల మొదలైన తీరు పట్ల నాకు కొంత అసంతృప్తి ఉందని చెప్పక తప్పదు. "ఆడవాళ్ళ ముచ్చట్లను మగవాళ్ళు ఎన్నటికీ అర్థం చేసుకోలేరు. నూటికీ కోటికీ గాని ఇల్లు దాటిపోలేని సీతమ్మలు, సుబ్బమ్మలు, మాచమ్మలు, కూచమ్మలూ రోజూ అంతంత సేపు ఏం మాట్లాడుకుంటారు? ఎంతో ఆప్యాయత గల స్నేహితులన్నా ఉంటే పోనీ అనుకోవచ్చు. కానీ ఈ ఆడవాళ్ళ లో అవీ కనిపించవు. వాళ్ళు పెద్ద స్నేహాలు చేయకుండానే రోజూ ఒకరికొకరు అంతు లేని విషయాలు చెప్పుకుంటారు. ఏమిటీ విషయాలు? ఇవి తమకు, తమవారికీ సంబంధించినవి కావచ్చు. ఇతరులకు సంబంధించినవి కావచ్చు . ఈ ఆడవాళ్ళు ఇల్లు దాటకపోయినా పై వాళ్ళు ఇంటికి వస్తారు. వాళ్ళు ఏవో వార్తలు తెస్తారు. ఎపుడైనా ఓ ఉత్తరం ఎక్కడి నుంచైనా రావచ్చు. వీటిని గురించి ఎన్నాళ్ళయినా మాట్లాడుకోవచ్చు. కాలక్షేపానికి నిత్యమూ కొత్త విషయాలుండాలని కూడా లేదు. చెప్పుకున్న విషయాలే మళ్ళీ మళ్ళీ చెప్పుకోవచ్చు. ఈ చెప్పుకోవటం ఆడవాళ్ళ జీవితాలకూ వ్యక్తిత్వాలకు ఎంతో ముఖ్యం .ఇది వాళ్ళ చదువు. వాళ్ళ సాహిత్యం, వాళ్ళ తత్వజ్ఞానం, వాళ్ళ తపస్సు. నాలుగు రోజులపాటు వాళ్ళను కలవకుండా చేస్తే తాము ఎటువంటి బానిసత్వంలో ఉన్నదీ, కూపస్థ మండూకాల్లా ఎట్లా జీవిస్తున్నదీ వాళ్లకి తెలిసివస్తుంది". ఈయన చెప్పిన విషయంలో కొంత సత్యం ఉన్నా ఈ పేరా నాకు నచ్చకపోవటానికి రెండు కారణాలు .

ఒకటి—స్వయంగా అభ్యుదయ వాది, మార్క్సిస్ట్ మేధావి అయిన కొకు తనకు నిబద్ధత ఉన్న సిద్ధాంత మూలాలకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్య. ఎందుకంటే తాడిత, పీడిత, అణగ ద్రొక్కబడిన వర్గాలతో పాటు, సాంఘికంగా, ఆర్థికంగా, విద్యా విషయాల్లో కొన్ని తరాల పాటు నిర్లక్ష్యం చేయబడ్డ స్త్రీలను కూడా పరిగణించి మార్క్సిస్ట్ లు స్త్రీల పట్ల చూపించా ల్సింది కరుణ కదా? స్త్రీ ఉద్ధరణకు మార్గాలు వెతకాలి కానీ అపహాస్యం చేయకూడదుకదా. అందులో ఇటువంటి వ్యాఖ్య చేసింది ఏ ఛాందస సనాతనవాదో కాదు, కొ.కు. వంటి గొప్ప నిబద్ధత ఉన్న అభ్యుదయ, ఆధునిక మేధావి అవటం కొద్దిగా ఆశ్చర్యమే .

రెండు – ఈ పేరాలోనే ఉన్న వైరుధ్యం —చివరి నాలుగు లైన్లు. అంటే కలవకపోతే వాళ్ళు కూపస్థ మండూకాల్లా ఉంటారని ఆయన ఉద్దేశ్యమే కదా? అటువంటప్పుడు ఆడవాళ్ళు కలవటం పట్ల అపహాస్యం చేయవలసిన అవసరం ఏమిటి?

అయినా చదువు తప్పనిసరిగా చదవవలసిన నవల. మన దేశచరిత్ర లోనే ముఖ్యమైన జాతీయోద్యమ కాలంలో తెలుగు గడ్డపై సామాజిక, ఆర్థిక, సంఘ జీవనాన్ని గురించి నిరాడంబర వచనంలో ఆకర్షణీయంగా ఎలా వ్రాశారో తెలుసుకోవటానికి, ఈ పుస్తకం తప్పక చదవాలి.

# తావో తే చింగ్ (道德經 )

తమ్మినేని యదుకుల భూషణ్

తావో తే చింగ్ (TAO TE CHING) చైనీయులకు భగవద్గీత లాంటిది. గీత లాగే స్వచ్ఛందంగా అనేక భాషల్లోకి అనూదితమైంది. ఆంగ్లంలో వందలాది అనువాదాలు లభ్యమవుతున్నాయి. పండితులు పామరులు ప్రతి ఒక్కరు ఈ గ్రంధాన్ని అనువాదం చేద్దామని ఉబలాటపడేవారే. దానికి కారణం గ్రంధం చిన్నది కావడం (81 పద్యాలు) కావచ్చు. వేదం లాగే వ్యాఖ్యానం లేకుండా చదవడం అంత సులభం కాదు. సాయణ భాష్యం లాగే పేరు పొందినది మూడవ శతాబ్దం నాటి వాంగ్ బి వ్యాఖ్యానం. తొలినాళ్ళలోవచ్చిన అనువాదాలు వ్యాఖ్యానాల ను పట్టించుకోలేదు. దానికి కారణం అనువాద కులు అసలు సిసలు ప్రతి చేతిలో పడితే అనువాదం చేసి వేయగలమని భావించడమే. అనువాదకులు పాశ్చాత్యసంప్రదాయం నుంచి వచ్చిన వారు కావడం వల్ల, బైబిల్ అనువాదాల్లో పాటించిన పద్ధతులే (వ్యాఖ్యానాలను పట్టించు కోకపోవడం, ఎక్కువ సార్లు వాటిని అపనమ్మ కంతో చూడటం, అవి సత్యశోధనకు గుదిబండలని భావించడం) ప్రామాణికమని భావించారు. ఈ ధోరణి వల్ల వ్యాఖ్యానాలు అందించే విలువైన విషయాలను వీరు తమ అనువాదాల్లో వినియోగించుకోలేక పోయారు. జర్మను పరిశోధకులు ఈ లోటు పూరించే ప్రయత్నం చేశారు, రుడాల్ఫ్ వాగ్నర్ వాంగ్ బి వ్యాఖ్యానాన్ని ఆధారంగా చేసుకొని ఎంతో శ్రమకోర్చి గొప్ప అనువాదాన్ని వెలయించడమే కాకుండా, వ్యాఖ్యాతగా వాంగ్ బి ఘనతను ఉగ్గడిస్తూ మరో రెండు గ్రంథాలను ప్రకటించాడు. ప్రాచ్యదేశాల వ్యాఖ్యాన సంప్రదాయాన్ని చక్కగా అర్థం చేసుకొని వాటిని అనువాదంలో వాడుకొన్న తీరు శ్లాఘనీయం. వేయి పుటల్లో పరచుకొన్న వీరి కృషి పరిశోధకులను అబ్బుర పరచక మానదు. వాంగ్ బి నన్నెచోడుడు లాంటివాడు , విలక్షణ ప్రతిభు డు. అంతే గాక అల్పాయుష్కుడు. అతను మరణించే నాటికి అతని వయసు పాతిక లోపే .





తావో తే చింగ్ కు వచ్చిన ఇరవైయ్యవ శతాబ్ది తొలి దశకంలో (1913) వచ్చిన ప్రామాణిక అనువాదాల్లో ఎన్నదగినది పాల్ సారస్ అనువాదమే. ఇందులో ఫ్రెంచి పరిశోధకుడు Prof. Paul Pelliot (T'oung Pao, 1912 pp. 351-430) ప్రస్తావన ఉంది. ఇతని పరిశోధనలో తేలిన విషయం. మగధాధీశుడు హర్షశీలాది త్యుని సామంతుడు -అస్సాము పాలకుడు, కుమారకుని కొలువులో అనువాదం జరిగింది. చేసినవాడు హ్యూయన్ త్సాంగ్ (ఇంతవర కు అది అనుపలబ్ధము). ఇతనే బౌద్ధ గ్రంథాలననేకం సంస్కృతం నుండి చైనీస్ లోకి పరివర్తించాడు. ఇతను రాసిన యాత్రా చరిత్ర ప్రసిద్ధి గాంచింది.

తావో తే చింగ్ అనువాదంలో ఆది లోనే హంసపాదు లాంటిది **తావో** శబ్దమే. నూటికి తొంభై తొమ్మిదిమంది **తావో**ను **తావో** గానే పెట్టేసి బండి నడిపించారు. కానీ, **తావో** అన్న శబ్దం క్రియా రూపం తీసుకున్నప్పు డు వస్తుంది చిక్కు. సంస్కృత కృతి మీద నాకు ఆసక్తి కలగడానికి ముఖ్య కారణం, **తావో** అన్న పదాన్ని ఇరు భాషల లోతులు తెలిసిన అనువా దకశ్రేష్ఠుడు ఎలా అనువదించాడు ? ఆయన అనువాదానికి ఆధారమైన ప్రతి ఏమిటి ?? వాంగ్ బి వ్యాఖ్యానాన్ని , భాష్యాన్ని అనుసరిం చాడా? లేదా స్వతంత్రధోరణి అవలంబించాడా? ఆయన వ్యాఖ్యానంలో బౌద్ధ ప్రభావం ఉందా ? ఇలా ఎన్నో చిక్కు ప్రశ్నలు విడి పోతాయి. ఆ అనువాదం దొరికితే.

తావో అనగా-దారి, తోవ, పథం, మార్గం;. తే అనగా గుణం. చింగ్ అనగా గ్రంథం .

**తావో తే చింగ్ ఎప్పటిది ? ఏ కాలానికి చెందినది ?**

క్రీ . పూ 168 నాటి ప్రతులు రెండు ( పట్టు వస్త్రం మీద రాసినవి ) 1973 లో ఒక సమాధిలో దొరికాయి. వీటిని దొరికిన ప్రాంతం పేరు మీదుగా మా వాంగ్ తుయి ప్రతులుగా వ్యవహరిస్తారు. ఇవే ప్రాచీనమని తలచి వీటి మీద ఎంతో పరిశోధన జరిగిన పిమ్మట 1993 లో తూర్పు చైనాలో క్రీ.పూ 300 నాటి ప్రతి ఒకటి ( వెదురు మీద రాసినది ) సమాధిలో లభించింది. దీన్ని గోడియన్ ప్రతిగా వ్యవహరిస్తారు. రెండు వేల సంవత్సరాలు సమాధుల్లో మగ్గి మళ్ళీ మన చేతుల్లో పడటం కన్నా అద్భుతం ఏముంది ? ఈ ప్రాచీన ప్రతుల మీద ఎంతో కృషి చేసి పరిష్కార పాఠం వ్యాఖ్యాన సహితంగా ప్రకటించిన వాడు రాబర్ట్ హెన్రిక్స్ అన్న పండితుడు. ( ఇతని పుస్తకం చూసిన తర్వాతే నా ఆసక్తి మరింత పెరిగింది).

తావో తే చింగ్ కర్త లావోజు ( క్రీ. పూ ఆరవ శతాబ్దం) బుద్ధుని

సమకాలికుడిగా  భావించడం చైనీస్ సంప్రదాయం, కానీ అతని గురించి తెలిసినది అతి తక్కువ.  అతను సరిహద్దు దాటి భారత దేశంలో ప్రవేశించే ముందు ఈ పుస్తకం రాసి అక్కడి కావలివానికి ఇచ్చి వెళ్ళాడు అని ఒక కథ ప్రచారంలో ఉంది.

ప్రాచీన చైనీస్ అనువాదంలో ఎదురయ్యే చిక్కులు బహుళం , అవన్నీ దాటుకొని అనువాదాన్ని నిర్వహించటం కత్తి మీద సాము. ఇబ్బడి ముబ్బడిగా వచ్చిన అనువాదాల్లో పండిత పాఠాలను ఓపిగ్గా చదివి ఆకళించుకొని ముగ్గులోకి దిగే వారు తక్కువ. ఎక్కువ మంది పండితులకు విషయ సంగ్రహణ చేయడం, చారిత్రకాంశాలు తదితరాల మీద ఉన్న పట్టు అనువాదాన్ని కవిత్వంగా మార్చడంలో లేదు. కావున మధ్యేమార్గంగా వచ్చిన అనువాదాలు చాలా తక్కువ అని చెప్పాలి.

## గుబురు కొమ్మల చెట్టు

**నిషిగంధ**

ఎందుకో ఎక్కడా ఆగబుద్ధి కాదు
అలా అని అంతా వదిలేసి వెళ్ళాలనీ ఉండదు..
లేతకాంతి చిన్నగా కుదిపి లేపడంతోనే
ఆకాశం ఆట మైదానం అవుతుంది.
గెలుపు అవసరం లేని నింపాది పరుగులు మొదలవుతాయో లేదో
వేధించే దాహాలన్నీ దారి తప్పుకుంటాయి!

కింద నించి చేతులు జాచి పిలుస్తున్న
పాపాయి నవ్వులన్నీ
మెత్తటి మట్టి వాసనని మోసుకొచ్చినప్పుడల్లా
ఇక ఉండలేక మహా ఇష్టంతోనే దిగి వస్తాను..
తెల్లటి గోడలమీదనో, పెరటి మొక్కల మధ్యనో
ఎంతో కొంతసేపు సావకాశంగానే గడుపుతాను కానీ
అక్కడా ఆగలేను..
ఒక అన్యమస్కపు క్షణం చివర్లో తటాలున లేచివెళ్ళక ఉండలేను!

గోపురం గూడులో మునగదీసుకుంటూ
దుమ్మూ దుమారమూ దాటేస్తుంటాను..
విసిరేసే ముసురొకటి వచ్చినప్పుడే
గుబురుకొమ్మల చెట్టొకటి ఆసరా ఇచ్చింది.
గూళ్ళు కట్టుకున్న జంటల గురించీ,
వాటిని వదిలి వెళ్ళిన గువ్వల గురించీ
చెమ్మగిల్లిన కథలెన్నో చెప్పింది.
ఇప్పటివో, గతజన్మవో తెల్చుకోలేని జ్ఞాపకాలలో
కరిగీ, కదిలీ వెక్కి వెక్కి ఏడ్చేశాననుకుంటా
మెత్తని ఆకుల మధ్యలోకి హత్తుకుంది!
ఎప్పటి అసహనాలూ, అయోమయాలో
వేకువఝాము వెలుతురులో వదిలించేసుకుంటూ
గడ్డిపూల మైదానాల మీదుగా గిరికీలు కొడుతుంటే..
వీచే గాలుల మధ్య చిన్నగా చలించే లేత అకులూ,
చెట్టంతా అలుముకున్న గోరువెచ్చని శాంతీ గుర్తుకొచ్చాయి.
ఎందుకో అంతా వదిలేయాలనిపించింది..
అక్కడికే వెళ్ళిపోవాలనీ తెలిసిపోయింది!

రివ్వున తిరిగివెళ్ళానా..
వేల కనురెప్పలై కాపాడిన పచ్చదనం
ఖండాలుగా కొట్టివేయబడి కనబడింది!
విరిగిన నీడలేమో బుగ్గలు తుడుచుకుంటున్నాయి!!



# మనము - పిల్లలు - భాష...

దాసరి అమరేంద్ర (ఇండియా)

"ఎంత అన్యాయం" నువ్వేమో మంచి తెలుగు రాస్తూ ఉంటావు. వీళ్ళకు ఒక్క ముక్క చదవడం రాదు. మాట్లాడడమూ అంతంత మాత్రమే. ఇది చాలా అన్యాయం. వీళ్ళకు తెలుగు నేర్పించక పోవడం నీదే తప్పు" మందలింపు స్వరంతో అంది అమ్మ - ఇరవై ఏళ్ల క్రితం. అప్పటికే మేము ఢిల్లీలో ఉండటం మొదలెట్టి ఇరవై ఏళ్ళు అయిపోయింది . పిల్లలిద్దరూ అక్కడే పుట్టి పెరిగారు. నవ్వేసి ఊరుకున్నాను.

"హైదరాబాదులో పుట్టి పెరిగిన మాట నిజమే గానీ — ఏదీ, వీళ్ళ చదువులన్నీ ఇంగ్లీషులోనే. బావుంటుంది గదా అని కేంద్రీయ విద్యాలయంలో నానా తంటాలు పడి చేర్చాం. అక్కడ అంతా హిందీ మయం. తెలుగు ఏదో మొక్కుబడి. చూస్తే ప్రాణం ఉసూరు మంటోంది ". ఓ రచయిత మిత్రుని ఆవేదన.

చిరునవ్వే నా సమాధానం.

★★★

నా వరకూ నేను తెలుగు చదువుకొన్నది చాలా తక్కువ. హైస్కూలు. పీ.యూ.సీ . ఆ తర్వాత తెలుగు కనీసం ఒక సబ్జక్టైనా గాదు. కానీ బెజవాడ సీవీయార్ స్కూల్లో 1962 -67 హైస్కూలు రోజుల్లో తెలుగుతో అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది. నన్నయ్య ఉదంకోపాఖ్యానం నుంచి కరుణశ్రీ పుష్ప విలాపం దాకా, చిన్నయసూరి పంచతంత్రం నుంచి ముద్దు కృష్ణ వైతాళికులు ముందుమాట దాకా — అదో సమ్మోహన సంబంధం. అలా ఏర్పడిన భాషా సాహిత్యానుబంధం ఏభై ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది .

ప్రపంచంలోని వెయ్యి మంది తెలుగు భాషాభిమానుల పట్టిక వేసిన పక్షంలో అందులో నేను ఉండి తీరుతానని నా గట్టి నమ్మకం. చదువులోనూ, ఆఫీసుపనుల్లోనూ, ఇతర దైనందిన కార్య క్రమాల్లోనూ తెలుగు ప్రమేయం పూజ్యమే అయినా ఆ భాష అంటే నాకు వల్ల మాలిన అభిమానం. శృతి మించని ప్రేమ .

మన పిల్లలకు తెలుగు రాకపోతే విచారంగా ఉండదా ? బాధగా ఉండదా? అన్యాయం అనిపించదా? మన వైఫల్యం అనిపించదా? విచారమా? బాధా? అన్యాయమా? వైఫల్యమా? ఎందుకూ? నాకు ఏమాత్రం ఈ భావాలు కలగనే కలగవు.

★★★

అసలు భాష అంటే ఏమిటి? ఎలా పుడుతుంది? ఎలా మనుగడ సాగిస్తుంది? ఎలా వికసిస్తుంది? భాష ప్రయోజనం ఏమిటి? - భాష మనిషికి ప్రాథమిక అవసరం. సమాచారాన్ని, అనుభవాలనూ, ఆలోచనలనూ, భావాలనూ ఒకరికి మరొకరు ఇచ్చి పుచ్చుకునే సాధనం. ప్రాథమిక అవసరాల స్థాయి దాటాక - సాంఘిక, ఆర్థిక, రాజకీయ, భౌగోళిక కారణాల పుణ్యమా అని కొన్ని కొన్ని భాషలు మహా అభివృద్ధి చెందుతాయి. గుంపు, ప్రాంతం,రాష్ట్రం, దేశం పరిధుల్ని దాటుకుని 'ఎదిగి' అంతర్జాతీయ భాషలుగా రాణిస్తాయి. సంస్కృతికీ, సాహిత్యానికీ పట్టుకొమ్మలు అవుతాయి. కోట్లాదిమందికి మాతృభాషలవుతాయి. మరికొన్ని కోట్లమందికి మాతృభాష కన్నా ఎక్కువవుతాయి.

మరికొన్ని భాషలు — అనేకానేక కారణాల వల్ల ఎదగవు. నశించినా నశిస్తాయి. అదో విషాదం గావచ్చు. కానీ అనివార్యం అనుకొంటాను. గత అయిదారు వేల సంవత్సరాలలో ఎన్నెన్ని భాషలు అంతరించాయో, ఎలా అంతరించాయో అందులో అనివార్యత ఏమిటో — అదో గొప్ప రిసెర్చ్ అంశం.

★★★

తెలుగు వికసిత భాషా — అంతరిస్తున్న భాషా?
నేను భాషా నిపుణుడిని గాదు. — అంచేత ఖచ్చితమైన అభిప్రాయం చెప్పలేను. కానీ, నా తెలుగు అభిమానాన్ని పక్కన పెట్టి చూసినా - సంగీత సాహిత్యాల పరంగానూ, తెలుగు భాషకున్న విస్తృత ప్రాచుర్యం దృష్ట్యానూ (పన్నెండు కోట్ల మంది తెలుగు మాట్లాడుతారు గదా)- వికసిత భాష అనే అనాలి. మరి మన పిల్లలకు — మన తెలుగు పిల్లలకు —తెలుగు రాకపోవడం దౌర్భాగ్యం కాదా? అది మరీ పెద్ద మాట. పెద్ద మాటవాడినా, సున్నితంగా చెప్పినా — నా సమాధానం మాత్రం 'కానే కాదు'. మరి మన పిల్లల విషయంలో అది కాలం చెల్లిన భాష ఎందుకు అవుతోంది? అలా అయినపుడు ఆ విపరీతా నికి మనం ఎలా సమాధానం చెపుతాం?
అసలు అంతకు ముందుగా మనం వేసుకోవలసిన ప్రశ్న —
మనకు తెలుగు మాతృభాష ఎలా అయింది?
భగవంతుడి వరం వల్లా? పూర్వజన్మ సుకృతం వల్లా?
నా వరకూ నేను తెలుగు వాడిగా పుట్టడం ' కేవలం యాదృచ్ఛికం' అనుకొంటాను. నేను తెలుగు వాడిగా పుట్టడానికి ఎంత సంభావ్యత-ప్రాబాబిలిటి ఉందో, ఒక తమిళుడిగానో, ఫ్రెంచి మనిషిగానో, జపనీయుడుగానో, ఉగాండా మనిషిగానో, అమెరికన్ నేటివ్ ఇండియన్గానో, జులు తెగ మనిషిగానో, సంథాలీ భాషీయుడిగానో పుట్టడానికి అంతే సంభావ్యత ఉందని నమ్ముతాను.

తెలుగులో కాకుండా సంథాలీలలోనో, అండమాన్ జాతి

వారిలోనో పుట్టినా ఆయా భాషా సంస్కృతులను ఇంతగానూ అభి మానించి ప్రేమించి ఉండే వాడిననే విషయంలో నాకు అనుమానం లేదు. ఆయా భాషల వికాసానికి ఉడతా భక్తిని తప్పక పనిచేసి ఉండేవాడిని. అది అతి సహజమైన మానవప్రకృతి అని నా గట్టి నమ్మకం.

★★★

మళ్ళా 'మనము – భాష – పిల్లలు ' అన్న విషయం దగ్గరికి వస్తే వెయ్యి సంవత్సరాల చరిత్ర (రెండు వేలా?) ఉన్న తెలుగు భాషా కుటుంబంలో మన పిల్లలు పుట్టారు – నిజమే.

ఒక గొప్ప వారసత్వ సంపద వారికోసం ఎదురు చూస్తోం ది – అదీ నిజమే. అందుకు ఎవరైనా, ఏమైనా కారణాలు కావచ్చు. పిల్లలు మాత్రం కారణం కాదని నేననుకుంటాను. ఎవరికైతే తెలుగు రావడంలేదని మనం బాధ పడుతున్నామో – వాళ్ళు పుట్టి పెరుగు తున్నది తెలుగు భాష పరిమళిస్తోందని మనం భావించే గ్రామ సీమల్లో గాదు – హైదరాబాదు వంటి భాషాపరంగా పరాయివైన నగరాల్లో బొంబాయి, ఢిల్లీలాంటి పరాయి రాష్ట్రపు ఊళ్లల్లో. సిడ్నీ, పారిస్, న్యూయార్క్ లాంటి విదేశప్రాంతాల్లో. పైగా వాళ్ళను అలా భాషకు దూరం చేసింది మనం. మనందరం. ఆ ఊళ్లో తెలుగు నడవదు – ఉర్దూనో, హిందీనో, ఫ్రెంచో, ఇంగ్లీషో. ఇంట్లో నడిచే పక్షం లో పిల్లలకు కష్టం మీద తెలుగు మాట్లాడటం వస్తుంది. మరి బయటకు అడుగు పెడితే తెలుగు భాష – ఆమాటకొస్తే తమిళ, మళయాళ, కన్నడ, ఒడియా – ఆయా భాషలన్నీ 'నిరుపయోగం' . కిరాణా షాపుల దగ్గర్నించి, ఆటో టాక్సీల దగ్గర్నించి, స్కూళ్ల దగ్గర్నించి , ఆఫీసుల దగ్గర్నించి – అంటూ అక్కడి స్థానిక భాషో లేదా అందరికీ అనుసంధాన మయ్యే అంతర్జాతీయ భాషో. మన మాతృ భాష మరి అక్కడ చెలామణీ అవ్వదు.

మరి పిల్లలకు తెలుగు ఎలా వస్తుంది? పోనీ పట్టి బల వంతాన నేర్పినా – నేర్చుకున్నా – ఆ నేర్చుకున్నది బతికి బట్టగట్టి ఎలా మనుగడ సాగిస్తుంది? అక్కరకు రాని చుట్టాన్నీ, భాషను – గ్రక్కున గాక పోయినా-ఎప్పటికయినా విడవంగ వలసి వస్తుంది గదా. మనం విడిచి పెట్టకపోయినా అదే మెల్లగా విడిచిపెట్టి వెళ్ళిపోతుందిగదా ... విడిచి పూర్తిగా వెళ్లిపోకపోయినా ఆ భాష మనం వాడనపుడు–వాడలేనపుడు–పదును కోల్పోయి తుప్పు పట్టిపోదూ?

అదే జరిగింది–జరుగుతోంది – మన పిల్లల విషయంలో. అందుకే ఈ విషయంలో నాకు చీమ కుట్టినంతయినా చింత లేదు. "నీ మాట నిజమే అనుకుందాం. అయినా తెలుగులో ఉన్న అఖండ సాహితీ సంపద పిల్లలకు అందకపోవడం ..." అంటారు మీరు. ముందే అన్నట్టు తెలుగు భాషలో ఉన్న అనేకానేక సంపదల మీద నాకు ప్రేమ, శ్రద్ధ, భక్తి, గౌరవం ఉన్నాయి. కానీ అలాంటి సంపద ఇతర భాషల్లోనూ పుష్కలంగా ఉంది కదా ? తమిళంలో ఉంది. కన్నడంలో ఉంది. బెంగాలీ, మళయాళ, మరాఠ, హిందీ , రష్యన్, జర్మన్, ఫ్రెంచ్ ... ఎన్నో ఎన్నెన్నో భాషలలో ఉంది. తెలుగు సాహితీ సంపద అందుకోలేక పోయినా హిందీ, ఇంగ్లీషులలో అందుకుం టే చాలదా? చాలడమేమిటీ–ఎక్కువ గాదూ? అసలు మనం వేసు కోవలసిన మరో మౌలిక మైన ప్రశ్న ఉంది.

ఏభాషలో చదువుతున్నామన్నది ముఖ్యమా–ఏం చదువు తున్నా మన్నది ముఖ్యమా? నా వరకూ నేను తెలుగు శృంగార కథలు చదవడంకన్నా హిందీ యశపాల్ నూ, ఇంగ్లీషు హెమింగ్వే నూ చదవడాన్ని ఇష్టపడతాను. తమిళంలో సులోచనారాణి, యండమూరిలను చదవడం కన్నా మైథిలీ సంథాలీలలో కొడవటి గంటిని చదవమని చెబుతాను. సిడ్నీషెల్డన్ కన్నా సోమర్సెట్ మామ్ ను చదవమంటాను .

నా వరకూ నాకు ' ఏం చదువుతున్నాం' అన్నది ముఖ్యం. ఏ భాషలో అన్నది అంత ముఖ్యం కాదు. మా పిల్లలు ప్రేమ్ చంద్ ను చదివారు. హెమింగ్వే నూ, ఖాలిద్ హుస్సేన్ ని చదువుతున్నారు. అది చాలు–వాళ్ళు కొకును చదవలేక పోతున్నారన్న 'నిరాశ'ను జయించడానికి. అంచేత వాళ్ళు అపార తెలుగు సాహితీ సంపదకి దూరమవుతున్నారన్న చింత లేదు. ఇహ నా పుస్తకాలు చదవడం సంగతా ...

నవ్వొస్తుంది.. అందుకు బాధ పడే వాళ్ళను చూస్తే !

# 'గాధాసప్తశతి' లో గ్రామజీవనం

డా. పుట్టపర్తి నాగ పద్మిని, హైదరాబాద్ (ఇండియా)

ఇటీవల ఒక ఫోటో చూశాను. పాతకాలంలో బాటసారుల కోసం నిర్మించిన సత్రాలూ, బావులూ, ఇంకా అక్కడక్కడా అవశేషాల్లా ఉన్న ఊర్లు! మా చిన్నతనంలోనూ ఇలాంటి సత్రాలు ఊరి బయట ఒకటి రెండు కనిపించేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారి పోయింది. ఊళ్ళలో అన్నీ నక్షత్ర కాంతుల లాడ్జీలే కనిపిస్తాయి. చిన్న చిన్న ఊళ్ళలోనూ చిన్నో చితకో లాడ్జీలే ఉంటాయి తప్ప, ఉచితంగా బాటసారులను సేద తీర్చే సత్రాలు కనిపించనే కనిపించవు.

ఆ ఫోటోలు చూస్తుంటే, 'గాథాసప్తశతి' లోని అచ్చమైన పల్లె వాతావరణం, బాటసారులను గ్రామస్తులు ఆదరించే పద్ధతీ, వారి ముచ్చటగొలిపే సంప్రదాయాలూ, వారి నమ్మకాలూ ఇవన్నీ గుర్తొచ్చి కళ్ళు చెమరించాయి.

మా అయ్యగారు పుట్టపర్తివారి వద్ద మూడువందల గాథల దాకా నాకు పాఠం అయ్యింది - 1973-1974 ప్రాంతాలలో. వారి దగ్గర పాఠం అంటే, కత్తి మీద సామే. నిన్న చెప్పిన పాఠం ఈరోజు అప్పజెప్పి తీరాల్సిందే! ఏమాత్రం తేడా వచ్చినా తిట్లు తప్పవు. అయ్య కోపాన్ని తట్టుకోవటం చాలా కష్టం. ఏదో పడుతూ లేస్తూ, కొన్ని గాథలు పూర్తి చేసుకోగలిగాను కానీ, ఆగిపోయిన తరువాత తెలిసింది ఎంతగా నష్టపోయానో. ఏదో నేనా తరువాత, మరికొన్ని చదివినా, అప్పటి అనుభవం ముందు, ఇవన్నీ దిగదుడుపే! మా అయ్యగారు చూపిన మార్గంలోనే నడుస్తూ, వారు చెప్పిన నేను గమనించిన నాటి గ్రామజీవితం గురించి కొన్ని సంగతులివిగో మీకోసం ...

అసలు, గాథాసప్తశతి మొత్తం అమూల్య మౌక్తికరాశి. ముక్తకాలంటే, వేటికవే సంపూర్ణార్థం కలిగి, చదువరులను ఆహ్లాదపరచే రసగుళికలు. భామహుని దృష్టిలో అనిబద్ధ కావ్యం ముక్తకం. అగ్నిపురాణకారుని దృష్టిలో 'చమత్కార సృష్టిలో సామర్థ్యం ఉన్న శ్లోకమే ముక్తకం. లోచనకారుడంటాడూ **'పూర్వాపర నిరపేక్షణాపి,యేన రసచర్వణా క్రియతే తదేవ ముక్తకం'** అని! మొత్తానికి, వ్యంజనతోపాటు రససృష్టిలోనూ సామర్థ్యం గల ముక్తకాన్ని 'సరస ముక్తకమ'నీ, కల్పనతోపాటు నీతినీ గంభీరంగా ప్రతిపాదించే ముక్తకాన్ని 'సూక్తి' అనీ అంటారు. చమత్కారం కూడా లేని ముక్తకాన్ని 'వస్తుకథన ముక్తకం' అంటారు. గాథాసప్తశతిలో ఇవన్నీ ఉన్నాయనే చెప్పాలి.

డా.జాన్ డ్రింగ్వాటర్ దృష్టిలో, మనిషిలోని మానసిక శక్తి నాలుగు విధాలు. 1. పూర్ణనియంత్రణాత్మక బౌద్ధిక దృష్టి (Profound Intellectual control of material) 2. పూర్ణ భావాత్మక చేతన (Profound emotional Sensitiveness to material), 3. నైతికత (Energy of Morality) 4. కవిత్వ శక్తి. (Poetic energy)

వీటిలో-మొదటి రెండింటినీ సంఘటిత శక్తి, సహృదయత అనవచ్చు. మూడవది మనకు తెలిసినదే! నాలుగవదైన కవిత్వశక్తిని అన్నింటిలోనూ శ్రేష్ఠమైనదంటారాయన! (Poetic energy is the witness of the highest urgency of individual life of all things, the most admirable and great.)

ఈ నేపథ్యంలో, గాథల్లో నాటి గ్రామీణ వాతావరణం ప్రతిఫలించే కొన్ని ముక్తకాలలోని మధురిమలను ఆస్వాదిద్దాం. ఇక్కడొమాట చెప్పుకోవాలి. గాథాసప్తశతి నిండా శృంగారమే చిప్పిల్లుతూ ఉంటుందనీ, మరి ఇతర వ్యక్తీకరణలే ఉండవనీ ఒక అభిప్రాయం ఉంది. ఆమాటకొస్తే, మన జానపదసాహిత్యంలో శృంగారానికే పెద్దపీట కదా! కానీ, వానిలోని భాష అందరికీ అర్థమయ్యేది కాబట్టీ, కాస్త అందుబాటులో ఉంది కాబట్టీ, జానపద సాహిత్యాన్ని మరింతగా వెలికి తీసి, అందులో ఉన్న ఇతర విషయకాలైన గేయాలను విశ్లేషించి, జానపదసాహిత్య హృదయాన్ని శ్లాఘిస్తున్నారు. కానీ, హాలుడు తనకి ఇష్టమైన అప్పటి కొన్ని గాథలను మాత్రమే సమీకరించాడు. ప్రాకృతసమాజాన్ని అధ్యయనం చేయటానికి అవే మనకు ఇప్పటికి దారిదివ్వెలు.అంతమాత్రం చేత, ఆనాటి సమాజాన్ని విశృంఖల శృంగారభరితం అనటం సబబు కాదేమోననిపిస్తుంది. ఉన్నంతలో, వాటిని విశ్లేషిస్తే, ఒక విషయం బోధపడుతుంది. గాథాసప్తశతి లోని శృంగారగాథలన్నీ మేలిమి ముత్యాలరాశులు. మధ్యలో వెలుగులు విరజిమ్ముతూ, మనల్ని ఆకర్షించే మేలుజాతి మరకతమణులూ, పచ్చలూ - అందులోని గ్రామీణ జీవన చిత్రణలు.

ఇప్పుడిక అసలు విషయంలోకి ప్రవేశిద్దామా! ఊరి ముందు ఒక పెద్ద మర్రిమాను, దాని చుట్టూ అరుగూ కూడా ఉంటే, బాటసారులకు ఎంత అనుకూలంగా ఉంటుందో కదా! గాథా కారుడదే అంటున్నాడు.

**సుఅణో జం దేస మలంకరేఇ తం విఅ కరేఇ పవసంతో,**
**గామాసణ్ణుమ్మూలిఅ మహావడట్ఠాణ సారిచ్ఛం. (1-94)**

వటవృక్షం ఊరి పొలిమేరలో ఉంటే, ఊళ్ళో సత్పురుషుడు ఉన్నట్లే.

అంతా సంతోషంగా, శ్రీరామరక్షగా ఉంటుంది. అదే ఆ సత్పురుషుడు పోతే, ఊరంతా పాడైపోయినట్టే! మర్రిచెట్టు కూలిపోయినా, ఊరిపొలిమేరంతా బిక్కుబిక్కుమన్నట్టు ఉంటుంది. మర్రిచెట్టును సత్పురుషునితో పోల్చటం గాథాకారుని గొప్పదనం కాదూ!

మర్రిచెట్టును దాటి కాస్త ఊరిలోకి వెళ్తే, అక్కడొక కుండల కపిల కనిపించింది గాథాకారునికి! దాహం వేసింది. మంచినీళ్ళు తాగాలనిపించింది. కుండలతో నీళ్ళు చేదుకునే సమయంలో ఒక సంగతి గుర్తొచ్చిందతనికి. కుండలకపిలను చూస్తే దుష్టులు గుర్తొచ్చారట పాపం! ఎలా? ఖాళీగా ఉన్నపుడు తేలికగా, ముఖం వేళ్ళాడేసుకుని ఉండే కపిలలు, బావిలోకి వెళ్ళి నీళ్ళతో నిండి బయటికి వచ్చేటప్పుడు నీల్గుకుంటూ, గొప్పగా, గర్వంగా బయటికి వస్తాయట! దుష్టులూ అంతే! తమ అవసరం వచ్చినప్పుడు వినయంగా వెళ్తారు. పని ముగిసిన తరువాత పెడమొగం పెడతారు. ఆ గాథఇదీ!

**ఉఅఅం లహిఉణ ఉత్తాణిఆఅణా హోంతి కే వి సవిసేసం**

**రిత్తా ణమంతి సుఇరం రహట్ట ఘడిఅ వ్వ కాపురిసా..(5-90)**

నీళ్ళు తాగి, కాస్త సేదదీరి, ఊళ్ళోకి అడుగులు వేశామో లేదో, మళ్ళీ నోరెండుకు పోతోంది. ఏమి ఎండలండీ బాబూ! ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే, ఇదిగో ఇలా!

**థో అం పిణ ణీసరయీ మజ్ఝణ్ణే ఉహ సరీరతలలుక్కా**

**ఆఆవభఏణ చాఈ వి పహిఆ తా కిం ణ పీసమసి (1-49)**

'అబ్బబ్బా! ఈ ఎండ ఎంత తీవ్రంగా ఉందంటే, చెట్టునీడ కూడా భయపడి చెట్టుకిందే దాక్కుంది'. చూశారా! గాథాకారుని అత్యుక్తి అమోఘంగా లేదూ? సాధారణంగా మిట్టమధ్యాహ్నం ఎండ చెట్టు కిందే పడుతుంది. ఆ వాస్తవాన్ని ఈ ముక్తకంలో ఎంత బాగా వ్యక్తీకరించాడో! నీడకు భయాన్ని ఆపాదిస్తూ 'చెట్టుకిందే తలదాచుకుంది పాపం' అనటంలోనే ఉంది ప్రజ్ఞంతా!

అదిగదిగో! అక్కడొక చలివేంద్రం ఉన్నట్టుందండోయ్! బాగానే గుంపు కనిపిస్తున్నది. అమ్మయ్య ... దగ్గరికొచ్చేశాం. అరెరే! బాటసారుల దోసిళ్ళలో చెంబుతో నీళ్ళు పోస్తున్న అందగత్తెను చూస్తుంటే మతి పోతోందే! ఏమి అందం ! ఏమి అందం !

**ఉద్ధచ్చో పిఅయి జలం జహజహ విరలంగలీ చిరం పహిఓ**

**పావాలిఆ వి తహతహ ధారం తణుయిం పి తణుయేయి. (2-61)**

ఆ చిన్నది బహు వయ్యారంగా నీళ్ళు పోస్తుంటే, అదిగో ఆ యువకుడు దోసిలితో పట్టి తాగుతున్నాడు ఆ అందగత్తెను తదేకంగా చూస్తూ! అరెరే! ఎంతకీ దోసిలి నిండదేమిటి? పైగా నీళ్ళన్నీ ఓవైపు కారిపోతున్నాయి కూడా! తలెత్తి ఆ చిన్నదాని అందం తాగుతున్నాడా అన్నట్టుగా ఉంది తప్ప, దాహం తీర్చుకుంటున్నట్టే లేదు. ఆ వయ్యారికూడా తక్కువేమీ తినలేదు లెండి. నీళ్ళధార బాగా తగ్గించి మరీ పోస్తున్నది ఆ యువకుని దోసిలిలో! ఇద్దరికిద్దరే! అందుకే కాబోలు ఇక్కడింతమంది గుమిగూడారు! వీళ్ళ కథ ఇప్పుడప్పుడే ముగిసేట్టులేదులెండి. మరేదో ఒక మార్గం చూసుకోవాలిక!

అదిగదిగో! అక్కడేదో మంచినీటిచెరువు ఉన్నట్టే ఉంది. పక్షులు ఎగురుతున్నాయక్కడ! హమ్మయ్య! చూశారా! వచ్చేశాం.. ఎంత నిశ్శబ్దంగా ఉందిక్కడ! అరెరే! చెరువు ఎంత నిశ్చలంగా ఎవరో ఆకాశాన్ని నీళ్ళల్లో పదిలంగా తల్లక్రిందులుగా పెట్టినట్టే లోపల ప్రతిబింబిస్తూ ఉందే! అదిగో! ఆ... నెమ్మదిగా అడుగులు వేద్దాం.. చూశారా! అంత పెద్ద ఆకాశం మీద పడినా ఒక్క కమలమూ నలగ లేదు. ఒక్క హంసా ఎగిరి పోలేదు..

**కమల అరాణ మలిఆ హంసా ఉడ్డావిఆ ణ అ పిఉచ్ఛా**

**కేణావి గామ తడాయే అంభం ఉత్తాణఅం వ్వూఢం (2-10)**

అదిగదిగో! ఇంకో చిత్రమూ చూడండి..

**ఉఅ ణిచ్చల ణిప్పందా భిసణి పత్తమ్మి రేహయి బలాఆ**

**ణిమ్మలఅ మరగఅ భాఅణ పరిట్ఠిఆ సంఖ సుత్తివ్వ (1-4)**

అదిగో, అదేమిటీ? మేలుజాతి మరకతమణులు తాపించిన పాత్రలో చందనమదీ ఉంచేందుకు పెట్టిన శంఖ నిర్మితమైన భరిణెలా అందంగా కనిపిస్తున్నదేమిటబ్బా? అరెరే! శంఖం కాదండీ.. విచ్చిన తామరల మధ్య నిశ్చలంగా కూర్చుని ఉన్న కొంగ సుమా! ఏమాశ్చర్యం! అంటే ... చాలాసేపటినుంచీ ఇక్కడికెవరూ రానేలేదన్నమాట! భలే బాగుంది కదూ.. ఇది ఇక్కడి ప్రేయసీప్రియులకు చక్కటి సమాగమప్రదేశంలా ఉంది. ఎవరూ రారు అంతగా మరి.. మనమేదో బాటసారులం. నీళ్ళు వెదుక్కుంటూ వచ్చామంతే కానీ ఊళ్ళో వాళ్ళకి ఇక్కడేం పనీ? పదండి.. మనమూ నీళ్ళు తాగి మన దారిన మనం పోవాలి.. "

బాటసారుల అనుభవాలెలా ఉండేవో మచ్చుకు కొన్ని ఇవన్నమాట! అప్పటి గ్రామాల్లో, వరిచేలు బాగా ఉండేవి. (4/30, 7/91) చెరుకుపంట గురించే కాక, చెరుకు తీయటాన్ని కూడా వర్ణించారు గాథాకారులు. ఇంకా జొన్నలూ, రాగీ, పత్తీ, నువ్వులూ, కాకరా, దోస మొదలైన పంటల గురించిన ముక్తకాలూ కనిపిస్తాయి. పత్తిని ఆడా మగా కలిసి ఏరేవారటకూడా! (2/77) మామిడి తోపులు పల్లెల్లో బాగానే ఉండేవట! (1/62, 2/43) మామిడి తోపులలో ప్రేయసీప్రియులు కలుసుకోవటం గురించి వర్ణనలు ఎక్కువగానే ఉన్నాయి. అంతే కాదు. మామిడితోరణాలతో ఇంటిని అలంకరించటమూ ఉండేది.

**సా తుహ కయేణ బాలా అ అణిసం ఘరదార తోరణ అణిసణ్ణా**

**ఓససయీ వందణ మాలి అ వ్వ ది అ హం వి అ వరాయీ (3/62)**

దూతిక ఒక యువకునితో అంటున్నది – 'ఆ అమాయకురాలు

మమిడితోరణంలా నీకోసం పవలూ రేయీ పడిగాపులు కాస్తూ అలాగే వేచి ఉంది. కాస్త కనికరించు.' అంటే, నిరంతరమూ అలా నిలుచునే ఉంటుందన్నమాట ఆగంతకుడి కోసం! మామిడి తోరణం ఎప్పుడూ ఎదురు చూస్తున్నట్టుగానే, ఆ అమ్మాయీ ఎదురు చూస్తూ, వాడిపోతోందని అర్థం. అంటే, హాలుని కాలంలో మమిడి తోరణాలు ఇంటిగుమ్మాలకు కట్టే ఆచారం ఉండేదని స్పష్టంగా తెలుస్తున్నది. ఇంకా ఇలాంటి ఎన్నో ఆచారాల గురించి, గాథల రూపంలోనే హృద్యంగా వర్ణించారు కవులీ గాథల్లో.

ఇంకా నేరేడు (2/80), బిల్వం (9/19), మాలతి (1/92), వకుళ (1/63), కుంద (5/26), కదంబ (1/37), శిరీష (1/55), పారిజాత (5/12) వృక్షాలను ఇళ్ళల్లో పెంచుకునేవారట కూడా! గ్రామాలకు దగ్గరగా ఉన్న అడవుల్లో, వేప (1/30) వట (1/7) మొదలైన వృక్షాలు ఉండేవట! ఇంత చక్కటి వాతావరణంతో అలరారు తున్న పల్లెపట్టుల్లో ఆనాటి ప్రజలు ఎంత నెమ్మదిగా, ఆనందంగా జీవనం సాగించేవారో కదా... అనిపించదూ మనకు? నేడు నగరాలకూ, పల్లెపట్టులకూ, పెద్దగా తేడా ఉండటమే లేదనిపిస్తున్నది. ఎటుచూసినా కాంక్రీటు అడవులే కదా దర్శనమిస్తున్నాయి మనకు. పల్లెటూళ్ళలోనూ వేగ నాగరికత ఛాయలు కనిపిస్తూనే ఉన్నాయి కదా మరి.

గాథాసప్తశతి లోని స్త్రీలు మనలా శిరోజాలంకరణకు మల్లెలు, జాజిపూలూ, కనకాంబరాలు వాడడమే కాక, నేరేడు చివుళ్ళు కూడ వాడేవారట! (2/80) మగవాళ్ళు కూడా కర్ణావతంసాలు పెట్టుకునేవారట! మామిడి పూగుత్తులు (4/31) పాద్రి పూలూ (5/69) కూడా ధరించేవారని కొన్ని గాథల్లో ఉంది.

బాటసారులకు ఇళ్ళబయట పడుకునేందుకు అనుమతించటంతోపాటూ, తలకిందికి గడ్డిమోపుకూడా సరఫరా చేసేవాళ్ళట! (4/79) బాగుంది కదూ! సరే! పడుకునేందుకు ముందు బాటసారులకు కాస్త ఉబుసుపోక కబుర్లుకూడా కావాలి కదా మరి! ఒకతనన్నాడూ, క్రితంసారి తాను ప్రవాసానికి వెళ్ళినప్పుడేమైందంటే, తాను ఊరి చెరువులో స్నానానికి వెళ్ళాడట! తీరా వెళ్ళేసరికి అక్కడ ఆడవాళ్ళు కూడా జలకాలాడుతున్నారు. తానూ నీళ్ళలో దిగాడు. ఇంతలో ఏమైంది?

**పిసుణేంతి కామినీణం,జలలుక్క పిఆవ ఊహణ సుహేల్లిం**
**కణ్ణఇఅ కవోలుత్పుల్ల ణిచ్చలచ్ఛీయిం వఅణాఇం.(6/58)**

ఎవరో తన కాళ్ళు లాగుతున్నారట! చచ్చే భయంవేసింది. కొంపదీసి మొసలి కాదుకదా? భయపడి గట్టిగా అరిచేసరికి, చుట్టుపక్కల వాళ్ళు నీళ్ళలోకి వంగి విడిపిస్తుంటే ఏమైంది? ఎవరో యువకుడు తన ప్రియురాలనుకుని, తనకాళ్ళు పట్టి లాగాడన్న మాట! అందరూ ఒకటే నవ్వులు! అతని మాటలు విని తక్కిన ఇద్దరూ కూడా కిసుక్కున నవ్వారు.

మరిప్పుడు రెండవ బాటసారి తన అనుభవం ఇలా చెప్పాడు. అది చలి కాలం. ఒక ఊరిలోని దేవాలయం దగ్గర మునగదీసుకుని పడుకున్నాడు. చలి పడుకోనీయటమే లేదు. అక్కడా ఇక్కడా గడ్డీ గాదమూ ఏరుకొచ్చి, నెగడు వేసుకున్నాడు. అవి ఒకసారే అంటుకుంటాయా మరి? ఒక పట్టాన రాజుకోవటమే లేదు. ఊదీ ఊదీ, తన బట్టలూ పిడకల కంపు కొడుతున్నాయి. అంతేనా! ఒకటే పొగ! పిడకలూ, గడ్డీ ఎగదోస్తూ కూర్చున్నాడు రాత్రంతా! నెగడును కర్రతో కెలుకుతూ ఉంటే, లోపల ఏదో ఎర్రగా కనిపిస్తుంది. ఆరిపోతే నల్లగా పెద్ద రాసి. ఎలుగుబంటిలాగే ఉందట ఆ రాశి! నెగడును కుళ్ళబొడుస్తుంటే, ఆ ఎలుగుబంటి పొట్ట చీలుస్తున్నట్టే అనిపించిందట తనకు! అలా, రాత్రంతా ఒంటరిగా గడిపానని చెప్పుకొచ్చాడతగాడు! తక్కిన ఇద్దరూ జాలి పడ్డారు అతగానిపై! ఆ గాథ ఇదీ..

**పాలేయి అచ్ఛ భల్లం వ ఉఅహ కుగ్గామ దేవుల ద్దారే**
**హేమంత ఆల పహిఓ విఝ్ఝా అంతం పలాలగ్గిం. (2/9)**

ఇప్పుడిక మూడవ బాటసారి అందుకున్నాడు. క్రితం సారి తానొక ఇంటిముందు ఇలాగే పడుకున్నాడు. రాత్రి బాగా పొద్దు పోయింది. అందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా ఇంట్లోంచి ఒకటే ఏడుపులూ పెడబొబ్బలూ! ఇంటి ఇల్లాలు ప్రసవవేదన పడుతున్నట్టుంది. చాలామంది ఆడవాళ్ళు ఆమెను సముదాయిస్తున్నారు. కాస్త వేడి నీళ్ళు తాగించండి అని ఎవరో అంటే, 'ఏమీ వద్దు అంటూంది ఆమె. 'అసలేమీ వద్దంటే ఎలాగే తల్లీ' అన్నారెవరో! 'అమ్మ నాయనో! ఓరిదేవుడో! ఇంత కష్టపడాలా పిల్లల్ని కనాలంటే? మొగుడూ వద్దూ, మొద్దులూ వద్దు. నాకు పిల్లలొద్దురో దేవుడా!' అని ఆ గృహిణి ఒహటే ఏడుపు! 'దీన్నే అంటారు ప్రసూతి వైరాగ్యమనీ!' అంటూ భళ్ళున నవ్వేస్తున్నారట చుట్టూ చేరిన ఆడాళ్ళు! బయట పడుకున్న తనకీ పట్టరానంత నవ్వు వచ్చిందట! ప్రపంచంలో కాపురాలన్నీ ఇలాగే సాగుతుంటాయి మరి! (2/26)

మన నిత్యజీవితంలో పాదుకునిపోయి ఉన్న కొన్ని నమ్మకాలకు, ఆచారాలకు మూలాలు కొన్ని గాథలలో కనిపించటం మనల్ని ముగ్ధులను గావిస్తుంది. పొలంపనులు మొదలు పెట్టేటప్పుడు మడకపై శుభసంకేతంగా స్వస్తిక గుర్తునుంచటం(2/61), బంగారం 'శ్యామ శబల వ్రతం' చేయటం వల్లే, అందమైన ఆడవారి ఆభూషణంగా మారి, వారి అందమైన శరీరాలను అంటిపెట్టుకునే భాగ్యాన్ని పొందిందనటం (3/11), కోపకారణంగా పగలంతా భర్తతో మాట్లాడకపోయినా, రాత్రిమాత్రం అతని పాదాల వద్దే భార్య

పడుకుందనటం (7/27), ప్రియునికి లేఖ వ్రాస్తూ, ముందుగా 'స్వస్తిశ్రీ' అన్న కుశల సూచక పదాన్ని వ్రాసిందనటం (3/44) – ఇలాంటి వర్ణనలతో, గాథాసప్తశతి – 'ఇది మన జీవితాల దర్పణమే' ననిపిస్తుంది. ఇంక – శకునాలు, పెళ్ళిసంబరాలు, పెళ్ళిపాటలు, సూర్యనమస్కారాలు, సంధ్యావందనాలు, గుప్తనిధులు, సతీసహగమ నాలతో పాటు, ఎలుగుబంట్లు, నెమళ్ళు, జింకలు, సాలెపురుగులు, బఱ్ఱెలు మనలను తమతో నడిపిస్తాయి. ఇంద్రధనుస్సులు మనల్ని మురిపిస్తాయి.

క్రీస్తు శకం 6-7 సంవత్సరాల మధ్యవాడైన హాల చక్రవర్తి సంకలనం చేసిన మహారాష్ట్రీప్రాకృతంలోని ఈ గాథాసప్తశతిలో గోదావరి, నర్మద, రేవా నదుల ప్రసక్తితోపాటు కొందరు తెలుగు కవుల గాథలూ, అత్తా (అత్త), అద్దాయే(అద్దం), తుప్ప(నేయి), రంప (రంపపుపోట్లు), మయిల(మైల), చోజ్జం(చోద్యం) వంటి తెలుగు పదాలు ఉండటంవల్ల తెలుగుభాష ప్రాచీనతకు ప్రామాణికత చేకూరిన తృప్తి దక్కుతుంది.

ఇన్ని విశేషాలున్న గాథాసప్తశతికి, కేవలం శృంగార శతకంగానే ముద్ర వేయటం అంత భావ్యం కాదు సరికదా, ఇప్పుడు, మనల్ని మళ్ళీ పల్లెలవైపు నడిపించే శక్తి కూడా యీ గాథలకు ఉందంటే అది అతిశయోక్తి కాదేమోకూడా!

## ఒక నది స్వగతం

**డా. నారాయణ గరిమెళ్ళ**

నదీమతల్లి అని నన్ను మీరు తలకెత్తుకున్నా
పిల్ల-ఏరు అని మీ చంకనేసుకున్నా
సదా సంతోషంతో ఉప్పొంగిపోతూనే ఉన్నాను

నది ఒడ్డులే నాగరికతలు వెల్లివిరిసేందుకు
నాంది పలికాయని తెలిసి నదినైనందుకు
గర్వంగా అలలెగసుకుంటుంటాను

జల జీవాలకు ఆవాసమైనందుకు
జన జీవనం నా పరీవాహాన్ని ఆసరాగా
బతుకుతున్నందుకుచరితార్థిననుకుంటాను

ఆనకట్టల కడ ఆగి కాల్వల ఎడ చీలి
పరుగు పరుగులుగా ప్రవహించి
పంటపొలాల ఆకలి తీర్చుతున్నందుకు
పండగ చేసుకుంటూ ఉంటాను

మీ దాహాలకు స్నానాలకు
పడవలయే మీ ప్రయాణాలకు
మీ ఆకళ్లు తీర్చేచేపల వలలకు
మిమ్మల్ని వెలిగించి నడిపించే విద్యుచ్ఛక్తి కీ
విభిన్న రూపాలలో అనేకాలుగా
అజరామరమౌతున్నందుకు నిత్యం
నాట్యాలు చేస్తూ పులకించిపోతుంటాను

అంత సంబరాన్నీ ఒక మధుర గతముగా
మాత్రమే మార్చేసి,మీ వ్యర్థాలకు
మీ ప్లాస్టిక్ వ్యర్థాలకు,మీ కర్మాగారాల వ్యర్థాలకు
చెత్త తొట్టిగా నన్ను మార్చినప్పటి నుండీ
మనుషులంటే పరమ అసహ్యంగా ఉంది

అంతలంతలౌతున్న నాలోని మనిషి విషం
నా నది సహజాన్ని చెరిపేసి
మీ కాలుష్య కాసార ముద్ర వేస్తోంది

ఆఖరికి దాచుకున్న నా ఇసుకనీ
దోచేస్తున్నందుకు తొలిచేస్తున్నందుకు
తరలించేస్తున్నందుకుప్రతిఘటన తొనే
నీటి దారి నుండి   శాప దారికి సాగుతున్నా

# ఏ దేశమేగినా ...

పంతుల నారాయణ రావు

తిరుమలరావుకి తెలుగు భాషాభిమానం మెండు. ఆయన పిల్లలు ఆంగ్లము నేర్చుకున్నట్టే తెలుగును కూడా నేర్చుకున్నారు. బడిగంటలు అయిన తరువాత మరో తెలుగతను వారికి రోజూ తెలుగు నేర్పేవారు. ఇంట్లో మాట్లాడుకోవడం తెలుగులో చేసేవారు కానీ తెలుగువ్రాత మటుకు మూలపడింది. అతను, అతని భార్యామణి అయిన చారులత వారి పట్టు వదలలేదు. తెలుగులిపిలో వ్రాసుకొనేలా 'లిపికార్' అనే సాధనాన్ని సహాయంగా పెట్టుకొని వ్రాయడం నేర్చుకున్నారు పిల్లలు. ఎక్కడున్నా దానితో ఆంగ్లకీలక ఫలకములోని ఆంగ్లాక్షరములతో తెలుగులిపి వచ్చేలా వాడి, వ్రాత మూలంగా సంభాషించుకునేవారు. పెద్దకొడుకు రాజు ఓ రోజు నాన్నగారితో నసుగుతూ అన్నాడు, "నాన్నగారూ, తెలుగుభాషలో మనలో మనం మాట్లాడడమూ, వ్రాతలూ చేస్తున్నాము కదా, ఇది అంతకంతకూ కష్టం అవుతోంది..." అని.

"ఎందుకని?" అని తిరుమలరావు కొంచెం కోపంగా అన్నారు. మన భాషని వాడడానికి వ్యతిరేకంగా ఎవరేమన్నా అతనికి కోపమే!

"మనం రోజూ వాడే కొన్ని ఆంగ్లపదాలకి తెలుగులో ఏమని అనాలో తెలియడం లేదు నాన్నగారూ! మీరే చెప్పండి, 'కంప్యూటర్', 'కీ బోర్డ్', 'ఇంటర్నెట్', 'రోబో', 'క్లోన్', 'సునామీ', ... ఇలా చెప్పుకుపోతూ ఉంటే చాలా పదాలున్నాయి మరి. ఏం చేయాలో చెప్పండి?"

"ఆంగ్లభాష నుంచయినా మరే భాష నుంచయినా ఆయా పదాలను తెలుగులోకి లేదా తెలుగుపదాలను ఆయా భాషల్లోకి అనువాదం చేసే సాధనాలున్నాయి..."

"ఎక్కడ?. . ." అని ఎదురు ప్రశ్న వేశాడు రాజు.

"రోజూ వాడతావు కదా? అంతర్జాలకం, దానితో వెతకి చూడు మరి"

"అంతర్జాలకమా? నేను రోజూ వాడతానా? అదేమిటి?" ఆశ్చర్యపోయి రాజు అడిగేడు.

వచ్చే నవ్వునాపుకుంటూ, "మన తెలుగుపదాలని మనమే వాడకపోతే అలానే ఉంటుంది మరి. క్రొత్తగా, ఇంకొంతమందికి వెక్కసంగా ..." తిరుమలరావు రాజుని వెక్కిరించాడు. ఆ తరువాత వారింటిలో ఈ సమస్య కొంతమట్టుకి తీరింది. కానీ, చిన్నవాడైన మోహన్ తిరుమలరావుతో ఓనాడిలా అన్నాడు, "నాన్నగారూ, మీరు చెప్పినట్టే తెలియని పదాల కోసం నిఘంటువులో చూస్తున్నాము. కానీ అక్కడ కూడా అప్పుడప్పుడు చుక్కెదురే అవుతున్నదండీ! శబ్దకోశములో లేదనో, లేదా అదే ఆంగ్లపదాలను తెలుగులో వ్రాసేయడమో జరుగుతోంది. అలా అయితే ఎలాగండీ?" అని ప్రశ్నించేడు.

"ఇలా జరగడం సాధారణమే. ఆంగ్ల పదాలని కొన్నింటిని మన భాష లోనికి దిగుబడి చేసుకొని అంతర్లీనం చేసుకున్నామన్న మాట..."

తిరుమలరావుకి ఈ సంభాషణ అక్కడితో తెగేది కాదని తెలుసును. నాగరికతతో బాటు ఉద్భవించిన ఆంగ్ల పదాలకి తెలుగులో ప్రత్యామ్నాయం లేక అవే పదాలని వాడేస్తున్నాము ... నిజానికి అవన్నీ దిగుబడి చేసుకున్నట్టా? జపానువారు వారి భాషలో క్రొత్త పదాలని సృష్టించడానికి చాలా ఖర్చు పెడతారట మన భాషకో. మనం ప్రత్యేకంగా వనరులు వెచ్చించగలిగిన పరిస్థితిలో లేమే మరి!

★★★

ఆ రోజు ముందు గదిలో అందరూ కూర్చున్నారు. "ఏ సినిమా కావాలి?" అని చారులత అడిగింది.

"నాకు క్రొత్త సినీమాలేవీ వద్దు. అందరం సరదాగా మాయాబజారు సినిమా చూద్దామా?" అని ఉబలాటంగా తిరుమలరావు అన్నారు. "మీరు మరీనూ! అంత పాత సినిమా మనవాళ్ళకి నచ్చుతుందంటారా?"

"చిన్నవాళ్ళు, వాళ్ళకి నచ్చకపోవడ మేమిటి? అదీకాక తెలుగు బాగా వచ్చు కదా? సినిమాలోని పాటలు, సంభాషణలు వాళ్ళని అదరగొడతాయి"

తిరుమలరావు అంచనా తప్పు కాలేదు. ఒకమారు చూసిన వాళ్ళు మళ్ళీ చూస్తామన్నారు. మర్నాడు ఆదివారమవడంతో అందరికీ ఖాళీయే! సంతోషంగా మళ్ళీ వేసింది చారులత. ఘటోత్కచుడు, అతని చిన్న పరివారాన్ని పర్యవేక్షిస్తున్న సందర్భమది.....

"త స మ దీ యు లు....." అని పరివారములోని వాడొకడు అంటున్నాడు. "త స మ దీ యు లు" విచిత్రంగా నవ్వుతూ, "పదాలు మనం పుట్టించకపోతే ఎలా వస్తాయి..." అని తన నటనా చాతుర్యంతో అదరగొడుతూ నటిస్తున్న ఎస్వీయార్గారు, ఘటోత్కచుని పాత్రలో అన్నారు. చిన్నవాడు అన్నాడు, " అమ్మా, నాన్నా, మరి మనకి ఇప్పుడు లేని పదాలని పుట్టించవచ్చునుగా.

చిన్నవాడు అన్నాడు, " అమ్మా, నాన్నా, మరి మనకి ఇప్పుడు లేని పదాలని పుట్టించవచ్చునుగా, ఆంగ్లపదాలు వాడకుండా ఉండేలా?" అని అదేదో చిన్నపనిలా అమాయకంగా అడిగేడు.

"నిజమే, కాని అది అంత చిన్న పనేమీ కాదమ్మా! ప్రభుత్వము వారు చేపట్ట వలసినది అది...."

★★★

రోజూ ఉదయమే లేచి ఓ రెండు మైళ్ళు నడవడం అలవాటు, తిరుమలరావుకి. కాని ఓ వారంరోజుల క్రితమేమయిందంటే, ముందుకి అడుగు వేస్తున్న ఆయన గబిక్కున బోరుగిలా పడిపోయారు. అసలు పడుతున్నాననైనా ఆయనకి తెలియలేదు. అసంకల్పిత ప్రతీకారచర్యలా అతని చేతులు వెళ్ళి ముందున్న గచ్చుపలకని తాకాయి. కాలి మోచిప్పకీ, చేతి దగ్గరా అక్కడా చెక్కుకు పోయింది. ఎలా పడ్డానా అని వంగి చూశారు. ఒక గచ్చు పలక సమతలంలో లేకుండా మీదకి లేచి ఉంది. 'దాని అంచుని తన్నుకుని పడ్డాను' అని అప్పుడు గ్రహించారాయన. తరువాత వారం పదిరోజులు నడుస్తున్నప్పుడు ఆయన కొంచెం జాగ్రత్తగానే చూసుకుంటూ అడుగు తీసి అడుగు వేస్తున్నారు. తెలిసినదేమిటంటే, ఎన్నోచోట్లలో ఈ రకపు ఎగుడుదిగుళ్ళు ఉన్నాయని. కాని నడిచేవారికి వాటి వలన ఇబ్బంది కలగకుండా ఉండడానికి, పలకల రెండువైపుల అంచులనూ నున్నగా కలిపి గచ్చు అన్నిచోట్లా చేశారు. 'ఆహా! ఎంత శ్రద్ధ మన ఊరి పురపాలక సంఘం వారికి' అని అనుకుని ముందుకు నడుస్తున్నారాయన. కొంచెందూరం పోయే సరికి, ఆయన కొన్నాళ్ళ క్రిందట పడిపోయిన చోటు వచ్చింది. చూస్తే, ఆ గచ్చుపలకలు చక్కగా అంచుల దగ్గర సిమెంటుతో పూడ్చి బాగుచేసి ఉన్నాయి. మెచ్చుకోలుగా తల పంకించి ముందుకి కదిలేరు.

ఇంకొంచెం ముందుకు వెళ్ళిన తిరుమలరావుకి ఒకటి, రెండు గచ్చుపలకల మీద బొమ్మలు చెక్కినట్లు కనబడ్డాయి. అవి చిన్నపిల్లలకి బాగుండే బొమ్మలు. వాటికి రంగులు కూడా వేశారు. ఎంతోమంది ఏళ్ళ తరబడి నడుస్తున్నా, ఆ బొమ్మలు చెక్కుచెదర కుండా ఆ గచ్చుపలకల మీద నిలచి ఉన్నాయి. 'పిల్లల వేసుకొనే బొమ్మలు కనుక, ఏదో సాధనం సులభంగానే వాడి, ప్రక్కనే ఉన్న ఇంటివారు, గచ్చు మీద ఇలా చేసి ఉంటారు' అని అనుకుని ముందుకి నడవబోయిన తిరుమలరావుకి బుర్రలో ఓ ఆలోచన మెదిలింది. 'తనక్కూడా వాళ్ళు వాడిన సాధనం తప్పకుండా కావాలి, ఎలా?' అని అనుకుంటున్న అతనికి పొందికగా, అందంగా అమర్చినట్టున్న ప్రక్క ఇంటి ఆవరణలో మొక్కల దగ్గర కలుపు తీస్తూ గడ్డిలో చతికిల పడి కూర్చుని ఉన్న తెల్ల అమ్మాయి కనబడింది. చొరవ చేసుకుని, ఆ అమ్మాయికి 'శుభోదయం' అని ఆంగ్లములో చెప్పారు. ఆమె కూడా ముక్తసరిగా కానట్టుగా, ప్రకాశంగా నవ్వుతూ నే 'శుభోదయం' అని ఆంగ్లములో జవాబు చెప్పింది. 'ఫర్వాలేదు, ఇంకొంచెం మాట్లాడవచ్చు' అని అనుకొని, "మిస్! ఈ బొమ్మలు ఎలా వేశారు? మీ ఇంట్లో వారు వేసినవేనా, ఇవి?" అని అడిగారు. ఆమె సరదాగా చెప్పింది, "నా పాపతో ఆడుతూ ఉన్నపుడు నేను చేశాను. 'కాస్కో'లో ఈ చిన్నసామగ్రి మూటని కొన్నాను. మరీ ఎక్కువ ఖరీదు కూడా కాదు. దీనిని 'ఛాకిట్ ఔట్' అంటారు....." అని ఉత్సాహంగా చెప్పిందామె. ఆమెకి ధన్యవాదములు చెప్పి తిరుమల రావు ముందుకి సాగారు.

ఇంటికి చేరిన తరువాత ఆయన పెద్ద కొడుకుతో 'కాలి బాట మీద నున్న గతుకులను నగర పాలక సంస్థ వారు ఎంత బాగా బాగుచేశారో!' అని మెచ్చుకున్నారు. వాడు నవ్వి అన్నాడు, "ఇది పెట్టుబడిదారీవ్యవస్థ అని మరచిపోతున్నారు, నాన్నగారూ!" అని తన కొచ్చిన రీతిలో 'చిన చేపను పెద చేప, పెద చేపను పెను చేప... ఇది స్వాహా! అది స్వాహా.. ఇది స్వాహా!.....అది స్వాహా' అని నవ్వుతూ పాడుతూ, "వాళ్లు వెంటనే ఎందుకు బాగుచేశారంటే, అలా చేయకపోతే ఆ ఎగుడు దిగుళ్ళను తన్నుకు పడిన వారు వేసే నష్ట పరిహారపు దావాలలో పెద్ద ఎత్తున జరిమానాలు చెల్లించు కోవలసి ఉంటుందని. సంస్థలు అన్నీ ఇలాంటి పరిధులలోనే పని చేస్తాయి. డేగల్లా ఎవరి అవకాశం కోసం వారు కాచుకొని ఉంటారు. ఎవరు తప్పు చేస్తే వారిని పొడుచు తినడానికి సిద్ధంగా చాలామంది పొంచుకొని ఉంటారు." ఇలా చెప్పుకుపోతున్న వాడిని చూసి తిరుమలరావు అచ్చెరబోయారు. నిజమేనేమోనన్న భావన కూడా కలిగింది.

★★★

ఆ రోజు రాత్రి వారంతా దూరదర్శిని ముందు సమావేశమయ్యారు. క్రొత్తగా విడుదల అవుతు సినిమాల పరిచయం. ఈ కార్యక్రమంలో ఆయా చిత్రాల నిర్మాతలు, దర్శకులు, నటీనటులు వగైరా అందరూ చిత్రం గురించి వారి అభిప్రాయాలని వెల్లడి చేస్తున్నారు.

మొదట ఆ సినిమా నిర్మాత మాట్లాడారు. "ఈ సినీమా తీయడానికి హెల్ప్ చేసిన హోల్ ఇండస్ట్రీకి నా థేంక్సు. నా ఫ్రండ్ హరీష్ గారికైతే మెనీ మెనీ థేంక్సు. ఎంతగానో హెల్ప్ చేశారు. ఈ సినిమాలో ఫ్రెష్-గా ఒక న్యూ హీరోని ఇంట్రడ్యూస్ చేస్తున్నాం, డిన్.ర్ గారిని. వీరి మీద ఓ ఫీలింగ్ నాకుంది. మన యూత్-కి సరిగ్గా ఫిట్ అవుతాడని. మరి మీ ఫీలింగేమిటో మా సినిమా రిలీజ్

తరువాత చూసి చెప్పండి....." ఇలా సాగుతున్నది అతని సంభాషణ....వింటున్న అందరూ కడుపుబ్బా నవ్వుకున్నారు.

నవ్వుతూనే పెద్దవాడన్నాడు. "నాన్నగారూ! ఇదేమి వైపరీత్యం? ఆంధ్రప్రదేశ్ లో ఉన్నవారే మనకన్నా అధ్వాన్నంగా తెలుగుమాట్లాడుతున్నారేమిటి? ఆయన మాట్లాడే మాటలలో సగం పైగా ఆంగ్ల పదాలు దొర్లుతున్నాయే! ఆయన వాడే ఆంగ్ల పదాలేమీ ప్రత్యేకమైనవీ కావు. చక్కగా తేట తెలుగులో మాట్లాడవచ్చునుగా?"
"అవును, నిజమే బాబూ! నువ్వే కనక అవే మాటలు మాట్లాడవలసి వస్తే ఎలా మాట్లాడుతావు?" కుతూహలంగా అడిగింది అమ్మ.
"చెప్పమంటారా?" అని ఏకసంథాగ్రాహి అయిన వాడు తడుము కోకుండా ఇలా చెప్పాడు:

"ఈ సినీమా తీయడానికి సహాయం చేసిన పరిశ్రమల వారందరికీ నా ధన్యవాదాలు. నా స్నేహితులు హరీష్ గారికైతే చాలా చాలా ధన్యవాదాలు. ఆయన నాకు ఎంతగానో సహాయం చేశారు. ఈ సినిమాలో తాజాగా ఒక క్రొత్త ముఖ్య నటుడిని పరిచయం చేస్తున్నాం డిన్.ర్ గారిని. వీరి మీద ఓ భావన నాకుంది. మన యువతరానికి బాగా నచ్చుతాడని. మరి మీరేమనుకుంటున్నారో మా సినిమా విడుదలయిన తరువాత చూసి చెప్పండి....."

అందరూ మెచ్చుకోలుగా చప్పట్లు కొట్టారు. మరింత ఉత్సాహంతో పెద్దవాడు అన్నాడు, "నాన్నగారూ! మీకొకాయన ఇవాళ దూరవాణి (టెలిఫోను)లో సందేశము ఉంచారు. విన్నారా?" "అదేదో నవ్వించేదే అయివుంటుంది! నువ్వే చెప్పు" అని తిరుమల రావు అన్నారు.

"సారీరా, బిసీగా ఉండి నిన్ను 'కాల్' చేయలేక పోయాను. నువ్విప్పుడింట్లో ఉన్నట్టులేదు. మళ్ళీ మారు చేస్తాను" అని పక పక నవ్వుతూ పెదవాడు చెప్పాడు. అందులో అంత నవ్వతగ్గ విషయమేమిటో తెలియక వాళ్ళంతా తెల్లమొహాలేశారు. పెదబాబు చిన్నబోయి, "తిరిగి గబగబా చెబుతాను, ఈ మారు జాగ్రతగా వినండి. . . 'సారీరా! బిసీగా ఉండి నిన్ను కాల్చేయ లేకపోయాను ...."తిరుమలరావు నవ్వుతూ, "వాడెవుడు నన్ను కాల్చడానికి . . ." అని అన్నారు. అందరూ హాయిగా నవ్వేరు.

"చూశారుగా, మన భాషకున్న అందం! ఆంగ్లము, తెలుగు కలుపకుండా అన్నీ తెలుగుపదాలనే వీలయినంత వరకు వాడితే అదే సంభాషణ ఎంత వీనులవిందుగా ఉందో మరి? నీకు తెలుగు బాగా వచ్చిందిరా! కల్తీ లేకుండా అలానే మాట్లాడటానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉండు!" అని ప్రోత్సాహపూరితంగా అన్నారు.

"నా తెలుగు కూడా చాలా బాగుంటుంది. వినండి.... ఇప్పుడు మాట్లాడుతున్న వారి మాటలు. అవి బాగులేకపోతే వాటిని నేను సరి చేస్తాను." అని చిన్నవాడు అన్నాడు, తనేమీ తక్కువ కాదన్నట్లు. అందరూ శ్రద్ధగా దూరదర్శని వేపే చూస్తూ వింటున్నారు.

ఒక నటుని సంభాషణ వస్తోంది ..... "ఈ సినీమాలోని నా రోలు నా ఎన్టైర్ కెరీర్ లోనే హ్యూజ్ హిట్. దీని వలన నా ఇమేజి సెన్సేషనల్-గా అయి నా ఫేన్సు నన్ను స్కై మీదకి ఫ్లై అయేలా చేస్తారని బిలీవ్ చేస్తున్నాను..." ఇలా సాగుతున్నది అతని వాక్ధాటి!
"దీన్ని సరిగ్గా తెలుగులో మాట్లాడితే ఇలా ఉంటుంది" అని గర్వంగా మొదలుపెట్టాడు చిన్నవాడు. వాడికీ జ్ఞాపకశక్తి బాగా ఉంది. దీటుగా చక్కగా ఇలా అన్నాడు: "ఈ సినీమాలోని నా పాత్ర ఇప్పటిదాకా నా యావత్తు వృత్తిలోనే బ్రహ్మాండమైన సఫలత. దీనివలన నా గురించి సంచలనాత్మకంగా అనుకుంటున్న నా అభిమానులందరూ నన్ను ఇంకా ఆకాశం మీదకి ఎత్తేస్తారని అనుకుంటున్నాను..."

"చాలా బాగా చెప్పావు. అదీ స్పష్టంగా అనువాదం చేసి! అసలు మనం భాషని ఎందుకు గౌరవించాలో చెబుతాను, వినండి. మన మనస్సుకి ప్రతిధ్వని మాట. ఆ వాక్కు అనేది దేవుడు మనుష్యులకు మాత్రమే ఇచ్చిన ఓ పెద్ద శక్తి. అసలు శబ్దం ఓంకారము నుంచి పుట్టినది కనుక భగవంతునితో సమానం. అందుకే కాళిదాసు "వాగర్థావివ సంపృక్తౌ వాగర్థః ప్రతిపత్తయే। జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ॥" అన్నాడు. అంటే, శబ్దాన్ని అనుసరించి అర్థం, అర్థాన్ని అనుసరించి శబ్దం ఉంటాయి. అంటే మనం మాట్లాడే మాటలో, మాట్లాడేదాని బట్టి దేముడు కాని దెయ్యం కాని తాండవం చేస్తుందంటే ఆశ్చర్యం లేదు. ఇక మన తెలుగుభాష గురించి కొంత మాట్లాడుకుందాం .ప్రథమ నారి అయిన పరాశక్తి పూజకి తెలుగులిపి వాడారు. మన భాష శివోహం. సంస్కృత పండితులైన అయ్యప దీక్షితులు కూడా మన భాషని పొగుడుతూ అన్నారు: "ఆంధ్రత్వ మాంధ్ర భాషా చ నాల్పస్య తపసః ఫలమ్" అంటే ఎంతో తపస్సు, పుణ్యం చేసుకుంటేనే ఈ భాషని మాట్లాడగలిగిన అదృష్టం కలగదని. భాషను నిర్మలంగా ఉంచుకోవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది. మనభాష మనకి సంపద. ఈ సంపదని తప్పనిసరిగా కాపాడుకోవాలి. ముఖ్యంగా బహుళంగా మాట్లాడే సినీమా కార్యకర్తలు, నటీనటులు మొదలైనవారి వాక్కు అందరూ వినేది. అంతెందుకు దేశాంతరములలో ఎక్కడో ఉన్న మనం కూడా వింటున్నాం కదా? భాష ఒక దైవశక్తి కనుక దీనిని కాపాడవలసిన ధర్మమూ, విధీ ప్రతిమనిషికీ ఉన్నాయి. ఇవి నేనంటున్న మాటలే కావు ప్రముఖ రచయిత, సినిమా రంగానికి మంచిమాటలు, పత్రికాపాఠకులకి మన సంస్కృతి గురించి తన రచనలద్వారా బాగా తెలియజేసిన శ్రీ వక్కంత సూర్య

నారాయణరావుగారు. 'మన అక్షరమాలని మంత్రమనుకుంటే, అక్షరాలన్నీ బీజాక్షరాలే! మాట సజీవంగా ఉండాలంటే పలుకు పటిష్టంగా ఉండాలి. పలికే విధానం మాటకి ప్రాణం పోయాలి ...' అన్నారు. మరి ఇలా వ్రాసిన ఆ మహనీయుని తోటి సినిమా వారు గుర్తించి ఆయన చెప్పినది ఒక్కింత వినాలి...." భావావేశంతో చెప్పుకు పోతున్న తిరుమలరావు మాటల్ని కుటుంబ సభ్యులంతా శ్రద్ధగా విన్నారు. "మరి దీనికి మనం ఏం చేయగలం? చూస్తూ ఊరుకోడమేనా?" అని అందరూ అన్నారు.

"ప్రస్తుతానికి అంతే! నేను చెప్పినది గుర్తుంచుకొని ముందు ముందు మీకు పెళ్ళిళ్ళయి, మీ పెళ్ళాలెవరైనా సరే, మన భాషని స్వచ్ఛంగా ఇంట్లో వాడతామని నాకు మాట నివ్వండి. అదే పది వేలు"

నాన్నగారికున్న ఉద్వేగమే వారిలోకూడా కలిగి ఇద్దరూ ఉక్కుమ్మడిగా మాటిచ్చారు, "అలాగే!" అని.

# ప్రాణ ప్రతిష్ఠ

**విన్నకోట రవిశంకర్**

మనిషికెవరు ప్రాణం పోశారో తెలియదుగాని,
మనుషులు చేసిన ఈ బొమ్మలో
మనుషులే దేవుడికి ప్రాణం పోస్తున్నారు.

మాటవినే లోహంతో
మలచిన ఈ మౌనమూర్తికి
జగన్నాటకాన్ని నడిపించే
దర్శకత్వం ఇస్తున్నారు.

చెదిరిన ధ్యానం నుంచి
కనులు తెరిచిన ఈ ప్రతిమకు
కటాక్ష వీక్షణాలు నేర్పిస్తున్నారు
ఆచంద్రార్కామూ అలాగే ఉండమని ప్రార్థిస్తున్నారు.

తొలి చూపుకు తామే అర్హులమని
చెమ్కీ ముసుగుల చాటున చిన్నారి కన్నెపిల్లలు
ముసిముసిగా నవ్వుతున్నారు.
మొదటిరోజు బడిలో చేరే కుర్రవాడిని
బుజ్జగించి ముస్తాబు చేసినట్టు
మొదటిసారి గుడిలో అడుగుపెట్టిన దేవుడికి
సకలోపచారాలూ చేస్తున్నారు
పవిత్రజలాలతో, మంత్రించిన సంస్కృత పదాలతో
సకల శక్తుల్ని ఆవాహన చేస్తున్నారు
తమ జీవితాల్ని ఆపాత మధురం చెయ్యమని
మధురసాలతో అభిషేకిస్తున్నారు.

తెర తొలగింది .
తొలి దర్శనంతో అందర్నీ పునీతుల్ని చెయ్యటానికి
కొలువు తీరాడు దేవుడు.
మొదటిసారి విధి నిర్వహణ చెయ్యబోతున్న
శస్త్రకారుని చేతి కత్తిలాగా
ఆయన చేతిలో వేణువు
కనపడకుండా కంపిస్తోంది.



# జ్ఞాపకాలు

భారతి భావరాజు

ఈ వ్యాసానికి 'సినిమాలు' లేక 'చలనచిత్రాలు' అనే శీర్షిక పెట్టాలనుకున్నాను. కానీ సినిమా అనగానే చలన చిత్ర పరిశ్రమ, చరిత్ర, సినిమా తయారీ, నటులు ఇలా చాలానే పరిశోధించి రాస్తే కానీ ఆ శీర్షికకి న్యాయం చెయ్యలేను. అందుకే 'జ్ఞాపకాలు' అనడంలో నా ఉద్దేశ్యం 'సినిమాలు ... నా అనుభవాలు" అన్నమాట.



సినిమాకి వెళ్లి (అంటే సినిమా హాల్ లో సినిమా చూసి అని అర్ధం) చాలా సంవత్సరాలయి పోయిందని అనేవాళ్ళు చాలామందే వున్నారు. కొన్నేళ్ళగా సినిమాలు ఇంట్లోనే తెలుగు టి.వి. లోనో, కంప్యూటర్ లోనో చూస్తూ ఉంటాం అనే ఈనాటి వాళ్ళకి కూడా మన చిన్నప్పటి అనుభవాలో, లేక మన పెద్దవాళ్ళు చెప్పిన కథలో వింటే, చలనచిత్రాల వంద సంవత్సరాల చరిత్రలో (నాకు వందేళ్ళ వయస్సని కాదుసుమా!) సినిమా కెళ్ళడం, ఆ అనుభవం మంచి జ్ఞాపకాలు. మా నాన్నగారు తన చిన్నతనంలో చూసిన టూరింగ్ టాకీసు సినిమాలు, డేరా సినిమాలు, నేల టిక్కట్లూ, బెంచి టిక్కట్లూ గురించి చెప్పేవారు. నేను పెరిగింది బొంబాయి మహానగరంలో. హిందీ, ఇంగ్లీష్ సినిమాలు మాత్రమే చూసేవాళ్ళం. నా చిన్నప్పుడు ఆంధ్రా నించి, సంవత్సరం క్రితం విడుదలయి, పేరందుకుని, వంద రోజులు పైగా ఆడిన సినిమాలు, బొంబేలో హాలు నిండే జనం వస్తారని నమ్మకం వున్న పాత సినిమాలు మాత్రమే నెలకొక ఆదివారం ప్రొద్దున్న 8 గంటలకి ఒక్కటే ఆట వేసేవారు. 11:30 కల్లా మళ్ళా యధాప్రకారం, హిందీ సినిమా మొదలయ్యేది. అప్పట్లో ఎవరన్నా "సినిమాకి వస్తున్నారా" అంటే, "సూర్య టాకీస్" కే అని వేరే చెప్పక్కరలేదు. ఎందుకంటే అక్కడ మాత్రమే చూపించేవారు తెలుగు సినిమా. 15రోజులు ముందుగా, ఇంట్లో ఫామిలీ మీటింగ్ పెట్టుకుని, ఎవరెవరు ఆ సినిమాకి వెళ్ళాలో నిశ్చయించి, మాలో ఒకరు, రెండు వారాల ముందుగానే "సూర్య టాకీస్" కెళ్ళి అడ్వాన్సు టిక్కెట్లు కొన్నాకే 'ఫలానా ఆదివారం, ఫలానా సినిమా' చూడబోతున్నాం అన్న ప్రోగ్రాం. అమ్మ ఆ ఆదివారం, ప్రొద్దుటే 5 గంటలకి నిద్రలేచి, తెలుగు సినిమాకి వెళ్లేముందు మేమంతా తినే బ్రేక్-ఫాస్ట్ , సినిమా చూసి కష్టపడిన మాకందరికీ ఇంటికొచ్చేసరికి భోజనం తయారుచేసి బయలుదేరేది. అంత కష్టపడి 15 రోజుల ప్రయత్నం తరువాత, 'అసలు' సినిమా చూపే ముందు వచ్చే అరగంట వార్తలు, ట్రైలర్స్ మిస్ అవ్వడం అమ్మకి ఇష్టం లేకనుకుంటా, మమ్మల్ని పండుగ రోజులాగే, ప్రొద్దున్నే నిద్రలేపేసి, తయారయ్యాక, అందరికి టిఫిన్లు అందించి, తనూ బయలుదేరేది. నిజం చెప్పొద్దూ, అంత హడావుడి అమ్మదే! ఇక్కడ మరొక విషయం చెప్పాలి మీకు. ఎప్పుడో చూసిన బంధుమిత్రులెందరో కలిసేవారు "సూర్య టాకీస్" లో. ఇంక అమ్మ ఆనందం చెప్పక్కర లేదు. తను ప్రొద్దుటే లేచి పడిన కష్టమంతా మరచిపోయి, సంతోషంతో సినిమా మొదలయ్యేదాక, చిన్న గుంపుగా మిగతా అమ్మలక్కలతో కబుర్లలోకి దిగేది.

నాకు తరవాత తెలిసిన అసలు విషయమేమంటే, ఈ బొంబాయి 'అమ్మలు' ముఖ్యంగా అదే తెలుగు సినిమాకి వచ్చిన బ్రహ్మచారులు అంటే పెళ్ళికి రెడీగావున్న అబ్బాయిల గురించి మాట్లాడుకునేవారట! మరి ఈ బ్రహ్మచారులు తెలుగు సినిమా చూడడానికి వచ్చేవారో, తెలుగు అమ్మాయిలని చూడడానికి వచ్చేవారో! అసలు సంగతి ఇప్పుడు చెప్పెయ్యవచ్చు మీకు. మాఅమ్మ మాఆయన్ని మొదటిసారి చూసింది, కృష్ణకుమారి, జగ్గయ్య నటించిన "ఉయ్యాలజంపాల" సినిమాకి వెళ్ళినప్పుడుట! ఆ తరువాత ఎల్లా పెళ్లి కుదిరింది అనే వివరాలు ఇప్పుడు అప్రస్తుతం .

నాకు గుర్తున్నంత వరకు నాన్నగారు మాత్రం తన సీటులో సెటిలయిపోయి, సినిమా ఎప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూసేవారు. నా చిన్నతనంలో సినిమా మొదలయిన తరువాత నాన్నగారి ప్రక్కనే కూర్చున్న నేను కథ అర్ధంకాక, మాటిమాటికీ నాన్నగారిని ప్రశ్నలతో వేధించడం ఎలా మరచిపోగలను!

సినిమా మధ్యలో "విశ్రాంతి" అని పావుగంట సేపు సినిమా ఆపడం, లైట్లు వెలగడంతో, సోడాలు, సమోసాల లాంటి చిరు తిండ్లు అమ్మకానికి రావడం, అమ్మని నేను కొనమని వేధించడం, ఆ తరువాత అమ్మ సంచిలోంచి, తను చేసిన జంతికలు, చేగోడిలు బయటకు తియ్యడం, నేను అమ్మ కొననివ్వకపోవడంతో మొహం ముడుచుకొని కూర్చోవడం గుర్తుకొస్తున్నాయి. జీవితం అంటే , సుఖాలే కాదు, కొన్ని నిరాశలు కూడా ఉంటాయని నా చిన్న

తనంలో తెలుసుకున్నాను. ఎన్.టి.ఆర్., అంజలీదేవి సినిమా "లవకుశ", నా అభిమాన నటులంతా నటించిన "గుండమ్మకథ" సినిమాలకి, అడ్వాన్సు టిక్కెట్లు కొనాలని ఉత్సాహంగా వెళ్ళిన నాకు, "హౌస్ ఫుల్" బోర్డ్ చూసి బోలెడు నిరాశపడిన రోజులు కూడా వున్నాయి. అనుకోకుండా బోనస్ గా "గుండమ్మ కథ" మరోవారం, మరో ఆట వేస్తారని తెలిసి, ముందుగానే వెళ్లి "అడ్వాన్స్" టిక్కట్లు తెచ్చుకున్న రోజు, అసలు ఈ జన్మలో "గుండమ్మకథ" చూడలేనేమో అనుకున్న నాకు విజయం సాధించినంత ఆ ఆనందం ఒక మధుర స్మృతి.




సినిమా పూర్తయ్యాక హాల్ బయటకి రాగానే కనపడేది, అప్పుడే చూసివచ్చిన సినిమా పాటల పుస్తకాలు అమ్మే అబ్బాయి. అమ్మ ఇంటికెళ్ళే హడావుడిలో ఉండగా, రెండణాల పాటల పుస్తకం కొనమని గొడవ చెయ్యడం నా చిన్ననాటి జ్ఞాపకాలలో భాగమే. మరో సినిమా, మరో పాటల పుస్తకం వచ్చేంతవరకు అవే పాటలు నోటిలో ఆడుతుండేవి. పాటల పుస్తకాలు కొన్ని చేరాక, వాటిని ఒక పుస్తకంగా బైండ్ చేయించి పదిలంగా ఉంచుకునేదాన్ని. వీలున్న ప్పుడల్లా నాకు నచ్చిన పాటల్ని పుస్తకం చూసుకుంటూ నాలో నేను పాడుకుని మురిసిపోయేదాన్ని. పాటల పుస్తకాలే కాదు, చూసిన సినిమాల టిక్కట్లు కూడా గుర్తుగా దాచుకునేదాన్ని. ఈనాడు ఆ రోజులు తలుచుకుంటే చెరగని ముద్రలవి.

నేను బొంబాయి వదిలాక అక్కడ చాలా మార్పులొచ్చాయి. తెలుగు జనాభా ఎక్కువ అవ్వడంతో, ఆంధ్రదేశంలో విడుదలయినట్టే బొంబాయిలో అదే సమయానికి విడుదల చేసే తెలుగు సినిమా హాల్స్, వారమంతా రోజుకి నాలుగు ఆటలతో, ఇప్పుడు అక్కడున్న మా బంధుమిత్రులకి తెలుగు సినిమా చూడట్లేదన్న కొరత పోయింది.

బొంబాయి నించి వేసవి సెలవలకి ఆంధ్రదేశంలో అమ్మమ్మ తాతగారింటికి వెళ్ళినప్పుడు తెగ సినిమాలు చూసేవాళ్ళం. అక్కడ తమాషా ఏమంటే, హిందీ, ఇంగ్లీష్ సినిమాలకి వెళ్ళినప్పుడు, నాకయితే అర్ధమయ్యేది కానీ హిందీ, ఇంగ్లీష్ రాని వారికోసం సినిమా హాల్ ఉద్యోగి కుర్చీ ఎక్కి, రేకుతో చేసిన మెగాఫోన్ లో గట్టిగా సినిమాలో జరుగుతున్న సంభాషణలు అనువాదం చేస్తూ, తనకి తోచినట్టు స్వంత కవిత్వం, జోకులు చెప్పడం గుర్తుకొస్తోంది. ఆపైన అతను నవ్వితే అర్ధమయినా కాకపోయినా ప్రేక్షకులు నవ్వడం నాకెంతో తమాషాగా అనిపించేది. నేను చెప్పేది ఇతర భాషల సినిమాలకి 'సబ్ టైటిల్స్' చూపే రోజులు రాకముందు అనుభవం అనుకోండి!

సినిమాకి వెళ్ళడం అనేది ఒక అనుభూతి. సినిమా చూసేది ఎవరికివారే అయినా, అందరం కలసివెళ్ళడం ఒక సరదా. ముఖ్యంగా పెళ్ళిళ్ళకి, వేడుకలకే కాక వేసవి సెలవలలో అందరం కలసినప్పుడు ఇంటిల్లిపాదీ సినిమాకి వెళ్ళడం మరపురాని సంఘటన. ఏ సినిమాకి వెళ్ళామో, ఎవరితో వెళ్ళామో, ఏ వూళ్ళో ఎప్పుడు కలిసినప్పుడు ఎంతమంది వెళ్ళామో, ఎవరి ప్రక్కన కూర్చున్నామో, ఇంకా పోతే ఆరోజు వర్షంలోనో, మండుటెండలోనో వెళ్ళడం అవి కూడా విశేషమే ఈనాడు తలుచుకుంటే!

అమెరికా వచ్చాక, 1970 లలో అమెరికాలో సినిమాల గురించి చెప్పాలి. సినిమా హాల్స్ ఎన్ని వున్నా, అప్పట్లో డ్రైవ్-ఇన్ సినిమాలుండేవి చాలా చోట్ల. అంటే మన కారులో వెళ్లి, విశాలమైన మైదానంలో స్పీకర్ ఉన్న చోట కారు ఆపుకొని, కారులోనే కూర్చొని సినిమా చూడడం అన్నమాట. పెద్ద తెర, ఓపెన్ ఎయిర్ లో చూపించేవారు సినిమాలు. మనిషికొక టిక్కట్ బదులు, కారుకొక టిక్కట్ అన్నమాట. కారులో ఎంతమంది వున్నా పట్టించుకోరు. చిరుతిండి కూడా కారు దగ్గర అమ్మడంతో కారులోనే సినిమా చూస్తూ తినేవాళ్ళం. వర్షం వస్తే ఆరోజు సినిమా ఉండదు. ఇండియానుండి అమెరికా చూడాలని వచ్చిన బంధు మిత్రులకి అదొక క్రొత్త అనుభవం ఆరోజుల్లో. 1980లలో డ్రైవ్-ఇన్ సినిమాలు క్రమేణా తగ్గిపోయి, మల్టి-ప్లెక్స్ సినిమా హాల్స్ చాలా వెలిశాయి. అంటే, ఒకే చోట చాలా సినిమాలు చూడవచ్చన్నమాట. వాటితోబాటు ఇంట్లో విడియో ప్లేయర్లలో సినిమాలు చూడడం కూడా ఉండేది, 1990లలో డి.వి.డి.లు, డి.వి.ఆర్.లు వచ్చాయి. అమెరికాలోనే కాదు, ఇండియాలో కూడా ఈ పరికరాలు రావడంతో, సినిమా హాల్స్ కి వెళ్ళే జనాభా తగ్గారా అనిపించేది.

ఇంక 21వ శతాబ్దం వచ్చాక, చలనచిత్ర పరిశ్రమలో మార్పులు మనందరికీ తెలిసినవే. ఒక్కసారిగా సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువయ్యి కంప్యూటర్లు, అంతర్జాలం(ఇంటర్నెట్) ద్వారా, తలచుకొన్న సినిమా ఇట్టే చూడగలుగుతున్నాం. ఇంట్లోనే కాదు, కారులో, రైల్లో,

విమానంలో ప్రయాణాలు చేస్తూ సెల్ ఫోన్లు, ఐ-పాడ్లు, లాప్-టాప్స్ వంటి పరికరాలు వాడుతూ, 'నెట్ ఫ్లిక్స్', 'యూట్యూబ్', 'హులూ' ల సహాయంతో సినిమాలు చూడగల్గుతున్నాం. ఇక వందలకొద్దీ కేబు ల్ ఛానెల్స్ తో ఒకే ఇంట్లో ఉంటూ, ఎవరికి తోచిన సినిమా వారు తలొక రూమ్ లో చూడగలుగుతున్నాం అంటే ఆశ్చర్యం లేదు. "ఎవరికీ వారే యమునాతీరే" అన్నమాట! కుటుంబలో అందరం కలిసి సినిమాహాలు కాదు మనింట్లో ఒకే గదిలో, ఒకే సినిమాచూసే భాగ్యం కూడా పోయిందనుకోండి. మా మనవలతో అప్పుడప్పుడు పిజ్జా, పాప్ కార్న్ తో 'మూవీ నైట్' అని శుక్రవారం సాయంత్రమో, సెలవల్లోనో మావారు, నేను, వాళ్ళకి నచ్చిన సినిమాలు చూస్తుంటాం. ఇక పొతే, నాలుగు అంగుళాలున్న సెల్-ఫోన్ స్క్రీన్ (తెర) నించి, వంద అంగుళాల హోమ్ థియేటర్ తెరతో మనకి ఏ నటుల ని ఏ సైజు లో చూడాలనిపిస్తే ఆ సైజు లో చూసి తృప్తి పడవచ్చు ఈనాడు. ప్రత్యేక కళ్ళజోడు వేసుకుని ఇంటినించి కదలకుండా చూసే 3డి సినిమాలు వున్న ఈరోజుల్లో సినిమా హాల్స్ గతేం కానూ అనుకుంటున్నారా? ఎన్ని మార్పులొచ్చినా, సినిమా వెండితెరపై ఈనాడు కూడా సినిమాహల్స్ కి వెళ్ళే జనాభా వృద్ధిలోనే ఉందని చెప్పాలి. ఇంకాపోతే, సోడా, చిప్స్, పాప్ కార్న్ తింటూ సినిమా చూసే రోజులు ఈనాడూ ఉన్నా, డిన్నర్ థియేటర్లు చాలా వెలుస్తున్నాయి. సినిమా హాల్ లో పడక్కుర్చీ లాంటి సోఫాలు, ప్రక్క టేబుల్స్ తో బాటు, టేబుల్ లైట్స్. అంటే, మనింట్లో లివింగ్ రూమ్ లో కూర్చున్నట్టున్నమాట! సినిమా చూస్తూండగానే, మెన్యూ చూసి డిన్నర్ ఆర్డర్ చేసి, తెప్పించుకుని, తింటూ తృప్తిగా సినిమా చూడడం మరో అనుభవం ఈ రోజుల్లో. ఎటొచ్చి, ఒకసారి నేను వెళ్ళిన డిన్నర్ థియేటర్లో తీరా నేను డిన్నర్ తినబోయే సమయానికి, ఆ సినిమా సీన్ లో తిండిలేని బీదవాళ్ళని చూసే సరికి సోఫాలో కూర్చున్న నాకు తినాలనిపించలేదు,

ఏది ఏమైనా, చివరగా నేను చెప్పేదేమంటే, మన చలనచిత్ర పరిశ్రమ మేటి నటీనటులతో, క్రొత్త పోకడలతో, సాంకేతిక పరిజ్ఞానం (టెక్నాలజీ), పరిశోధనలతో, ఎప్పటికీ తరతరాలుగా జనాన్ని అలరిస్తూ, మనందరినీ వినోదపరుస్తూనే ఉంటుదనడానికి ఏమాత్రం సంకోచం లేదు. దీనికి నిదర్శనాలే ఈనాటి ఆస్కార్, ఫిల్మ్ ఫేర్ పురస్కారాలు!

## "మన్మధ" ఉగాది

క. మనకీ దినమున నతి నూ
తనమౌ ధృతి కల్గు"మన్మధకు"కు నాహ్వాన
మ్మున, సర్వ దిశలు క్రమ్మగ,
ననిర్వచనమైన సొంపు, హాయి తలిర్చన్

ధృతి = సంతోషం; తలిర్చన్ = అతిశయించగ; అనిర్వచనము = మాటలేని



## తెలుగు పలుకు

గీ. తెలుగులో నొక ప్రాంతము పలుకు వరుస
వేరు వరుస కొకింతగ విడిగ తోచు
అయిన జనముల కలయిక కగునే బెడగు
క్రొత్త వైవిధ్యములు బాసకున్ కలుగవె?

బెగడు = భయము; విడిగ = ప్రత్యేకము; వరుస =క్రమము, విధము; కలయిక = సంగమము

గీ. దూరదేశములోనున్న వారి కలము
తల్లి పల్కుల గరిమ సంపుల్ల కరణి
నందరకు తెల్పగల్గుట యంత సులభము
మా, అయిన నిర్వురకు శ్రేయ మగును కాదే!

గరిమ = గొప్పతనము; సంపుల్ల సరణి = చక్కగా విరిసిన వరుస

**వేమూరి వేంకట రామనాథం**

# థాంక్స్ టు అంబేద్కర్

డా. కలశపూడి శ్రీనివాస రావు




"అంబేద్కర్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారు" అన్నాడు గట్టిగా ఆవేశపూరితంగా మార్కండేయ శర్మ. అప్పటిదాకా హాలులో రకరకాల స్థాయిలో, వేర్వేరు గుంపులలో సాగుతున్న చర్చలు ఈ మాటలతో ఒక్క కుదుపుతో ఆగిన బస్సులా ఆగిపోయాయి.

దీపావళి రోజు. బయట మంచు పడుతున్నది. న్యూయార్క్ వాతావరణంలో దీపావళి నాడు మంచు పడటం ఆశ్చర్యం. కాని మంచు పడుతున్నా మా ఇంటికి సుమారు పిలిచిన వారందరూ రావడం చాలా ఆనందంగా ఉంది. ఆ ఆనందం ఇచ్చినశక్తి తో వచ్చినవాళ్లకి కావలసిన ద్రవ, ఘన పదార్థాలని అందిస్తూ అందరి మధ్యా తిరుగుతున్నాను. వచ్చినవాళ్ళలో అతి చిన్న ఉద్యోగం చేస్తున్న వాళ్ళ నుంచి పెద్ద కంపెనీలు నడుపుతూ గణనీయంగా గడించిన వాళ్ళు ఉన్నారు. ఇవాళ విశేషం ఏమిటంటే డబ్బు, బంగారం గురించి కాకుండా ఇండియాలో వాళ్ల వాళ్ల ఊరుల గురించి, తెలుగుభాష గురించి చర్చలు చిన్న చిన్న గుంపులలో జరుగుతున్నాయి. అందరి ఉద్దేశ్యం ఒకటే. ఇండియా అమెరికాలా అయిపోవాలని, అందరూ హాయిగా బతకాలని. చాలామంది అనుకునేది ఏమిటంటే ఇండియన్ బుర్ర చాలా గొప్పదని ప్రపంచమంతా గుర్తించాలని; తెలివితక్కువ తెల్లవాళ్ళు ఇది గుర్తించి, వేదాలు, రామాయణ, మహాభారతాలు చదవాలని. అలా మొదలైన కబుర్లు, వాడి వాడి మాటలను వేడివేడిగా వాడి తమ తమ తెలుగు భాషా పరిజ్ఞానాన్ని, వాదనా పటిమని, తర్క సామర్థ్యాన్ని చమత్కార ప్రతిభని చూపిస్తూ, నీకంటే ఒక ఆకు ఎక్కువే చదివాను తెలుసా అని చెప్పకనే చెపుతూ కోలాహలంగా వాదించుకుంటున్నారు.

గాంధీ అంత గొప్పవాడు ప్రపంచంలో పుట్టలేదని ఒకరంటే, అంత మొండివాడు ఇంక మరెవరూ లేరని కొంతమంది... అసలు దేశంలో అన్ని సమస్యలకి ముస్లిమ్స్ కారణమని కొందరు, ఈ కాషాయం వాళ్ళు దేశాన్ని వెయ్యేళ్ళు వెనక్కి తీసుకొని వెళ్లిపోతున్నారని మరికొందరు... తెలుగు చచ్చిపోతున్నదని కొందరు, లేదు లేదు ప్రభుత్వ విధానాల వల్ల కొన్ని కోట్ల నిరక్షరాస్యులున్నారని, వాళ్ళవల్ల తెలుగు మరికొన్ని వందల ఏళ్ళు బతికే ఉంటుందని మరికొందరు... రిజర్వేషన్ వల్ల దేశం పాడైపోయిందని ఒకరు వాదిస్తే, బ్రాహ్మణులే తరతరాలుగా తెలివంతా దాచేసుకుని మిగిలినవాళ్లని తొక్కేశారని మరికొంతమంది. మరో పదేళ్ళలో రిజర్వేషన్ వల్ల సీట్లు తెచ్చుకుని, ఉద్యోగాలు తెచ్చుకుని అధికారంలోకి వచ్చిన కొత్త బ్రాహ్మణులు మిగిలినవాళ్ళని ఎలా అణగదొక్కేస్తారో మరికొందరు... ఇలా రకరకాల విషయాలను ఒకరి మీద ఒకరు పోటీ పడి వాదించుకోవడంతో హాల్లో వాతావరణం, డైనింగ్ టేబుల్ మీద ఉన్న ఆహారపదార్థాల కంటే వేడిగా ఉంది.

అన్నిటికంటే ఎక్కువగా, గట్టిగా వాదించుకుంటున్న విషయం కులాల మీద. ఇది జోరుగా సాగుతున్నదని దూరం నుంచి విన్న నాకు తెలుస్తున్నది. వాళ్లకి కావలసినవి అందించడానికి వెళ్లి వస్తున్నప్పుడు విన్న మాటల వల్ల కొన్ని విషయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. నరకాసురుడు దళితుడని, కృష్ణుడు, సత్యభామ అగ్రవర్ణస్తులని, అంచేత నరకాసురవధని దీపావళి జరపడం దళితులకి అవమానమని వచ్చిన వార్తలని చదివినవాళ్ళు ఈ కుల చర్చని మొదలుపెట్టారు. వచ్చిన యాభైఅరవైమందిలో కుల చర్చలో పాల్గొన్న వాళ్ళ సంఖ్య ఎక్కువ. కులపిచ్చి, కులగజ్జి, కులతామర, కులమేహం, కులపోటుకి అమెరికా వాళ్ళు ఇంకా ఏ మందూ కనిపెట్టలేదు. ఆయుర్వేదం, యునానిలలో ఉన్నా అది బ్రాహ్మలది, ముస్లింలది కాబట్టి వాడకూడదు. అంచేత ఇంకా చాలా మంది ఈ కుల రోగాలతో బాధపడుతున్నారు.

అప్పటికి మూడుసార్లు భోజనానికి పిలుపు వచ్చినా వాదించుకోవడంలో మునిగిపోయిన వాళ్ళు ఒక్కరూ కదలలేదు. వీళ్ళ వాదనలని ఆపించి, హాల్లో వాతావరణాన్ని చల్లబరిచి, వేడి వేడి భోజనానికి పంపవలసిన బాధ్యత ఉంది. గత పది నిమిషాలుగా ఈ విషయమే ఆలోచిస్తున్నాను. అదిగో అప్పుడు –

"అంబేద్కర్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారు" అన్నాడు గట్టిగా ఆవేశపూరితంగా మార్కండేయ శర్మ. అప్పటిదాకా హాలులో రకరకాల స్థాయిలో, వేర్వేరు గుంపులలో సాగుతున్న చర్చ లు ఈ మాటలతో ఒక్క కుదుపుతో ఆగిన బస్సులా ఆగిపోయాయి.

అప్పుడు నా మెదడులో మేల్కొన్న ఒక జ్ఞాపకం మెరుపులా మెరిసింది. వెంటనే, "థాంక్స్ టు అంబేద్కర్" అన్నాను గట్టిగా, అందరి వైపు చూస్తూ.

"ఎందుకూ" సుమారుగా అందరూ ఆశ్చర్యంతో.

"ఎందుకంటే అంబేద్కర్ వల్లే నేను ఇక్కడ ఉన్నాను. నేను ఇక్కడ ఉండబట్టే మీ అందరికీ ఇవాళ లంచ్ ఇవ్వగలుగుతున్నాను. అంచేత ఒక విధంగా ఇవాళ లంచ్ కి మీరందరూ అంబేద్కర్ కి కృతజ్ఞతలు చెప్పుకోవాలి." అన్నాను. నాకు చిన్నప్పుడు బాగా పరిచయమున్న మిషనరీ భాష యాసలో.

"మీరు కాని క్రిస్టియన్ ... చర్చి..." మాంసాహారం చూస్తున్న శాకాహారిలా నన్ను చూస్తూ అడిగింది ఒకావిడ.

"అవునండి, నేను చర్చి వీధిలో పుట్టాను, చర్చి ఎదుటే పెరిగాను, చర్చి స్కూల్లో చదివాను " అన్నాను. ఇంటిల్లిపాది నిశ్శబ్దం గా విన్నారు, మా మాటలని.

అప్పటిదాకా జరిగిన వాదనలు అందరూ మర్చిపోయారు. వాళ్ళు ఇప్పటిదాకా వాదించుకున్న వాదనలలో అన్న మాటలలో వాళ్ళని ఇంటికి పిలిచిన నన్ను తప్పుగా ఏమైనా అన్నారా అన్న మీమాంసలో పడ్డట్టున్నారు.

ఇదే అదను అనుకుని మళ్ళీ అందరినీ భోజనానికి పదమన్నాను. అందరూ లేవబోతూ ఉంటే, కుతూహలానికి మారు పేరైన కొంటెకోణంగి కోమలి "థాంక్స్ టు అంబేద్కర్" అని ఆయనలాగే మమ్మల్ని తప్పు త్రోవ పట్టించి భోజనానికి పంపు తారా? వీల్లేదు. ఎందుకలా అన్నారో కాని, దాని వెనుక కథేంటో చెప్పాలి" అంది. మార్కండేయ శర్మకి జవాబు చెప్పలేక కాబోలు.

"అంబేద్కర్ కథ చెప్పాలి" అన్నారు అందరూ కోరస్ గా.

"మీరందరూ మీ ప్లేట్లలో భోజనం తెచ్చుకొని తింటూ ఉండండి. మీరు తింటూ ఉంటే నేను చెపుతాను" అన్నాను. అందరూ గబగబా వెళ్లి భోజనం తెచ్చుకోవడంలో మునిగి పోయారు. అందరూ మళ్ళీ ఎవరి కుర్చీలో వాళ్ళు కూర్చుని 'చెప్పం డి" అన్నారు కోరస్ గా.

"మాకుటుంబాల్లో పుట్టిన తర్వాత స్కూలుకు వెళ్ళడం ఎంత సహజమో, స్కూల్లో చదువైన తర్వాత రైల్వే ఉద్యోగానికి వెళ్ళడం అంతే సహజం. అంచేత డిగ్రీ అవ్వగానే నేను ఒక రైల్వే ఉద్యోగం ఇంటర్వ్యూ కి వెళ్లాను. నన్ను ఇంటర్వ్యూ చెయ్యడానికి అయిదుగురు కూర్చొని ఉన్నారు. నన్ను ఎగాదిగా చూసి ఎదురు గా ఉన్న ఒక చిన్న కుర్చీలో కూర్చోమన్నారు. ముందు ఏవేవో ప్రశ్నలు వేశారు. అవి అన్నీ 'త్రీ ఇడియట్స్' సినిమాలోలా నా చదువుకి కానీ, నేను కావాలనుకుంటున్న ఉద్యోగానికి కానీ ఏమీ సంబంధం లేనివి. నేను వెంటవెంటనే సమాధానాలు చెపు తున్నాను. వాళ్ళు తాపీగా ఏవేవో రకరకాల ప్రశ్నలు అడుగు తున్నారు. ఇలా పాసింజరు రైలులా సాగుతున్న నా రైల్వే ఉద్యోగం ఇంటర్వ్యూలో 'ఇండియన్ కాన్ స్టిట్యూషన్ రాసిందెవరు?' అన్న ప్రశ్న వేసి, ఎక్స్ ప్రెస్ ట్రైన్ ని లూప్ లైన్ కి షటింగ్ చేసిన స్టేషన్ మాస్టర్ లా ఒక చిరునవ్వుతో చెప్పు చూద్దాం అన్నట్టు చూశాడు ఒకతను.

"'ఇండియన్ కాన్ స్టిట్యూషన్ ఒక నవలో నాటకమో కాదు, ఒక్కతను వ్రాయడానికి" అని ఆగాను. ప్రశ్న అడిగిన ఆయన గాబరాగా కుర్చీలో కదిలాడు. ఇంటర్వ్యూ చెయ్యడానికి కూర్చున్న మిగిలిన వాళ్ళు బిగుసుకుపోయారు. నా వైపే అందరి దృష్టి. నాకు కాకపోతే ఈ ఉద్యోగం ఇంకెవరికి ఇస్తారు అన్న ధీమా నాకు ముందునుంచీ ఉంది. దాని బలం వల్లే నా మాటలు తాపీగా, దృఢంగా వస్తున్నాయి.

బహుశా భీమ్ రావు రాంజీ అంబేద్కర్ వ్రాశాడని నేను అంటాను అని అనుకొన్నారు కాబోలు" అన్నాను, అది సరైన జవాబు కాదన్నట్టు తల ఊపుతూ. "1946లో మన కాన్ స్టిట్యూషన్ నిర్మాణం కోసం 299 మందితో కాన్ స్టిట్యూషన్ అసెంబ్లీ ఏర్ప డింది. అందులో 17 కమిటీలు ఉన్నాయి. ఆ 17 కమిటీల్లో కాన్ స్టిట్యూషన్ డ్రాఫ్టింగ్ కమిటీ ఒకటి. ఈ కమిటీకి మాత్రమే డా. అంబేద్కర్ చైర్మన్. ఈ కమిటీ రెండేళ్ళ పదకొండు నెలల పదిహేడు రోజులు పనిచేసి రాజ్యాంగాన్ని రూపొందించింది. ఈ కమిటీ పనితీరు మీద ఎన్నో విమర్శలొచ్చాయి. నత్త మీద అంబేద్కర్ కూర్చుని ఉంటే నెహ్రూ కొరడాతో కొడుతున్న శంకర్ వీక్లీ కార్టూన్ ఆయన పనితీరుకి ఒక చమత్కారం" – అంటూ నాకు తెలిసిన విషయాలన్నింటినీ ఒక వడగళ్ళ వానలా వాళ్ళ మీద కురిపించాను. ఒక్కసారి చెప్పడం ఆపి వాళ్ళ మొహాల్లోకి చూసాను. నిశ్శబ్దం. వాళ్ళ సీరియస్ నెస్ చూసి నన్ను ఇక లే, వెళ్ళు, చేసిన ఇంటర్వ్యూ చాలని అంటారు అని అనుకున్నాను. అలా అనలేదు.

అంతా లేచి నిలుచున్నారు బెరుకు బెరుకుగా. నిలుచున్నవాళ్ళు 'సర్ ..సర్.." అంటున్నారు. ఎవరినా? అని వెనక్కి తిరిగి చూస్తే ఒక పెద్దాయన నిలుచున్నారు. పంచె కట్టుకుని, పైన ఖద్దరు చొక్కాతో చాలా హుందాగా కనిపించారు. నేను కూడా మర్యాద కోసం లేచి నిలుచున్నాను.

"నీ పేరేమిటి?" అని అడిగారు.

చెప్పాను.

"ఏఊరు?"చెప్పాను.

"ఎవరబ్బాయివి"

చెప్పాను.

"ఏం చదివావు? "

చెప్పాను.

" ఈ ఇంటర్వ్యూ కి ఎందుకు వచ్చావు?"

"ఉద్యోగం కావాలని."

"ఉద్యోగానికి ఎందుకు వచ్చావు?"

"డబ్బులు... జీతం కోసం.." అన్నాను నిశ్చయంగా, ఇంటర్వ్యూ చేస్తు న్నవాళ్ళు ఏమీ మాట్లాడలేదు. లేచి నిలబడే ఉన్నారు. అంటే ఈ ప్రశ్నలు వేస్తున్న ఆయన వీళ్ళ పైన అధికారి అయివుంటారని తోచింది.



"జీతం కోసం అయితే ఈ ఉద్యోగానికి ఎందుకు అప్లై చేశావు? ఇంతకన్నా మంచిది, ఎక్కువ జీతం వచ్చే ఆపరేటింగ్ ఉద్యోగానికి ఎందుకు అప్లై చెయ్యలేదు?"అన్నారు.

"నేను అప్లై చేసినప్పుడు కమర్షియల్ పోస్టులు మాత్రమే అడ్వర్టైజ్ చేశారు సర్ " అన్నాను. అప్పటికి నాకు తెలియకుం డానే నామాటలలో వినయం ఉల్లిపొరకాగితంలా ప్రతీ మాటని చుట్టుకుని వస్తున్నది.

"సరే, ఇతన్ని ఆపరేటింగ్ పోస్టు కోసం కంటి పరీక్షకు పంపండి" అని ఇంటర్వ్యూ చేస్తున్నవాళ్ళకి చెప్పారు.

'ఎస్ సర్" అన్నారు అందరూ ఒక్కసారి.

"థాంక్స్ సర్" అన్నాను నేను ఆయనకి నమస్కారం కూడా పెడుతూ.

"ఈ ఉద్యోగం వస్తే, నీకు ఒక పాస్ పంపుతారు. అది తీసుకుని జాయిన్ అవ్వడానికి రమ్మంటారు. జాయిన్ అవ్వకముందు వచ్చి నన్ను కలువు" అని కదలబోయారు.

"మీరు, మీ పేరు..." ఇంతకీ మీరెవరు, మిమ్మల్ని ఎలా కలవాలి అన్న భావంతో.

"నేను సర్వీస్ కమిషన్ చైర్మన్ ని" అన్నారు.

"తప్పకుండా వచ్చి కలుస్తాను" అన్నాను.

అని చెప్పడం ఆపాను. మా ఇంట్లో భోజనం చేస్తున్న అందరి వైపు చూశాను.

"ఉద్యోగం వచ్చిందా? రైల్వే పాస్ వచ్చిందా? ఆయన్ని కలిశారా? రైల్వే ఉద్యోగం లో జాయిన్ అయ్యారా?" భోజనం మధ్యలో ఆపి అడిగారు కుతూహలం ఆపుకోలేని వాళ్ళు.

"ఉద్యోగం వచ్చింది. వచ్చిన మూడు నెలలకి పాస్ కూడా వచ్చింది. ఆ పాస్ పట్టుకుని ఆయన్ని కలవడానికి వెళ్లాను. దొరక లేదు. మూడుసార్లు ప్రయత్నించాను. ఈ లోగా నా ఎమ్మెస్సీ కూడా అయిపోయింది."

"మరి రైల్వే ఉద్యోగం?" ఆత్రుతగా అడిగారు.

"అమెరికాలో పి.హెచ్.డి అడ్మిషన్ స్కాలర్ షిప్ తో సహా వచ్చింది. అమెరికా వచ్చేశాను, ఓ ఇరవై ఏళ్ల కిందట" అన్నాను, నేను కూడా ఆ జ్ఞాపకాలలోంచి బయటపడుతూ.

"అయితే అంబేద్కర్ కి థాంక్స్ ఎందుకు?" అని అడిగా రు ఒక ప్రొఫెసర్ గారు. ప్రతి మెదడూ ఒక్కో విధంగా పనిచేస్తుంది అని నిరూపించడానికన్నట్టు.

"రాజ్యాంగం ప్రశ్న లేకపోతే, అంబేద్కర్ జవాబు లేదు. అంబేద్కర్ జవాబు లేకపోతే, ఇంటర్వ్యూ మామూలుగా అయ్యేది, మామూలుగా అయితే, సర్వీస్ కమిషన్ చైర్మన్ ఆగేవారు కాదు, ఆయన ఆగకపోతే, నన్ను వచ్చి కలవమని చెప్పేవారు కాదు, ఆయన్ని కలవడమన్నది లేకపోతే ఉద్యోగంలో జాయిన్ అయి పోయే వాడిని, ఉద్యోగంలో జాయిన్ అయితే ఇక అమెరికా రావడం ఉండేది కాదు. అమెరికా రాకపోతే మిమ్మల్ని కలిసే భాగ్యం ఉండేది కాదు, మిమ్మల్ని కలిసే భాగ్యంలేకపోతే ఇవాళ మీతో కలిసి భోజనం చేసే అవకాశం ఉండేది కాదు. అంచేత అంబేద్కర్ కు థాంక్స్ చెప్పుకోవాలి" అన్నాను.

# శ్రావణమాసం స్పెషల్

**శ్యామలాదేవి దశిక**



సరిగ్గా సమయానికి వచ్చారు చేతులు కడుక్కురండి.. ప్రసాదం తీసుకుందురు గానీ !

ఏమిటీ.. కళ్ళు అంత పెద్దవి చేసుకుని అలా చూస్తున్నారూ? ఇన్ని పిండివంటలు, పలహారాలు చేశా ననా ? ఈ రోజు శ్రావణ శుక్రవారం కదా? పూజ చేసుకున్నాను. అమ్మ వారికి నైవేద్యంగా ఇవన్నీ చేశా ను.ఇన్నాళ్ళకు కథలో చెప్పినట్టు ఇరవై ఒక్క రకాలు చేశాను చూశా రా !

కాస్త పాయసం, నాలుగు బూరెలు చెయ్యడానికి, నానా హైరానా పడిపోయే నేను ఉన్నట్టుండి ఇన్ని పిండివంటలు ఎలా చేశానా అని ఆశ్చర్య పోతున్నారుకదూ? ఇదంతా అమ్మవారి మహిమ అనుకుంటున్నారేమో. కాదండీ బాబు అంతా తెలుగు బుల్లితెర మహిమ!

ఈ నెలంతా లేడీస్ నోములు, వ్రతాలతో ఊపిరాడనంత బిజీ, బిజీగా ఉంటారని " శ్రావణమాసం స్పెషల్ " అంటూ "ఆ" టీవీ లో ప్రత్యేకమైన వంటల ప్రోగ్రాం పెట్టారు. పూజలు, పునస్కారాలు చేసుకునే నాలాంటి ఆడవాళ్ళు గంటలు తరబడి వంటలు చేస్తూ., టైము వేస్టు చేసుకోకుండా నిమిషాల మీద రకరకాల నైవేద్యాలు ఎలా తయారు చెయ్యచ్చో చూపించారండీ!

"ఆ" టీవీ ఏమిటీ అంటారా? మీకు ఏమి తెలీదు.. ఆ టీవీ అంటే ఆడవాళ్ళ టీవీ అని అర్థం. ఆ ఛానల్ లో అన్నీ ఆడవాళ్ళకు సంబంధించిన కార్యక్రమాలే వస్తాయి.

ఆ వంటల షో చూశాక తెలిసింది-పిచ్చిమొహాన్ని ఇన్నాళ్ళు అన్నీ యధావిధిగా చేస్తూ అనవసరంగా శ్రమపడ్డానని!

ఏమిటీ.? టీవీలో చూపించేవన్నీ ఎడిట్ చేసి చూపిస్తారంటారా? సడేలేండి.... సంబడం! అదేదో మీకొక్కళ్ళకే తెలిసినట్టు... ఆ సంగతి నాకూ తెలుసు! కానీ ఈ కుకింగ్ షో అలా కాదు. స్టవ్ వెలిగించి నప్పటినుంచీ., చేస్తున్న వంటని ప్లేట్లోకి తీసేంత వరకు ఖచ్చితంగా ఎంత టైం పడుతుందో టైమర్ పెట్టి మరీ చూపించారు.

టైమర్ పెట్టి చూపించడం ఏమిటీ అంటారా?

అబ్బ చెప్పాను కదండీ. ఇది మామూలు వంటల ప్రోగ్రాం కాదనీ. అన్ని షోల్లో లాగా వంటలు ఎలా చెయ్యాలో చూపించే కార్యక్రమం కాదది. ఓ పిండివంట ఎలా చెయ్యాలో చూపించటం గొప్ప కాదు. దాన్ని ఎంత తక్కువ టైములో చేస్తారన్నది పాయింటు. ఏ అయిటం చేసినా ఏడు నిముషాలు దాటిందంటే ఎలిమినేట్ అయిపోతారు. పోవమ్మ మహాలక్ష్మీ.... పోవమ్మా... అంటూ పంపించేశారు తెలుసా! వంటల్లో చెయ్యితిరిగిన వనితలు కొందరు మూడంటే మూడు నిమిషాల్లో ఇట్టే స్వీట్లు.. అట్టే హాట్లు చేసేసి పట్టుచీరలు, పాపిడిబిళ్ళలు గెలిచేసుకున్నారు! కొన్ని స్వీట్ల కైతే స్టవ్ కూడా ఆన్ చెయ్యక్కర్లా. మైక్రోవేవ్ లో ఇలా పెట్టి అలా తియ్యడమే. ఇవాళ నేను చేసిన ఈ పిండివంటలన్నీ ఆ షో లో బహుమతులు గెలుచుకున్నవేనండీ!

ఏమిటీ.? మూడునిముషాల్లో.-ఐదు నిముషాల్లో పిండివంటలు పూర్తిచెయ్యడం వింతగానూ విడ్డూరంగానూ ఉంది అంటారా?

వింతే మరి! అంతే కాదండోయ్ ! ఆ కొద్ది పాటి టైములో కూడా వంటమీద శ్రద్ధ పెట్టాల్సిన పని లేదుట. చాలా మంది ఓ పక్క వంట చేస్తూనే యాంకర్ అడిగే ప్రశ్నలకు చకచకా సమాధానాలిస్తూ... పాటలు పాడుతూ... డ్యాన్సులు చేస్తూ పూర్తి చేశారు. నిజానికి అది వంటల పోటీ కమ్ టాలెంట్ షో అనుకోండి !

వంటలకు...డాన్సులకు సంబంధం ఏమిటీ అంటారా?

ఏం చచ్చు ప్రశ్న అండీ బాబు! ఏ కాలం లో ఉన్నారు మీరు? అందుకే తెలుగు ఛానల్స్ చూడండీ. కాస్త తెలివి పెరుగుతుంది అంటే వినిపించుకోరాయే. అస్తమానం హిస్టరీ ఛానల్సు...ట్రావెల్ ఛానల్సు ఈరెండు కాకపోతే న్యూస్ ఛానల్ చూసే మీకు లోకజ్ఞానం తెలివితేటలు రమ్మంటే ఎలా వస్తాయి?

ఇప్పుడు పాటలు, డ్యాన్సులు బుల్లితెర వంటల్లో భాగాలు అయిపోయాయి. చేసే వంటలో ఉప్పులు కారాలు వేసినా వెయ్యక పోయినా ప్రేక్షకులు ఏమీ పట్టించుకోరు. కానీ ఆటలు....పాటలు లేకపోతే అమ్మో ! ఇంకేమైనా ఉందా?! "ఆడుతు, పాడుతు పని చేస్తుంటే ... అలుపు సొలుపే ఉండదు" అని ఆనాడే మన కవులు పాటలు కూడా రాశారు కదా. అలా ఓ పక్క వంట చేస్తూ మరో పక్క పాటలు పాడుతూ..డ్యాన్సులు చేస్తుంటే శ్రమే తెలీదుట. ఈ రోజుల్లో "అసలు పని" మాట ఎలా వున్నా ఆటా పాటా వస్తే చాలు ఇట్టే షయిన్ అయిపోవచ్చు!

గొప్పవాళ్ళ దగ్గరనుంచీ నాలాంటి వాళ్ళతో సహా బుల్లితెర మీద కనిపించాలంటే ఈ రెండూ వచ్చితీరాలి. ముఖ్యంగా ఎగరటం అదేనండీ గంతులేయడం కంపల్సరీ గా రావాలి. నేను చిన్నప్పుడు రేడియోలో సినిమా పాటలు వింటూ నాకు తోచినట్లు డాన్సు

చేస్తుండేదాన్ని. నా డాన్సుని ఎవరూ మెచ్చుకోక పోగా ఇంట్లో అందరూ "నీకు కాళ్ళు చేతులు కుదురుగా ఉండవు కదా? ఏమిటా పిచ్చి గంతులు" అంటూ అస్తమానం కోప్పడేవారు. ఆ పిచ్చి ఎగురుళ్ళే ఈ రోజుల్లో ఓ పెద్ద స్టైల్ అయిపోయింది! ఏ వంటల ప్రోగ్రాం అయినా "ఇప్పుడు ఫలానా వారు మనకి ఓ కొత్తరకం వంటకం చూపిస్తారు" అని అంటారే కానీ, అసలు వంట కంటే ముందు, వాళ్ళు వగలు పోతూ మనకు చూపించేది వాళ్ళ చీరలు, నగలు..డాన్సులే!



ఏమిటీ? ఈ వంటలు చూస్తుంటే నైవేద్యం కోసం చేసినట్టు లేవంటారా? పార్టీల్లోను, రెస్టారెంట్ లో చేసే ఐటమ్స్ లా వున్నాయి అంటారా?

అయ్యోరామ! మీకు ప్రతీదీ విడమరిచి చెప్పాలి. ఇప్పుడు రోజూ మనం తినే వంటల్లో మార్పు వచ్చినట్టే దేముడికి పెట్టే నైవేద్యాల్లో కూడా బోలెడంత కొత్తదనం వచ్చేసిందండీ! పాతవస్తువుల్ని ఆటక మీదకు ఎక్కించేసినట్టు పాత నైవేద్యాల్ని అందరూ పక్కన పెట్టేస్తు న్నారు. ఇప్పటి కాలం అమ్మవార్లు ఆ పాత పరమాన్నాలతో, పులిహోరలతో, అప్పాలతో ప్రీతి చెందరుటా. మనం ఎన్ని కొత్త రకాలు చేస్తే దేవతలు అంత సంతోషించి అంతే త్వరగా మన కోరికలు తీరుస్తారుటండీ! అందుకే ఇవ్వాళా-రేపు దేవుళ్ళకు "కాంటినెంటల్ టైప్ నైవేద్యాలు" కామన్ అయిపోయాయి.

గులాబ్ జామ్ తో కర్రీ చేసుకోవచ్చనీ....పనీర్ తో పచ్చడి చెయ్యొచ్చని.... మష్రూమ్స్ తో మాగాయ పెట్టచ్చని " శ్రావణమాసం స్పెషల్ " షో చూసిన తర్వాతే తెలిసింది! ఒకవేళ మన చాదస్తం కొద్దీ సాంప్రదాయకమైన నైవేద్యాలే పెట్టాలనుకున్నా... పూర్వంలాగా వంటకాలన్నీ ఆరోజే చెయ్యక్కరలేదుట. క్రితం రోజే పిండిరుబ్బుకుని రెఫ్రిజిరేటర్లో పెట్టేసుకోవడం, స్వీట్ మరింత రుచిగా ఉండటానికి త్వరగా అయిపోవడానికి చక్కగా బజారులో దొరికే కోవా కొనుక్కొచ్చి వేసెయ్యడం, కూర మగ్గిపోగానే వెంటనే రెడీ మేడ్ సాస్ వేసి కలిపెయ్యడం లాంటి చిట్కాలు చాలా...చాలా చెప్పారు!!

ఏమిటీ అమ్మవారు ఎప్పటిలా కాకుండా అదోమాదిరిగా ఉందేమిటీ అంటారా? అమ్మో ఫరవాలేదే.....నా అమ్మవారు కొత్తగా ఉందని కనిపెట్టేశారే! ఇప్పటి ఫాషన్ కు తగినట్టుగా అమ్మవారిని ఎన్ని రకాలుగా అలంకరించుకోవచ్చో కూడా చూపించారు. అందుకే ఈసారి నేనూ, నా వరలక్ష్మి అమ్మవార్ని కొత్త స్టైల్ లో అలంకరించుకున్నా. పెళ్ళిళ్ళకు "వెడ్డింగ్ ప్లానర్స్" ఉన్నట్టే ఇప్పుడు నోములు వ్రతాలు చేసుకునే వాళ్ళకోసం "పూజా ప్లానర్స్" అని ఉన్నారుటండీ. అలాంటివాళ్ళు ఈ "శ్రావణమాసం స్పెషల్" షో కి వచ్చి ఇలాంటి అకేషన్లకు ఎలా ప్రిపేర్ అవ్వాలో నేర్పారు. ఇండియాలో ఇప్పుడు ఈ ప్రొఫెషన్ కు బోలెడంత డిమాండుటండీ! ఈ రోజుల్లో మొగుళ్ళ కంటే ఎక్కువ సంపాదిస్తున్న ఆడవాళ్ళకు, పిల్లల్ని పెంచే టైము, వంటింట్లోకి వెళ్ళే ఓపికే ఉండటం లేదు. ఇంక పూజలకు-పునస్కారాలకు టైము ఎక్కడ ఉంటుంది? అందుకే ఈతరం పిల్లలు పూజాప్లానర్స్-ని బుక్ చేసేసుకుంటున్నారుట! వ్రతానికి కావాల్సిన వస్తువులకోసం పనికట్టుకుని కొట్టు-కొట్టుకు తిరగక్కర లేకుండా అన్నీ వాళ్ళే పట్టుకొస్తారు.

నా చిన్నప్పుడు మా అమ్మ "వరలక్ష్మీ వ్రతం" రోజున ఎంత శ్రమ పడేదో. ఓ పక్క వంట చేస్తూ..మరో పక్క పిండితో అమ్మవార్ని తయారుచేసుకుంటూ., పూజకు కావాల్సినవి సిద్ధం చేసుకుంటూ ముత్తైదులకు ఇవ్వాల్సిన వాయనాలు సర్దుకుంటూ నానా హైరానా పడిపోయేది. ఇప్పుడు ఆ బాధలేమి లేకుండా పూజా ప్లానర్స్ కు కాంట్రాక్ట్ ఇచ్చేస్తే అన్నీ వాళ్ళే చూసుకుంటారు. అమ్మవార్ని అలంకరించడం దగ్గరనుంచి ... వచ్చిన ఆడవాళ్ళకు తాంబూలం ఇవ్వడం దాకా అంతా వాళ్ళదే పూచీ. మన బడ్జెట్ కి అనుకూలంగా, మన అభిరుచికి అనుగుణంగా మనకు ఎలా కావాలంటే అలా సిద్ధం చేస్తారు. అమ్మవార్ని కూడా మనకు ఏ స్టైల్ లో కావాలంటే ఆ స్టైల్ లో తయారుచేస్తారుట.

దేవుళ్ళకు స్టైల్ ఏమిటీ ....అంటారా?

మీకు అన్నీ పూసగుచ్చినట్టు చెప్తే కాని అర్ధంకాదు కదా? స్టైల్ అంటే టాలీవుడ్ స్టైల్ లోనా, బాలీవుడ్ స్టైల్ లోనా...ఈ రెండు కాక హాలీవుడ్ స్టైల్ లోనా అని అర్ధం!

శ్రావణమాసానికి ముందు ఏ సినిమా అయినా సూపర్ డూపర్ హిట్ అయితే ఆ సినిమా హీరోయిన్ స్టైల్ పాపులర్ అయి కూర్చుంటుందిట. ఇంక ఆ స్టైల్ లో వున్న అమ్మవారిని చూడ్డానికి ఎక్కడెక్కడి లేడీస్ వస్తారుట.

మా పెద్ద అక్కయ్య చెప్తోంది. కిందటి ఏడాది పెళ్ళి చేసుకున్న దాని ఆఖరి మనవరాలు లిప్సిక, హైదరాబాద్ లో హైటెక్ సిటీలో ఉంటుంది. అది మొదటిసారి వరలక్ష్మీ వ్రతం చేసుకుంటోందని మా

అక్కయ్య పాపం...... అనాతవరం నుంచి అవస్థ పడుతూ వెళ్ళిందిట. పేరంటానికి వచ్చిన ఆడపిల్లలందరూ మా లిప్సిక లాగే సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుట! అమ్మాయిలందరూ మూవీ స్టార్స్ లా తయారయి, వస్తూనే హాపీ ఉగాది... హాపీ దివాలీ అని చెప్పుకున్నట్టు "హాపీ వరలక్ష్మీ... హాపీ వరలక్ష్మీ" అంటూ ఒకళ్ళ కొకళ్ళు హై ఫైవ్ లు ఇచ్చుకున్నారుటా!

"యువర్ వరలక్ష్మీ లుక్స్ వెరీ స్మార్ట్..... యువర్ వరలక్ష్మీ లుక్స్ వెరీ గ్లామరస్" అంటూ లిప్సికను పొగిడేస్తుంటే మా అక్కయ్యకు అంతా అయోమయంగా అనిపించిందిట.

మా అక్కయ్య కోడలు శ్రీదేవి మాత్రం, లక్షలు సంపాదించే వాళ్ళ అమ్మాయి.. అసలు పూజ అంటూ చేసుకోవడమే తన భాగ్యం అన్నట్టు కూతుర్ని చూసుకుని ఒకటే మురిసిపోయిందిట!

ఇన్నాళ్ళు "అమెరికా" అంటే ఆధునిక దేశం అని, నాగరికత అంతా ఇక్కడే ఉందని అనుకునేదాన్ని. తెలుగు చానల్స్ చూసిన తర్వాత తెలిసింది-ఆధునికతలో అమెరికా ఎక్కడో ఆమడదూరం వెనకా తల ఉందని!

ఏమైనా ఈ సారి "శ్రావణమాసం స్పెషల్" పుణ్యమా అని అస్సలు శ్రమే అనిపించలేదు సుమండీ !

ఇంతకూ నా సరికొత్త వంటలు... నైవేద్యాలు... ఎలా ఉన్నాయో చెప్పారుకాదు. అదేమిటీ మొహం అదోలా పెట్టి అలా బాత్రూం వైపు పరిగెడుతున్నారూ? ఇంకా పదిరకాలు వున్నాయి త్వరగా వచ్చేయండి ఇదిగో మిమ్మల్నే ...

## లోపల వెలిగే దీపం

**ప్రసూన రవీంద్రన్**

కాలాన్ని కొలుస్తూ
పచ్చల్ని పరుస్తూ
నీలాల్ని ఏరుకోవడానికి
నది దాకా నడిచే దారుల్లో
కోయిలొకటి స్వరాల్ని నాటుకుంటోంది.
నిశ్శబ్దంలోంచి కోలాహలంలోకి చేసే ప్రయాణం
పంటకొచ్చిన పాటతోనే మొదలవుతుంది కదూ!
స్వప్నాల్ని శపిస్తూ
గాఢతని తపిస్తూ
నిద్రని వశపరుచుకోవడానికి
చీకటితో చెలిమిచేసే సమయంలో
మిడతొకటి రహస్యాల్ని పలవరిస్తోంది
వెలుగులోంచి చీకటిలోకీ
మెలకువలోంచి నిద్రలోకీ
నడవాల్సిన వంతెన
ఆ రహస్యాల చిరుకాంతిలోనే నిర్మితమవుతుంది కదూ!

నవ్వుల్ని కూడుకుంటూ
వేదనని తీసివేస్తూ
గణితశాస్త్రంతో జీవితార్థాల్ని సవరించుకునే వేళలో
సున్నా మౌనంగా ఉండిపోతుంది.
విధి వికటాట్టహాసాలకి
పల్లానికి ప్రవహించేటప్పుడు
ఆ సున్నాయే దోసిలిగామారి మరో మలుపుకి మొదలవుతుంది కదూ.
ఎప్పటికైనా
చీకట్లోకి పారిపోయే వెలుగూ
నిశ్శబ్దంలోకి ముడుచుకుపోయే పాటా
పరిచయమవడం మాత్రమే జీవితం కాదు.
గమనించంగానీ
రాత్రి తొడిమెకి విచ్చుకునే పగలూ
శబ్దాల్లోకి లయమయ్యే స్వరమూ
లోపలి పంజరంలో మేల్కొనే ఉంటాయ్.

# పునర్నిర్మాణం

**అరుణ పప్పు**

"ప్రళయభీకరమైన తుఫానొచ్చి వెళ్లేక మీ విశాఖ ఎలా ఉందో చూడాలనుంది..." అంటూ ఫోన్చేసింది సుశీలా నాయర్. ఈవిడకీ వైజాగు పిచ్చి ఏమిటో నాకర్థం కాదు. ఆ మాటే ఆమెతో అంటే, బొంగురు గొంతుతో గలగలా నవ్వింది.

"నీకు లేదా నీలి సముద్రం పిచ్చి? పిచ్చివాళ్లకు తమ సంగతి తమకు తెలియదుట. అలాగే ఉంది నీ వ్యవహారం కూడా.." అంది. ఆవిడ మాటల్లో నిజమెంతో తెలుసు కనుక నేనూ నవ్వేశాను.

"అయినా ఎవరైనా అందమైన ప్రదేశాలను మంచి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు చూద్దామనుకుంటారు. మీరేంటండి బాబూ... తుఫాను తర్వాత, భూకంపాల తర్వాత, వరదల తర్వాత... అంటూ చూడ్డానికి వెళుతుంటారు.. ఇది మాత్రం కచ్చితంగా పిచ్చిపనే... ఇప్పుడేంటంటారు?" అనడిగాను.

"ప్రకృతిని, పచ్చటి పరిసరాలను గమనించడం, అందమైన దృశ్యాలను, స్థలాలను నా కెమెరాలో బంధించడం... ఇంకా ఎంతోమందిలో చూడాలన్న తపన కలిగేలా వాటి గురించి రాయడం.. ఇదంతా నా వృత్తి. కాదనను. కానీ గిరికా, నువ్వెప్పుడైనా ఆలోచించావా.... భూమ్మీద పుట్టినప్పటి నుంచి మనుషులు ఎంత పని చేస్తున్నారో... ఎంత శ్రమిస్తున్నారో? భౌతిక సదుపాయాలను కల్పించుకోవడం కోసం, జీవితాన్ని సుఖవంతం చేసుకోవడం కోసం, తెలియని విషయాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ ప్రయాణాన్ని గమనిస్తుంటే నాకు గొప్ప ఆశ్చర్యంగా ఉంటుంది తెలుసా?"

ఈ మాటలంటున్నప్పుడు కళ్లు సగం మూసుకుని, తృప్తి అనే మాటకు పర్యాయపదంగా నిలబడే ఆవిడ ముఖం ఎలా ఉంటుందో ఊహించగలిగాన్నేను.

"ఏదైనా విధ్వంసం – అది ప్రకృతి సృష్టించిందా, మనుషులు చేసిందా అని కాదు.. ఏదైనా సరే, దానితర్వాత మనుషులు, ప్రకృతి – ఒక్క మాటలో చెప్పాలంటే తమనుతాము మళ్లీ నిర్మించుకునే ప్రయత్నం చేస్తారు చూడు.. దాన్ని నా కళ్లతో చూడాలి, నా మనస్సుతో అర్థం చేసుకోవాలి. ఆ ప్రయత్నంలోని జీవనకాంక్ష, క్రియేటివిటీ నాకు అత్యద్భుతమైన ఏదో సత్యాన్ని తెలియచెపుతున్నట్టు ఉంటాయి..." అందావిడ.

"అబ్బా.. అంత పెద్ద విషయాలను నేను ఆలోచించలేనండి. మనిషి ప్రయాణం ముందుకెళుతోందో, వెనక్కెళుతోందో, దానికి వాళ్లను పురిగొల్పేవేమిటో, అందులో వాళ్లు చూపించే క్రియేటివిటీ... ఇవన్నీ నాకెందుకు? మీ ప్రయాణం సంగతి చెప్పండి ముందు? ఎప్పుడొస్తున్నారు, ఎక్కడెక్కడికి వెళతారు? ఇవి చెప్పండి చాలు..." అన్నాను. అంత విసుక్కున్నా, ఆవిడ పరిశీలనలో నేనూ భాగమవుతానని ఆవిడకీ తెలుసు. అందుకే తేలిగ్గా నవ్వి ఆ వివరాలన్నిటినీ చెప్పింది.

చెప్పినట్టుగానే విశాఖనగరానికి చేరుకుంది.

ఆమె మధ్యాహ్నం రెండు గంటలకు విమానం దిగుతూనే ఛిన్నాభిన్నమైన ఎయిర్పోర్టును చూసి ఆశ్చర్యపోవడం మొదలెట్టింది.

"వైజాగ్ని స్లీపింగ్ సిటీ అని ఎందుకంటారో నాకిప్పుడు అర్థమవుతోంది సుమా.... ఇంత చిన్నదాన్ని మళ్లీ కట్టడానికి ఆర్నెల్లా...." అంటూ నోరు తెరిచేసింది.

"కూలిపోయినవాటిని బాగుచేసుకోవడంలో మనుషుల ఆశ, క్రియేటివిటీ బయటపడతాయి... వాటిని నేను చూడాలీ... అన్నారుగా. అసలు ఇక్కడి వాళ్లకు అలాంటి లక్షణాలుంటే కదా బయటపడేవి. మా ఊరు స్లీపింగ్ సిటీ, మా జనాలు స్లీపింగ్ బ్యూటీలు.. వాళ్లు



నిద్దర్లేచి ఇవన్నీ సర్దుకునేదాకా ఇక్కడే ఉండండి." అని ఆట పట్టిస్తూ కారు పార్కింగ్ వైపు కదిలాను.

అక్కణ్నుంచి ఇంటికెళ్లేదాకా దారికిరువైపులా కూకటివేళ్లతో పెకలించుకుపోయి కూలిపోయిన మహా వృక్షాలనీ, నేలకు జీరాడేలా వంగిపోయిన చెట్లనీ, ఆకన్నదే లేకుండా మోడువారి పోయిన వాటినీ చూస్తూ నిశ్శబ్దమయిపోయింది సుశీలా నాయర్.

నేనేం కదిలించలేదు. కారు ఎన్ఏడీ జంక్షన్ దాటి, ఎన్ఎస్‌టీఎల్ గేటు దగ్గరకు రాగానే "కారాపు కారాపు" అని గోలచేసింది.

ఆపగానే కెమెరా తీసుకుని దిగింది. ఎన్ఎస్‌టీఎల్ ప్రహరీగోడకు అటువైపు భవనాలున్నట్టే తెలియనివ్వకుండా అంతెత్తున పెరిగిన చెట్లు తుఫానుకు నేలకూలిపోయాయి. దాంతో బట్టల్లేకపోతే బిడియ పడుతున్న చిన్నపిల్లలా కనిపిస్తోంది లోపలి భవనం. ఈవిడ కెమెరా అటు తిప్పుతుంటే నాకు భయమేసింది. అసలే అది నేవీ వాళ్ల ప్రయోగశాల. ఇలా ఫోటోలు తీస్తున్నట్టు తెలిసిందంటే అక్కడే పట్టుకుని చితగ్గొడతారు. కాని సుశీలగారి కెమెరా గోడకు ఇటువైపునే, పేవ్‌మెంట్ పక్కకే, నేల మీదకు ఫోకస్ అవడం చూసి హమ్మయ్య అనుకున్నాను.

చూస్తే... అక్కడ పడిపోయిన ఒక పెద్ద రావిచెట్టుకు చిన్నచిన్న లేత చిగుళ్లొస్తున్నాయి. వాటి పచ్చదనం ఎంతందంగా ఉందో మాటల్లో చెప్పలేను. కాండం నుంచి చిన్నగా వస్తున్న వాటిని తన కెమెరాలో బంధించడం పూర్తయ్యాక ఆమె మొహంలో మొదటిసారి నవ్వు మొలిచింది.

"ఇదే ప్రకృతి. ఇదే జీవితం. చెబితే విన్నావా? ఈ లేత చిగురును చూసిన ఆనందం ముందు మరేదీ సాటిరాదు కదా అని గెంతినట్టుగా కార్లోకి దూకి కూర్చుందావిడ. నవ్వి కారును ముందుకు పోనిచ్చాను.

"సిటీ దర్శనం అయ్యాక ఈసారి బావికొండకు మరోసారి వెళ్లాలి గిరికా" అన్నది.

సాయంత్రం విషయం చెబితే "ఎన్నాళ్లబట్టీ అనుకుంటున్నానో... బావికొండ చూడాలని... నేనూ వస్తానువోయ్..." అంటూ రామినాయుడు కూడా ఉత్సాహపడ్డారు.

"మా మళయాళీ మేడమ్‌కి వచ్చిన తెలుగే అంతంత మాత్రం. మీ శ్రీకాకుళం వెటకారం ఆవిడకి అర్థమవదు."అని జాగ్రత్త చెప్పాన్నేను.

"అచ్చిచ్చీ... నేనెంత బుద్ధిమంతుణ్నో నీకు తెల్సుగదేటి. ఎక్కణ్నుంచో ఒచ్చినోళ్లతో మనకేటి ఎటకారాలు చెప్మీ" అనేసి ఫోను పెట్టేశాడాయన. రెండో రోజు ఉదయాన్నే బావికొండకు మా ప్రయాణం మొదలైంది.

దారి పొడుగునా ఈవిడ బౌద్ధం గురించి నాకు బోధ చేస్తూనే ఉంది. నేను మాత్రం పెద్దగా వాటిని చెవినేసుకోకుండా... రోడ్డుకిరువైపులా కోతకొచ్చిన వరి పొలాలను, అక్కడక్కడా ఉన్న చెరుకు పంటనూ చూస్తూ ఊకొడుతున్నాను. చుట్టూ మావిడిచెట్లు, అశోక చెట్లతో ఉన్న ఒక తోట వంటి ప్రదేశం వచ్చింది. అక్కణ్నుంచి బావి కొండ పైకి మెట్లున్నాయి.

"బావులు, అదే, స్తూపాలు సూడాలంతె మెట్లెక్కి ఎల్లవలిసిందే. టిక్కెట్టుగిక్కెట్టు ఏటీనేదు..." అంటూ అక్కడ చీపురుతో ఎండుటాకులను శుభ్రం చేస్తున్న ఒకామె చెప్పింది.

ఆమె తప్పితే అక్కడ మరో మనిషి అలికిడి లేదు.

"ఇక్కడ అప్పన్న ఉండాలి కదా.. ఆమె ఏదీ?" అడిగాన్నేను కుతూహలంగా.

"అప్పన్నా, అది మా అప్పే. మా గుంటణ్ని స్కూలుకి పంపేసి ఒస్తాది. అప్పన్నొచ్చేక నానెలిపోతాను. మీకది తెలుసేటి?" అడిగిందామె అంతే ఆసక్తిగా మమ్మల్ని చూస్తూ.

తెలిస్తే ఎలాగ తెలుసో చెప్పాలి. అది నాకిష్టం లేదు.

"సరేలే, కొండమీదికెళ్లొస్తాం..." అని పైకి దారి తీశాను. సుశీలా నాయర్, రామినాయుడు నన్ను అనుసరించారు.

బుద్ధుడి శరీరంలోని ఎముకనొకదాన్ని భరిణలో పెట్టి బావికొండ స్థూపంలో భద్రపరిచారని, దాంతో పాటు ఎన్నో ఏళ్ల కిందటి మట్టి పాత్రలు దొరికాయని చెప్పింది అక్కడ భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెచ్చులూడుతున్న బోర్డు. అంతకుమించి ఆసక్తికరమైన వివరాలేమీ లేవక్కడ. మెట్లెక్కేసరికి ఆయాసమొచ్చేసింది. సుశీలా నాయర్ మాత్రం తన గున్న శరీరాన్ని పిచికలాగా గెంతులేయించి చకచకా తిరుగుతూ ఫోటోలు తీసుకోవడంలో మునిగిపోయింది.

అక్కడ ఒక గుహలో బుద్ధుడి విగ్రహం ఉంది, దాని ముందు మట్టి ప్రమిదల్లో నూనె పోసి ఎవరో వెలిగించిన దీపాలు రెండు మినుకు మినుకుమంటూ వెలుగుతున్నాయి. విగ్రహానికి పసుపూకుంకుమా పూసి ఉన్నాయి.

"ఈ విచిత్రం చూసేవా? ఏ బుద్ధుడైతే విగ్రహారాధన వద్దని చెప్పాడో, జీవితమంతా దాన్ని నిరసించాడో ఆ బుద్ధుడికే విగ్రహం ఉండటం? పైగా దానికి పూజలు..." అంటూ గలగల్లాడింది సుశీల.

"అదేదో మా వైజాగువాళ్లొక్కళ్లే చేసినట్టు నవ్వుతారేంటి? అఫ్ఘనిస్తాన్ మొదలుకొని అన్నిచోట్లా బుద్ధుడికి నిలువెత్తు విగ్రహాలున్నాయి. పైగా రకరకాల భంగిమల్లో. చైనా బుద్ధుడికి చిన్న కళ్లుంటాయి, జపాన్‌లో బుద్ధుడు పొట్టిగా ఉంటాడు... ఏ దేశానికా బుద్ధుడన్న మాట..." ఉడుక్కుంటూనే, ఏదో కనిపెట్టేసినట్టు నవ్వాను నేను. "బుద్ధుడే కాదు, ఏ గొప్ప వ్యక్తికైనా ఇది తప్పదనుకుంటాను.

వాళ్లు చెప్పిన మార్గంలో నడవడానికి మనకెన్నో అడ్డంకులుగాని, బొమ్మ పెట్టి పూజచేసి, అవతలివాళ్లను భగవంతుణ్ని చేసెయ్యడానికి మనం సిద్ధంగా ఉంటామనుకుంటా..." అన్నదావిడ.

మా రామినాయుడు ఇవన్నీ పట్టించుకోకుండా దేన్నో చిన్నగొంతుతో పాడుకుంటూ ఆ స్థూ పాల చుట్టూ తిరుగుతున్నాడు.

బావికొండ పైనుంచి చూస్తే చుట్టూ ఎన్నో ఎకరాల మేర విస్తరించిన పంటపొలాలు కనిపించాయి. చాలావాటిలో కోతలు జరుగుతున్నాయి. కూలీల కోలాహలం, ట్రాక్టరు చప్పుళ్లు కొండ మీది నిశ్శబ్దాన్ని అప్పుడప్పుడు పగలగొడుతున్నాయి.

పౌష్యమాసపు ఉదయం పదిగంటల వేళ ఎండ, గొడుగులాంటి ఆకాశం, చుట్టూ ఆవరించిన వరిచేలు, దూరాన నల్లగా కనిపిస్తున్న కొండలు, ఎదురుగా స్థూప శిథిలాలు.... ఒక పెద్ద రంగుల చిత్రంలో నేనూ ఒక పిక్సెల్‌నయిపోయినట్టు అనిపించింది నాకు.

అంతా తిరిగి వచ్చిన సుశీలానాయర్ నిశ్శబ్దంగా నాపక్కన కూర్చుంది.

"గిరికా, ఇలాంటి ప్రదేశాలకు ఎందుకు వెళ్లాలో ఎప్పుడైనా ఆలోచించావా?

నేనేం మాట్లాడలేదు. సమాధానం ఆవిడే చెబుతుందని తెలుసు.

"చిన్న ప్రదేశాల్లో, ఇరుకిరుకు ఆలోచనల్లో పడి కొట్టుకుపోతుంటాం మనం నిత్యం. అప్పుడప్పుడూ ఇలాంటి చోట్లకు వచ్చినప్పుడు మనం గొప్ప విషయాల గురించి ఆలోచించడం, వాటిలో ఎంతోకొంత భాగం కావడం జరుగుతుంది. సముద్రం ముందు నిల్చున్నప్పుడు నీకిది అనుభవానికి రాలేదూ? శాశ్వతమైనవి ఏవో, కానివేవో మనకిలాంటి సందర్భాల్లో బోధ పడుతుంది కదా..."

అవునన్నట్టు తలూపాను నేను.

రెండు గంటల తర్వాత మేం కిందకొచ్చేసరికి ఇదివరకు ఆ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఆడమనిషి మరో మూల ఇంకా తుడుస్తూనే ఉంది.

"నీల్లుగాని కావాలేటమ్మ తాగనానికి?" అనడిగింది పక్కనున్న కుండని చూపిస్తూ. వద్దన్నాన్నేను. "అయితేవూరునించి ఒచ్చినారమ్మ..." అని మరో ప్రశ్న వేసింది.

"నేనిక్కడే వైజాగునించి. ఆ సంచి పట్టుకున్నాయనది శ్రీకాకుళం. అదిగో ఫోటోలు తీస్తోంది చూడు.. ఆవిడది మాత్రం బెంగుళూరు... ఫోటోలు తీసి, ఈ ఊరు గురించి పెద్దపెద్ద పత్రికల్లో రాస్తుందావిడ..." అని చెబుతూ ఉండగా అప్పన్న రావడం కనిపించింది.

"ఎవలితో మాట్లాడుతున్నవే ఓలమ్మి..." అంటూ వచ్చిన అప్పన్న మమ్మల్ని చూసి ఒక్క క్షణం అలా నిలబడిపోయింది. అంతలోనే తేరుకుని "బాగున్నారా అమ్మగోరూ..." అంటూ పలకరించింది.

అంతగా ప్రసిద్ధికెక్కని బౌద్ధక్షేత్రాల గురించి పరిచయం చెయ్యాలన్న తలంపుతో తిరుగుతూ కిందటి వేసవిలో సుశీలానాయర్ ఇక్కడికీ వచ్చింది.

ఆరోజు నాకింకా గుర్తుంది.

అప్పుడు మేం వచ్చేప్పటికి ఆమె ఆ తోటను శుభ్రం చేస్తోంది, పద్నాలుగేళ్ల పిల్ల ఒకత్తి ఎగిరెగిరి దూకుతూ మావిడికాయలు తెంపడంలో బిజీగా ఉంది. అప్పుడు మేం వచ్చినప్పుడు మంచినీళ్లిచ్చి, ఆ పిల్ల మావిడికాయలిచ్చింది.

"పైకెల్లాలంటే మెట్లున్నాయి. ఇక్కడ గేటు తాలాలు తియ్యడానికి మరో పదినిమిసాలు పడుతుంది. అందాకా ఇక్కడ కూచోండి.. అదయ్యాక శివుడి గుడికీ ఎల్లాలి... కావాలంటే నేనూ ఒచ్చి చూపిస్తా..."అని చెప్పింది.

సుశీలానాయర్ "చదువుకుంటున్నావా? అయితే నీ గురించి నువ్వు ఇంగ్లీషులో చెప్పు..." అనడిగితే తడుముకోకుండా "మై నేమీజ్ కొండతల్లి. ఐయామ్ స్టడీయింగ్ టెంత్ క్లాసిన్ గవర్నమెంట్ హైస్కూల్. నౌ కమింగ్ టు ఇంటర్మీడియెట్. మై మదర్స్ నేమీజ్ అప్పన్న, మై ఫాదర్స్ నే మీజ్ చెల్లయ్య. దే ఆర్ కూలీస్...." అని గడగడా చెప్పేసింది.

"హౌ స్మార్ట్ షీ ఈజ్..." అని నాతో అంటూ ఇంకా సుశీల ఏదో అడగబోతోంది, పైకి వెళదామని చప్టా మీద నుంచి లేచాం. అంతే చెట్టు పైనుంచి సరిగ్గా కొండతల్లి మీదకు ఒక పెద్ద పాము పడింది!

పాముని తెలుసుకుని విదిలించేలోపే ఆ పిల్ల తల మీదా, నుదుటి మీదా రెండుసార్లు కాటేసి జరజరా పాకి కిందకొచ్చి మాయమైపోయింది.

నేనూ సుశీలా కీచుగా అరిచాం. కొండతల్లి "అమ్మా... ఓలమ్మా... పాము కరిసీసినాదే అమ్మా...." అంటూ విరుచుకు పడిపోయింది. అప్పన్న చీపురు పారేసి వచ్చింది, ముగ్గురం సాయం పట్టి పిల్లను కార్లోకెక్కించి దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లాం.

అనకాపల్లి ఊళ్లోకి పది నిమిషాల ప్రయాణం... కొండతల్లి గొంతులోంచి వెలువడుతున్న గురక లాంటి శబ్దం, అప్పన్న భయంకరమైన ఏడుపు, సుశీల చెమట్లతో కారు నిండిపోయి ఊపిరాడనట్టనిపించింది.

డాక్టరు చూసి పెదవి విరిచేశాడు. మరో అరగంటలోపే ఆ పాప శరీరం రంగు విరిగిపోయింది, వేడి చల్లబడిపోయింది. కబురు తెలిసిన వెంటనే వాళ్ల బంధువులు, వీధిలోని ఇరుగూపొరుగూ ఓ యాభైమంది వరకూ పరుగులు పెడుతూ వచ్చేశారు. వాళ్ల ఏడుపులూపెడబొబ్బలతో దద్దరిల్లిపోయింది ఆస్పత్రి. మా ప్రమేయం ఏమీ

లేని స్థితిలో ఇంటికెలాగ వచ్చిపడ్డామో మాకే తెలియలేదు. మర్నాడు సుశీలానాయర్ ప్రయాణమై వెళ్లిపోయింది.

మళ్లీ ఇదిగో... ఇప్పుడొచ్చింది!

మమ్మల్ని చూడగానే ఏడాది కిందటి విషాద సంఘటన అప్పుడే జరిగిందన్నట్టుగా అప్పన్న మొహంలో ఒక దుఃఖప్రవాహం పొంగిం ది. ఇక నిలబడలేనన్నట్టుగా ఆమె నేల మీద గొంతుకిలా కూర్చుండి పోయింది.

“ఒక్కగానొక్క పిల్లమ్మ... ఎంత ఒద్దనుకున్నా దుక్కమొచ్చేసే...” అంది.

మళ్లీ సర్దుకుంది.

“ఎలాగున్నావు అప్పన్నా...” అడిగింది సుశీల గొంతు పెగుల్చుకుని.

“ఏదో ఇలాగున్నావమ్మ. ఏటి సెయ్యగలవమ్మ మావు? మావని కాదు, అసలు ఎవులైనా ఏటి సెయ్యగలరు? మృత్యుదేవత ఎవులికై న సెప్పొస్తాదేటి? దానికలగ ఒచ్చినాది. ఎంతేడిచినా నా కూతురు మళ్లీ ఒస్తాదేటమ్మా. మా కొండ మీద దేవుడి కత ఒకాయన సెప్పినాడు. ఒకావిడ నాలాగా సచ్చిపోయిన కొడుకును బతికిం చమని ఆయన్ని అడిగిందట. సావు లేని ఇంటి నుంచి గుప్పెడు గింజలు పట్రామన్నాడట ఆ దేవుడు. అవి తెస్తే మంత్రమేసి బతికి ద్దువన్నాడట. సావు లేని ఇల్లెక్కడుంటాదమ్మ. ఆయమ్మ తేలేక పోయిందట. అందరింట్లోనూ సావుంటాదని అర్థం సేసుకున్నాదట. ఇలాంటి కతలు ఇన్నప్పుడు మనసు తేలికవుద్దమ్మ” అంటూ దీర్ఘంగా ఊపిరి తీసుకుంది.

తర్వాత తలెత్తి కళ్లు చిత్రంగా తిప్పింది.

“కొండతల్లి మా ఇంట్లో పుట్టిందిగానమ్మ, అసలుకి మా దగ్గర పెరగ వల్సిన పిల్ల కాదమ్మ. అందుకే దేవుడు బేగా తీసుకెలిపోయేడు. ఇంకెక్కడో, మీలాంటి పెద్ద అమ్మగార్లు, అయ్యగార్లింట్లో ఈపాటికి పుట్టించీసుంటాడు. ఆలయితే బాగా చూసుకుంతారు. మీలాగా ఇంగిలీసు మాట్లాడిపిత్తారు, మంచిమంచి గవున్లేసి కార్లల్ల తిప్పుతారు...” అంటూ అదంతా తాను కళ్లెదురుగా చూస్తున్నట్టే చిర్నవ్వు చిందించింది.

అటువంటి అందమైన దృశ్యమేదో చూస్తున్నట్టే అనిపించింది మాకూను.

“పోయినోలకోసం పోగలవేటమ్మ. ఇదిగో ఇది మా సెల్లెలు. దీనికి మతి సరిగనేదని చెప్పి మొగుడొగ్గీసినాడు. దీని కొడుకునిప్పుడు పెంచుతున్నను. ఆడింకా రెండో తరగతే. అయితే మాత్రం, బలే సదువుతాడమ్మ...” అంటూ చెప్పుకుపోయింది.

ఎంత వద్దంటున్నా వినకుండా ఆమె చేతిలో కొన్ని నోట్లు కుక్కింది సుశీలానాయర్.

మా కారు వెనక్కి విశాఖపట్నానికి బయల్దేరింది.

"....జీవితంపు చిక్కుముడులు విడవెంతగ సడలించిన
జడిగొల్పే దుఃఖంలో తడవకుండ గొడుగులేదు
మనుజునిలో మరణ భీతి, మదిలో దుఃఖానుభూతి
ఆలోచనలన్నిటికీ ఆంతర్యంలో పునాది
ఈ సృష్టికి ఏమిటర్థం, మానవునికి గమ్యమేది....""

తాను తరచూ పాడే శ్రీశ్రీ కవితనొకదాన్ని రామినాయుడు తన గొంతులో శృతి చేసి పాడటం మొదలుపెట్టాడు.

“అర్థం అయీకావడం లేదు, కొంచెం వివరంగా చెప్పు...” అన్నది సుశీలా నాయర్.

నేను చెప్పాను. అది శ్రీశ్రీదని చెప్పకముందే “సృష్టికి అర్థం ఏమిటని పాడుతున్నాడా....” అని అడిగిందావిడ.

“అప్పన్నను, బావికొండనూ, ఇప్పుడు కొత్త చిగుళ్లేస్తున్న విశాఖ పట్నాన్నీ చూసేక కూడా ఆ ప్రశ్న ప్రశ్నగానే ఉందా ఆయనికి?” అని కూడా అడిగింది.

ముందు సీట్లో కూర్చున్న రామినాయుడు వెనక్కి తిరిగి మా ఇద్దరి వైపూ చూసి నవ్వేడు!!





# వేదికలు - పాదుకలు

వసుంధర



"హలో - ఎవరూ నేను భారతిని మాట్లాడుతున్నాను ...."

"హలో, అమ్మా! నేను - సృజన్ - కాలర్ ఐడీ చూడలేదా?"

"నువ్వా? కళ్ళజోడు పెట్టుకోలేదురా! ఏంటి విశేషం? అంతా బాగున్నారా?"

"బాగున్నామమ్మా, విశేషమంటే విశేషమే! ఆ మధ్య ఇండియాలో వారసత్వంగా నాకొచ్చే ఇల్లూ పొలం నాకవసరం లేదని చెబితే నువ్వేమన్నావో గుర్తుందా?"

"ఈ వారసత్వాన్ని వదులుకోవడం వల్ల పేదవాళ్ళకి సాయం చేయ్యొచ్చని మెచ్చుకున్నాను. కానీ మన సంప్రదాయం మాత్రం వదలకూడని వారసత్వమని కూడా చెప్పాను"

"అదే చెబుతున్నా! మొన్న హారిస్బర్గులో తెలుగువాళ్ళం మీట్ పెట్టుకున్నాం. అక్కడ ఫుడ్-కోర్ట్స్ లో జయ బొబ్బట్లు పెట్టింది. ఏకగ్రీవంగా నెంబర్ వన్ ఐటంగా సెలక్ట్ అయింది . క్రెడిట్ నాది కాదు, రెసిపీ మా అత్తయ్యదని చెబితే అక్కడ నీ పేరు మోగిపోయిందనుకో"

"జయ బొబ్బట్లు చేసిందా? అందుకు నువ్వొప్పుకున్నావా? నేనక్కడికొచ్చినప్పుడు సంక్రాంతి కి బొబ్బట్లు చేస్తే ఔటాఫ్ డేట్ పిండివంట ని మీరిద్దరూ నన్నీడ్చిపారేశారు కదురా!"

"నువ్వు మరీనమ్మా! పిల్లలకి పీజాలూ, కేకులూ ఇష్టమన్నాం, అది ఈడ్చిపారేయడమా?"

"చెప్పేలా చెపితే పిల్లలకి మాత్రం ఎందుకు నచ్చవు? అసలవి ముందు మీకే నచ్చవు. ఇంతకీ నీకు తెలుసా? ఆ రోజు మీరు బయటికెళ్ళేక పిల్లలొచ్చి నన్నడిగి ఒక్కొక్కళ్ళు రెండేసి బొబ్బట్లు తిన్నారు. మీకు చెప్పొద్దని బ్రతిమాలారు. ఎందుకో మీరు చెప్పాలి మరి! మన వంటలు, సంప్రదాయం - వీటిని మర్చిపోవడానిక్కాదు, మీరక్కడికెళ్ళింది? హారిస్బర్గ్ లో సమావేశం పెట్టి, మీకీ విషయం గుర్తు చేసిన వాళ్ళకి నా అభినందనలు"

"ఐతే నువ్వు నన్నభినందిచాల్సిన విషయం కూడా ఒకటుంది. నువ్వ నేదానివిగా, భాషంటే అమ్మ, సాహిత్యం ఆ అమ్మ ఉండే మేడా అని! ఆ ప్రేరణ తోనే వచ్చే నెల్లో బ్రిడ్జివాటర్లో తెలుగు లిటరరీ మీట్ ఒకటి ప్రపోజ్ చేశాను, అంతా ఒప్పుకున్నారు".

"ఏంటీ, సాహితీ సమావేశం నువ్వు ప్రతిపాదించావా? నమ్మడం కష్టం. అది వేరెవరి ఘనతో అయ్యుండాలి. నిజం చెప్పు"

"అదేంటమ్మా అలాగనేశావ్! ఇండియాలో నేనెన్ని తెలుగు పుస్తకాలు చదివానో నీకు తెలీదా?"

"ఆ చదివావులే నా బలవంతమ్మీద! ఒకసారి అలవాటయ్యేక నీ పిల్లలు బొబ్బట్ల మీద మనసు పడ్డట్లే అప్పట్లో నువ్వూ వెతుక్కు వెతుక్కు చదివిన మాట నిజమే! కానీ అమెరికా వెళ్ళేక ఏదీ, నువ్వు చదివిన తెలుగు పుస్తకం ఒకటి చెప్పు!"

"ఒకటి కాదు, వందున్నాయి, ముందసలు నేను చదవనన్న అనుమానం నీకెందుకొచ్చిందో చెప్పు"

"చెప్పడానికేముందీ - నీ పిల్లల్ని చూస్తున్నాగా, ఒక్క తెలుగు ముక్క రాదు. వరసలు కూడా అమ్మకి మమ్మీ, నాన్నకి డాడీ, నానమ్మకి గ్రానీ, నా వరకు చూస్తే - మీ పక్కింటి అమెరికన్ పిల్లలకీ, వీళ్ళకీ తేడాలేదు. మనవాళ్ళు మనవాళ్ళు అనిపించడానికి రక్త బంధమేనా, భాష కూడా ముఖ్యం!"

"నన్నేడిపించాలని అలాగంటావు గానీ, ఇప్పుడు అక్కడి పిల్లలే తెలుగు మాట్లాడ్డంలేదని నీకు తెలీదా? మేమిద్దరం పొద్దున్ననగా

వెళ్ళి, రాత్రికి ఇంటికొస్తాం. పిల్లలకి స్కూల్లో ఇంగ్లీషు.. చుట్టు పక్క లంతా ఇంగ్లీషు... వాళ్ళని చూసుకునే నానీ ఇంగ్లీషు... షాపుల్లో ఇంగ్లీషు. మధ్యలో తెలుగు మాట్లాడితే, మేమిద్దరం వాళ్ళకి పరాయి వాళ్ళైపోతున్నాం. అందుకే ఈ పరిస్థితి వచ్చిందితప్ప మాకు తెలుగు మీద ప్రేమ లేక కాదు..."

"నువ్విలాగంటున్నావు. మరి మహానుభావుడు ఆ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, ఎక్కడా తెలుగు లేనట్లు పాడుతా తీయగా కార్య క్రమం కోసం అక్కడికొచ్చాడు. అమెరికా పిల్లలు కదా వీళ్ళ తెలుగు వినేదెలాగరా బాబూ అని హడిలి చచ్చాను. కానీ ఒక్క పొల్లు మాట లేకుండా, ఉచ్చారణలో చిన్న దోషం లేకుండా చెవులు తుప్పు వదిలే మధుర గాత్రాలతో, తప్పులెన్నలేని సంగీత స్వరజ్ఞానంతో ఆ పిల్లలం దరూ ఎంత బాగా పాడుతున్నార్రా? ఇక్కణ్ణించొచ్చినాయనే కాసేపు వాళ్ళతో గడిపి ఇంత సాధిస్తే నువ్వేమిట్రా, రోజంతా పిల్లల్తో ఉంటూ ఏవో కథలు చెబుతావు! తప్పు పిల్లలిది కాదు, వాళ్ళకు ప్రేరణ కాలేని మీదే. ముందు మీకు సంప్రదాయం మీద అభిమానం, గౌరవం ఉండాలి"

"నీకలా ఎందుకనిపించిందో కానీ, సంప్రదాయం నాప్రాణం. అప్పుడే ఎవరి దగ్గరా అనకు – త్వరలో నేనిక్కడ మన ఆరువేల నియోగి బ్రాహ్మలందరినీ కూడగట్టి ఓ సాహితీ సంస్థ ప్రారంభిం చబోతున్నాను"

"ఏడిసినట్లుంది. సంప్రదాయమంటే కులం, మతం ప్రాంతం వగైరా కాదు. వాటికి అతీతమైన భాష, సాహితి, సంస్కృతులది, ఏ భాషా సంస్థైనా – భాషతో మాత్రమే ముడిపడుండాలి. ఈ శతాబ్దంలో నువ్వన్నలాటి సంస్థ ప్రారంభిస్తే నలుగురూ ముఖం తగలేస్తారు"

"నేనలా దొరకనమ్మా! ఆసంస్థ పేరు స్నాటా. అంటే సెకండ్ టు నన్ అసోసియేషన్ ఆఫ్ తెలుగూస్ (ఎస్ ఎన్ ఎ టి ఎ). దాని గూఢార్థం తెలుసా? సెకండ్ టు నన్ అంటే నన్నయ్య తరువాతి వాడనీ అంటే తిక్కనని, తిక్కన ఆరువేల నియోగి కదా, అదన్న మాట"

"ఓరినీ మనం ఆరువేల నియోగులమని ఇక్కడున్న నేనే మర్చి పోయాను. నువ్వక్కడికెళ్ళి గుర్తుంచుకున్న గొప్ప సంప్రదాయం ఇదన్న మాట! పైగా గొప్పగా చెప్తున్నావ్! ఇక్కడైతే పేదరికం పేరిట కొందరూ, కులం పేరిట కొందరూ బాగా వెనకపడ్డారు. అందుకని కుల ప్రస్తావన కొంత అవసరపడిందని సరిపెట్టుకోవచ్చు. అక్కడం తా ఒకే లాగున్నారుగా, డబ్బుతో మూలుగుతున్నారుగా – మీకెందు కురా ఈ కులాలూ శాఖలూనూ..."

"ఏమోనమ్మా! కలిసి పని చేయడానికి ఇక్కడ కూడా అవే ప్రేరణ ఔతున్నాయి. మనం ఫలితాన్ని చూడాలి కానీ, మిగతావి పట్టించుకో కూడదు. ఒకప్పుడిక్కడి జనం ఇండియా అంటే ఎక్కడుందీ అనే వారు. ఇప్పుడు తెలుగంటే – ఏ జిల్లా, ఏ తాలూకా అని అడుగు తున్నారు. అప్పట్లో మన గుడి అనగానే, పిట్స్ బర్గ్ అనే వారు. ఇప్పుడు ఊరూరా ఓ గుడి. అప్పట్లో వెజిటేరియన్ అంటే నవ్వేవారు. ఇప్పుడెక్కడ చూసినా దోశా ఎక్స్ ప్రెస్సులూ, ఉడిపి హోటళ్ళూనూ. సబ్జీమండీ ఇంగ్లీషు పేరైపోవడమే కాదు తెల్ల అమెరికన్లకీ షాపింగ్ సెంటరైంది. థియేటర్లో తెలుగు సినిమాలు వేస్తున్నారు"

"ఇవన్నీ అక్కడికొచ్చినప్పుడు నాకు చూపించావుగా! అప్పుడు నయాగరా జలప్రాంతం దగ్గర తిన్న మసాల దోశ రుచి కూడా ఇప్ప టికీ గుర్తుంది. నేనంటున్నది మీ దైనందిన అవసరాలు తీర్చే వాటి గురించి కాదు. సాంస్కృతిక సంప్రదాయ అవసరాల గురించి... "

వాటికి మాత్రం ఏం లోటమ్మా! పండితుల్ని రప్పించి అవధానాలు చేయిస్తున్నాం. జ్ఞానుల్ని రప్పించి ప్రవచనాలు చెప్పిస్తున్నాం. ఇక్కడా, అక్కడా కథల పోటీలు పెట్టి రచయితల్ని ప్రోత్సహిస్తున్నాం. వివిధ రంగాలకు చెందిన కళాకారుల్ని ఏటేటా సత్కరిస్తున్నాం. సాహితీ పత్రికలు నడుపుతున్నాం..."

"ఆగరా బాబూ నువ్వు చెబుతున్నది మీ సంస్థల గురించి. తల్లి భారతిని అద్భుతంగా సేవించడానికి ఆ సంస్థలు ఏర్పరుస్తున్న వేదికల గురించి! ఆ వేదికలకు ప్రపంచం నలుమూలల నుంచీ నా బోటి వారందరూ జోహారులర్పిస్తున్నారు. ఇప్పుడు నేనంటున్నది ఆ వేదికల దాకా నడిచి వెళ్ళే పాదుకల గురించి."

"పాదుకలంటే మేమే కదా! మేము మా సాహితీ పరిజ్ఞానాన్ని పునశ్చరణ చేస్తున్నాం. పిల్లలకు తెలుగు పద్యాలూ పాటలూ నేర్పి ప్రదర్శనలిప్పిస్తున్నాం. మన కట్టూబొట్టూ తెలిసేలా విచిత్ర వేషధార ణ చేయిస్తున్నాం, బుఱ్ఱకథలు హరికథలు చెప్పిస్తున్నాం. నాటకాలు వేయిస్తున్నాం. మావంతు మేంచేయకుండా ఆ వేదికలెలా అర్థవంత మౌతాయి? వాటి సాఫల్యం వెనక మా అవిరళ కృషి ఉంది"

"ఉందనుకో, కానీ నువ్వే అన్నావుగా – చేసిందంతా వేదికల కోసమే నని! భాషంటే అమ్మరా! ఆ అమ్మని అప్పుడప్పుడూ వేదికనెక్కించి గౌరవించడం బాగానే ఉంది. కానీ ఇంట్లో కూడా ఉంచుకోండిరా. లేకపోతే ఖరీదైన వృద్ధాశ్రమాలకీ ఆ వేదికలకీ తేడా ఉండదు.."

అమ్మ గొంతు మూగవోయినట్లైంది. నేనేదో అనే లోగా – "డాడ్, మాం ఈజ్ కాలింగ్" అన్న మా అబ్బాయి మాటతో అప్పటికి ఫోన్ కట్ చేయాల్సి వచ్చింది.

# రాజు - కవి

డా. భాస్కర్ కొంపెల్ల

తెలుగువాళ్లకి కవులు అనగానే రెండు గుర్తుకొస్తాయి. ఒకటి వాళ్ళు రాసిన కవిత్వం, తర్వాత వాళ్ళని పోషించిన రాజులు. తెలుగులో పేరున్న కవి-రాజు జంట తెనాలి రామకృష్ణుడు — శ్రీకృష్ణదేవ రాయలు. వీళ్ళ ఛలోక్తులూ, సమస్యాపూరణలూ "తెనాలి రామకృష్ణ" సినిమాలో చూపించారు. పూర్వం రోజుల్లో సంస్కృతంలో ఇలాంటి కవి-రాజు జంట ఉండేది. కాళిదాసు-భోజుడు. వాళ్ళ గురించిన కొన్ని కథలు సంస్కృతంలో భోజప్రబంధం నుంచీ, తెలుగులో భోజ రాజీయం నుంచీ తీసుకుని ఇక్కడ చెప్పుకుందాం.



★ ★ ★

భోజుడి ఆస్థానంలో ఉన్నవాళ్ళల్లో కాళి దాసు అందరికన్న గొప్ప వాడు. దాంతో అతనికి భోజుడు చాలా స్వేచ్ఛనిచ్చాడు.

ఒకసారి భోజుని భార్య లీలావతి చెలికత్తె తో ఏకాంతంగా ఏదో మాట్లాడుతోంది. భోజుడు అదేం పట్టించుకోకుండా వాళ్ళ దగ్గరకి వచ్చేస్తూంటే చెలికత్తె వెళ్ళి పోయింది. వెంటనే లీలావతి నవ్వుతూ "రండి మూర్ఖులవారూ!" అంది. భోజుని మనస్సు చివుక్కుమంది. కాని "లీలావతి పండితురాలు. ఆ మాట అనడంలో ఏదో అంతరార్థం ఉంది" అనుకుని అదెలాగైనా తెలుసుకోవాలని, మర్నాడు సభకి వెడు తూ, కనిపించినవాణ్ణల్లా "అరే మూర్ఖా! ఎలా ఉన్నావ్" అనడం మొదలుపెట్టాడు. అందరూ విస్తుపోతున్నారు కానీ మారుమాట్లాడే ధైర్యం లేదు. భోజుడు కాళిదాసు కనబడగానే మళ్ళీ అలాగే పల కరించాడు. దానికి కాళిదాసు చిరునవ్వు నవ్వి

**ఖాదన్న గచ్ఛామి, హసన్న జల్పే, గతం న శోచామి, కృతం న మన్యే|**
**ద్వాభ్యాం తృతీయో న భవామి రాజన్! కిం కారణం భోజ! భవామి మూర్ఖః?||**

అని అడిగాడు ( ఓ భోజరాజా! నేను తింటూ నడవను. నవ్వుతూ మాట్లాడను. నష్టపడ్డదాన్ని గురించి ఏడుస్తూ కూర్చోను. నేనే అంతా చేశానని అనుకోను. ఇద్దరు మాట్లాడుకుంటూంటే వెళ్ళి చొరబడ ను. నేను మూర్ఖుణ్ణి అనడానికి కారణం ఏమిటి). రాజుకి పెళ్ళాం ఎందుకలా అందో బోధపడింది. "ఇది ఒక సమస్యగా ఇచ్చా. బాగా పూరించావు" అని కాళిదాసుని సత్కరించాడు.

★ ★ ★

భోజుడు అన్ని వృత్తుల్లో ఉన్నవాళ్ళకీ సాహిత్యంలో ప్రవేశం కలిగి ఉండాలనే ఆశతో సాహిత్యంలో కృషిచేసే వాళ్ళందరికీ బహుమా నాలిచ్చేవాడు. ఒకరోజు కువిందకవి అనే గొప్ప పండితుడొచ్చి భోజుణ్ణి మెప్పించాడు. భోజుడు అతణ్ణి తన రాజధాని ధారానగరం లోనే అట్టేపెట్టుకోవాలని నిశ్చయించుకుని, తన మంత్రిని పిలిచి, కువిందకవికి ఒక ఇల్లు ఏర్పాటు చెయ్యమన్నాడు. ధారానగరంలో ఎవడైనా మూర్ఖుడుంటే, వాణ్ణి ఊరి బయటకి పంపించేసి కువింద కవిని ఆ ఇంట్లో పెడితే రాజు ఏమీ అనడుగదా అని అనుకుని అలాంటివాడికోసం వెతికాడు మంత్రి. అలా వెతుకుతూంటే, ఒక బట్టలునేసే సాలెవాడు కనిపించాడు. అతన్ని చూసి 'చదువులేని వాడే అయియుంటాడులే' అనుకుని ఇల్లొదిలి పొమ్మన్నాడు. ఆ సాలెవాడికి కోపం వచ్చి భోజుడి దగ్గరకి వెళ్ళి "కులవృత్తి చేసుకుంటు న్నా గాబట్టి నేను మూర్ఖుణ్ణను కుంటున్నా వా?" అని ఒక శ్లోకం ఆశువుగా చెప్పాడు.

**కావ్యం కరోమి న హి చారుతరం కరోమి,**
**యత్నాత్కరోమి యది చారుతరం కరోమి|**
**భూపాలమౌళిమణిరంజితపాద పీఠ! హే సాహసాంక! కవయామి, వయామి, యామి||**

(సామంతరాజులచేత మొక్కబడే పాదాలున్న భోజరాజా! ఓ తెంపరీ! ఇప్పటికిప్పుడు కావ్యం చెప్పగలను. కాని అది అందంగా రాదు. కొద్దిగా ఆలోచించి కావ్యం చెప్పానంటే మనో హరంగా చెప్తాను. నేను కవిత్వం వ్రాయగలను. నేత నేయగలను. వస్తాను శెలవ్) ఇలా చెప్పగానే భోజుడికి కోపం వచ్చి "కవిత్వం బాగానే ఉంది. కాని నీకు మర్యాద తెలిసినట్టులేదు" అన్నాడు. భోజుని కోపం చూసి సాలెవాడు మళ్ళీ అన్నాడు.

**బాల్యే సుతానాం సురతేంగనానాం స్తుతౌ కవీనాం సమరే భటానాం|**
**త్వంకారయుక్తా హి గిరః ప్రశస్తాః కస్తే ప్రభో! మోహభరః? స్మర త్వమ్!||**

(పసితనంలో పిల్లలు, సంభోగసమయంలో కామికులు, పొగడ్తల్లో కవులు, యుద్ధంలో భటులు వాడే "నువ్వు" అన్న సంబోధన అంద రూ ఒప్పుకునేదేగా! ప్రభూ! ఇదెక్కడి అజ్ఞానం? ఆలోచించి చూడు) భోజుడు వాణ్ణి సత్కరించి "నువ్వు ఇల్లొదక్కర్లేదులే" అన్నాడు

నవ్వుతూ.

★ ★ ★

ఒకరోజు భోజకాళిదాసులిద్దరూ వీధిల్లో నడిచివెడుతూ శృంగారం కలిసిన కవిత్వం గురించి చర్చించుకుంటున్నారు. ఇంతలో అరుగు మీద శిష్యులకి పాఠం చెపుతున్న పండితుడింటి వద్దకి రాగానే "అణో రణీయాన్ మహతీ మహీయాన్" (అణువులో పరమాణువు, మహత్తులో గొప్పమహత్తు) అనే వేదపాఠం వినిపించింది. రాజు మాటలాపి నిలబడ్డాడు. ఇంకో వైపున్న ఇంట్లోంచి "యజ్ఞోపవీతం పరమం పవిత్రం" (యజ్ఞోపవీతం మిక్కిలి పవిత్రమైనది) అని వినిపించింది. ఇంతవరకూ శృంగారం గురించి ముచ్చటిస్తున్న రాజు ఈ వేదమంత్రాలు విని గంభీరంగా మారిపోతూంటే, కాళిదాసు అతన్ని రసికప్రపంచంలోకి వెనక్కి తేవడానికి ఇలా అన్నాడు.

**అణో రణీయాన్ మహతీ మహీయాన్ మధ్యం నితంబశ్చ యదంగనాయాః|**

**తదంగనాలింగన కుంకుమార్ద్రం యజ్ఞోపవీతం పరమం పవిత్రం||**

(ఏ అమ్మాయి యొక్క నడుము అణువులో పరమాణువో (అంటే మహా సన్ననిదో), ఏ అమ్మాయి పిరుదు మహత్తులో కెల్లా గొప్పమహత్తో అలాంటి అమ్మాయిని కౌగిలించుకున్నప్పుడు అంటుకున్న కుంకుమ తగిలి తడిసిన యజ్ఞోపవీతం మిక్కిలి పవిత్రమైనది.) భోజుడు విని ఇహలోకంలోకి వచ్చి ఆనందంతో కాళిదాసుని అభినందించాడు.

★ ★ ★

ఒకసారి భోజరాజు తను చచ్చిపోయింతర్వాత అందరూ ఏమనుకుంటారో అని కుతూహలం పుట్టి, కాళిదాసుని పిలిచి "నేను చనిపోతే నువ్వేమనుకుంటావ్" అని అడిగాడు. కాళిదాసు చెప్పనన్నాడు. భోజుడు కోపం నటించి "నా ఉప్పు తింటూ నా ప్రశ్నకి సమాధానం చెప్పవా? నాకు మళ్ళా కనిపించకు" అని వెళ్ళిపోయాడు. చేసేదిలేక కాళిదాసు ధారానగరం వదిలేసి దూరంగా మరో ఊళ్ళో ఉండడం మొదలుపెట్టాడు. చారుల ద్వారా కాళిదాసు అక్కడ ఉన్నాడని తెలిసి భోజుడు మారువేషంలో ఒక యోగిలా ఆ ఊరు వెళ్ళి కాళిదాసుని కలిసి "కవీంద్రా! మీరెంత కవులో నాకు తెలుసు, ధారానగరంలో మిమ్మల్ని చూశాను. ఎలా ఉన్నారు" అని అడిగాడు. అతడు ధారానగరం నుంచి వచ్చాడని తెలిసి, కాళిదాసు "మా భోజరాజు క్షేమమేనా?" అని అడిగాడు. దానికి యోగి (భోజుడు) "ఇంకెక్కడి భోజరాజు? మీరు వెళ్ళిపోయిన కొద్దిరోజులకే మంచం పట్టి చనిపోయాడు" అన్నాడు. కాళిదాసుకి ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చి

**అద్య ధారా నిరాధారా నిరాలంబా సరస్వతీ|**

**పండితాః ఖండితాః సర్వే భోజరాజే దివంగతే||**

(ఇప్పుడు ధారా నగరం ఆధారాన్ని కోల్పోయింది. భోజరాజు చనిపోవడం వల్ల చదువులతల్లి సరస్వతి ఆసరాలేనిదిగా అయిపోయింది. పండితులందరూ నరికివేయబడినట్లై పోయారు.) ఆమాట వినగానే యోగి రూపంలో ఉన్న భోజుడు తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే కాళిదాసుకి ఆ యోగి భోజుడేనని తెలిసింది. మెల్లగా అతని చెవిలో ఇలా అన్నాడు

**అద్య ధారా సదాధారా సదాలంబా సరస్వతీ|**

**పండితాః మండితాః సర్వే భోజరాజే భువంగతే||**

(భోజుడు భూమి మీదకి రాగానే ఇప్పుడు , అతని ధారానగరం గొప్ప ఆధారం కలదిగా అయింది. సరస్వతికి గొప్ప ఆసరా లభించింది. పండితులందరూ అలంకరించ బడ్డారు). భోజుడు లేచి కూర్చుని కాళిదాసుని బ్రతిమాలి ధారానగరానికి తీసుకెళ్ళాడు.

★ ★ ★

ఒకసారి సభలోకి వస్తూనే "టంటంట టంటం టటటంట టంటం. ఈ సమస్యనెవరైనా పూరించండి" అన్నాడు కవుల్నీ, సభికుల్నీ ఉద్దేశించి. సభలో వాళ్ళు ఆలోచిస్తూండగా, తలంటు పోసుకుని ఉన్నరాజుని చూసిన కాళిదాసు లేచి పూరించాడు.

**రాజ్యాభిషేకే మదవిహ్వలాయా హస్తచ్యుతో హేమఘటో యువత్యాః**

**సోపానమార్గేన కరోతి శబ్దం టంటంట టంటం టటటంట టంటం**

(రాజుకి తలమీద నీళ్ళు పోస్తూండగా అతని అందానికి పరవశత్వం పొందిన ఒక యువతి తన చేతిలో ఉన్న బంగారు గిన్నెని ఒదిలేసింది. అలా ఆ యువతి చేతిలోంచి జారిన గిన్నె మెట్లమీదనించి దొర్లుతూ టంటంట టంటం టటటంట టంటం అని శబ్దం చేస్తోంది) కాళిదాసు పరిశీలనకీ, ఊహకీ రాజు ముగ్ధుడయ్యాడు.

★ ★ ★

భోజకాళిదాసులిద్దరికీ విలాసవతి అనే ఒక స్నేహితురాలు ఉండేది. సంగీతం, నృత్యం, సురాపానంలాంటివి కలిసి చేసేవారు. విలాసవతి ఇద్దర్నీ ఒకేసమయంలో ఇంటికి రానిచ్చేది కాదు. ఇద్దరితో విడివిడిగా గడిపేది. దాంతో భోజుడికి "ఈ కాళిదాసుకి నాతో సమానమైన ఆదరణ ఏమిటి?" అని ఉడుకుమోత్తనం వచ్చింది. "ఈసారి కాళిదాసు ఇంట్లోకి రావాలంటే అమవాస్యనాడు గుండు గీయించుకుంటేనే ఇంట్లోకి రానిస్తానని చెప్పు" అని విలాసవతికి ఉత్తర్వు వేసాడు. "సరే" అంది విలాసవతి.

ఈ విషయం అడగ్గానే కాళిదాసు విలాసవతితో "శాస్త్రప్రకారం అమవాస్యనాడు శిరోముండనం నిషేధం. కాని నీకోసం ఏదైనా చేస్తాను. నాకోసం నువ్వు కూడా ఒకటి చెయ్యాలి. ఈసారి భోజుడు వచ్చినప్పుడు అతన్ని గాడిదలా ఓండ్ర పెడితేగాని ఇంట్లోకి రానివ్వన

ని చెప్పు" అన్నాడు. విలాసవతి అతని అసూయకి ఆనందపడి "సరే"నంది. భోజుడు కూడా విలాసవతి సహవాసం వదల్లేక గాడిద లా ఓండ్రపెట్టి విలాసవతి ఇంట్లో ప్రవేశించాడు. అదంతా లీలావతి చేసే సరసంలో భాగం అనుకున్నాడు భోజుడు.

అమావాస్య మర్నాడు కృష్ణపక్ష పాడ్యమినాడు కాళిదాసు గుండుతో ఎదురుపడ్డాడు భోజుడికి. భోజుడు పరిహాసంగా

"**కాళిదాస కవిశ్రేష్ఠా! యత్ర పర్వణి ముండనం?**" (మహాకవి కాళిదాసా? ఏ పక్షంలో గుండు గీయించడం?) అని అడిగాడు.

"**గార్ధభాః యత్ర గాయంతే తత్ర పర్వణి ముండనం**" (గాడిదలు ఏ పక్షంలో పాటలు పాడతాయో ఆ పక్షంలో గుండు గీయించడం ). అని బదులిచ్చాడు కాళిదాసు. భోజరాజు ఖంగు తిన్నాడు.

★ ★ ★

ఒక చిత్రకారుడు భోజుడి దగ్గరకొచ్చి "రాజా! నాకు ఒక వ్యక్తిలో ఏదైనా ఒక్కభాగం చూపించండి చాలు. నేనా వ్యక్తి పూర్తి చిత్రం గీసేస్తాను" అన్నాడు. రాజు వాణ్ణి పరీక్షించాలని రాణి లీలావతి తల వెండ్రుక తెప్పించి వాడికిచ్చాడు. పదిరోజుల్లో బొమ్మగీసి తెమ్మ న్నాడు. చిత్రకారుడు బొమ్మ ఒకరోజులోనే పూర్తి చేసాడు. కాని, ఒక సమస్య వచ్చి పడింది. వాడు రాణి చిత్రంలో నుదిటికి తిలకం దిద్ది నప్పుడల్లా ఒకచుక్క కుంచెనుంచి జారి ఆమె కుడితొడమీద పడు తోంది. బొమ్మ ఎన్నిసార్లు గీసినా ఇదే వరస. కాళిదాసు వాడి బొమ్మ ఎలా తయారవుతోందో చూద్దామని వచ్చాడు. చిత్రకారుడు వాడి గోడు అంతా వెళ్ళబోసుకున్నాడు. "ఆ చుక్క అలాగే వదిలెయ్. ఆవి డకి అక్కడ పుట్టుమచ్చ ఉందేమో" అని కాళిదాసు వెళ్ళిపోయాడు.

భోజుడా బొమ్మచూసి "ఆ మచ్చేమిటి" అని మండిపడ్డాడు. చిత్రకారుడు జరిగిందంతా చెప్పాడు. "ఆ పుట్టుమచ్చ రాణి లీలావతికి ఉందని కాళిదాసుకెలా తెలుసు? ఆమెకీ, కాళిదాసుకీ ఏదో సంబంధం ఉందేమో" అనుకుంటూ, కాళిదాసుని పిలిచి, కారణమేమీ చెప్పకుండా అతన్ని రాజ్యం వదిలిపొమ్మన్నాడు. రాణి లీలావతిని కలవడం మానేశాడు.

కాళిదాసు విలాసవతి ఇంటికి వెళ్ళి "రాజ్యం వదలి పోతున్నా" అన్నాడు. "ఇలా పొమ్మన్నవాడు మళ్ళీ ఎలాగూ రమ్మంటాళ్ళే" అని నచ్చచెప్పి విలాసవతి కాళిదాసుని తన ఇంట్లో భూగృహంలో (బేస్మెంట్) అన్ని సౌకర్యాలూ ఏర్పరిచి దాచిపెట్టింది.

కొద్దిరోజులకి రాణికీ, కాళిదాసుకీ ఏ సంబంధం లేదనీ, కాళిదాసుకి అంగసాముద్రిక విద్య తెలుసుగాబట్టి, రాణి పద్మినీజాతి స్త్రీ గనుక ఆమెకి అక్కడ పుట్టుమచ్చ ఉండవచ్చని కాళిదాసు ఊహిం చాడనీ భోజుడికి అర్థం అయింది. కాళిదాసుని తిరిగి తనదగ్గరకి తెచ్చుకోవాలనుకుని, కాళిదాసు ఎక్కడున్నాడో విలాసవతికేమైనా తెలుసునేమోనని ఆమెని అడిగాడు. విలాసవతి తనకేమీ తెలియ దంది. భోజుడు నమ్మలేదు. అందువల్ల ఆమె ఇంట్లో గోడమీద

"కుసుమే కుసుమోత్పత్తిః శ్రూయతే న చ దృశ్యతే" (పువ్వులో పువ్వు పుట్టడం అన్నది వినబడ లేదు, చూడవడలేదు)

అని వ్రాసి "ఇది పూరించిన వాళ్ళకి అర్ధరాజ్యం ఇస్తానని ప్రకటించా ను" అని చెప్పి వెళ్ళిపోయాడు. రాత్రివేళ భూగృహంలోంచి పైగదుల్లోకి వచ్చిన కాళిదాసు దాన్ని చూసి, విలాసవతితో

"బాలే! తవ ముఖాంభోజే దృష్టమిందీవరద్వయం" (ఓ బాలా! నీ ముఖమనే పద్మంలో రెండు కలవపూవులు కనబడుతున్నాయి) అని అర్థం వివరించి చెప్పి తిరిగి వెళ్ళిపోయి నిద్రపోయాడు. తన ముఖం అనే పద్మంలో రెండు కళ్ళనే కలువలు పుట్టాయని చెప్పిన ఆ పూరణ వినగానే విలాసవతి ఇదే భోజుడు ఆశించే సరైన పూరణ అని అర్థం చేసుకుని, అర్ధరాజ్యం మీద ఆశతో కాళిదాసుని కత్తితో పొడిచి చంపేసింది. మర్నాడు రాజసభకి వెళ్ళి "రాజా! నేను దాన్ని పూరించా వినండి" అని వినిపించింది.

**కుసుమే కుసుమోత్పత్తిః శ్రూయతే న చ దృశ్యతే |**
**రాజే! తవ ముఖాంభోజే దృషమిందీవరద్వయం||**

భోజుడు విన్న వెంటనే, ఆ "రాజే" అన్నపదం తప్పితే మిగిలినదంతా కాళిదాసుది. అతన్ని ఎక్కడ దాచావో చెప్పు అని గదమాయించి అడిగాడు. (ఎందుకంటే సంస్కృతంలో రాజన్ అనే పదమే వాడాలి. రాజే అన్నపదం లేదు. విలాసవతికి సంస్కృతం బాగా రాదు. ఆ రోజుల్లో ఆడవాళ్ళు ప్రాకృతంలోనే మాట్లాడేవాళ్ళు.) కాళిదాసు మరణించిన విషయం తెలుసుకున్న భోజుడు కృంగిపోయాడు. కొద్ది రోజుల్లోనే అతనిపై బెంగతో మరణించాడు.



## వేపపూత - కోయిల కూత

**దర్భా బాబూ రావు**

పండగ పూట శెలవే కదా.. 'పనీ పాటా' ఉండదు కదా బారెడు పొద్దెక్కే దాకా పక్క వదలకుండా ముసుగు దన్ని తనివి తీరా పడుకోవచ్చని, మెలకువొచ్చినా కూడా మెదలకుండా పడుకున్నాను. 'తానొకటి తలిస్తే తన భార్యొకటి తలుస్తుందన్నట్లు' నా సుఖానికి ఆదిలోనే హంసపాదు పడింది. హంసపాదో, దోసపాదో ఏదయితేనేం నా నిద్ర కాస్తా పాడయ్యింది.

నాకు పనీ తప్ప లేదు, మా ఆవిడ పాటా తప్ప లేదు. నాకు అప్పజెప్పాల్సిన పని మరిచిపోకుండా ఉండగలందులకు గానూ మా ఆవిడ ఓ అరగంట క్రితం నుంచీ, పని చేసుకుంటూ——ఒకే పాట పాడుతూనే ఉంది. నాకు నిద్రా భంగం కలిగించే పని మా మనవరాలికి అప్పగించింది చాలక, తన వంతు ప్రయత్నంగా తన పాటకు 'లయబద్ధంగా' గుండ్రాయి పెట్టి కుంకుడుకాయలు కొట్టడం ప్రారంభించింది.

మా ఆవిడ పాట హోరూ, గుండ్రాయి దెబ్బల హోరూ మా మనవరాలి దుప్పటి లాగుడు హోరూ కలిసి వెరశి నా నిద్ర కాస్తా చెట్టెక్కేసింది. ఆవిడ రిపీట్ చేస్తున్న పాట కూడా చెట్టెక్కడం గురించే.

**చెట్టునెక్క గలవా? ఓ నరహరి పుట్టలెక్కగలవా?**

**చెట్టునెక్కి ఆ చిటారు కొమ్మన 'పూత' కోయగలవా?**

**వేప్పూత కోయగలవా? యాప్పూత కోయగలవా?** అని యాప్పూతే మిటీ నీ దుంప పిలకెయ్య .. పండగ పూటా అందునా తెలుగు సంవత్సరాది నాడు ఇలా ఉచ్చారణా దోషంతో పాట పాడితే ఇంకేమైనా ఉందా? సంవత్సరం పాడుగూతా ఇలా 'దోష భూయిష్ఠమైన పాటలే వినాల్సొస్తుందీ అని అందామనుకున్నాను. కానీ ఆవిడ నాకన్నా పండితురాలు గనక, వేప్పూత అనే పదానికి వికృతి యాప్పూతా అన్నదంటే నేను చేయగలిగిందేమీ లేదు కనుక, పొద్దున్నే ఆవిడలో తప్పులెన్ని పేచీకి దిగితే భంగపాటే కాకుండా సంవత్సరమంతా కలహాల కాపురం వెలగబెట్టాల్సొస్తుందని భయపడి అలా అనడం మానేశాను. ఈ మన్మధ నామ సంవత్సరం నాడు నన్ను యువకుణ్ణి చేయాలనుకుంది కాబోలు వేపచెట్టెంకించి, నా చేత చిటారు కొమ్మన ఉండే స్వచ్ఛమైన వేప్పూత కోయించడం, నేను లేచే దాకా శ్రోతలు కోరని పాట కార్యక్రమం కొనసాగిస్తున్నదన్నమాట. తనకిష్టమైన పనులు సాధించుకోవడం కోసం అప్పుడప్పుడూ నన్ను మాటల్లో పెట్టి మునగ చెట్టెక్కించడం ఆవిడకు మామూలే. సరే! నాకు కూడా ఆవిడకెదురు చెప్పలేకా, చెప్పినా కుదరదు కనుకా మునగ చెట్టెక్కేసి ముందుకు పడిపోయి ముందు జేబులో పర్సు రాలగొట్టుకోవడం మామూలేననుకోండీ!




అయితే ఈ సారి ప్రత్యేకించి గుర్తు పెట్టుకుని మరీ నన్ను చెట్టెక్కించాలని మా ఆవిడ పడుతున్న తాపత్రయానికి నాక్కాస్త కోపమొచ్చేసింది. అయినా మొగుడు గారి కోపం మొదలుకు చేట న్నారు కదండీ మగవాళ్ళు. పెళ్ళాం కోరిక పెడచెవిన పెడితే తిండి సుఖం తిరుపతికెళ్ళినట్లేగా. అయినా మనసూరుకోక మానవ ప్రయత్నంగా మగ ప్రయత్నంగా ఇదిగో చూడూ! నువ్వు చేసి పెట్టే ఇంతోటి పచ్చడి కోసం అల్లంత చెట్టెక్కించడానికి ఇంత పంతం దేనికి చెప్పు, నేల రాలిన పూత చాలదా? దులుపుకుని కలుపుకోవచ్చు కదా. పైగా నేల కూడా శుభ్రమైన గచ్చేనాయె అని చెప్పి చూశా. దాంతో ఆవిడ "చాల్లేండి! చాదస్తపు మొగుడు చెబితే వినడూ గిల్లితే గిలగిలలాడుతాడన్నట్లుంది మీరు చెప్పేది. నేల రాలిన పూత ఊళ్ళో వాళ్ళకివ్వొచ్చని దాచాలేండి. సొంత చెట్టుండ గా, చెట్టంత మొగుడుండగా రాలిన పూత వాడాల్సిన ఖర్మ మనకేం పట్టిందీ?" అని చెవి కొరికి మరీ చెప్పింతరువాత .. చెప్పినట్లు విని చెట్టెక్కక తప్పుతుందా? ఆ మాటా నిజమే మరి. ఊళ్ళోవాళ్ళ మీద కసి తీర్చుకోడానికిదో చక్కటి అవకాశం. లేకపోతే ఒకసారి కష్ట పడి చెట్టెక్కితే దిగనిస్తారా ఊళ్ళోవాళ్ళు? ఎప్పుడు చెట్టెక్కుతానా అని ఎక్కణ్ణుంచి నక్కి చూస్తారో ఏమో. ఎక్కీ ఎక్కగానే బిల బిలమంటూ చెట్టు కింద జేరి మాక్కా స్తంటే మాక్కాస్తనీ ఇదిగో కాస్తనీ ఇంకాస్తనీ అవసరానికి మించినంతగా పూతతో పాటు కొమ్మలు గూడా రాలగొట్టించేదాకా నన్ను వాయగొట్టి

గాని వదలరు. పైగా మా వేపచెట్టు వీధి మీదికి ఉండడంతో దారి న బోయే దానయ్యలు కూడా నన్ను పలకరించే నెపంతో ఏమిటి మాష్టారూ? మీరే స్వయంగా చెట్టెక్కారూ, కుఱ్ఱాళ్ళకి చెపితే కోసి పెట్టేవాళ్ళుగా అంటూ ఎగతాళిగా నవ్వింది చాలక ' ఏదీ ఆ చేత్తో మాకో నాలుగు పుల్లలు కోసి పడెయ్యండి' అంటూ మొహమాట పెట్టేస్తారు.

కానీ మా ఇంటిగుట్టు వాళ్ళకేం తెలుసు? మా ఆవిడ నన్ను తప్ప మరొహణ్ణి ఆ చెట్టెక్కడం మాట దేముడెరుగు కనీసం తాకను గూడా తాకనివ్వదు. పోనీలే సంవత్సరానికొకసారే కదా అని సరిపెట్టుకుందామనుకున్నా, చుట్టు పక్కల షుగర్ పేషంట్లు కూడా చీటికీ మాటికీ నన్ను చెట్టెక్కించి వేప చిగుళ్ళు కోయిస్తుం టారు. అవి మేస్తే వాళ్ళ వ్యాధి నయమవుతుందని వాళ్ళ భ్రమ. ఆ వ్యాధి నయమౌతుందో లేదో గానీ 'వేప చిగుళ్ళు మేసీ మేసీ వాళ్ళు మామూలు మాటలు మానేసి 'కోయిల కూతలు కూస్తారేమోనే అని మా ఆవిడతో అంటే ఛీ ఛీ! కోయిల కూసేది వేప చిగుళ్ళు తిని కాదండీ, మామిడి చిగుళ్ళు తిని. దానికో సినిమా పాట కూడా ఉంది.. అంటూ పాటందుకుంది. 'మావి చిగురు తినగానే కోయిల కూసేనా' అని. చాల్లే ఆపు.. నీ సినిమా పరిజ్ఞానం, సంగీత జ్ఞానం నాకెక్కడిది కానీ పాటలు పాడి నన్ను హింసించకు పండగ పూట అన్నాను. ఆవిడకి విపరీతమైన కోపం వచ్చి విస విసా వెళ్ళిపోయింది. నా అనుమానం ఏమిటంటే కోయిల గాయనీ గాయకులు మామిడిచిగురు తిన్నప్పుడు హుషారుగా డ్యూయెట్లూ, వేప చిగురు తిన్నప్పుడు సోలోగా విషాద గీతాలూ ఆలపిస్తారని. అసలు అప్పుడప్పుడూ మా చెట్టు మీద వాలేవి కోయిల పిల్లలా? కాకి పిల్లలా? అని నాలో నేను తర్కించుకుంటుండగా తలంటి పోస్తాను రండని కోపంగా కేకేసిందావిడ.

గాజుల చేత్తో తలంటించుకోవడం ముచ్చటే గానీ మా ఆవిడ చేయి కాస్త బరువూ చురుకూ కూడాను. పైగా కోపంగా కూడా ఉంది, ఆవిడ చేత పాట ఆపించిన పాపానికి. తల బాదుడికి తల ఒగ్గి తగిన శిక్ష అనుభవించక తప్పదు కదా. ఐతే కుంకుడు కాయలు బాది బాది 'జబ్బ సత్తువ కాస్త సన్నగిల్లి ఉంటుందనే ధైర్యంతో ఇదుగో వస్తున్నా' అంటూ తలొగ్గి కూర్చున్నా.

## తెలుగమ్మాయి

**మనోహర బోగా**

యతుల జతుల అలజడుల
పారే గోదారి గలగలల
తెలుగమ్మాయి !
నిండుదనం సంప్రదాయం
బంధాలు బాధ్యతలు
నడుమ ఒదిగిన తెలుగమ్మాయి !
మామిడి పిందె లోని వగరు
మల్లెపూవులోని సోయగం
సొంతం చేసుకున్న తెలుగమ్మాయి !
బాపూ బొమ్మ ఏడుమల్లెల అందగత్తె
పదహారణాల పడుచుపిల్ల
తెలుగమ్మాయి !
తళుకుమనే తారలకు కన్నుకుట్టి
నేలలోని జాబిలివి నువ్వంటూ
నీ చెంత చేరతామంటూ మారాం చేస్తే
అది తెలుగమ్మాయి ! మన తెలుగమ్మాయి !



## తూర్పయినా - పడమరయినా

**సుజాత**

ఇప్పటికి నాలుగు సార్లు ఫోన్ చేశాను శాండ్రాకి. ఫోన్ తీయదు. మెసేజ్ లకు, ఈ మెయిల్స్ కి రెస్పాన్స్ ఇవ్వదు. వాట్సప్-లో కనిపించదు. ఏమై ఉంటుంది? శాండ్రా కూతురు మేగన్ స్కూలుకు మూడురోజుల్నుంచి రావట్లేదని మావాడు చెప్పాడు. ఆ పిల్లకు తరచూ అనారోగ్యం చేస్తుంది. అలా ఏమైనా అయ్యుంటుందా?



ఇటు చూస్తే స్కూల్లో టీచర్స్ అప్రీసియేషన్ వీక్ వచ్చే వారమే! టీచర్లు అందరికీ సర్ప్రైజులు ఏర్పాటు చేసే బాధ్యత శాండ్రానే తీసుకుంది. మొత్తం ప్రోగ్రాం తయారు చేసింది. నేను కేవలం అసిస్టెంట్ ని మాత్రమే! ఏం చేయాలో తెలీడం లేదు. మళ్ళీ ఫోన్ చేశాను నాలుగో సారి! ఊహూ.. వాయిస్-మెయిల్ కి వెళ్తోంది. భర్త తో విభేదాలున్నాయని తెలుసు! తనే చెప్పింది నాకు! ఏమైనా గొడవలు అయ్యాయేమో అని కంగారుగా ఉంది ! కాసేపు తోటలోకి పోయి పని చేస్తే కొంత శాంతిగా ఉంటుందనిపించి గులాబీ పాద కొమ్మలు కట్ చేయడం మొదలు పెట్టాను. ఇది నాకు శాండ్రా ఇచ్చిందే! ఎంత త్వరగా పెరిగిందో! అసంఖ్యాకంగా పూలు!

ఫోన్ మోగింది.! స్మిత!

"ఇంట్లో ఉన్నావా? నీతో మాట్లాడాలి, రానా ఇప్పుడు?"

"రా, ఇంట్లోనే ఉన్నా! వచ్చేప్పుడు మీ ఇంట్లో కొంచెం పెరుగు ఉంటే పట్రా! రాత్రి పాలు తోడుకోలేదు "

పదిహేను నిమిషాల్లో నీలిమ, ధరణిలతో కల్సి వచ్చింది స్మిత ! డబ్బాడు పెరుగు తెచ్చింది. "ఇంతెందుకూ" సంతోషిస్తూనే అన్నాను! అల్లం టీ పెట్టుకుని తోటలో కూచున్నాం అందరం !

“శ్వేతా, మా చెల్లెలి కాపరం ఏమీ బాగాలేదు. అతను కొట్టడం కూడా మొదలు పెట్టాడట" అంది నెమ్మదిగా!

ఆశ్చర్యం వేయలేదు కానీ కొంచెం చివుక్కుమంది. తీవ్ర విభేదాలు కొట్టే స్థాయికి చేరడానికి ఎంతో కాలం పట్టదేమో అనిపించింది. స్మిత చెల్లెలు విరిత సంగతి నాకు తెలుసు. అతనికి తాగుడు, జూదం ఇతర అలవాట్లు ఉన్నాయి. డబ్బు చాలదు. ఇద్దరు పిల్లలు. విరిత ఉద్యోగం చేస్తోంది కాబట్టి బండి నడిచిపోతోంది. ఇద్దరూ సంపాదిస్తున్నారు కాబట్టి మాకెందుకు పెట్టరని గోల చేసే ఇద్దరు ఆడపడుచులు ఇండియాలో ఉన్నారు. సహజంగానే తమ్ముడిని సపోర్ట్ చేస్తారు. వాళ్ళ పెట్టుపోతలన్నీ ఇక్కడి నుంచే సక్రమంగా జరపాలి విరిత! తేడాలొస్తే చుట్టాల్లో ప్రతొక్కరికీ చెత్త ప్రచారాలు! ఈ విషయాల గురించి ఇంట్లో గొడవలు మామూలే! అతను ఈ మధ్య కెసీనో(casino)ల్లోనే ఎక్కువ కాలం గడుపుతూ డబ్బంతా తగలేస్తున్నాడు. అడక్కూడదు. ప్రశ్నించకూడదు. గట్టిగాప్రశ్నిస్తే చివరికి కొట్టే స్థాయికి చేరాడు.

"మరెలా? ఏం చేయాలనుకుంటుంది విరిత?"

"ఏం చేస్తుంది? ఎలాగో సర్దుకుంటుంది.ఇక్కడి వాళ్ళ లాగా గమ్మున విడాకులు పారేసి ఇంకోడిని చేసుకోలేదుగా! పిల్లల గురించి ఆలోచించాలిగా! మై ఛాయిస్ అనేసుకోడానికి అందరూ దీపికలవుతారా ఏమిటి?" ఇదే సమస్య స్మిత తో! క్షణాల్లో జడ్జిమెంట్లు చేసి పారేస్తుంది!

"ఇక్కడి వాళ్ళు అక్కడి వాళ్ళు ఏమీ లేదు స్మితా! ఆడవాళ్ల సమస్యలు ఎక్కడైనా ఒకటే! విడాకులు పారేయడం అనేది ఎవరికైనా చివరి ఆప్షనే! పిల్లల గురించి ఆలోచించడం అనేది కూడా అన్ని రకాలుగానూ జరిగాకే విడాకుల దాకా వెళ్తారెవరైనా "అన్నాను కఠినంగానే.

"అలా ఏం కాదు. ఇక్కడ తీసుకున్నంత త్వరగా మన ఇండియాలో అయితే విడాకులు తీసుకుంటారా ఆడాళ్ళు? పిల్లల గురించి ఎంత మంది పడి ఉంటున్నారో తెల్సా? కేవలం పిల్లల జీవితం డిస్టర్బ్ కాకూడదని." కోపం తెచ్చుకుంది. స్మిత ఒప్పుకోదు.

"నిజమే! పిల్లల గురించి ఎంతో మంది పడి ఉంటున్నారు. అక్కడే కాదు, ఇక్కడ కూడా!" అన్నాను.

మా వాడి సాకర్ కోచ్ మాటలు గుర్తొచ్చాయి.ఆయన భార్యతో విడిపోయి సెపరేట్ గా కొడుకుతో కల్సి ఉంటున్నాడు. భార్యా కూతురూ వేరేగా ఉంటారు.

"రోజూ గొడవలు పడి, పోట్లాడుకుని ఒకరి గుణాలొకరు బయట పెట్టుకుని, ఇంకా ముదిరితే కొట్టుకుని, ఒకరి మీద ఒకరు పిల్లలకు చాడీలు చెప్పి ఇలా ఇద్దరి వ్యక్తిత్వాల మీదా పిల్లలకు ద్వేషాలు

పుట్టించడం కంటే విడిపోయి ఇద్దరి మధ్యా ఉన్న కొద్దిపాటి స్నేహాన్ని కాపాడుకోవడం బెటరేమో కదా! పిల్లలు కనీసం ప్రశాంతంగా పెరుగుతారు" అన్నాడాయన!

"నీతో ఏకీభవిస్తూనే విభేదిస్తున్నాను కోచ్" అన్నాను. నవ్వాడాయన "నాకర్థమైంది లే! పిల్లలకు ఇద్దరూ ఉండొద్దా అనే పాయింట్ దగ్గర ఆగిపోయావు నువ్వు" అన్నాడు.

ఆ సంగతే స్మితకు అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నించాను.

మరి కాసేపు విరిత కాపురం గురించే మాటలు సాగాయి. పేరుకు తగ్గట్టే పువ్వులా ఉంటుంది. అతనూ అందగాడే! పిల్లలిద్దరూ బంగారు బొమ్మల్లా ఉంటారు. పాపకి పదేళ్ళు, బాబుకి ఏడు. వీళ్ళ గొడవల మధ్య పాపం వాళ్ళు నలిగిపోతున్నారు.

ఫోన్ మోగింది. - శాండ్రా!

గబుక్కున ఫోన్ తీసుకుని "పది నిమిషాలు ..."అన్నాను అందరి వైపూ చూస్తూ లోపలికి నడవబోతూ!

ఫోన్ లో మాట్లాడి వచ్చాక "ఎవరూ" అంది స్మిత ! నేను ప్రైవేట్ గా మాట్లాడాను అని తెలిసి కూడా ! "శాండ్రా ... నా ఫ్రెండ్ " అన్నాను క్లుప్తంగా

"మేగన్ వాళ్ళ అమ్మేనా ? వాళ్ళింట్లో ఏదో గొడవగా ఉందిటగా ! వాళ్ల డర్క్ మావాడి క్లాసేగా-వాడు మొన్న ఒకరోజంతా మా ఇంట్లోనే ఉన్నాడు " అంది

తెల్లబోయాను. ఈ సంగతి స్మితకు తెలిసిపోయిందా ? ఇహ కమ్యూనిటీ అంతా తెలీడానికి ఆట్టే టైము పట్టదు

"ఏముంది, ప్రతి ఇంట్లో ఉండే గొడవలే! ఇద్దరికీ పడటంలేదు" అన్నాను క్లుప్తంగా

స్మిత వెటకారంగా నవ్వింది "ఏముందిలే రేపో మాపో విడాకులు పడేసుకుని మళ్ళీ చెరో పెళ్ళీ చేసుకుంటారు. విడిపోయినా "స్నేహితులమే" అని చెప్పుకుంటూ!" నీలిమ, ధరణి గొల్లున నవ్వారు.

"ఎవరి పరిస్థితిని బట్టి వాళ్ళు నిర్ణయాలు తీసుకుంటారు. మనం విని వదిలేద్దాం!" అన్నాను చిరాకుని అదిమి పెడుతూ

"సర్లే, విరిత నీకు ఫోన్ చేస్తుందేమో, కాస్త సర్దుకోమని చెప్పు ఇద్దరికీ! మాఅమ్మ చాలా బెంగ పెట్టుకుంది. ఏమిటో? " లేచింది స్మిత.

★★★

ఇడ్లీ తినడం ముగించి కాఫీ తీసుకుంది శాండ్రా! శాండ్రాకి నేనే ఇడ్లీ అలవాటు చేశాను. బాగా ఇష్టంగా తింటుంది. కాఫీ తాగి కొద్దిగా తేరుకుంది."ఏం చేయాలో తెలీడం లేదు. స్టీవ్ వెళ్ళి పోయి మూడు రోజులైంది. మేగన్ కామన్ ఏరియాలో కూచుని ఒకటే ఏడుస్తుంది. నిన్నంతా ఉబ్బసంతో బాధపడింది. డర్క్ దాన్ని సముదాయిస్తున్నాడు కానీ పాపం వాడి వయసెంతని? వాడు అర్థం చేసుకో గలుగుతున్నా, వాడికీ భయంగానే ఉంది." అంది దిగాలుగా!

"తండ్రి ఇల్లు వదిలి వెళ్ళిపోవడం చిన్నవిషయమా ఏమిటి మరి" అన్నాను సానుభూతిగా! ఇలాంటి పరిస్థితిలో అవతలి వాళ్ళు ఏం చెప్పినా అవును అనడం తప్ప ఏ ఒక్క మాట ఎక్కువ మాట్లాడినా అది తీర్పె కూచుంటుంది. "ఎల్లుండి మేగన్ ని మీ ఇంట్లో వదిలి పెట్టనా? నేను మా అమ్మ వెళ్ళి స్టీవ్ తో మాట్లాడాలి అనుకుంటున్నాం. స్టీవ్ మీ వెనక లైన్లోనే అపార్ట్మెంట్ లో చేరాడు" అంది వీడి దుంప తెగా, అప్పుడే ఇల్లు కూడా తీసుకున్నాడా!

"దానికేం భాగ్యం? అలాగే వదిలి పెట్టు" అన్నాను. శాండ్రా ఒక మెట్టు దిగి స్టీవ్ తో మాట్లాడ్డానికి వెళ్తుందని నేను అనుకోలేదు. తండ్రిని వదిలిఉండలేక దిగులుతో ఏడుస్తున్న మేగన్ ఒక కారణమేమో!

మర్నాడు వెనక రోడ్లోంచి వస్తుంటే స్టీవ్ కారు ఎదురైంది. నన్ను చూసి స్లో చేసి చెయ్యి వూపాడు. పక్కనే మేగన్ ! చేతిలో స్టార్ బక్స్ హాట్ చాక్లెట్! కానీ ఆ పిల్ల మొహం లో సంతోషం లేదు.

★★★

శాండ్రా పుట్టుకతో ఇటాలియన్! హైస్కూలు వయసులో కుటుంబంతో అమెరికా వలస వచ్చింది. అవడానికి ఇపుడు అమెరికా పౌరురాలే అయినా అమెరికాకి ఒక 'కల్చర్' లేదని చిన్న చూపు శాండ్రా కి! ఇద్దరూ హార్వర్డ్ యూనివర్సిటీలో క్లాస్-మేట్స్. ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. బాగా విద్యాధికులు! ఆర్టిస్టులు. అందుకేనేమో ఇద్దరికీ ఒక ఇంచి కూడా తగ్గని ఈగో. మాకు మంచి స్నేహితులు.

వాళ్లిద్దరూ నా ముందు ప్రైవసీ ఫీల్ కాకుండా చచ్చేట్టు వాదించుకుని పోట్లాడుకున్న సంఘటనలు అరుదేం కాదు!

ఈగో తగ్గించుకోవాలని సలహాలు ఇతర్లకు చెప్పడం చాలా చెత్త పని! అహాన్ని జయించడం ఎవరికి సాధ్యం? ఇంటికి వచ్చిన కాసేపటికి స్టీవ్ ఫోన్ చేశాడు.

"ఒక్క అయిదు నిమిషాలు టైముందా? మీ ఇంటికి రావొచ్చా" వచ్చాడు. ఐదు నిమిషాలన్న వాడు అరగంట సేపు శాండ్రా గురించి మాట్లాడాడు. పూర్తిగా తన వెర్షన్ శాండ్రాకి పొగరు. ఎక్కువ సంపాదిస్తోందనీ , అందగత్తె అనీ గర్వం కూడా ఉందిట! గాయని అన్న పేరుతో తన కోసం ఎవరెవరో వస్తున్నారట...ఇక సహించడం తన వల్ల కాదట. తనే అనుకుంటే తమతో పాటు ఉంటున్న శాండ్రా తల్లిని భరించడం మరీ కష్టంట. అసలావిడే అగ్నికి ఆజ్యం పోస్తుందిట. తన తల్లిదండ్రుల్లాగే ఆవిడ వేరేగా ఉంటే సహం గొడవలు తగ్గుతాయట. ఇహ వాళ్ళిద్దర్నీ భరించడం తన వల్ల కాదనీ, విడాకులు కావల్సిందేననీ సారాంశం. శాండ్రాది కూడా దాదాపు ఇదే వాదన! ఫిమేల్ వెర్షన్! "విడాకులా! అప్పుడే నిర్ణయించుకునేశావా? ఇహ

ఇహ మాట్లాడుకోడాల్లేవా! ఒకసారి పిల్లల గురించి ..” "అబ్బ ఆపు శ్వేతా" మర్యాదగానే విసుగు ప్రదర్శించాడు స్టీవ్. "డర్క్ కి ఇప్పుడు పదహారేళ్ళు. పదిహేడేళ్ళ నుంచీ ఇలాగే ఉంది మా కాపరం. ఇంకా బాగు పడుతుందన్న నమ్మకం ఉందా నీకు?"

"ఎన్ని గొడవలు పడుతున్నా మీ ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఎక్కడో ఇష్టం గౌరవం ఉన్నాయి స్టీవ్. అందుకే పదిహేడేళ్లుగా గొడవలు వస్తున్నా సర్దుకుపోగలుగుతున్నారు..." నా మాటలు నాకే పేలవం గా అనిపించి ఆపేశాను.

"రేపు శాండ్రా నీ ఇంటికి వస్తుందట మాట్లాడ్డానికి. తెలుసుగా?"

"యా..యా తెలుసు"

"ట్రై టు వర్క్ ఇటవుట్ స్టీవ్! జీవితం మళ్ళీ స్టార్ట్ ఓవర్ అంటే ఎంత స్ట్రెస్ నెత్తికెత్తికోవడమో తెల్సా?" అన్నాను.

"నాకు తెలుసు! కానీ నా వల్ల కావడం లేదు. సరే, వెళ్తాను. మళ్ళీ కలుస్తాలే" మెట్లు దిగాడు స్టీవ్.

నేను పెద్దగా ఏమీ చెప్పక పోయినా.. చెప్పిన కొంచెమూ స్టీవ్ కి రుచించలేదనుకుంటా. సలహా ఆశించి వచ్చిన వాళ్ళకి తమ వెర్షన్ ని బలపరిచే మాటలే తప్ప నిజానికి కావలసింది సలహా కానే కాదు.

★★★

ఫోన్లో విరిత చాలానే చెప్పింది. మధ్య మధ్యలో కొద్దిగా ఏడ్చింది కూడా! ఎవరితోనో ఒకరితో చెప్పుకోకపోతే ఒత్తిడి భరించలేనని ఫోన్ చేసిందని అర్ధమైంది. అమ్మా,నాన్న, అక్కా అందరూ ఎలాగో సర్దుకుపొమ్మని సలహా చెప్తున్నారట. పోనీ ఇండియా వెళ్ళి పోదా మంటే అతనొప్పుకోవడం లేదట. తనొక్కతే పిల్లలతో ఇండియా వచ్చేయడానికి అమ్మానాన్నలు, అత్తమామలు ఒప్పుకోడం లేదట. "ఎలాగోలా" అతగాడిని దారికి తనే తెచ్చుకోవాలని అంటున్నారట అత్తగారింట్లో. నిజానికి వాళ్ళ ఇంటా-వంటా అలాటి అలవాట్లు లేవట. ఎవరో స్నేహితులే అమాయకుడైన తమ పుత్రుడికి ఈ అల వాట్లు పట్టించారని అభిప్రాయ పడుతున్నారట.

"పిల్లలకు ఈ విషయాలు ఎంత దాచినా అర్థం కాకుండా ఉండవు కదండీ! పెద్దది నిండా పదేళ్ళు లేవు. అది నన్ను ఓదారుస్తుంది. అది కాలేజికి వచ్చే దాకా ఆగితే అది కూడా ఏదో ఒక ఉద్యోగం చేస్తుం దట. అప్పుడు మేము హాయిగా ఉండొచ్చట. అది చెప్తుంటే నాకే జాలేసింది"

కాలమే ఏదో ఒక దారి చూపిస్తుందని ఎదురుచూడ్డం తప్ప అత న్నుంచి విడిపోయే పరిస్థితి లేదని దిగాలుగా చెప్పింది విరిత. అలా టి మనిషిని ఇంట్లో భరించడం ఎంత అసహ్యంగా ఉన్నా, పిల్లలతో సహా అదే ఇంట్లో ఉండాల్సి రావడం ఎంత దుస్సహంగా ఉందో ఆ పిల్లకి.

శాండ్రా , విరితల గురించి ఆలోచిస్తుంటే అశాంతిగా అనిపించింది. ఇలాటి వాటిని భరించగల శక్తి ఎలా వస్తుందో ఆడవాళ్లకి? ఈ గొడవలు పిల్లలకు తెలీకుండా ఎంతవరకూ ఉంచగలరు. అలాటి ఒత్తిడిలో ఆ అశాంతిలో పెరిగే పిల్లలు ఎలా తయారవుతారు?

మరో పక్క శాండ్రా చెప్పనే చెప్పింది. చర్చించుకుని సాల్వ్ చేసుకోడానికి స్టీవ్ ససేమిరా అంటున్నాడట. నిజానికి కల్సి ఉండ టం శాండ్రాకీ ఇష్టం లేదు. ఆ రోగిష్టి పిల్ల మేగన్ తండ్రికి దగ్గర కాబట్టి దానికోసమే ఒక మెట్టు తగ్గిందట కానీ లేక పోతే ఈ "ఫక్తు అమెరికన్" మొగుడితో నిజంగా తను వాదించదల్చుకుంటే తల ఎక్కడో పెట్టుకోవాల్సి వస్తుందట అతడు.

నాకు శాండ్రా యురోపియన్ కల్చర్ భజన విన్నపుడల్లా అడగాలనిపిస్తుండేది . "స్టీవ్ జాతి వివరాలు తెలిసే చేసుకున్నావ్ గా! ఎందుకు మాటిమాటికీ ఆ సంగతి ఎత్తుతావ్ తల్లీ" అని! నిజానికి వాళ్ళిద్దరి మధ్యా జరిగే గొడవల్లో దూషించుకోడానికి ఇదొ క పాయింట్ మాత్రమే! స్టీవ్ ని తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. శాండ్రా మ్యూజిక్ కాన్సర్ట్స్ జరిగినపుడల్లా ఏదో ఒక గొడవ. ఎవరెవరో శాండ్రాతో కాంటాక్ట్ లోకి వచ్చారనీ!

తన ఈమెయిల్స్, ఫోన్ మీద కూడా నిఘా ఉంటుందని అన్నది శాండ్రా ఎంత వరకూ నిజమో!

ఏ గొడవా లేకుండా ప్రపంచంలో ఏ మూలా ఏ కాపరమూ ఉండ దేమో! ఎన్ని కౌన్సెలింగ్ సెంటర్లు ఉన్నా మనిషన్నవాడు ఆడైనా మగైనా అవమానమూ, బాధా, అహమూ విడిచిపెట్టో, మర్చిపోయో బతకలేడుగా!

"మామ్, అలా కూచున్నావేంటి? తినవేం?" నా కొడుకు గొంతు వినపడ్డంతో ఉలిక్కిపడి చూస్తే చెయ్యి ఎండిపోయి ఉంది. మనసులో ఏదో ఖాళీ తనం! విరిత, శాండ్రాల గురించిన బాధతో నలతగా అనిపించింది. వాళ్ళిద్దరితో కూచుని వాళ్ళు చెప్పేదంతా, గంటల తరబడి మాట్లాడినా సరే వింటూ ఉండిపోవాలనిపించింది. మరిహ తినబుద్ధి కాక చేయి కడిగేసుకున్నాను.

విరిత, శాండ్రా ఇద్దరూ నా మెదడుని వారం రోజులుగా వదలక ఆక్రమించారు. శాండ్రా, స్టీవ్ విడాకులకు కోర్టు ప్రొసీడింగ్స్ సిద్ధం అవుతున్నారట. శాండ్రా తల్లేమో భరణం విషయాల్ని స్టీవ్ తో మా ట్లాడాలని తెగ ఉత్సాహ పడుతోందట. వాళ్ళు నివాసముండే పాలస్ లాంటి ఇల్లు వదులుకోవాలని ముసలావిడకు ఎంతమాత్రమూ లేనట్టుంది. అయిదేళ్ళుగా తెల్సిన ఒక కుటుంబం ఇలా కలహాలతో విడిపోయేదాకా రావడాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాను! కొద్ది రోజు ల్లో శాండ్రా, స్టీవ్ చెరోచోటా ఉంటారు. పిల్లలిద్దరూ వీకెండ్స్ తల్లితో నో , తండ్రితోనో ఎలా ప్లాన్ చేసుకోవాలో ఆలోచిస్తూ ...

ఆ ఒత్తిడిని మోస్తారా? మేగన్ ఆరోగ్యం సంగతేమిటో! విడిపోయాక ఎలాటి కమిట్మెంట్సూ లేని తేలికదనంతో ఇద్దరూ స్నేహితుల్లా ఉంటారా? ఉండగలరా అలా?

నిజంగా స్మిత అన్న మాటల్లో నిజముందా? పిల్లల విషయంలో 'మనవాళ్ళు' ఆలోచించినట్టు 'వీళ్ళు' హృదయంతో ఆలోచించలేరా?

ఎన్నో బాధలు పడుతూ దెబ్బలు తింటూ, చేతి నిండా సంపాదన ఉండి కూడా విరిత ఎందుకు సహిస్తోంది? ఆ పిల్లలిద్దరి కోసమేగా!




శాండ్రా, స్టీవ్ ల ఆలోచనలో తప్పుందా? శాండ్రా ఒక మెట్టు దిగి వచ్చినా స్టీవ్ సిద్ధం గా లేడు. విరిత భర్తకి విరిత వెళ్ళిపోదని పెద్ద నమ్మకం! అలాటి ఆలోచనే చేయదని మితిమీరిన ఆత్మ విశ్వాసం!

వాళ్ళిద్దరి సంగతేమో గానీ నా బుర్ర మాత్రం వేడెక్కి పోతోంది.

★★★

మధ్యాహ్నం ఆఫీస్ లో ఉండగా శాండ్రా నుంచి ఫోన్! నిజానికి నేనే చేద్దామనుకుంటున్నా! కోర్టు ప్రొసీడింగ్స్ గురించి! "గెస్ వాట్?" అంది చిన్నగా నవ్వు దాచుకున్న గొంతుతో!

"క్విజ్లొద్దు! పన్లో ఉన్నాను, క్విక్ గా విషయం చెప్పు" అన్నా ను

"డైవోర్స్ అయిడియా డ్రాప్ చేసుకున్నాం. స్టీవ్ వచ్చేస్తున్నాడు ఇంటికి" అంది. నా చెవుల్ని నేనే నమ్మలేక పోయాను "ఎక్కడున్నావు?" అన్నాను.

"ఇంట్లోనే" అంది నవ్వుతూ "వస్తున్నా ఉండు" కారు తాళం తీసుకుని బయటపడ్డాను.

శాండ్రా నవ్వుతూ తలుపు తీసింది."కాఫీ?" అంది కిచెన్ లోకి నడుస్తూ

"కాఫీ లేదు గీఫీ లేదు. ఏమైందో చెప్పు? ఎలా జరిగింది?" అన్నాను సోఫాలో కూలబడి.

కాఫీ తీసుకొచ్చి కూచుని క్లుప్తంగానే చెప్పింది! ఎందుకో గానీ ఒకసారి ఫైనల్ గా ఈ ఇంట్లో కల్సి మాట్లాడుకుందామా అన్నాట్ట స్టీవ్. విడాకుల తర్వాత ఇల్లు తనకి అక్కర్లేదని చెప్పేసిందిట శాండ్రా ముందుగానే!

ముందు పోట్లాడుకున్నారట యధావిధిగా! ఆ తర్వాత కోపం చల్లారి మాట్లాట లోకి దిగారట. మేగన్,డర్క్ ఇప్పటికే చాలా నలిగారని ఇద్దరికీ ఎంచేతో మరి జ్ఞానోదయం లాంటి ఫీలింగ్ కల్గిందట. ఆ ఇంట్లో ఇద్దర్లో ఎవరు లేకపోయినా పిల్లలు లేకపోయినా రెండో వాళ్లం ఉండలేమని అనిపించిందట.

ఇంకొక్క చాన్స్ తీసుకుని చూద్దాం అనిపించిందట ఇద్దరికీ! (బెట్టు సరిగా శాండ్రా చెప్పట్లేదు కానీ తనే ప్రపోజ్ చేసి ఉంటుందని నాకనిపించింది). అటార్నీ తోనే మాట్లాడి విషయం సెటిల్ చేసుకున్నారట. అంతే! కథ సుఖాంతం!

హాయిగా వెనక్కి వాలి "అమ్మయ్య" అన్నాను తెలుగులో పైకే.

"వాట్? ఏమన్నావు"అంది శాండ్రా చిగుళ్ళన్నీ కనిపించేలా తన మార్కు నవ్వు నవ్వుతూ నన్ను కావిలించుకుంటూ!

★★★

"అసలు ఎలా సాధ్యమైంది విరితా ఇది? నీ సహనం లెవెల్స్ చూసి, పిల్లల కోసం అతని తోనే ఉంటావనుకున్నాం అంతా"

నవ్వింది విరిత!

"నేను పిల్లల కోసమైనా సరే అతనితోనే పడి తన్నులు తింటూ ఉండాలని ఎప్పుడూ అనుకోలేదండీ! ఒకసారి తెగితే తిరిగి అతుక్కోదు కాబట్టి కొన్ని చాన్స్ లు ఇచ్చానంతే! పిల్లల కోసం అంటూ నన్ను బ్లాక్ మెయిల్ చేసింది మా అమ్మా, పిన్ని, అక్కా వీళ్ళే! ఇహ అతని వైపైతే అసలు అతని తప్పే లేదని వాదించిన వాళ్ళే అంతా! "ఏదో మగాడన్న తర్వాత ఏదో ఒకటి చెయ్యకుండా ఎలా ఉంటాడు. మనమే చూసీ చూడనట్టు వదిలే యాలి" అని వాగారు. ఇవన్నీ వింటూ కూడా అతనికి చాన్స్ లు ఇస్తూ వచ్చాను. నిజంగానే నా సహనానికి నాకే ఆశ్చర్యం వేస్తోంది. చాలా రోజులు ఏడ్చాను. ఇక నాకు ఏడవడం ఇష్టం లేదు. ఆ రోజు అతను నన్ను, పిల్లల్ని కూడా కొట్టడంతో మాకు కమ్యూనిటీలో కూడా సపోర్ట్ దొరికింది. లేకపోతే సర్దుకో అని చెప్పినవాళ్ళే ముందు అంతా! కిషోర్ అని ఒకాయన అతన్ని చంపేస్తాడేమో అనుకున్నా నిజంగా. "ఇంక ఒక దెబ్బ ఆ పిల్ల మీద పడిందంటే చస్తావ్" అని ఆయనే పోలీసులకు ఫోన్ కూడా చేశారు"

విరిత అందగత్తె అయినా ఆమె మొహం అంత మెరిసిపోతూ ఎన్నడూ కనిపించలేదు నాకు.

"నాకు ఉద్యోగం ఉండబట్టి ఆ పొగరుతో 'ఇంత పని' చేశానని అందరితో చెప్తున్నారట అతని తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ళూ. నాకు ఉద్యోగం లేకపోయినా ఇదే పని చేసేదాన్నండీ! ఇండియా వెళ్ళిపోయి ఏదో ఒక చిన్న ఉద్యోగమైనా వెతుక్కుని పిల్లల కోసం బతికే

దాన్ని! పిల్లల కోసం అతనితో ఉండాలని అందరూ సలహాలిచ్చారు నాకు. కానీ నేను నా పిల్లల కోసమే అతనికి దూరంగా వచ్చేశాను. అలాటి మనిషితో అలాటి ఇంట్లో నా పిల్లలా? వద్దు! ఎలాగూ పిల్లల కస్టడీ అతను కోరుకోడు. ఎందుకంటే అతనికి బాధ్యతలు వద్దు. పంతం కొద్దీ అతను కోరినా అప్పుడే ఏదో ఒకటి చేస్తాను. చెప్పండి, నేను చేసింది తప్పా?" విరిత మొహంలో ప్రసన్నత మాయమై గొంతులో మేఘాలు కమ్ముకున్నాయి.

"తప్పా రైటా ఎవరు నిర్ణయిస్తారు? నీ లైఫ్ కి ఏది మంచిదనిపించిందో అది నువ్వు చేశావు. నీ జీవితం నీ ఇష్టం" అన్నాను.

"విడిపోయి స్నేహితుల్లా ఉండమని కొందరు చెప్పారు. వొద్దండీ, నాకు అతనితో ఇక స్నేహం కాదు, అతను ఒకప్పుడు నా జీవితంలో ఉన్నాడని గుర్తుంచుకోవడం కూడా నాకు ఇష్టం లేదు" విరిత మాటలకు నాక్కూడా కళ్లలో నీళ్ళొచ్చేలా ఉన్నాయి.

★★★

"ఏంటీ? శాండ్రా డైవర్స్ తీసుకోలేదా? సరిపోయింది. ఆ అయినా ఈ భాగ్యం ఎన్నాళ్ళు? చూస్తాంగా! మనమూ ఇక్కడే ఉంటాం, వాళ్ళూ ఇక్కడే ఉంటారూ..." "

మరి వాడలా పిల్లల్ని కూడా కొట్టి ప్రాణాలు తీసేస్తుంటే ఎన్నాళ్ళని పడి ఉంటుంది విరిత మాత్రం? బతికుంటే బలుసాకు తినొచ్చనీ... పిల్లలకోసం కలిసి ఉండాల్సిన మనిషా వాడు!? అలాటి వెధవ మనిషి దగ్గర పెరగాల్సిన పిల్లలా వాళ్ళు? పిల్లల కోసమే విరిత పోట్లాట ఎలాగో పాపం దాని బతుకు అది బతుకుతుంది"

ఈ రెండు వ్యాఖ్యలూ స్మితవే!

స్మిత అలా మాట్లాడక పోయుంటే నిజంగా ఆశ్చర్య పడేదాన్నే!

## సముద్రం

**హెచ్చార్కే**

ఒక్కొక్కరూ వెళ్లిపోతున్నారు.
పిలిచి పిలిచి అలసి పోతున్నావు.
కంటి నుండి ఒక్కొక్క చుక్క రాలి, పెన్నీటిలో కలిసిపోతున్నది.
ఇక్కడంతా బాగుందని అననందుకు, సాక్ష్యం చెప్పనందుకు
మనుషులు ఒక్కొక్కరొక రాతి కన్ను విసిరి వెళిపోతున్నారు
దూరం జరుగుతూ ఏవేవో ఓడలు, రంగు రంగుల తెరచాపలు
మాటలకు అందని దూరం.
నడి సముద్రం, చేతులకు గడ్డిపోచ అందదు
అరవకు, మునిగిపో
నీలోపలికి నువ్వు,
నీ లోపలి మనుషుల మిగుల్ల లోనికి నువ్వు
ప్రతి అబద్ధాన్నీ కాదనడం కుదర్దు
కాదంటే, ఒక్కో నిజం ఒక వురి తాడవుతుంది
నీళ్లు, శీత జలాలు, మూసుకుంటున్న వల తాళ్లు, చీకటి అలలు
ఊపిరి తీసుకో, దొరుకుతుందేమో కాస్త విశ్రాంతి, దొరికితే తీసుకో
అరిచేతులు తెడ్లు, దేహమొక నావ; పద పద, పద పద, పద
తరించు సముద్రాన్ని, దొరకబుచ్చుకో ఊపిరికి ఊపిరి పోసే తీరాన్ని
ఇది ఎప్పుడూ ఇంతే
అబద్ధం వద్దనుకుంటే,
ఏ అబద్ధానికీ ఎవరూ బలి కావొద్దనుకుంటే,
ఎవడికైనా ఎప్పుడైనా ఇంతే, బహుశా, ఎక్కడో
రుతానృతాల మధ్య ఒక తటస్థ భూమి, కొత్త
దీవి.... .... నీ కోసం ఎదురు చూస్తున్నదేమో;
భయం?... ఉండనీ! చీకటి?.. అదీ ఉండనీ!
ఈదు, ఈదు. ఈదగలవు నువ్వీ సముద్రాన్ని
ఈదడానికే పుట్టావు, దున్నడానికి పుట్టిన రైతువి
ఎక్కడి నుంచో ఒక పక్షి అరుపు.
ఎక్కడి నుంచో ఒక అలుపు పాట.
అలల మీద తేలుతూ ఎక్కడిదో ఒక ఎండుటాకు.
ఎక్కడో ఉంది నిను సేద తీర్చే తడి ఇసుక,
ఒకటో రెండో ఎన్నో మనస్సులు.
భయం... ఉండనీ. చీకటి... ఉండనీ.
ఆర్తిని వినని ఓడలు,
వాటి రంగు రంగుల తెరచాపలూ ఉండనీ
వెన్నెల మరకలు పడిన చీకటి,
చీకటి కన్నుల వలె నక్షత్రాలు,
సిగ్గు పడే చంద్రుడు.. సైతం ఉండనీ
ఇది సముద్ర మనుకుంటావు నువ్వు
కాదు. ఇవి ఉమ్మ నీటి కెరటాలు.
నువ్వొక పుట్టాల్సి ఉన్న పాపాయివి
పుడుతున్నప్పుడు ప్రతి ఒక్కరూ ఒక్కరే.

# My advise to Youth

**Dr. Gavarasana Satyanarayana**

Do the youth need advice? They need advice when they choose a new school or university. They go to schools or universities to see them first hand. When they do go to India to visit relatives or just see places, they need advice. Why should one go to India?

As mentioned, the visit could be to see the relatives. One has to know about the old civilization. There are continuously living cities in India since the times of Vedas. This could be 3,500 years before. Imagine going to Kashi (now known as Varanasi)! Do you know that Kashi is the oldest continuously living city in the world? Jericho is another (not the one in New York state) city. Do you know where Jericho is located?

India is known as the spiritual country. When you visit now, materialism is seen everywhere in India. Then why call India, spiritual? If someone wants to become immersed in spirituality, one has to go to India. How anyone can stay, with no money, in India? Do you know the meaning of "Athithi devo bhava" ?

One has to go to villages to find out. My grandsons, do not wish to visit India, because it is dirty. True, India is dirty. The present Prime Minister of India has launched a program 'Swatch Bharat' to keep India clean. Lots of young people signed up to keep India 'clean.'

You have go to a village to see real India. Usually everyone has roots in a village. There are people in cities like Bombay, Delhi, Kolkata and Chennai who have never stepped out of the cities they live in. They do not know the difficulties of the villagers.

It is not enough if you go and visit a village, render some service that would remain forever. Any service is remembered, not the money donated. People outside India think they can abolish all the problems of the villagers if they donate money. This could be true, where large amounts of money is needed to start a service project. Let the villagers come out with a solution that is plaguing them. This is usually solved by a people's representative, like MLA or MP. Since solving a problem of the villagers will not bring votes, the people's representatives do not pay attention. That is where you come in.

There are many problems that villagers face. The administration does not know many things. You can enlighten them with statistics. For example there is power cut faced by the villagers. You can enumerate those houses that do not have electricity connection. There are many small businesses in the village, like workshops with lathes, carpenters using power tools. Even banks do not operate as they are linked with internet. Can you offer a solution? Can the local people offer a solution?

Lack of toilets in the villages is a big problem. I worked on this problem in a village called Pulimeru in east Godavari district many years ago. Twenty toilets were constructed in the village as there was some help from the government. When I went canvassing for building of toilets in the village, men folk did not agree. Women, who faced the difficulty in doing natural functions, readily agreed.

In America, anyone without a house is known as 'homeless.' In India, one without a house usually finds a house to stay, usually a relation's. The concept of 'homeless' is not known. But there are many elderly men and women who are deserted by their sons and daughters. For them, old age homes are the places to stay. Even these old age homes are not there everywhere. You can write the names and addresses of these old people and send the same to the concerned authorities.

Digital governance is a pet topic of the new PM of India. He wants all the papers needed by a citizen can be obtained by computer. India is known all over the world as it has exported expertise in digital technology. The fact remains, that India has not used its expertise in computers locally. As you are aware of the use of computers, you can suggest new ways of obtaining information in India through computers.

'Make in India' is another pet project. As you are young and looking for a job in the US, you can get it here as the unemployment rate is low. If one has to obtain a job in India, one has to use connections, money and influence. The jobs are not plenty and the people (young ones) are many. So the PM thought that the best way to employ these young people is to manufacture in India and then export to other countries.

Smart cities is another concept that is gaining attention. The present set up shows that the people who live in the cities are not happy with transport, livelihood and a place to live. There are many slums in the cities. In order to build new cities with all needs of the people, smart cities are planned.

Health and education are the bed-rocks of progress. You can help document incidence of disease among the

villagers. The education field needs your help: you can teach the high school students English and math. As you may come to know that the teachers in the village rarely come to the school to teach. The government uses them in myriad ways. They are used to take census, record all kinds of things needed by the government. The teacher's unions do not protest, as teachers get paid extra.

My request to you is to document everything. Report the same to the District Collector as he or she is the local government. One can also send an email to the PM with your suggestions. Make sure that the writings are published, so that others can do better.

## జడ (అష్టవిధ నాయికలు )

డా. జెజ్జాల కృష్ణ మోహన రావు

శ్రీవాణియు, శ్రీగిరిజయు
శ్రీవేంకటనాథు సతియు – సిరు లిచ్చి సదా
దీవింతురు మనలను, జడ
పూవుల చెలువములతోడఁ, – బూల నగవులన్ – 1

**అష్టవిధ నాయికల** జడలు –

నీకోస మలంకారము
నీకోసమె విరుల సిరులు – నీకై జడలున్
నీకోసమె గంధమ్ములు
నీకలయిక నాదు గురియు – నీవే యెల్లన్ – 8
(నాయకునితో కలయికకై అలంకరించుకొని వేచియుండే వాసకసజ్జిక తలపులు)

తీవెలఁ బూవులు పిలిచెను
పూవుల నుంచంగ జడను – మోహన లేవే
యీ విరహము గాల్చెను నను
రావా ముద్దాడ నన్ను – రమణా భ్రమణా – 9
(వియోగముతో బాధపడే విరహోత్కంఠిత తలంపులు)

కొప్పుంచి జలక మాడితి
నిప్పుడు కురు లెల్ల నాకు – నిటునటు జెదరెన్
గుప్పల సిరి యిది గొప్పది
చప్పున రావేల వచ్చి – జడ నల్లు ప్రియా – 10
(పతిని బానిసగా చేసికొన్న స్వాధీనపతిక ఆజ్ఞ)

కలహము పడినా నెందుల
కలఁకలతో నిట్టు లిందు – నలరక, నా యీ
వలపుల జడ విరి వాడెను
తలఁపులు నీదయ్యె నెడఁద – తలుపులు తియరా – 11
(కలహము పిదప నాయకునితో తగవులాడిన కలహాంతరిత మనసు)

ఖండించి నన్ను నీ వే
ముండ జడలఁ బూల నుంచి – మురిసిన పిదపన్
నిండుగ నవ్వుల వస్తివి
దండింతును నిన్ను రాకు – దరిదాపులకున్ – 12
(నాయకునిపై కినుక వహించిన ఖండిత తిట్టులు)

వత్తును సుఖ సంభోగ–
మ్మిత్తును నమ్ముమని జెప్పి – యెటు వెళ్లితివో
చిత్తము నీకై వేఁగెను
మత్తగు జడపూలు వద్దు, – మండనము లిఁకన్ – 13
(నాయకునిచే మోసపోయిన విప్రలబ్ధ వలపోత)

ఏడ దనున్నాఁడో బా–
వేడ నతఁడు చెప్పరేల – వేడెద జాడన్
వాఁడే లేనప్పుడు జడ
నాడెడు పూలేల నాకు – నరుసము లేలన్ – 14
(దీర్ఘకాల ప్రవాసములోనున్న నాయకుని తలబోయు ప్రోషితభర్తృక విరహము)

జడలోఁ బూవులు రాలన్
వడివడిగా వనమునందు – వర్షములోనన్
పడగల పాముల దాటుచు
సుడిగాలిన్ జనెను సుదతి – చూడఁగఁ బ్రియునిన్ – 15
(ప్రియుని సంధించుటకోసము వెళ్లే అభిసారికోత్సాహము)

# కార్య సాధక లక్షణం

ఆకెళ్ళ బాల భాను , భట్నవిల్లి (ఇండియా)

"**వేదో ~ ఖిల ధర్మమూలం**" మానవజీవితంలో ఆచరించాల్సిన అనేక ధర్మాలను వేదం చెబుతోంది. పెద్దలను ఏ విధంగా అనుసరించాలో, వారు చెప్పిన విషయాలను ఏ విధంగా ఆచరించాలో, పిల్లలతో ఏ విధంగా నడుచుకోవాలో, వారికి ఎలా ఆదర్శవంతంగా ఉండాలో, గురువులను ఎలా గౌరవించాలో, వారికి ఎలా మంచి పేరు తెచ్చేలా జీవితం గడపాలో, సమాజంలో స్నేహబాంధవ్యాలను ఎలా పెంపొందించుకోవాలో మొదలైన విషయాలను వేదం తెలియచెబుతోంది.



ఉదాహరణకు "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ" అంటూ, తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలి, అతిథి అభ్యాగతులను ఆదరించాలి లాంటి ఎన్నో విషయాలను వేదంచెబుతోంది. ఐతే, ఇవన్నీ మంత్రరూపంలో ఉన్నాయి. సామాన్య ప్రజలకు వాటి అర్థం తెలియదు. అందుకని 'వాల్మీకి మహర్షి' వేదంలో చెప్పబడిన అనేకధర్మాలను సామాన్య ప్రజలకు తెలిసే విధంగా, అప్పటి ప్రజలు మాట్లాడుకొనే సంస్కర్తభాష (సంస్కృతం)లో శ్రీమద్రామాయాణంగా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, కుటుంబవ్యవస్థను అద్దం పట్టే విధంగా మనకు అందించారు.

అలాగే, వేదం ఆదేశిస్తుంది. తప్పనిసరిగా చేసి తీరాలి అని నిర్దేశిస్తుంది. అలా నిర్దేశించినందువల్ల అందరికీ ఆచరించాలని అనిపించకపోవచ్చు. అందుకే, అందరికీ అర్థమయ్యే విధంగా వేదాలలో చెప్పబడిన ధర్మాలన్నింటినీ ఏవిధంగా నిజజీవితంలో ఆచరించవచ్చో మనకు రామకథలోని శ్రీరామ పాత్ర ద్వారా నిరూపించి చూపించారు.

రామాయణం నుంచి మనం ఏవిషయాన్నయినా నేర్చుకోవచ్చు. మనకు కావలసిన ఏ సమాచారమైనా రామాయణం నుండి లభిస్తుంది. శ్రీమద్రామాయణం-ఒక ధర్మశాస్త్రం, అలంకారకశాస్త్రం, నీతిశాస్త్రం, జ్యోతిషశాస్త్రం, మనస్తత్వశాస్త్రం, న్యాయశాస్త్రం, సామాజికశాస్త్రం, వాస్తుశాస్త్రం, జీవనశాస్త్రం, ఆధ్యాత్మికశాస్త్రం, యోగశాస్త్రం. ఇలా రామాయణం ఎవరు ఏ దృష్టితో చదివితే, వారికి ఆ విధంగా గోచరిస్తుంది. అందుకే, రామాయణాన్ని నిదానంగా పలుమార్లు చదవాలనీ, చదువుతున్న కొద్దీ క్రొత్తభావాలు తెలుస్తాయనీ, చదివేవారి వయస్సును బట్టీ, వారి గ్రహణశక్తిని బట్టీ అర్థమవుతుందని, ఆయా ఘట్టాలలో, సందర్భాలలో ఎన్నో సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు తెలుస్తాయనీ అంటారు. రామాయణంలోని ప్రతీ పాత్ర, మనకు ఆదర్శప్రాయమే. ప్రతి పాత్ర మనం నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలను చెబుతుంది. ఉదాహరణకు, హనుమంతుని పాత్ర. హనుమంతుడు చక్కని కార్యసాధకుడు. మొట్టమొదటి శ్రీరామ-హనుమత్ సమాగమ సమయమందే, హనుమంతుని వాక్చాతుర్యం, కార్యసాధకత్వ లక్షణాలను చూచి శ్రీరాముడు ముగ్ధుడై ఇలా ప్రశంసిస్తాడు.

**"ఏవం గుణగుణైర్యుకాః యన్యస్యుః కార్యసాధకాః,**
**తస్య సిద్ధ్యంతి సర్వార్థా దూతవాక్య ప్రభోధితాః"**

నవవ్యాకరణ పండితుడైన హనుమంతుని సంభాషణా చాతుర్యాన్ని చూచిన శ్రీరాముడు-"లక్ష్మణా! ఇన్ని శుభగుణాలతో కూడిన కార్యసాధకుడయిన ఒక్కదూత చాలును, అతనిచే ఆ యజమానికి సర్వవిధ కార్యములు నెరవేరగలవు" అని ప్రశంసిస్తాడు.

ఇక్కడ, భవిష్యత్తులో సీతాన్వేషణా మహాకార్యసాధకుడు ఇతడేనని రాముడు సూచించాడు. తదనుగుణంగానే శ్రీరామ-సుగ్రీవ మైత్రిని చేకూర్చి తన యజమానికి రాముని ద్వారా రాజ్యాన్ని ఇప్పించాడు హనుమంతుడు.

మనుధర్మశాస్త్రంలో దూత గురించి ఈ విధంగా చెప్పబడింది.

**"అనురక్తః శుభార్థజ్ఞః, స్మృతిమాన్ దేశకాలవిత్ ।**
**వపుష్మాన్ వీత భీర్వాగ్మీ, దూతో రాజ్ఞః ప్రకీర్త్యతే ॥**

పరిశుద్ధమైన మనస్సు కలవాడు, లౌకిక వ్యవహారం తెలిసినవాడు, వాక్చాతుర్యం కలవాడు అయిఉండాలి దూత. ఈ లక్షణాలన్నీ సరిగ్గా సరిపోయినవాడు హనుమంతుడు!

అందుకే, 'సీతను వెతికడం, రావణ నివాసాన్ని తెలుసుకోవడం అనేవి ప్రధాన కర్తవ్యాలుగా సుగ్రీవుడు కిష్కింధలోని వింధ్యపర్వతం నుంచి కోట్లాది అనుచరగణాన్నిచ్చి, ఆయా దిశా విశేషాలు చెప్పి ఒక్క మాసం వ్యవధి పెట్టి నలుదిక్కులకు వానరులను పంపాడు.

అలా పంపినవారిలో అంగదుని నాయకత్వంలో జాంబవంత, హనుమదాది వీరులు దక్షిణ దిక్కుగా వెళ్ళినా, తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కులకు పంపబడిన అనేక సంఖ్యాకులైన వానరులలో ఒక్క ఆంజనేయునకు మాత్రమే ఆనవాలుగా ముద్రికను స్వీకరించాలనే ఆలోచన వచ్చింది. అప్పుడే శ్రీరామునికి నమ్మకముంది - హనుమంతుడు సీత జాడను తెలుపగలడని. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని, కష్టనష్టాలకోర్చి సాగరలంఘనం చేసి శతృదుర్భేద్యమైన లంకలో ప్రవేశించి, సూక్ష్మబుద్ధితో, సూక్ష్మశరీరం ధరించి లంకలో సీతను వెదకినాడు హనుమంతుడు.

చివరకు అశోకవనంలో సీతాదేవిని గుర్తించాడు. రావణుని చేత బంధింపబడిన సీత ఎన్ని కష్టాలు పడుతోందో, రాక్షస స్త్రీల చేత ఎన్ని మాటలు పడుతోందో అన్నీ గ్రహించాడు. బాధపడుతున్న సీతను ఓదార్చాడు. రామముద్రికనిచ్చి, చూడామణిని గ్రహించాడు.

**"కార్యే కర్మణి నిర్దిష్ట:యో బహూన్యపి సాధయేత్**
**పూర్వ కార్య విరోధేన సకార్యం కర్తుమర్హతి"**

"వచ్చినపని పూర్తి అయిననూ, దానికి భంగము కలిగించని ఇతర కార్యములను చుట్టబెట్టుట ఉత్తమదూత లక్షణం" అందుకే అంతటితో వచ్చిన పని అయిపోయింది. కానీ శతృవుకు బలమెంత ఉందో పరీక్షిద్దామని అశోకవనాన్ని ధ్వంసం చేశాడు. రావణుడు పంపిన ఎనభైవేల మంది రక్కస మూకలను చెండాడాడు. ఆ పై వచ్చిన జంబుమాలిని, కొంతమంది సేనాపతులను, మంత్రిపుత్రులను కూడ సంహరించాడు. తరువాత రావణునకు హితబోధ చేయాలనే ఉద్దేశంతోనే ఇంద్రజిత్తుకు పట్టుబడినట్లు నటించాడు!

**జయత్యతి బలో రామో లక్ష్మణస్య మహా బలః**
**రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః**

మా స్వామి రఘురామ ప్రభువు మహా బలశాలి. ఆయన తప్పక లంకను నాశనం చేయగలడు. నేనొక్కడిని వస్తేనే ఇలా ఉంది. నా లాంటివారు కోట్లానుకోట్లమంది ఉన్నారు. అని రావణుని భయ పెట్టి, లంకకు నిప్పు పెట్టాడు. శతృవయిన రావణుణ్ణి మానసికంగా, ఆర్థికంగా, కృంగదీశాడు, నాలుగో వంతు సైన్యాన్ని సంహరించడం ద్వారా క్షీణబలుణ్ణి చేశాడు. ఇలా, దూతగా తన పాత్రను చక్కగా నిర్వహించి, తన స్వామికి మహోపకారం చేశాడు. అలాంటి కార్య సిద్ధుడైన హనుమంతుణ్ణి మనం కూడా ఆదర్శంగా తీసుకోవడం, సమయోచిత ప్రవర్తనతో కార్యసాధన కావించడమే రామాయణం ముఖ్య ప్రబోధం.

# నా దైవం

**జయ రాయపూడి**

నీవే నా రాగం ,అనురాగం , గానం ,ఆధారం !
నీవే నా ధైర్యం ,అ-భయం, జీవనం ,నా ప్రాణం!
నీవే నా అందం ఆనందం నా నమ్మకం
నా ఈ పయనం లో నీడగా నిలిచి చూపుమా గమ్యం !
ఈ సంసార సాగరం లో నీ తలపే ప్రేమమయం !

ఈ నేలపై నీవు నాకిచ్చిన సమయం కేవలం నా భాగ్యం !
నిను పూజించిన జీవితం ధన్యం,ఇది సృష్టించిన నీకే అంకితం!
ఇది మరువలేని అనుబంధం , ఎదలో నింపుకుని దైవం
నడచుకో నిత్యం !తెలుసుకో సత్యం! జీవితపు పరమార్ధం !

# నిత్య జీవితంలో పద్యం

భైరవభట్ల కామేశ్వరరావు

బాపూగారి చివరి చిత్రం శ్రీరామరాజ్యం చూసినప్పుడు నాకొక విషయం కొట్టొచ్చినట్లు అనిపించింది. ఆ సినిమాలో ఒక్క టంటే ఒక్క పద్యం కూడా లేదు! బహుశా పద్యాలు లేని ఒకే ఒక తెలుగు పౌరాణిక చిత్రం అదేనేమో. ఈ విషయం నాకు పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు కానీ, పద్యంపై నాకున్న మక్కువ, కాస్తంత చింతని మాత్రం మిగిల్చింది. తెలుగువాళ్ళ జీవితం నుంచి పద్యం జారిపోయిందన్న చేదునిజం స్పష్టంగా తెలిసింది. బహుశా ఇప్పు డు తెలుగుపద్యం బడిపిల్లల పుస్తకాలలో మాత్రమే మిగిలింద నుకుంటాను. అక్కడయినా ఉందో లేదో నాకు అనుమానమే.

పద్యం అనేది కేవలం రాజాస్థానాలకూ, కొన్ని వర్గాల ప్రజ లకూ మాత్రమే పరిమితం అన్న అభిప్రాయం ఒకటి ప్రచారంలో ఉంది. ఆ మాట పాక్షిక సత్యమే తప్ప పూర్తి నిజం కాదు. కవులను తమ ఆస్థానాలలో పోషించి వారి కావ్యాలను రాజులు అంకితం తీసుకొన్న మాట వాస్తవమే. అయినా మరొక పక్క, ప్రజల నిత్య జీవితాలలో భాగంగా కూడా తెలుగుపద్యం కొనసాగుతూ వచ్చింద న్న మాట కూడా అంతే వాస్తవం. మంచి భోజనం దొరికినప్పుడు, దొరకనప్పుడు, దప్పిక కలిగినప్పుడు, తగువులు పడినప్పుడు, ఆనం దంలోనూ, ఆగ్రహంలోనూ, ఒకటేమిటి, జీవితంలో ప్రతిసన్ని వేశాన్నీ పద్యం పరిమళింపజేసింది. యుద్ధం నుండి పారిపోయి వచ్చిన ఒక సైనికునికి అతని తల్లీ పెళ్ళమూ వాడిగా వేడిగా బుద్ధి చెప్పడానికి కూడా పద్యం ఉపయోగపడిందంటే, పద్యం తెలుగు వారి జీవితాలతో ఎంతగా పెనవేసుకొనిపోయిందో ఊహించ వచ్చు. ఖడ్గతిక్కనకు సంబంధించిన ఆ కథా, పద్యాలూ, తెలుగు వాళ్ళకు బాగా పరిచితమే. స్త్రీలుకూడా నిత్యజీవితంలో అలవోకగా పద్యాలు చెప్పేవారు అనడానికి అది మంచి ఉదాహరణ. పద్యం ఒక వర్గానికే పరిమితమయిందని చెప్పడానికి కూడా వీలులేదు.

**పచ్చగడ్డిమోపు పాకలో వేయించి**
**పెరటితలుపు మూయ మరచిపోయి**
**మాటలాడుచుండె మా తాత అవ్వతో**
**మేకలంత మోపు మేసిపోయె**
**ఆటలాడమాని అప్పుడు నే వచ్చి**
**కథలు చెప్పుమింక కథ లటంచు**
**తాత చుట్టు చేరి తప్పట్లుకొట్టగా**
**తగిలె నొక్క చరుపు దవడ మీద**

ఒక చిన్న తమాషా సంఘటనని చిత్రించే యీ తేటయిన ఆటవెలది పద్యాలలో రైతు జీవితం గుబాళించడం లేదూ! ఇలా నిత్యజీవితం లో సందర్భానుసారంగా ఒక పద్యమో, పద్యభాగమో, తెలుగువారి నోటినుండి జాలువారడం బహుశా పందొమ్మిదివందల డెబ్భైల దాకా కొనసాగిందనుకొంటాను. "కామిగాక మోక్షగామి కాడు", "ఊరక రారు మహాత్ములు", "బావా ఎప్పుడు వచ్చితీవు" వంటి మాటలు అలా ప్రజల నోళ్ళలో నాని నాని నానుడులైపోయాయి! మా పల్లెటూరిలో, మా అమ్మ వంటచేస్తూ ఉంటే పక్కింటి పిన్నిగారు వచ్చి, "అమ్మ, నీ చేతి తాలింపు కమ్మదనము, భరతదేశాన ఘుమ ఘుమ పరిమళించె" అంటూ ఆప్యాయంగా పలకరించేవారట.

పద్యం అనేక రూపాలలో మార్గాలలో తెలుగువారి జీవితం లో స్థానాన్ని ఏర్పరచుకొంది. వాటిలో ముఖ్యమైన రూపం చాటువు. సంస్కృత, తెలుగు, తమిళ భాషల్లోని చాటువులను ఇంగ్లీషులోకి అనువాదం చేసిన వేల్చేరు నారాయణరావు, డేవిడ్ షల్మన్‌లు, దానికి "A Poem At The Right Moment" అనే చక్కని అర్థవంతమైన పేరు పెట్టారు. ఒక సందర్భానికి తగ్గట్టుగా ఝటితి స్ఫూర్తితో చెప్పే, చెప్పుకొనే పద్యమే చాటువు. "ఒక భోగి చేత సత్క రింపబడినపుడో, ఒక లోభిచేత ఛీత్కరింపబడినప్పుడో, అందమైన దృశ్యం కనబడినపుడో, డెందం గాయపడినపుడో, అనిష్టం తొంగి చూసినపుడో, హాస్యం లాస్యం చేసినపుడో, అనేక సందర్భాల్లో చిత్ర మైన చిత్తవృత్తుల్లో ఛందోరూపంలో జుమ్మని చిమ్ముకొని వచ్చే కవి తారూపాలే ఈ చాటుపద్యాలు" అని సి.నా.రె.గారు చెప్పిన మాటలు చాటువుకు నిత్యజీవితంతో ఉన్న పెనవేతని స్పష్టం చేస్తాయి. చాటుపద్యం ఏ ఒక్క కవి సొంతమూ కాదు. ఒక సందర్భంలో ఒకరి చేత చెప్పబడిన ఒక చాటువు, ఆ తర్వాత అనేకులచేత అనేక మార్లు, అలాంటి సందర్భంలోనో వేరు సందర్భాలలోనో చెప్పబడు తూ ఉంటుంది. సందర్భోచితంగా పుట్టడమే కాదు సందర్భాను సారంగా వ్యాప్తికూడా చెందుతుందన్నమాట చాటువు. అలా అది నిత్యజీవన వ్యవహారంలో భాగమవుతుంది. ఉదాహరణకు:

**కలనాటి ధనము లక్కర**
**గలనాటికి దాచ కమలగర్భుని వశమే**
**నెలనడిమినాటి వెన్నెల**
**అలవడునే గాదెబోయ అమవసనిసికిన్**

పెద్దనగారి పేరు మీద చెలామణీ అయిన యీ చాటువును ఎంత మంది ఎన్నిమార్లు తమ పరిస్థితికి అన్వయించుకొని చెప్పుకొని ఉంటారో కదా!

తరతరాల తెలుగువారి నిత్యజీవితంలో భాగం కావడం వల్లనే,

చాటువులు వందల యేళ్ళుగా కాలంతో పాటు ప్రయాణం చేశాయి. ఒక రకంగా, చాటువులు పద్యరూపంలో ఉన్న జాతీయాలూ సామెతలూ అని అనుకోవచ్చు! చాటుకవిత్వం కోవకి చెందినవే శతక పద్యాలూను. "ఆకొన్న కూడె అమృతము", "చిత్తశుద్ధి లేని శివ పూజలేలయా", "తలలుబోడులైన తలపులు బోడులా", "గంగిగోవు పాలు గంటెడైనను చాలు" వంటి శతకపద్య పాదాలెన్నో నిత్య వ్యవహారంలో నానుడులుగా మారిపోయాయి.

చాటువులే కాకుండా, భారత భాగవతాలలో పద్యాలు కూడా తెలుగువారి జీవితాలలో భాగమయ్యాయి. ముఖ్యంగా పోతన పద్యాలను తెలుగువారు తమ గుండెలకి గాఢంగా హత్తుకున్నారు. గజేంద్రమోక్షణం, రుక్మిణీకల్యాణం, ప్రహ్లాదచరిత్ర – ఇలా ఒకటీ రెండూ కాదు, ఎన్నెన్నో రసవత్తర ఘట్టాలలో పద్యాలు తెలుగువారి ఇంటింటి పద్యాలయ్యాయి. ఉదాహరణకు, మునుపటి రోజుల్లో ఈ పద్యం తెలియని తెలుగువాడు లేడంటే అది అతిశయోక్తి కాదు:

**వారిజాక్షులందు వైవాహికములందు**
**ప్రాణవిత్తమానభంగమందు**
**చకితగోకులాగ్రజన్మరక్షణమందు**
**బొంకవచ్చు నఘము బొంద దధిప**

పూర్వకాలంలో పురాణప్రవచనాలు, హరికథలు, బుర్రకథలు మొదలైన ప్రక్రియలు పద్య ప్రచారానికి ముఖ్యసాధనాలుగా ఉండేవి. ఆధునికయుగంలో, జనరంజకమైన నాటకాలు పద్యప్రచార సాధనాలయ్యాయి. పల్లె ప్రజలు సైతం "చెల్లియొ చెల్లకో", "జెండాపై కపిరాజు" అంటూ తమ పనిపాటల్లో పద్యాలను పాడుకొనేలా చేసిన ఘనత తిరుపతివేంకట కవులది. ఆ తర్వాత విజృంభించిన సినిమాలు సైతం ఎంతో కొంత పద్యానికి స్థానమిచ్చాయి. పౌరాణిక చిత్రాలలో పద్యాలు సరేసరి, సాంఘిక చిత్రాలలో కూడా అక్కడక్కడ సరసమైన పద్యాలు సందర్భోచితంగా తళుక్కుమనేవి. కులగోత్రాల సినిమాలో పద్మనాభం మామగారి మీసంపై చెప్పిన సీసం ఇప్పటికీ చాలామంది పెద్దవాళ్ళకు గుర్తుండే ఉంటుంది.

ఇలా మన జీవితంలో భాగమైన మనదైన పద్యం ఇప్పుడు మనది కాకుండా పోడానికి కారణమేమిటి? ఇది సహజ పరిణామమా? పరాయి సంస్కృతి ప్రభావమా? కాలం చెల్లిపోయిందా? గొంతు నులిమేయబడిందా? ఇవన్నీ సాంఘికశాస్త్రవేత్తలూ సాహిత్యచరిత్రకారులూ ఆలోచించాల్సిన ప్రశ్నలు. అదంతా విద్యావిషయకమైన చర్చే తప్ప సామాన్య ప్రజకు పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. ఈ వ్యాసంలో ఆ విషయాలను చర్చించడం నా ఉద్దేశం కాదు. అయితే, ఈ కాలంలో రోజువారీ జీవితంలో పద్యానికున్న ప్రాసంగికత ఏమిటి? ఇప్పటికీ నిత్యవ్యవహారంలో ఒక భాగంగా పద్యాన్ని ఉపయోగించుకోవచ్చా? ఈ ప్రశ్నలకు సోదాహరణంగా సమాధానాలు చెప్పడానికి ప్రయత్నిస్తాను. పద్యమంటే పండితులకి మాత్రమే పరిమితమైన ఒక కళారూపమన్న అపప్రథని తొలగించడం నా యీ ప్రయత్నం వెనకనున్న ప్రధాన లక్ష్యం.

నిత్యజీవితంలో అడుగడుగునా అలవోకగా చెప్పుకొనేందుకు బోలెడంత పద్యసంపద మనకుంది. అందరికీ బాగా తెలిసున్న పద్యంతో మొదలుపెడదాం. మీ యింట్లో వంకాయకూర చేసిన రోజు, వేడివేడి అన్నంలో దాన్ని కలుపుకొంటూ చక్కగా యీ పద్యాన్ని తలుచుకోవచ్చు:

**వంకాయవంటి కూరయు**
**పంకజముఖి సీతవంటి భామామణియున్**
**శంకరునివంటి దైవము**
**లంకాధిపు వైరివంటి రాజును గలడే!**

అలా చదువుకొని తిని చూడండి, వంకాయకూర ఇంకాస్త రుచిగా ఉంటుంది! వడ్డిస్తున్నది మీ భార్య అయితే, రెండో పాదాన్ని "పంకజముఖి! నిన్ను మించు భామామణియున్" అని మార్చి ఆమెని ఉద్దేశిస్తూ చదవండి. ఆ తర్వాతనుంచీ ఎప్పుడు చేసినా వంకాయకూర మరింత రుచిగా ఉండకపోతే నన్నడగండి!

మీకు వంకాయ కన్నా కాకరకాయకూర యిష్టమైతే, అది చేసినప్పుడు చదువుకోడానికి కూడా పద్యం ఉంది:

**వేయారు వగల కూరలు**
**కాయలనేకములు ధాత్రి కలవందులలో**
**నాయకములురా కాకర**
**కాయలు మరి కుందవరపు కవిచౌడప్పా!**

ఇలా భోజనం చేసేటప్పుడు చదువుకోడానికి కావలసినన్ని పద్యాలున్నాయి! భోజనం దాకా ఎందుకు, మీరు పొద్దున్నే కాఫీ పడందే ఏ పనీ చేయలేని కాఫీదాసులయితే, మహాకవి శ్రీశ్రీ అంతటివాడు మీ కోసం చిక్కని ఫిల్టరు కాఫీలాంటి పద్యం ఒకటి రాసాడు చూడండి:

**ఎప్పుడుపడితే అప్పుడు**
**కప్పుడు కాఫీనొసంగ గలిగిన సుజనుల్**
**చొప్పడిన యూరనుండుము**
**చొప్పడకున్నట్టి యూరు చొరకుము మువ్వా!**

అలాగే కిళ్ళీ ప్రేమికులకు తాంబూలసేవనం చేస్తూ చర్వణ చేసేందుకు ఘుమ్మనిపించే పద్యాలెన్నో మన కావ్యాలలో ఉన్నాయి. ఒకోసారి ఒకో పద్యాన్ని గుర్తుకు చేసుకోవచ్చు. పెద్దనగారి "మృగమద సౌరభ విభవద్విగుణిత ఘనసారసాంద్ర వీటీ గంధము" చాలా ప్రసిద్ధమే. సరదాగా చిలకలు చుడుతూ మీ ఆయనకో ఆవిడకో చిక్కుప్రశ్న వేయాలంటే ఇదిగో యీ పద్యం చెప్పవచ్చు:

**వండగ నెండిన దొక్కటి**
**వండక మరి పచ్చిదొకటి వడి కాలినదిన్**
**దిండికి రుచియై యుండును**
**మండలమున జనులకెల్ల మహిలో వేమా!**

అసలు తాంబూలమే దొరకలేదనుకోండి, అలాంటప్పుడు కూడా చదువుకొనేందుకు మంచి పద్యం ఉంది:

**పరగడుపున, సభలోపల,**
**తరుణులయెడ, భుక్తమైన తరి, యొక విడెమున్**
**దొరకని నరునకు సౌఖ్యము**
**కరువప్పా కుందవరపు కవిచౌడప్పా!**

సరే యిక తిండిగోల ఆపి ముందుకు సాగుదాం. తాంబూలం సంగతి ఎలానూ వచ్చింది కాబట్టి, ఆలుమగల సరస సన్నివేశాల వైపు చూపు మళ్ళిద్దాం. వాటికి అనువైన పద్యాలు మన ప్రబంధాలలో కోకొల్లలుగా ఉన్నాయి. ప్రబంధాలలోనే కాదు చాటువుల్లో కూడా కావలసినన్ని పద్యాలు దొరుకుతున్నాయి. అవి సంసారంలోని శృంగారాన్ని మరింత రసవంతం చేసుకోడానికి ఉపయోగించవచ్చు. ఉదాహరణకు మీ యింటావిడ చిరు అలకతో మొహం తిప్పుకు వెళ్ళిపోతోందనుకోండి. చక్కగా యీ పద్యాన్ని అందుకోండి:

**వరబింబాధరమున్ బయోధరములున్ వక్రాలకంబుల్ మనో**
**హర లోలాక్షులు జూప కవ్వలి మొగంబైనంత నేమాయె నీ**
**గురుభాస్వజ్జఘనంబు, గ్రొమ్ముడియు మాకుం జాలవే! గంగ క**
**ద్దరి మే లిద్దరి కీడునుం గలదె!**

అలా మీరు పద్యం చెప్పేసరికి అర్థమైనా అవ్వకున్నా, మీ అర్ధాంగి చటుక్కున వెనక్కి తిరక్క మానదు. అప్పుడు "**ఉద్యద్రాజ బింబాననా!**" అంటూ ఆ పద్యాన్ని పూర్తి చేసి, అవసరమైతే దాని భావం ఆమెకు వివరించండి. అప్పుడామె అలక అటకెక్కక మానదు! విరహం కూడా శృంగారరసంలో ఒక భాగమే. ఈ కాలపు ఉద్యోగాలు ఆలుమగల మధ్య మాటిమాటికీ విరహాగ్నిని పెంచేవే కూడానూ! అలా ఏదో పనిమీద శ్రీవారు పై ఊరు వెళ్ళవలసి వస్తే అతన్ని ఊరికే తలుచుకోడం కాక పద్యాలలో తలుచుకొంటే కాస్తంత ఊరట కలుగుతుంది. ఎలా? అంటే యిలా:

**ఆతడు దూరదేశమున కక్కట! ఎన్నడొ బోయె, రాడు, నే**
**నాతని బాసి మన్మథశరాగ్ని దపించుచు నున్నదాన, నీ**
**వాతని నన్ను జూచితి వియత్తల మెక్కి సుధాకరుండ! నే**
**నాతనికంటె జిక్కితినొ యాతడె చిక్కెనొ నాకు దెల్పుమా!**

అలా చందమామను నిలదీస్తే ఆ విరహాన్ని చూడలేక అతడే చిక్కిపోతాడేమో! మరి అలాంటి స్నేహంబాంధవికి దూరానున్న భర్త ఏం చేస్తే మనసు కాస్త సేద తీరుతుంది? పీనాసితనానికి పోయి పొట్టిపొట్టి మెసేజులు కాకుండా, ఎంచక్కా యిలాంటి పద్యాన్ని ఈమెయిలు చేస్తే సరి!

**శ్రీమదసత్య మధ్యకును జిన్ని వయారికి ముద్దులాడికిన్**
**సామజయానకున్ మిగుల జక్కని యింతికి మేలు గావలెన్**
**మేమిట క్షేమ మీవరకు మీ శుభవార్తలు వ్రాసి పంపుమీ**
**నా మది నీదు మోహము క్షణంబును దీరదు స్నేహబాంధవీ!**

ఇలా ఆలుమగల స్నేహానికి సౌరభాన్ని అద్దే పద్యసుమాలు ఎన్నయినా చెప్పుకోవచ్చు!

పద్యాలు పెద్దలకు మాత్రమే కాదు. పిల్లల గురించిన పద్యాలూ, పిల్లలతో చెప్పే పద్యాలూ కూడా కోకొల్లలు.

**జోజో కమలదళేక్షణ!**
**జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!**
**జోజో పల్లవకరపద!**
**జోజో పూర్ణేందువదన! జోజో యనుచున్.**

మీ పాపాయిని పోతనగారి పద్యంతో రోజూ జోకొట్టవచ్చు. నా చిన్నప్పుడు మా తాతగారు మమ్మల్ని ఉయ్యాల ఊపుతో గజేంద్ర మోక్షణం పద్యాలు చదువుతూ జోకొట్టేవారట! ఉయ్యాలలో ఊగే పసిపాపను చూస్తే చటుక్కున జాషువాగారి పాపాయి పద్యాలు గుర్తుకు వస్తాయి. ఒకటి రెండయినా కంఠస్థం చేసి ఆ సందర్భంలో పాడుకొంటే మన మనసుకూడా పసిపాపంత స్వచ్ఛంగా మారిపోతుంది. మచ్చుకొక పద్యం:

**బొటవ్రేల ముల్లోకముల జూచి లోలోన**
**ఆనందపడు నోరు లేని యోగి**
**తల్లిదండ్రుల తనూవల్లరి ద్వయికి వ**
**న్నియబెట్టు తొమ్మిదినెలల పంట**
**అమృతమ్ము విషమను వ్యత్యాస మెరుగ కా**
**స్వాదించ చను వెఱ్ఱిబాగులాడు**
**అనుభవించు కొలంది యినుమడించుచు మరం**
**దము జాలువారు చైతన్యఫలము**

**భాష రాదు, వట్టి పాలు మాత్రమె త్రాగు,**
**నిద్రపోవు, లేచి నిలువలేడు,**
**ఎవ్వరెరుగ రితని దే దేశమో గాని**
**మొన్న మొన్న నిలకు మొలచినాడు!**

మీ పిల్లలతో సరదాగా చదవడానికీ చదివించడానికీ చక్కని ప్రాసలతో సులువుగా నోటికొచ్చే శతకపద్యాలెన్నో ఉన్నాయి. ఎప్పుడైనా మీ అమ్మాయో అబ్బాయో కాస్త బద్ధకంగా పక్కపై దొర్లుతూ ఉంటే, కసురుకోకుండా ఈ పద్యం చదివి వినిపించండి:

**ఎద్దునెక్కె శివుడు, గ్రద్దనెక్కె విష్ణు**
**హంసనెక్కె బ్రహ్మ అందముగను**
**బద్ధకంపు మొద్దు బల్లపై నెక్కెరా**
**లలితసుగుణజాల! తెలుగుబాల!**

లలితంగా మందలించడానికి యింతకన్నా మంచి మార్గం ఏముం టుంది చెప్పండి! అలాగే, కాస్త ఎదుగుతున్న సంతానం ఎప్పుడైనా కొంచెం మొండిగా వాదనకు కాని దిగితే, ఊరికే బీపీ పెంచు కోకుండా యీ పద్యాన్ని వినిపించి ఊరుకోడం ఉత్తమం.

**తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు**
**దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు**
**తిరిగి కుందేటికొమ్ము సాధింపవచ్చు**
**చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు!**

సంతోషంలోనే కాదు బాధాకర సన్నివేశాలలో సైతం మన సుకు కొంత ఊరటనిచ్చి, వచ్చిన కష్టాన్ని చిరునవ్వుతో స్వీకరించేం దుకు పద్యాలు ఉపయోగపడతాయి. ఉదాహరణకు, ఏడాది చివర సర్కారు వారికి పన్నుకట్టాల్సి వచ్చినప్పుడు, మనసు చివుక్కు మనక మానదు. అయినా కట్టడం ఎలాగూ తప్పదు కాబట్టి, అది తప్పించు కో(లే)(కూడ)నిది కాబట్టి, సరదాగా యీ పద్యాన్ని చదువుకోవచ్చు:

**తిండి లేనట్టివానికి తిండి యిడడు**
**తిండి గలవారి దగ్గర తీయు పన్ను**
**ఉర్విపతి కంటే దంతవైద్యుండు నయము**
**పన్నుకట్టును లేనట్టివాడు చనిన!**

అలాగే ఇంట్లో చికాకులేమైనా ఏర్పడితే వాటిని చెప్పులో రాయిలా విదిలించుకొనేందుకు ఈ పద్యాన్ని గుర్తుచేసుకొంటే మంచిది!

**చెప్పులోని రాయి చెవిలోని జోరీగ**
**కంటిలోని నలుసు కాలిముల్లు**
**ఇంటిలోని పోరు ఇంతింత గాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ఒకోసారి ఏదో జరగాలని ఆశపడతాం. అది జరగదు. మన ప్రయ త్నలోపం లేకపోయినా అది జరగలేదంటే ఆ తప్పు విధి మీద నెట్టే సి చేతులు దులుపేసుకోడమే ఉత్తమం. దీనికి గాథాసప్తశతిలో ఒక మంచి పద్యముంది. దానికి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి తెలుగు సేత మనకోసం:

**హృదయఫలకము మీద నేమేమి మనసు**
**ఆస యనియెడి కుంచెతో వ్రాసికొనునో**
**నవ్వుచును విధి దాని నంతయును బట్టి**
**తుడిచివైచుచునుండు బాలుడును బోలె!**

ఇలా పద్యాలను ఎన్నైనా చెప్పుకొంటూ పోవచ్చు, పెరిగి పెరిగి చాటభారతం అవుతుంది! పద్యమంటే నిజంగా యిష్ట పడేవారు, దాన్ని నిత్యజీవితంలోకి ఎలా స్వాగతించవచ్చునో, కలుపుకోవచ్చునో రుచి చూపించడమే నా లక్ష్యం కాబట్టి యీ ఉదా హరణలు చాలుననుకొంటాను. పైగా అవి ఉండాల్సింది పుస్తకాల్లో కాదు, ప్రజల నాల్కలపైన. ముందు కొన్ని పద్యాలతో మొదలుపెట్టి దానిలో స్వారస్యాన్ని గ్రహిస్తే ఆపైన మీకు కావలిసినన్ని పద్యాలు దొరుకుతాయి.

ఇంతకీ యిలా పద్యాలను మన జీవితభాగస్వాములుగా చేసుకోడం తెలుగు భాషా సంస్కృతులను ఉద్ధరించడానికో పద్యాల ను బ్రతికించుకోడానికో కాదు సుమా! మరెందుకంటారా. మన కోసం, మనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకోడం కోసం, మన నలుపు తెలుపు బతుకులకి కాసిన్ని రంగులద్దడం కోసం, యాంత్రిక త అనే భూతం కోరలకు చిక్కకుండా జీవితానికి కాస్తంత రసస్పర్శ ని అందించడం కోసం. ఒక్క ముక్కలో చెప్పాలంటే బాపూగారి సినిమాలో ముళ్ళపూడివారు చెప్పినట్టు:

**"మడిసన్నాక కాసింత కలాపోసనుండాల. ఉత్తినే తినితొంగుంటే మడిసికీ గొడ్డుకీ తేడా ఏటుంటాది!"**





# రెడ్డి గారి భార్య

**కొమరవోలు సరోజ**

ఆ రోజు న్యూజెర్సీ లో తెలుగు కళాసమితి రజతోత్సవాల సందర్భంగా రెండురోజులు అత్యంత వైభవంగా విందులు వినోదాలు సంగీత, సాహిత్య నృత్య కదంబాలతో విరజిల్లుతోంది.
కార్యక్రమాలన్నిటిలోకి లంబాడీ డాన్స్ మహా అద్భుతంగా ఉంది. ఆ డాన్సు చేసిన నారీమణి చక్కటి ముఖ సౌందర్యమే గోకుల్ రెడ్డి గారి కళ్ళముందు మాటి మాటికీ సాక్షాత్కరిస్తోంది. ఆమె పేరు దశమి అని తెలిసింది. పేరు మార్చుకుందా?
ఎక్కడి పాలమూరు? .ఎక్కడి న్యూ జెర్సీ?
అసలీ దేశానికి ఎందుకొచ్చింది?
ఎట్లా వచ్చిందీ? రెడ్డి గారి మనసులో అన్నీ ప్రశ్నలే.



ఆ రూపం, గడ్డం మీద మూడు చుక్కలు, పచ్చ బొట్టు, అసలు తానెట్లా మరిచి పోగలడు! ఆమెతో తన పరిచయం నలభై ఏళ్ల నాటిది కానీ – ఆ చక్కదనం, ఆ చిరునవ్వు, వీణానాదం లాంటి సుస్వరం, అజంతా –ఎల్లోరాలను తలదన్నే సహజ బాహ్య సౌందర్యం! తాను ఆమెతో గడిపిన సమయం ... తీగ లాగితే డొంకంతా కదలిన చందమైంది గోకుల్ రెడ్డి గారి పరిస్థితి. ఫంక్షన్ నుండి ఇంటికి వచ్చి మూడుగంటలైనా ఆయనకింకా ఆ లంబాడీ డాన్సు చూస్తున్న అనుభూతే కలుగుతోంది. కొడుకు వచ్చి"ఇంకా నిద్రపోలేదా నాన్నగారూ? గుడ్ నైట్ చెబుదామని వచ్చాను" అని చెప్పినా కూడా, యధాలాపంగానే గుడ్ నైట్ చెప్పారు కానీ ఆయన మనసు గతంనుండి బయటకు రాలేదు. తను ఆమెకు న్యాయం చేయలేక పోయాడు. కులం అనే కుళ్ళు, ధనం అనే దాహం తనకు అడ్డొచ్చాయి. ఆమెను అనుభవించడానికి లేని అడ్డు గోడలన్నీ పెళ్లి అనే పేరెత్తగానే పటిష్టమైన కంచుగోడలై నిలిచాయి. అయితే పైన భగవంతుడున్నాడు కదా! తన పాపానికి తగిన ప్రాయశ్చిత్తం చేశాడు. తనకు సంతాన ప్రాప్తి కలుగలేదు. చివరికి దత్త స్వీకారం తీసుకోవలసి వచ్చింది. నలభై ఏళ్ళు నిండకుండానే భార్య గుండె జబ్బుతో మరణించింది. ఆమెకు వివాహానికి పూర్వమే గుండె జబ్బుందని తనకెవ్వరూ చెప్పలేదు. తన తల్లిదండ్రులకు విషయం ముందే తెలిసినా తనెక్కడ ఒప్పుకోడో అని రహస్యంగా దాచారు. ధనదాహం అలాంటిది. ఎంత త్రాగినా ఇంకా దాహంగానే ఉంటుంది, ఎక్కువ భాగం మనుషులకు. ఆ కోట్ల ధనమంతా తనకేమాత్రం ఆనందాన్ని ఇవ్వగలుగుతున్నదీనాడు? తనకు ఆరు పదులు నిండాయి. తన దత్తపుత్రుడు శ్రీహరి తన వరకు ఫరవాలేదు, కానీ.. వాడికి భార్య మీద ఏ మాత్రం కంట్రోల్ లేదు. ఎన్నడైనా తప్పి, దవిరి నోరు విప్పాడంటే చిన్న సైజు కురుక్షేత్రమే. ఆ జపాన్ ముళ్ళకంప వాణ్ని గుచ్చి గుచ్చి రక్త స్రావమైతే గాని వదిలిపెట్టదు. ఆవిడ గారికి చీరెలు కొని, నగలు చేయించి, ఫర్గెట్ అండ్ ఫర్ గివ్ అంటూ గులాబిలు సమర్పించుకుని, హోటల్కి తీసుకెళ్ళి అమ్మగార్ని ప్రసన్నురాల్ని చేసుకుంటాడు. వచ్చిన జీతమంతా ఆమెగారి దోసిట్లో పోసి, తన ఖర్చులకు కూడా రాణిగారి నడిగి పుచ్చుకుంటాడు. తనకు వేరే గత్యంతరం లేక ఈ అమెరికా అనే పద్మవ్యూహంలో చిక్కుకు పోయాడు. పోనీ అభిమన్యుడి లాగా విజయమో వీరస్వర్గమో అనుకుందా మంటే – తనకు కొడుకు, కోడలుతో అడ్జస్ట్ కావటమే చేత కాలేదింతవరకు. వచ్చి అప్పుడే దగ్గర దగ్గర మూడేళ్ళు కావస్తోంది.

తెలుగు కళా సమితి కార్య వర్గాన్నిఅడిగితే ఆ డాన్సర్ చిరునామా తెలుస్తుందేమోనని శక్తి వంచన లేకుండా భావరాజు మూర్తి గారికి, ఊటుకూరి కుమార్ గారికి, దశిక శ్యామల గారికి, వైదేహి శశిధర్ గారికి ఫోన్లు చేసి మొత్తం మీద ఆమె ఆచూకీ తెలుసుకున్నారు మన హీరో గోకుల్ రెడ్డి గారు.

"కృషితో నాస్తి దుర్భిక్షమ్"అనుకుని తన ప్రతిభకు తనే మురిసి పోతూ తృప్తిగా నవ్వుకుని, హాయిగా శ్వాస పీల్చుకుని, ఒక నిర్ణయానికి వచ్చినట్లు దుప్పటి కప్పుకుని పడుకున్నారు. గత కొన్ని రోజులుగా ఏవేవో ఆలోచనల్లతో సతమతమవుతూ సరిగ్గా నిద్ర పోనందువల్ల వడి వడిగా నిద్రాదేవి ఒడిలోకి జారిపోయారు.

★★★

యు.ఎస్. విజిటర్ గా వచ్చిన తన తల్లిని తీసుకుని మధు స్మిత ,

ఎడిసన్ లో వున్న సౌత్ ఇండియన్ రెస్టారెంట్ కి ఆమె భర్త ఆనంద్ వారి అయిదు నెలల పాప వచ్చారు. గోకుల్ రెడ్డి గారు కూడా వారి కొడుకు కోడలితో వచ్చారు. స్నాక్ తిని మెయిన్ కోర్స్ ఆర్డర్ చేసి సంభాషణకు ఉపక్రమించారు. "నాన్నగారు చెప్పారు విషయం, మాకెలాంటి అభ్యంతరం లేదు, ఆయన సంతోషమే మా సంతోషం" చెప్పాడు శ్రీహరి.

"అవునండీ" కోడలు కమల వంత పాడింది. తొందర్లో మామగారి బెడద వదిలిపోతే అంతకంటే కోరుకునేదేముంది అనుకుంది మనసులో ."మాకూ ఇష్టమేనండి" చెప్పాడు డాన్సర్ గారి అల్లుడు.

"మా అమ్మ ఇష్టమే నా ఇష్టం, మా అన్నయ్య కూడా అంతే" కూతురు మధు స్మిత చెప్పింది. ఆమె మాత్రం నవ్వుతూ కూర్చుంది తప్ప ఏమీ చెప్పలేదు.

"చక్రీ! ఐయాం సారీ...దశమి,"ఫరవాలేదన్నట్లు సమ్మోహనంగా నవ్వింది. "నేను చేసిన పొరపాటు దిద్దుకోవాలని కొంతలో కొంతైనా ఉపశమనం పొందాలనీ నా శేషజీవితం నీతో కలసి బ్రతకాలని, అప్పట్లో నేను నీకు ఇవ్వలేకపోయిన భార్య స్థానాన్ని ఇప్పుడు నీకు ఇవ్వాలని నేను అభిలషిస్తున్నాను, మరి నీ అభిప్రాయం కూడా చెబితే ......"

"అర్థమయింది, మీ ఆలోచన కూడా మంచిదే! నా భర్త డాక్టర్లకు సాధ్యంకాని జబ్బుతో తీసుకుని, తీసుకుని ప్రాణాలొదిలేసిండు. పోయే ముందు ఎవరైనా మంచి మనిషొస్తే మళ్లీ పెళ్లి చేసుకోమని నా చేత సత్య ప్రమాణం చేయించుకున్నాడు. వొచ్చే వారం నేను ఇండియా పోతున్నా. పోయే ముందు టెక్స్ట్ పంపిస్తా" భోజనం వచ్చేసింది, ఇండియాలో ఇళ్ళధరల గురించి, అమెరికా వసతులు, కెనడా లో హెల్త్ కేర్ గురించీ కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు ముగించారు. మర్యాద మాటలయ్యాక థాంక్స్ తో బై బై లతో ఎటు వాళ్లటు వెళ్ళిపోయారు.

గోకుల్ రెడ్డి గారికి ఏడు రోజులూ ఏడు యుగాల్లా అనిపించి తాళలేక ఫోన్ చేసి రావచ్చా అని అడగకుండా "వస్తున్నానని" చెప్పి టాక్సీ లో బయల్దేరి వెళ్ళిపోయారు. డోర్ బెల్ రింగవగానే చక్రి వచ్చి తలుపు తీసి కూర్చోమని మర్యాద చేసింది.

"కూతురూ, అల్లుడూ ఉద్యోగాల కెళ్ళిపోయారు. పసి పిల్ల నిద్రపోతున్నది. నేను ప్రయాణానికి సిద్ధమవుతున్నాను" అని లోపలికెళ్ళి టీ కెటిల్ ఆన్ చేసి వచ్చింది.

"నా కోర్కె తీర్చటానికి నువ్వు సిద్దమేగా, అంటే నీ కోరికా అదేగా!"

"నాకే కోశానా పెళ్లి చేసుకోవాలని లేదు" ఆమె సమాధానానికి ఖంగుతిన్నారు గోకుల్ రెడ్డి గారు. తిరిగి ఆమే మాట్లాడింది. "మేము హైదరాబాద్ మూవ్ అయ్యాక అప్పట్లో ఎన్ని ఉత్తరాలు వ్రాసినా మీరు జవాబు వ్రాయకపోగా నేను మరీ బాధగా వ్రాస్తే, పెళ్లి చేసుకొనేందుకు కుదరదు, గర్ల్ ఫ్రెండ్ గా ట్రీట్ చేస్తాను" ఉంచుకుంటాను" అని జవాబిచ్చారు. అప్పటికే నాకు నెల తప్పిందని కూడా చెప్పాను. ఐనా మీలో చలనం రాలేదు. మీరు నన్ను వాడుకుని "వాసాంసి జీర్ణాని యధా విహాయ" లాగే చిరిగిన చింకి చీర మాదిరి విసిరి పారేశారు. నా భర్త చాలా గొప్ప విశాల హృదయుడు. మీరు డబ్బున్న పెద్ద బంగాళా వారే కానీ మనసు మహా ఇరుకు, అంతకు మించి సంకుచితం.

మా జాతి కి (ఆరోజుల్లో గుడిసెలో ఉండేటోళ్ళం) మాకు ఆత్మ స్థైర్యం మస్తు. నేను బ్రహ్మాండంగా ఉన్నాను. ముంబైలో పెద్ద అపా ర్ట్ మెంట్, వైన్ షాప్. చిల్లర దుకాణం, ప్రాణప్రదంగా ప్రేమించే కొడుకూ, కోడలూ, కూతురూ, అల్లుడు. పిల్లగానికి జరా మీ రూపురేఖలొచ్చాయి, వానికీ సంగతి ఎరిక లేదు, అవసరం పడలేదు. మీ పుణ్యమా అని మీకు ఉత్తరాలు వ్రాయడానికి చదువుకున్నాను. ఎలాగూ చదువు మొదలుపెట్టాను కదా అని బి.ఎ వరకు చదువుకున్నాను. ఆ పీడకల లాంటి నిజాన్ని పెళ్లి అనే వలయంలో బంధించి నాజీవితాన్ని మరొకమారు పణంగా పెట్టే గొప్ప త్యాగమూర్తి ని కాదు నేను. మీ డబ్బు నాకవసరం లేదు. నా వైన్ షాపులో నలుగురు కుర్రపిల్లలు కొలువు చేస్తున్నారు. నేనే పదిమందికి సహాయం చేయగలను. మాలంబాడీ జాతివారు ప్రపంచంలోని వేరువేరు జాతులవారి కంటే ఏ మాత్రం తక్కువకాదని మీరు గ్రహించాలి.

మీ భార్యగా మీరిచ్చే ఆ హోదా నాకసలే అక్కర్లేదు. మీకు మరీ అంతగా పెళ్లి కావాలనుకుంటే చేసుకుంటాను నా భర్త అనే స్థానంమీకిస్తాను. అదీ కేవలం కంపేనియన్. అంతే కానీ సంసారం, వాంఛలు దరిదాపుల్లోకి కూడా రాకూడదు. ఏడాదిలో నాలుగు నెలలు ఇండియాలోనూ, నాలుగునెలలు అమెరికాలోను మిగతా నాలుగు నెలలు నృత్య ప్రదర్శనలిస్తూ మాతండాలతో కలసి తిరగాలి". అవాక్కయారు గోకుల్ రెడ్డి గారు. కొంత సేపయ్యాక "చక్రీ! తొందర పడకు, బాగా ఆలోచించుకో ఎదురుచూస్తుంటా" అని చెప్పి బయటికి నడిచారు గోకుల్ రెడ్డి గారు.

★★★

నూవార్క్ ఎయిర్ పోర్టులో కూతురికి చెప్పింది చక్రి, నేనేదో వంటరిగా వున్నానని మళ్ళీ నా పెళ్ళని ఆలోచించకు. నేను చాలా సుఖంగా వున్నాను. ఆ రెడ్డిగారికి నా కాంటాక్ట్ ఏమీ ఇవ్వకు, నాకే మాత్రం ఇష్టంలేదు". ఇంతలో ఫ్లైట్ ఎనౌన్స్ మెంట్ రావటంతో మనుమరాల్ని ఒక్కసారి ఎత్తుకుని గట్టిగా గుండెలకు హత్తుకుని తన లగేజ్ తీసుకుని గేటు లోపలికి నడిచింది దశమి అని పిలువబడుతున్న నర్తకి చక్రి.

# ప్లాట్ ఫారం

**పి.కె.శ్రీనివాస్**

ఏదో పెద్దగా చప్పుడు అవడంతో, నిద్ర లేచి చుట్టూ చూశాను. పక్క బెర్తులో పిల్లలు, అర్థాంగి నిద్రపోతున్నారు. అప్పుడు అర్థమైంది నేను రైలు ప్రయాణం చేస్తున్నానని. ఏ సి కంపార్టుమెంటు వలన కాబోలు రాత్రి బాగా నిద్ర పట్టింది. ఎవరూ నిద్ర లేచినట్లులేరు, అంతా నిశ్శబ్దంగా ఉంది కంపార్టుమెంటు. మెల్లిగా దుప్పటి తీసి మొబైల్ లో టైము చూసుకున్నాను, ఐదున్నర అయింది. ఇక ఎలాగూ నిద్ర పట్టదు కాబట్టి, క్రిందకు దిగి కాలకృత్యాలు తీర్చుకొని, కిటికీ పక్కన కూర్చున్నాను. పిల్లలు ఇంకా మంచి నిద్రలో ఉన్నారు.




బయట ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అప్పుడే నిద్ర లేచిన పర్వతాలు గంభీరంగా చూస్తున్నాయి. ఉదయభానుడు, కొండలమధ్య దోబూచులు ఆడుతున్నాడు. ఇతడేనా ఇంకొన్ని గంటల్లో తలమీదికి ఎక్కి ఎర్రటి మంటలు కురిపించేది? అని అనుకున్నాను. పక్షులు గూడువిడిచి, పలుదిక్కులకు ఎగిరిపోతున్నాయి 'ఇంక తిరిగి రాము' అన్న ధీమాతో. పంటపొలాలు నా రాకకు పచ్చటి పడక పానుపులు పరుస్తున్నాయి. ఇరువైపులా వృక్షాలు హుందాగా నిలబడి పోటీపడి ఆహ్వానం పలుకుతున్నాయి. పక్కనే పోతున్న టెలిఫోన్ తీగలు పైకి కిందకి పడి లేచి, మానవ జీవన విధానానికి అద్దం పడుతున్నాయి.

సురక్ష వలయాల మధ్య బిక్కుబిక్కుమంటూ చేసే విమానప్రయాణం కన్నా, స్వేచ్ఛగా ఉన్న రైలు ప్రయాణం ఎంతో మిన్న అనుకున్నాను. గిర్రున తిరిగే రైలుచక్రాలు నా ఆలోచనలను వెనక్కు తిప్పాయి. స్కూల్ రజతోత్సవం కోసం సెలవు పెట్టి సప్తసముద్రాలు దాటి రావడం, నిన్న రాత్రి మిత్రులకు వీడుకోలు చెప్పి రజతోత్సవం ఏర్పాట్ల కోసం బ్రద్నపురం వెళ్ళడానికి రైలు ఎక్కడం అంతా కళ్ళ ముందు కదిలింది. "సర్ టీ" అన్న పాంట్రీ బాయ్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను. టీ తీసుకొని మెల్లిగా చప్పరిస్తూ ఆలోచించాను. సాయంత్రం రైలు దిగి, చిన్ననాటి మిత్రులందరినీ కలవాలి. ఇరవైఐదు సంవత్సరాల ఎడబాటు. ఇలా కలవగలమని ఏనాడూ ఊహించలేదు. నేటి సాంకేతిక విలువలకు దర్పణం ఈ మా కలయిక. "నభూతో న భవిష్యతి" అన్నట్టు... బ్రద్నపురం అదిరిపోవాలి. గురువులకూ, గురుతుల్యులకు అసలైన దక్షిణ కావాలి మా కలయిక. "ఆ అంటే అమలాపురం, ఇ అంటే ఇచ్ఛాపురం ..." పెద్దోడు సెట్ చేసిన రింగ్ టోన్ తో నా మొబైల్ మోగడంతో ఆలోచనలకు కళ్ళెం పడింది. ఫోను ఎత్తి "హలో" అన్నాను, అవతలి గొంతును గుర్తుపట్టాను, "సరే రా, నేను తెస్తున్నాను, మ్యూజిక్ షో కి అడ్వాన్సుగా ఇద్దాం, అవునూ.. , గెస్టు సంగతి ఏమైంది?" అన్నాను . "ఉష ఉతప్ తో మాట్లాడాను, తను ఫంక్షన్ కి, మ్యూజిక్ షోకి వస్తాను అంది" అవతలి కంఠం. "ఓకే రా, సాయంత్రానికల్లా అక్కడ ఉంటాను, వివరంగా మాట్లాడుకుందాం" అని పెట్టేశాను. మ్యూజిక్ షో కనివిని ఎరుగని రీతిలో అదరగొట్టాలి అనుకుంటూ. మొబైల్ తో ఆన్ లైన్-బ్యాంకులో కాష్ చూసుకున్నాను. అమౌంట్ చూసి అనుకున్నాను. "ఎంత ఖర్చైనా సరే, మ్యూజిక్ షోకి మహామహులను తేవా లి" అని .

ఆలోచన మధ్యలో పిల్లలు ఎప్పుడు లేచికూర్చున్నారో తెలీలేదు. "డాడీ మొబైల్ ఇవ్వు" పెద్దోడు మొబైల్ లాక్కుని, తన ఫేవరేట్ ఆన్-లైన్ గేమ్స్ ఆడటం మొదలుపెట్టాడు. పెద్దచప్పుడుతో ట్రైన్ ఆగింది. బాగా తెల్లవారింది. స్టేషన్ ఏదని చుట్టూ చూశాను, పేరు ఏమీ కనపడలేదు, "ఏదో చిన్న స్టేషన్, బహుశా క్రాసింగ్ అనుకుంటా, కాసేపు బయటకు వెళ్ళి, నా దేశపు గాలి పీలుస్తాను" అనుకుంటూ బయటకు దిగాను. "రిటైర్మెంట్" ఎరుగని అవ్వ కమ్మరకట్ట , గాందిగుండు అమ్ముతోంది స్టేషన్ ప్లాట్-ఫారం మీద. పక్కనే జనంతో కుక్కి వున్న జనరల్ కోచ్ నుంచి ఏదో గొడవ వినిపిస్తోంది, బహుశా సీట్ కోసం అనుకుంటా. ఇది ఏమి తెలియని ఎవరో అంధుడు మధ్యలో పాటలు పాడి పైసలు అడుగుతున్నాడు. గొడవ బాగా పెద్దదై బూతులుగా మారింది. సిగ్నల్ ఇవ్వడంతో, ట్రైన్ బయలుదేరడానికి సిద్ధమవడంతో, నేను లోపలికి వెళ్ళి, సీట్లో కూర్చున్నాను. కాసేపట్లో ట్రైన్ బయలు దేరింది.

మొబైల్ తో కుస్తీ పడుతున్న పెద్దోడిని చూస్తూ "ఏంచేస్తున్నావు రా?" అన్నాను. "మొబైల్ లో "ఫ్లిప్ కాయిన్" ఆన్ లైన్ గేమ్ ఆడు తున్నాను డాడీ. ఆస్ట్రేలియాలో ఉన్న ఒక ఆన్ లైన్ ఫ్రెండ్ తో ఆడుతున్నాను, వాడు ఇప్పుడు ఫ్లైట్లో వెళ్తూ నాతో ఆడుతున్నాడు" అన్నాడు బదులుగా. టెక్నాలజీ నాకు సరిగ్గా అర్థం కాలేదు, ఆనాటి మా తిప్పుడుబిళ్ళనే ఈ ఆట అనుకున్నాను. అంతలో ఏదో చప్పుడు అవడంతో అటు చూశాను. ఆరేళ్ళ కుర్రాడు, గుడ్డతో , నేల తుడుస్తున్నాడు, " ఎవడు రానిచ్చాడు వీడిని ఇక్కడికి ?" కోపంతో అరిచింది ఒక కంఠం. నేల తుడుస్తూ డబ్బులు అడుగుతున్నాడు. చెయ్యి తన పొట్టను తాకుతూ, మెల్లిగా నా దగ్గరికి వచ్చి "అయ్యా" అని చెయ్యి చాచాడు. పదిరూపాయల నోటు ఇచ్చి పక్కకు తిరిగి, మా చిన్న పాప తిప్పుతున్న ఎ , బి , సి డి బుక్ వైపు చూశాను." డాడీ , పి యు టి , పుట్ , మరి బి యు టి ఏమిటీ ? " అంది. " బ " అని నోరు తెరిచేలోపే " బట్ " అని వినిపించింది వెనక నుంచి. వెను తిరిగి చూశాను , చొక్కా విప్పి తుడుస్తున్న కుర్రాడిదా శబ్దం. ఆశ్చర్యంగా చూశాను ఆ కుర్రాడి గొంతులోకి , అందులో దాగి ఉన్న సరస్వతిని వెదుకుతూ. " హాయ్" అంది పాప ! " వాట్ ఈజ్ యువర్ నేమ్" అడిగింది. " మై నేమ్ ఈజ్ ఊతప్ప " మృదువుగా పలికాడు. ఆశ్చర్యం నుంచి వెంటనే తేరుకుంటూ "ఎక్కడ నీ అయ్యా? ఇలా వదిలేసాడు " కోపంగా అడిగాను. " అయ్యా , అమ్మా లేరు సర్" అంటూ వాడు గతం చెప్పసాగాడు. తన తల్లితండ్రులు కట్టడాలు కట్టే దగ్గర కూలీలని, గత రెండుసంవత్సరాలుగా ఒక స్కూల్ లో నూతన భవన నిర్మాణంలో అమ్మా అయ్యా పని చేస్తుంటే , తను క్లాసు పక్కన కూర్చొని, పాఠాలు వినేవాడని, ఒకనాడు, స్కూల్ ట్యాంక్ నిర్మిస్తూ అది విరిగి పడడంతో, ఇద్దరూ చనిపోయారని, ఆ తరువాత తన వరుసకు మామ ఒక అతను తీసుకువచ్చి, రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం మీద వదిలాడని చెప్పాడు.

మాటలు పడిపోయాయి నాకు అది విని. అది నిజామా.. అబద్ధమా? "నిజమే" బదులుగా అంది నా మనస్సు. కాయలు కాసి, పండ్లై నీడను ఇవ్వాల్సిన ఒక వృక్షం, మొగ్గలోనే ఎండిపోతోంది. చంద్రుని తాకి, అంగారకుడి వైపు పరుగులు తీసిన దేశం, రాతి యుగం వైపు చూస్తోంది. వెంటనే నాకు నా పాఠశాల గుర్తుకు వచ్చింది. గురువర్యులు గుర్తుకు వచ్చారు, వారు నాకు నేర్పిన సంస్కృతి కళ్ళ ముందు కదిలింది.

ఇంక ఆగలేదు నేను, ఫోన్ తీసి నెంబర్ డయల్ చేశాను నా పాఠశాలకు, "హలో " అంది అవతలి కంఠం. నేను ఫలానా అని చెప్పాను, ఒక అడ్మిషన్ కావాలని అడిగాను, "సర్! క్లాసులు ఐదు రోజుల క్రితమే స్టార్ట్ అయ్యాయి, ఒక్క సీట్ కూడా ఖాళీ లేదు, కాని... కాని.. ఒకే ఒక ఎన్ అర్ ఐ సీట్ ఖాళీగా ఉంది. అది మీకు ఇవ్వగలను, మూడు లక్షలు అడ్మిషన్ ఫీజ్" అని బదులిచ్చింది అవతలి కంఠం . వెంటనే మొబైల్ తో ఊతప్ప ఫోటో తీసి, స్కూల్ వెబ్ సైట్ ఓపెన్ చేసి, ఆన్ లైన్ అప్లికేషనులో ఫోటో అప్ లోడ్ చేసి, అప్లికేషను పూర్తి చేసి , అప్ లోడ్ చేశాను. ఫీజు కట్టడం కోసం ఆన్ లైన్ బ్యాంకు ఓపెన్ చేసి తగిన ఫీజు పై క్లిక్ చేశాను, " ప్లీజ్ కన్ఫర్మ్ " అన్నచోట ఆగాను, ఒక్క క్షణం ఆలోచించాను, " ఉష ఉతప్పా?,,, ఈ ఊతప్పా? " ఇంక ఆగలేదు వేళ్ళు , క్లిక్ చేశాయి.

"యువర్ అడ్మిషన్ ఈజ్ కన్ఫర్మడ్" అన్న రిప్లై చూసి తృప్తిగా ఊపిరి పీల్చాను. సాయంత్రం మిత్రులతో ఏమి సమాధానం చెప్పాలో తెలియక, గుండెల్లో ఒక పక్క రోజా పువ్వు కింద ముల్లులా గుచ్చుకుంటున్నా... రోజా సుగంధంతో నిండుకున్న నా మనస్సు, ఒక్కసారి తనివితీరా ఊపిరి పీల్చి ఒక నిట్టూర్పు విడిచింది. అది రైలు శబ్దంలో కలిసి లీనమైయింది.



# టేకోవర్ సుగ్రీవ అండ్ కంపెనీ

డా. యేలురిపాటి ఆంజనేయ శర్మ

ఆల్కాటెల్-లూసెంట్ కంపెనీని నోకియా టేకోవర్ చేస్తోంది - ఇది నేటి వార్త! ఇలా ఫలానా కంపెనీ ఫలానా కంపెనీని టేకోవర్ చేసు కొంది అనేది ప్రతిరోజూ పేపర్లో కనపడే మామూలు వార్తయి పోయింది. ఏమిటీ టేకోవర్? ఎందుకీ టేకోవర్? ఎవరికోసమీ టేకోవర్? దానికేమైనా ఆదర్శ సూత్రాలులున్నాయా? ఆచరణీయ పద్ధతులు ఉన్నాయా? అనుసరణీయ మార్గా లున్నాయా? మంచి ఉదాహరణలున్నాయా? ఆహా బేషుగ్గా! 'రామ సుగ్రీవ మైత్రి' చక్కని ఉదాహరణ.




ఒక కంపెనీని మరొక కంపెనీ కలిపేసు కోవటం, అదే కొనేయటం, ఇదే కదా టేకోవర్ అంటే! కొనేవాడికి అవసరముంటే కొను గోలు సాగుతుంది. అమ్మేవాడికి అవస రం వచ్చిపడినంత మాత్రాన కొనుగోలు సాగదు. లాభాలార్జిస్తున్న కంపెనీని ఎవడూ అమ్ముకోడు-నష్టాలొస్తున్న కంపెనీని ఎవడూ కొనుక్కోడు. మరి టేకోవర్ ఎందుకు?

లాభాలార్జించే అవకాశం ఉన్నప్పటికి, లాభా లు తీయలేక పోతున్న ఓనర్ కంపెనీని లాభ సాటిగా వదిలించుకుందామని చూస్తాడు! లాభాలు తీసే నాయకత్వ లక్షణాలు ఉన్న ఓనర్ అవకాశాలున్న కంపెనీని కలుపుకుని లాభాల వైపు పరుగులు తీయిస్తాడు! ఇది బిజినెస్ మేనేజ్ మెంట్.

ఇప్పుడు,రాముణ్ణి-సుగ్రీవుణ్ణి రెండు కంపెనీలుగా భావిద్దాం! రెండు కంపెనీలు కలవాలంటే, రెండిటిలోనూ కొన్ని సమాన లక్షణా లు, లక్ష్యాలు, అవసరాలు, అవకాశాలు ఉండి తీరాలి. రామునిది ధర్మస్థాపన కోసం పోరాటమైతే, సుగ్రీవునిది ధర్మబద్ధమైన పోరా టం! ఇక్కడ 'ధర్మం', సామాన్య లక్షణం. లక్ష్యం, భార్యా రక్షణ!

**రాముడి లక్ష్యం**, రావణాది రాక్షస సంహారం, లోకరక్షణం, దైవకార్య పరిపూర్తి. దానికి ప్రేరణ, సీతాపహరణ జనిత క్రోధం. పునాది, సీతా విరహ జనిత దుఃఖం!

**సుగ్రీవుడి లక్ష్యం** వాలి సంహారం, రాజ్య ప్రాప్తి. దానికి ప్రేరణ, రాజ్య బహిష్కరణ జనిత క్రోధం! పునాది, రుమావిరహ జనిత దుఃఖం!

ఇక వనరులు. రాముడు అసహాయశూరుడు. 14 వేలమంది ఖర దూషణాదులని ఒంటిచేతో నామరూపాలు లేకుండా చేసినవాడు. పరాక్రమవంతుడు. ధైర్యం స్థైర్యం అపరిమిత నాయకత్వ లక్షణాలు కల మర్యాదాపురుషోత్తముడు. తనంతటి తమ్ముడు లక్ష్మణుడు తోడుగా ఉన్నవాడు!

సుగ్రీవుడు అపరిమిత బలశాలి. బుద్ధిమంతులు, మేధావు లు అయిన హనుమ, జాంబవతాది పరిమిత పరివార సమేతుడు. ఇద్దరికీ ఉన్నలోటు — 'మందిమార్బలం'. లోటును గుర్తుచేసుకుంటూ ఉండటం బలహీనత! దానిని అధిగమించే ఉపాయం, మందిని కూడ గట్టడమే! రాముని వైపునుండి ఆలోచిస్తే, భూమండలమంతా ప్రతీ అంగుళమూ వెదకి సీత జాడను కనుగొనే లక్షలాది బలగం కావాలి. ఇది నిజానికి వాలి వద్ద ఉంది. సఖ్యం వాలితోనే చేస్తే? (ఆ మాట చనిపోయే ముందు వాలి అంటాడు కూడా). వాలి అధర్మాన్ని అంటి పెట్టుకొని ఉన్నాడు- బల, ధన, మద గర్విష్ఠి. వాలితో స్నేహం టేకో వర్ కాదు సరెండర్ అవుతుంది. ఏ బంధం లోనైనా సరెండర్ అయినవాడి మాట చెల్లదు. వాలి ధర్మం మాట్లాడడు, ఆచరించడు. అది తన లక్ష్యానికే విరుద్ధం! చచ్చేముందు వాలి, రాముడు తనతో చెప్పివుంటే - 'రావణు ణ్ణి మందలించి సీతను ఇప్పించేవాణ్ణి' అంటాడు! బలిష్టం గా బ్రతికివున్న రోజుల్లో నిజంగా రాముడే అడిగివుంటే అలా జరిగే దేనా? వాలి స్వభావం, ఆచారణ తెలిసినవాడెవడూ నమ్మడు! ఇక సుగ్రీవుడు ధర్మాత్ముడు. లేమివల్ల బలహీనుడిగా అగుపించినా కలిమి కలిగితే, వాలికి తీసిపోని బలవంతుడు.

చెడ్డవాడైన బలవంతునితో స్నేహం, మన బలాన్ని హరిం పచేస్తుంది. బలహీనుడైనప్పటికీ, మంచివానితో స్నేహం, మన బలానికి జోడవుతుంది. సుగ్రీవుణ్ణి మొదట బలవంతుణ్ణి చేస్తే, ఆ బలగం మొత్తం తనకు సహకారి అవుతుంది. అంటే ఇక్కడ టేకో వర్ అవసరం అయ్యింది.

రెండు కంపెనీలు విలీనం అవ్వాలంటే, రెండిటిలో కాస్తంత పెద్దది ఏదో, అందులోకి చిన్నది కలిసిపోతుంది. రెండూ సమానంగా అనిపిస్తే, పెద్దదిగా నిరూపించుకున్న కంపెనీ, నాయకత్వాన్ని తన చేతులోకి తీసుకోవడం సహజం.

సప్త సాలద్రుమాలు, దుందుభి కాయంతో మొదలుపెట్టి, వాలి వధతో ముగించి, సుగ్రీవునికి రాజ్యాభిషేకం చేయించి, 'తానే పెద్ద' అని నిరూపించడమే కాక, ముందు ఉపకారం తనే చేసి కృతజ్ఞతను అటు మిగిల్చాడు శ్రీరాముడు. ఇక ప్రత్యుపకారం మాత్రమే చేయ గలగడం సుగ్రీవుని అనివార్యత.

అంతే కాక, డీల్ చేసేటప్పుడు, ప్రపోజల్ చేసినవాడు బేరంలో వెనక్కి తగ్గటం సహజం! రాముని దగ్గరకు హనుమంతుణ్ణి ముందుగా పంపినవాడు సుగ్రీవుడు. నాకు ఉపకారం చెయ్యి అని అర్థించాడు. రక్షించమని వేడుకొన్నాడు. సరెండర్ అయ్యాడు.

ఇక్కడ శ్రీరాముని విజ్ఞత టేకోవర్ చేసే కంపెనీకి ఆదర్శం. సుగ్రీవుణ్ణి చిన్నబుచ్చలేదు. అవమానించలేదు. తనతో సమాన హోదా ఇచ్చాడు. గౌరవించాడు. నీ కష్టం, నా కష్టం అన్నాడు. తాను కష్టంలో ఉన్నప్పటికీ ముందు మిత్రుని కష్టం తీర్చడానికి ప్రాధాన్యమిచ్చాడు.

అప్పుల్లో పడ్డ కంపెనీకి, అప్పులు తీర్చి ఒడ్డున పడేసి, అప్పుడు విలీనం చేసుకుంటే, బలగం అంతా సగౌరవంగా, భక్తిగా, ప్రేమగా, నమ్మకంగా కలసి వస్తారు.

నమ్మకానికి మారుపేరు మాటతప్పనివాడు శ్రీరాముడు అని తెలుస్తూనే వుంది. సుగ్రీవుణ్ణి మాటమీద నిలబెట్టడానికి అగ్నిసాక్షిగా స్నేహం అవసరం అయ్యింది. తక్కువస్థాయి ఆలోచనావిధానం కలవాడు కలిమి కలిగిన తరువాత కట్టుబడి ఉంటాడని నమ్మకమేముంది? అందుకే, 'కట్టుబాటు' అవసరం అయ్యింది. దాని అవసరం ఉంది కనుకనే, లక్ష్మణుడు వెళ్లి కట్టుబాటును గుర్తుచేస్తూ హెచ్చరించాల్సి వచ్చింది. ఏమైతేనేం? టేకోవర్ ద్వారా ఉభయులూ లాభపడ్డారు. అది ఆరోగ్యకరమైన, ఆదర్శవంతమైన టేకోవర్ మరి. దానికి అందమైన పేరు సఖ్యం! సఖ్యం సమానమైన హోదా కలవారి మధ్యే ఉంటుంది. సమాన హోదా ఇవ్వడం, కలుపుకుపోతున్న కంపెనీ ఔదార్యం అయితే, తన పరిమితినెఱిగి ప్రవర్తించడం, కలగలసిపోతున్న కంపెనీ విజ్ఞత! ఏమైతేనేం, 'టేకోవర్ సుగ్రీవా అండ్ కో' నేటికీ ఆదర్శమే!

---

## కాల చతురస్రం (Times Square - New York)

**- అనంత సుధాకర్ ఉప్పల**

భారీ తెరలపై కదిలే బొమ్మలు
అంబర చుంబిత ఆకాశ హర్మ్యాలు
వీధుల పొడుగున విద్యుత్ జిలుగులు
పగలును మరిపించే నిశీధి వెలుగులు

సూటు బూటుల గబగబ అడుగులు
మతిపోగొట్టే మగువల హొయలు
మత్తెక్కించే సెలబ్రిటీల చిందులు
పగటి వేషగాళ్ళ అందచందాలు

ఎన్నెన్నో దేశాల వంటకాల హోటళ్ళు
నోరూరించే ఘుమఘుమలు, కమ్మని రుచులు
మనసును దోచే మహత్తర నాటకశాలలు
అబ్బుర పరిచే వీధి విన్యాసాలు

పెంటు హౌసుల్లోన చిందులు, విందులు
పెంట కుప్పల్లోన వెదుక్కొనే పేదలు

పాతాళంలో సబ్వే పరుగులు
వీధుల నిండా వాహన వరదలు

అన్ని భాషలు, అన్ని మతాలు
ఎన్నో వర్ణాలు, మరెన్నో జాతులు
అంతా కలిసి తిరిగే సుందర లోకం
అందరూ చూడాలనుకొనే కలల నగరం

సంవత్సరాన్ని స్వాగతించే గోళం
ప్రతిరోజూ ఏదో ఒక సంబరం
తళుక్కుమనే కెమరా ట్రిక్కులు,
తమనే బంధించే సెల్ఫీ క్లిక్కులు

ఇది ప్రపంచానికి ప్రతిరూపం
ఇది మనిషి ప్రతిభకు మరో రూపం
నాలుగు దిక్కుల సంగమం
నవ్యమైన కాల చతురస్రం

# ఒంటరైన ప్రపంచం

డా. కేతవరపు రాజ్యశ్రీ

వయోవృద్ధులు ఎక్కువశాతం ఒంటరితనంతో బాధపడుతుంటారు. వయసురీత్యా వచ్చే అనారోగ్యంతో మందులు వేసుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. తమను పలకరించేవారు లేక, మంచానికి బందీలై ఒంటరిజీవితం గడుపుతుంటారు. దీనికి ఎవరినీ తప్పు పట్ట లేము. ఇంట్లోవారికి పనుల వత్తిడి వల్ల, ఉద్యోగ రీత్యా, చదువుల రీత్యా ఎవరి పనుల్లో వారు సతమవుతూ వయసు పైబడిన వారిని పలకరించే తీరుబాటు వుండదు. పెద్దవాళ్ళకి అన్ని సదుపాయాలూ చేశామని వారు తృప్తి పడతారే కానీ, "అన్నం తిన్నావా? మందు వేసుకున్నావా? ఒంట్లో ఎలా ఉంది? అని అడిగితే ఉండే తృప్తి ఎన్ని సదుపాయాలు చేసినా కలుగదు. అలా పలకరించేవారు లేక, ఒంటరివాళ్ళమన్న భావన వాళ్ళని బాధిస్తూ ఉంటుంది.

కానీ ఇప్పుడున్నసమాజంలో ప్రతి ఒక్కరు ఒంటరులే! నానాటికీ కొత్తపుంతలు తొక్కుతున్న వైజ్ఞానిక వస్తు సముదాయంతో, ఆధునిక పరికరాలతో దాదాపుగా అందరూ ఒంటరులై జీవిస్తున్నారు. ఒకప్పుడు ఇంటికొక "టివి" వుండేది. ఇంటిల్లపాదీ కూర్చుని కార్యక్రమాలు చూస్తూ, వాటి గురించి మాట్లాడుకుంటూ ఆనందించే వాళ్ళు. ఇప్పుడు అభిరుచులు మారి, ఎవరికి వారు తమకు ఇష్టమైన కార్యక్రమాలు చూడాలనుకుంటున్నారు. నాన్నకి వార్తలు, అమ్మకి సీరియల్స్, కొడుక్కి క్రికెట్, కూతురికి సినిమాలు, తాతానానమ్మలకి భక్తికార్యక్రమాలు ఇలా అందరి అభిరుచులకి తగినట్టు చూడడానికి ఇంటిలో మూడు,నాలుగు టివిలు పెట్టుకుంటున్నారు. ఎవరి గదిలో వాళ్ళు కూర్చుని వారి వారి ఇష్టమైన కార్యక్రమాలు చూసుకుంటున్నారు. అలా ఎవరి గదికి వారు పరిమితమైపోవడంతో, ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం తక్కువైపోయి కుటుంబం (కుటుంబవ్యవస్థ) ఒంటరిదయిపోయింది .

అది అక్కడికి ఆగిపోలేదు. "స్మార్ట్ ఫోన్లు" వచ్చాక వంటగదిలో వున్న అమ్మకి "అన్నంలోకి ఏం చేశావ్" అంటూ పిల్లలు మెసేజ్ చేస్తే, "మీ కిష్టమైన ఆలూ-ఫ్రై చేశాను" అంటూ అమ్మ మెసేజ్. ఇలా వంటగదిలో వున్నఅమ్మకి పిల్లలు, పిల్లలకి అమ్మ ఫోన్లల్లో మేసేజ్-లిచ్చి నిశ్శబ్దంగా మాట్లాడుకోవడంతో, అక్కాతమ్ముళ్ళ పోట్లాటలు, గిల్లికజ్జాలు, అమ్మానాన్నల తీర్పులు, అన్నయ్య అంటే నీకు ఎక్కువ ఇష్టం అంటూ చెల్లెలి అలక, చెల్లెలంటే ఎక్కువ ఇష్టం అంటూ అన్నయ్య ఫిర్యాదు ఇలా సందడిగా వుండే ఇల్లు ఇప్పుడు ఇంట్లోని వ్యక్తులు ఒకరికొకరు మెసేజ్-ల ద్వారా పలకరించుకొంటుంటే, నిశ్శబ్దతరంగంగా మారి ఒంటరిదైపోయింది. గుడికీ గోపురాలకీ, పెళ్ళిళ్ళకీ పేరంటాలకీ, సినిమాలకీ, బజార్లకీ వెళ్ళినప్పుడు తెలిసిన వాళ్ళు కనపడడం సహజం. ఒకరినొకరు పలకరించుకుంటూ, యోగక్షేమాలు కనుక్కుని, చాలా రోజుల తరువాత కలిశామని ఆనందంగా కబుర్లు చెప్పుకోవడం జరిగేది. కానీ ఇప్పుడు ఏకార్యక్రమాలకి వెళ్ళినా, ఎవరితోనూ సంబంధం లేకుండా, మొక్కుబడిగా పలకరించుకుని, వాట్సప్, ఫేస్ బుక్, ట్విట్టర్లతో కాలక్షేపం చేస్తూ, సమూహంలో ఉన్నా, ఎవరి ప్రపంచంలో వాళ్ళు మునిగి పోయి, కబుర్లూ, నవ్వులూ, కోలాహలం కరువైపోయి సమాజం ఒంటరిదయిపోయింది .

ఇదివరకు ఇంటింటికీ ఉత్తరాలు వచ్చేవి. పోస్ట్ మాన్ రాగానే అందరూ ఉత్తరాలకోసం, పిల్లల దగ్గర నుంచి వచ్చే మని యార్డర్ల కోసం ఎదురుచూస్తూ, ఉత్తరం రాగానే వాటిని చదివించుకుంటూ, ఒకళ్ళ ఇంటిలో విషయాలు మరొకరు తెలుసుకుంటూ, కబుర్లతో కాలక్షేపం చేసేవారు. ఇప్పుడు ఈమైల్స్ వచ్చి, పోస్ట్ మాన్ తెచ్చే ఉత్తరాల సందడి కనుమరుగై ఎవరి వ్యక్తిగత సమాచారం వారిలోనే ఉండిపోతోంది. ఎవరితోనూ మాట్లాడుకుని పంచుకోవలసిన అవసరం కనబడడం లేదు.

అంతర్జాలం (ఇంటర్నెట్) ఆవిర్భావంతో "ఈమైల్స్" ఉత్తరాలే కాకుండా, ప్రపంచంలో జరిగే వింతలూ విశేషాలన్నీ క్షణాలమీద మారుమూల పల్లెలకి సైతం తెలిసిపోతున్నాయి. ప్రపంచం మొత్తం అరచేతిలో (చిన్న సెల్ ఫోన్ లో) ఇమిడిపోయింది. మాటలతో పనిలేకుండా సమాచారం ప్రపంచం నలుమూలలకీ బట్వాడా అయిపోతోంది. 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా' అన్నట్టు స్పందన, సందడి, చడీ చప్పుడూ లేక ఒంటరిదైపోయింది ప్రపంచం .

వీటన్నిటికీ తోడు ఇంకొక సందడిలేని ప్రమాదం ప్రపంచాన్ని ముంచెత్తుతోంది. సరిగ్గా మాటలు, నడకా కూడా రాని పసిపిల్లలు ఏడుస్తుంటే ఓదార్చడాని, వాళ్ళని ఆడించడాని సెల్-ఫోన్, టాబ్లెట్-కంప్యూటర్స్ ఇచ్చేస్తున్నారు. అమ్మకి ప్రత్యామ్నాయంగా వీటిని పిల్లలకి ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే కానీ, వాటి వల్ల వచ్చే సమస్యల గురించి ఆలోచించడం లేదు. పిల్లలు తమ చిన్నివేళ్ళతో బ్రౌసింగ్ చేస్తుంటే మురిసిపోతున్నారు. చివరకిపిల్లలు వాటికి అలవాటు పడి, బయటికివెళ్ళి ఆడుకోవడం కూడా మానేస్తున్నారు. వీటి వాడకంవల్ల తెలివితేటల మాటేమో గానీ, చిన్నప్పుడే కళ్ళజోళ్ళు వచ్చేస్తున్నాయి. ఎవరేమి చెప్పినా అర్థం కాకుండా మందకొడిగా తయారయ్యే ప్రమాదమూ లేక పోలేదు .

అయితే, నాణానికి మరో కోణం లాగా ఈ వైజ్ఞానిక పరికరాల వల్ల ఎన్నో ఉపయోగాలూ లేకపోలేదు. గతంలో ఉత్తరాలు రాసుకుంటే ఒక వారానికి తెలిసే సమాచారం ఇప్పుడు క్షణాల మీద తెలిసిపోతోంది. ఎంత దూరాన ఉన్నవారితోనైనా రోజూ చూసుకుని మాటాడుకోవచ్చు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే తెలుసుకోవడానికీ తగిన వైద్య సదుపాయాలూ అందుకోవడానికీ వెంటనే వీలు కలుగుతోంది. క్షేమసమాచారాలు, పిలుపులు, శుభాకాంక్షలు ఒకటేమిటి మనసులోకి వచ్చిన మాట వెంటనే పృథ్వికంతా తెలుపగలిగే సావకాశం కలిగింది. ఫేస్ బుక్ లాంటి పబ్లిక్ సైట్స్ ఎప్పుడో విడిపోయిన స్నేహితులను, బంధువులనూ, పాత విద్యార్థులనూ కలుపుతున్నాయి. మనకు నచ్చిన, నచ్చని విషయాలను పదిమందితో పంచుకునే వీలు కలుగుతోంది. మనమొక సమస్యతో బాధ పడుతున్నప్పుడు మనతో బాటు చాలా మందికి ఇటువంటి సమస్యలున్నాయని, వారు దాన్ని అధిగమించిన తీరు నెట్ ద్వారా తెలుసుకుని, ఉపశమనం పొందే అవకాశాలతోబాటు అత్యవసర వైద్యసహాయం అవసరం ఐనప్పుడు వాట్సప్, ఫేస్ బుక్, ఈ-మెయిల్ కూడా చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.

కాని, 'అతి సర్వత్ర వర్జ్యయేత్' అన్నట్లుగా ఈ వైజ్ఞానిక ఉపకరణాలన్నీ సక్రమంగా పరిమితికి లోబడి ఉపయోగించుకుంటే, వీటివల్ల మంచిఫలితాలు అందుకోవచ్చు. ఔషధం అయినా మోతాదులో తీసుకుంటేనే ఉపయోగం. అలాగే, ఈ ఆధునిక ఉపకరణా లను అవే లోకంగా కాకుండా, తగుమాత్రంగా, అవసరమైనంత వరకు ఉపయోగించుకుంటే సమాజాభివృద్ధి, విజ్ఞానాభివృద్ధీ జరిగి ప్రపంచం ఒంటరితనాన్ని వదిలి సందడిగా కళకళలాడుతూ వుంటుంది .

## వర్షం కురిసిన రాత్రుల్లో ...

**మానస చామర్తి**

చీకటిని వణికించే దీపకాంతిలో
అసహనంగా కదులుతాయ్ పరదాల నీడలు
ప్రాచీన స్వప్నాన్ని పదే పదే గుర్తు చేస్తూ
ఉండీ ఉండీ గలగలమంటాయ్ గాలిగంటలు
తెరిచిన కిటికీల్లోంచీ చాచిన నా అరచేతుల్లో
చిందులేస్తున్న చినుకుల్ని చూస్తూ చూస్తూనే
నేను తిరగబడ్డ గొడుగుల్లో
పసివాడు వదిలిన పడవనవుతాను
వాడి పగడపు పెదవుల మీది నవ్వునై
తుళ్ళిపడతాను
చుక్కల్ని దాచేస్తూ రెమ్మల్ని రాల్చేస్తూ
దిక్కుల్ని కాల్చేసే వాననలా చూస్తూ చూస్తూ
నేను ముడుచుకున్న సీతాకోక రెక్కల్లో
దాగిపోని రంగుల లోకమవుతాను
దాగలేని స్వేచ్ఛా కాంక్షనవుతాను
మంత్రజలం చల్లేదెవరో
తెలియరాదు కానీ
వర్షం కురిసిన ప్రతి రాత్రీ నేను
నేలను తాకని చినుకునవుతాను.

# జెముడు

కొమరగిరి అనంత ప్రమీలా రాణి

ఎన్నో ఆలోచనలతో, ఆందోళనలతో, భయంతో బరువెక్కిన మనసుతో ఎయిర్ పోర్టు నుంచి ఇంటికి వచ్చాడు నందగోపాల్. అక్క రాలేదు ఎందుకో? ఇంటికి రాగానే లాప్ టాప్ ఆన్ చేసి మెయిల్ తెరిచి చూశాడు. అనుకున్నట్టుగానే అక్క దగ్గరనుంచి వచ్చిన మెయిల్ చదివిన తరువాత అతని మనసు తేలిక పడింది.



లండన్ నుంచి కొన్నిరోజులు బయటపడాలన్న ఆలోచనతో తమ్ముడికి వస్తున్నట్టు మెయిల్ ఇచ్చానే కాని, తరువాత అది మంచి ఐడియా కాదనిపించింది. అందుకే ప్రోగ్రాం మారిందని, ఒక వారం రోజుల పాటు ఈజిప్టు వెళుతున్నానని, అక్కడ ఒంటరిగా ఉం డి అన్నీ ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత టొరాంటోకి వస్తానని, ఖంగారు పడవద్దని రాశాను తమ్ముడికి.

కైరో ఎయిర్-పోర్ట్ లో నుంచి బయటకి వచ్చి టాక్సి చేసుకుని, కైరో ఇంటర్ నేషనల్ హొటల్ కి వెళ్ళి నా పేరు చెప్పి రిజర్వు చేయించు కున్న రూమ్ కీ తీసుకున్నాను. రూముకి వెళ్ళి, సూట్ కేసులు లోపల పెట్టి, చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని, బట్టలు మార్చు కుని, కింద వున్న రెస్టారెంట్ కి వెళ్ళి ఒక చీజ్ సాండ్ విచ్ తిని, వేడి వేడి టీ తాగి నా రూమ్ కి వచ్చాను.

చాలా కాలంగా ఇక్కడ నేను చూడాలని అనుకున్నవి మూడు ప్రదేశాలు మాత్రమే... గీజా" (Giza) లో వున్న పిరమిడ్స్ స్ఫింక్స్(Sphinx), కైరో మ్యూజియం(Cairo Museum), వాలీ ఆఫ్ ద కింగ్స్ (valley of the kings). మరునాడు బయలుదేరుతున్న టూరిస్టు బస్ లో సీటు రిజర్వు చెయ్యమని ఫ్రెంట్ డెస్క్ కి ఫోన్ చేసి చెప్పి, వెళ్ళి పడుకోవటానికి ప్రయత్నం చేశాను!

మరునాడు పొద్దున్నే రెడీ అయి సన్ స్క్రీన్ ముఖానికి చేతులకి బాగా రాసుకుని, బ్యాగ్ తీసుకుని కిందికి వెళ్ళాను. ఎనిమిదిన్నర కల్లా ఇంటర్ నేషనల్ రెప్రెజెంటటివ్ టూరిస్టు బస్సు వచ్చింది.

గైడు మమ్మల్ని అందరిని గ్రూప్పు చేసి బస్సు లో ఎక్కించు కుని పిరమిడ్సు దగ్గరగా, ఎక్కడైతే ఒంటెలు రైడ్ కి రెడీ అవుతు న్నాయో, అక్కడికి తీసుకుని వచ్చాడు. "సాయంత్రం 3:30 కల్లా వస్తాను, అందరూ ఇక్కడే రెడీ గా ఉండండి," అని చెప్పి వెళ్ళి పోయాడు. టూరిస్టు గైడు ముందే కొన్ని ఒంటెలను మాకు రిజర్వు చేయడంతో మాకు ఒంటెల యజమానుల వల్ల ఏ రకమైన ఇబ్బం దులు రాలేదు. " లేక పోతే వీళ్ళు తోచనియ్యరు" అని హోటల్ దగ్గ ర కొంత మంది ముందేచెప్పారు.

నేను, ఇంకొక అమ్మా యి ఇండియన్ లా ఉంది... పెద్ద వయస్సు కూడా వున్నట్లు లేదు, మేము ఇద్దరము ఒక గ్రూపు. రోజంతా తనతో కలిసి ఉండాలి కనుక నన్ను నేను పరిచయం చేసుకున్నాను," నా పేరు అమరా వతి, లండన్ నుంచి" అని. "నా పేరు సత్ వంత్ కౌర్. టొరాంటో లో జాబ్ చేస్తాను" చెప్పింది. "మా తమ్ముడు కూడా టొరాంటో లో ఉంటాడు, ఈ ట్రిప్పు తరువాత నేను అక్కడికే వెడుతున్నాను" అన్నాను

ఇట్లా మాట్లాడుతూ, మేము ఎక్కబోయే ఒంటె దగ్గరకు వచ్చి నిలుచున్నాము. వాటి మీద కూర్చోటానికి వీలుగా సీటుఉంది. ఆ సీటుకి పడకుండా పట్టుకోవటానికి ఒక పిడి కూడా ఉంది. ఒంటెల మీద రక రకాల డిజైన్లతో, రంగు రంగుల దుప్పట్లు వేసి వున్నాయి. వాటి చివర్లో రక రకాల, రంగుల కుచ్చులు వేళ్ళాడు తున్నాయి. ఈ అలంకరణలన్నీ టూరిస్టులను ఆకర్షించటాని కను కుంటాను.

నల్ల కళ్ళద్దాలు పెట్టుకుని, మళ్ళీ ఒకసారి సన్ స్క్రీన్ ముఖా నికి, చేతులకి రాసుకున్నాను."రండి, కూర్చోండి" అని అన్నాడు ఒంటె యజమాని. అందరం జాగ్రత్తగా కూర్చున్న తరువాత ఒంటెల ని లేపాడు. మేము ఒక చేత్తో కుర్చీకి వున్న పిడిని పడకుండా పట్టుకుని, ఇంకో చేత్తో కెమేరాలతో, సెల్ ఫోన్లతో ఫొటోలు తీసుకుంటున్నాము లెక్క లేకుండా! నా ఇబ్బందులు అన్నీ మర్చి పోయి, ఎంతో ఉత్సాహంతో, ఆశ్చర్యంతో కామెల్ రైడ్ ని ఎంజాయ్ చేస్తున్నాను! ఇవి 8 km పొడుగు అట, ఒక కొన నుంచి

ఇంకో కొన వరకు! ఇక్కడికి రావాలని ఎంత తొందరగా నేను నిర్ణయం తీసుకుని, దాన్ని అమల్లో పెట్టానో తలుచుకుంటే ఆశ్చర్యంగా, గర్వంగా వుంది! నా ఈ ఎనిమిదేళ్ళ వివాహ జీవితం లో కూడా ఇదే విధంగా ఏదో ఒక నిర్ణయం చేసి ఉంటే ఈనాడు నా జీవితం వేరుగా ఉండేది కదా అని అనుకున్నాను. కనీసం ఇప్పటికైనా మేలుకున్నాను అంతే చాలు. ఒక్క రోజులో ఎంత మార్పు వచ్చింది నాలో!

ఎక్కడ నుంచి బయలు దేరామో మళ్ళీ అక్కడికే మమ్మల్ని తీసుకు వచ్చాయి ఒంటెలు. దిగి బాటిల్ లో నుంచి నీళ్ళుతాగి, కొన్ని నీళ్ళు మొహం మీద చల్లుకున్నాను. ఈ లోపల బస్సు మా దగ్గరికి వచ్చి ఆగింది.

అమ్మయ్య! అనుకుని అందరం బస్సు ఎక్కి, మా సీట్లలో కూర్చున్నాము. ఎ.సి. బస్సు కనుక ఆ చల్లదనం మాకు ప్రాణం పోసినట్టు అయింది! బస్సు మెల్లిగా బయలుదేరింది. దారిలో ఒంటెల గుంపులు కనిపించాయి. అవి అందిన కొమ్మల్ని, ఆకుల్ని, జెముడు చెట్లని విరుచుకుని తింటున్నాయి. ముళ్ళు వున్నా లెక్క పెట్టటం లేదు. నోటి దగ్గర రక్తం కూడా కారుతోంది.

"ఒంటెలు చాలా విచిత్రమయిన జంతువులు. రక్తం వస్తు న్నా లెక్క చెయ్యటం లేదు. జెముడు చెట్లని ముళ్ళతో సహా తింటు న్నాయి, నొప్పిగా ఉండదా?" అన్నాను.

"ఒంటెల నోరు విశాలంగా, బలంగా, రబ్బరు లాగా వుం టుంది. ఈ ముళ్ళు వీటి నోటికి గాని, పెదవులకు గాని హాని చెయ్యవు! ముళ్ళు గుచ్చుకున్నా, రక్తం వచ్చినా వాటికి నొప్పి తెలీ దు. ఒంటెలు ఈ ఎడారి జీవితానికి అలవాటు పడ్డ జంతువులు అని, వీటిని చూసి మనం చాల నేర్చు కోవచ్చు" అని చెప్పి ఆగింది కౌర్.

"వీటిని చూసి మనం నేర్చుకునేది ఏమిటి?" అడిగాను.

"ఉన్న పరిస్థితులను బట్టి మనం ఎట్లా మారాలి లేదా పరిస్థితులను మనకు అనుకూలంగా ఎట్లా మార్చుకోవాలి అన్నది వీటి దగ్గర నుంచి మనం నేర్చుకోవలసినవి. నాకు పదేళ్లు వచ్చే వరకు నేను జైపూర్ లో పెరిగాను. ఒంటెల గురించి చాలా విష యాలు పెద్దవాళ్ళ దగ్గర నేర్చుకున్నాను. కొన్ని నేను రీసెర్చ్ చేసి తెలుసుకున్నా.. నాకు ఇంటరెస్ట్ కనుక" అన్నది.

బస్సు ఒక్క కుదుపుతో హోటల్ ముందర ఆగటం చూసి "థాంక్స్ ఫర్ ద ఇన్ ఫర్ మేషన్" అని చెప్పి మెల్లిగా లేచి అందరి తో పాటు బస్సు దిగాను! బాగా అలసిపోయి ఉండటం వల్ల ఎప్పుడు నిద్రపట్టిందోతెలీలేదు. పొద్దున్న సూర్యకిరణాలు మొహం మీద పడటంతో మెలుకువ వచ్చింది. బాల్కనీలో కూర్చుని ఒంటెలను చూస్తున్నాను. కౌర్ చెప్పిన విషయాలు గుర్తుకి వస్తు న్నాయి. ప్రస్తుతం నేను ఉన్న పరిస్థితుల్లో ఏ రకంగా పరిస్థితు లను నాకు అనుకూలంగా మార్చుకోగలను అని నన్ను నేను ప్రశ్నించుకుంటూ ఆలోచిస్తున్నాను.

నేను కూడా నన్ను, నా మనస్సును ఒంటెల నోటి చర్మం లాగా మొద్దుగా, కఠినంగా, రబ్బరులాగా మార్చుకోనా? ఈ రకమై న మార్పు నాలో వస్తే, జెముడు చెట్టు ముళ్ళ లాగా గుచ్చుకునే మాటలు ఎవరైనా అన్నా మనసు గాయపడకుండా ఉంటుం దేమో! ఏట్లాగయినా సరే తనతో నా మనస్సుల్లో నన్ను బాధ పెడు తున్న విషయాల గురించి మాట్లాడి సమస్యను పరిష్కారం చేసు కోవాలి అని ఒక నిర్ణయానికి వచ్చాను.

నేను మానసికంగా హింస పడుతున్నంత వరకు మన సమస్యలు పరిష్కారం కావని, దీని వల్ల నాకు, తనకి మధ్య దూరం ఎక్కువవుతుందే కాని తగ్గదని, ఇది విడాకులకు దారి తీస్తుందని చెప్పాలి. హాస్పిటల్ ఎమర్జెన్సీ వర్కుతో బిజీ గా ఉండే నేను, ఏదో అన్నాను... ఏదో చేశాను.. అని వాళ్ళు చెప్ప గానే తను నమ్మటం లో అర్ధం లేదని, తల్లి తండ్రుల మాట విని నన్ను ఫిజికల్ గా ఇమో షనల్ గా హింస పెడుతున్నావే తప్ప నా మంచితనాన్ని ఎందుకు గుర్తించటం లేదు అని అడగాలి.

అత్తమామలను దగ్గర ఉంచుకుని... గౌరవించి...అన్నీ సమకూర్చటమేనా నేను చేసిన తప్పు? భరించినంత కాలం భరించాను ఇక నా వల్ల కాదని, లండన్ లో వాళ్ళకి వేరే వ్యాప కం లేక ఇట్లా ప్రవర్తిస్తున్నారని, వాళ్ళని వెనక్కి పంపించి అక్కడ అన్ని సౌకర్యాలు చేస్తే వాళ్ళకి బావుంటుందని చెబుతాను.

ఇష్టపడి చేసుకున్నాను కనుక ఎవరినీ తప్పు పట్టేందుకు లేదు. ఈ మారేజ్ నిలపటానికి ప్రయత్నం చేస్తాను. చెయ్యక పోతే ఎందుకు చెయ్యలేదా అన్న బాధ జీవితాంతం వుండి పోతుంది. అది భరించడం కష్టం.

నేను ప్రయత్నం చెయ్యకుండా విడాకులు తీసుకుంటే, నా తల్లి తండ్రులు ఎంత బాధ పడతారు? ఈ పెద్దతనంలో వాళ్ళ ని కష్ట పెట్టటం నాకు ఏ మాత్రం ఇష్టంలేదు. నేను బాధ పడతానే కాని వాళ్ళని బాధ పడనివ్వను అని నిర్ణయించు కున్నాను. విడాకులు ఇస్తే తమ్ముడి పెళ్ళి కావటం కూడా కష్టం అవచ్చు. నిరంజనరావుని నేను పెళ్ళి చేసుకుంటాను అని అన్నప్పుడు కాదనలేదు అమ్మా నాన్న గారు.

ప్రొఫెషనల్ లైఫ్-లో పర్సనల్ లైఫ్ లో ఎంతో కాన్ఫిడెన్స్ తో అందరితో ధైర్యంగా మాట్లాడేదాన్ని. బయట ఎన్నో మెప్పులు పొందిన నేను ఇట్లా ఎందుకు మారాను?

ప్రాణాలని రక్షించే నేను.. ఇట్లా నా ప్రాణం తీసుకునే పరిస్థితిలో ఎందుకు ఇరుక్కున్నాను అని నన్ను నేను ఎన్నిసార్లు ప్రశ్నించు కున్నానో... కానీ జవాబు దొరకలేదు. నాకు ఇక ఈ సైకలాజికల్ టార్చర్ భరించే ఓపిక లేదు.

మూడవ రోజు ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ రోజు రాత్రి బుజాల మీద నుంచి పెద్దబరువు దించినట్టు అనిపించింది. మన స్సు తేలిక పడింది దూదిపింజంలా! పెళ్ళి అయిన ఎనిమిదేళ్ళ తరు వాత మొదటిసారిగా ఏం చెయ్యాలి అన్నది క్లియర్ గా కనిపిం చింది నాకు.

మిగిలిన రెండు రోజుల్లో, నేను చూడదలుచుకున్న వన్నీ చూశాను. సాయంత్రం అందరితో షాపింగు కి వెళ్ళాను. పెర్ఫ్యూమ్ షాప్ కి వెళ్ళి లోకల్ గా తయారు చేసిన రెండు సెంటు బాటిల్సు కొన్నాను. అందరికీ బై చెప్పి కౌర్ దగ్గరనుంచి సెల్ నెంబర్ తీసుకున్నాను. అన్ని జాగ్రత్తగా సూట్ కేస్ లో సర్దుకుని, మరునాటి ప్రయాణానికి సిద్ధం అయ్యాను. లాప్ టాప్ తెరిచి తమ్ముడికి ఫ్లైట్ డీటెయిల్స్ ఇచ్చి పికప్ చేసుకోవటాని రమ్మని మెయిల్ ఇచ్చాను. ఇంకొక మెయిల్ నిరంజనరావు కి ఇచ్చి లాప్ టాప్ మూసి ఎట్లా ఉం టుందో తెలియని భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ బెడ్ వైపు నడిచాను. నా ప్రయత్నము నేను చేశాను.ఆ పైన అమ్మవారి దయ!

## బంగారు కొండ

**ముకుంద రామారావు**

వెలుగు చీకట్లను తాగుతూ
నీడల్నికొద్దికొద్దిగా తింటూ
ప్రచండ గాలుల్ని సైతం ధిక్కరిస్తూ
నిబ్బరంగా నిర్భయంగా కొండ

ఆనందంతోనో బాధతోనో
దాని కంటిముందు జరుగుతున్న
అన్నింటికీ మౌన సాక్షి

తవ్వినా చెక్కినా చీల్చినా
గుళ్లూ దేవుళ్లను చేసినా
అసలు లేకుండానే చేసినా
మూగనోము

బయటా లోపలా
ఎంత సంపదుందో
తెలియని తెలుసుకోని మౌని

నీరు సైతం నిర్లక్ష్యంగా
వెక్కిరిస్తూ హొయలుపోతూ
ఎక్కడో సముద్రాన్ని చేరడానికి
దాటుకుంటూ పోతున్నా
చెక్కుచెదరని బుద్ధుడు

సర్వం ధారబోస్తూనో
ధారబోసేందుకు సిద్ధపడో
ఏ ధ్యానంలోనో శతాబ్దాలుగా
కదలక మెదలక కూర్చున్న
నిరంతర ప్రేమమూర్తి
నిర్వికల్ప సమాధిలోని సూఫీ

★★★

విజయవాడలో మండు వేసవిలో ఎండ నిప్పులు చెరుగుతున్న రోజున విశ్వనాధ సత్యనారాయణ గారు, ఆయన ఆత్మీయ మిత్రులు ధూళిపాళ శ్రీ రామ మూర్తి గారు వాల్మీకి రామాయణంలో ఋష్యశృంగ వృత్తాంతాన్ని చదువుకుంటున్నారు. ఉన్నట్టుండి మేఘాలు కమ్మి వర్షం పడింది. "వేసవిలో వర్షమా?" అని ఆశ్చర్య పోయారుట ధూళిపాళ శ్రీ రామమూర్తి గారు. "ఇందులో ఆశ్చర్య మేముంది. పిండాకూడు. మనం చదువుతున్నది ఋష్యశృంగుడి కథ. అది వాల్మీకి మహత్యం." అన్నారట విశ్వనాథ.

కొన్ని సీజన్ల తరవాత మరో మండు వేసవిలో ధూళిపాళ పరుగున వచ్చారట విశ్వనాథ వారింటికి. "అయ్యా చూసారా. వర్షం పడుతోంది !" అన్నారు శ్రీ రామమూర్తి గారు. "అయితే ఏమిటట?" అన్నారు విశ్వనాథ. "మీ కల్పవృక్షానికీ ఆ మహత్యం వుందండీ! నేనిప్పుడు కల్పవృక్షంలో ఋష్యశృంగ వృత్తాంతమే చదివి వస్తున్నాను!" అన్నారట శ్రీ ధూళిపాళ. ( గొల్లపూడి మారుతీ రావు గారి రచన నుంచి)

# గురు శిష్య సంవాదము

**అరుణాచల భారతం, డల్లాస్ (టెక్సాస్)**

"ఫేస్ బుక్"లో ఈ క్రింది (https://www.facebook.com/notes/great-living/chat-with-god/251299851565841) లోని ఆర్టికల్ చదివిన తరువాత, పద్యరూపంలో 'గురు-శిష్య సంవాద ము'ను వ్రాయాలనే తలపు కలిగి ఈ పద్యాలను వ్రాయడం జరిగింది. ఐతే, ఇందులోని పదాలే రచయితకు చెందినవి, భావావేశం మాత్రం పైన తెలిపిన "ఫేస్ బుక్" పేజ్ వల్ల కలిగినదిగా గుర్తింపవలెను.

**కం.** **సమయాభావ మిషలఁ జూ**
**పి, మాయ దరిఁజేరు శిష్యు వివరించి గురుం**
**డమితోత్సాదకుఁగ మలఁచు**
**ప్రమోద దీపికలఁ బఱపు పరమోద్ధఢిమన్**

"అనేక వ్యవహారములందు మిక్కిలి సతమతమై ఉన్నాను, కనుక నేనేమీ క్రొత్తపద్ధతులు, ధ్యానాదులు చేయబోను" అనే శిష్యుణ్ణి గురువులు-గొప్ప స్థిరబుద్ధితో సన్మార్గాన్ని బోధించి, అతణ్ణి నలుగురికీ ఆనందాన్ని పంచే క్రియాశాలిగా తీర్చిదిద్ద గలరుసుమా!

**కం.** **"నిస్సందేహము – బ్రతుకిది**
**దుస్సంకట" మనెడు శిష్యుఁ ద్రోవ మరల్పన్**
**"ఘుస్సను జీవము కొఱకై**
**డస్సిపడకు మం"చు గురుఁడు డాంబిక మడఁచున్**

**శిష్యుడు** : అనేక కష్టనష్టాలతో కూడిఈ సంసారం బహు క్లిష్టముగా ఎందుకుంటుంది?

**గురుడు** : క్షణభంగురమైన ఈ జీవితాన్ని విశ్లేషించే ప్రగల్భతకు ఎందుకు పూనుకుంటావు? అలా చేయబట్టే, క్లిష్టముగా అనిపించుచున్నది"

**"కలుగఁగ యే యానందము**
**కలవర మెందుక"ని చట్టు కారణ మడుగన్**
**"అలవాటుగఁ దలపోయుట**
**తొలఁగించెను నీదు సుఖము తొలుత"నె గురుఁడున్**

**శిష్యుడు**: ఆనందమనే భావం ఏ మాత్రమూ కలుగకుండా, తరచుగా తత్తరపాటు ఎందుకు కలుగుతూ ఉంటుంది?"

**గురుడు**: ప్రతి విషయాన్ని గురించీ విపరీతంగా ఆలోచన చేయడమనేది నీకు ఎప్పటినుంచో అలవాటయిపోయి ఈ విధంగా కలవరం కలుగుతోంది సుమా!

**శిష్యుడు** :

**ఆ.వె..** **మంచి మనుజు నేల క్రుంచు*గష్టమనినఁ**

**గురుడు :** **బసిఁడి కగ్గి వలన వన్నె కలుగు,**
**సానవెట్ట మెఱయు మాణిక్య – మట్టులె**
**కష్ట మొదవి నరుని గట్టిపఱచు!**

* క్రుంచు ('క్రుంగు' ధాతువునకు ప్రేరణార్థకము) క్రుంగించు (క్రుంగజేయు) అని అర్థము)

**శిష్యుడు**: మంచి మనుషులనే, కష్టాలు క్రుంగదీస్తాయి ఎందుకని?

**గురుడు**: వజ్రాలు, మణి మాణిక్యాలు సాన పట్టకుండా మెరువవు కదా! అలాగే బంగారానికి మెరిసే గుణం కూడా అగ్నినుండి వెలువడిన తరవాతే కదా కలుగుతోంది? అదేవిధంగా, మానవులు కూడా తమకు కలిగిన కష్టనష్టాలనే తాపానికి తట్టుకొని నిలబడగలిగినప్పుడే గొప్పవారిగా గుర్తింపును పొందుతారు!

**శిష్యుడు**:

**తే. గీ.** **'అనుభవమ్మెటులవసర'మనఁగ – నిలను**

**గురుడు :** **జీవితోపభోగార్థంపు సిద్ధులెల్ల**
**నిగ్గుదేరఁ బరీక్షించి నీకొసంగు**
**నుత్తమోత్తమ మగునట్టి యొజ్జ యదియె!**

**శిష్యుడు**: మానవులకు కలిగే ఈ అనుభవాల వల్ల లాభమేమిటి?

**గురుడు:** ముందుగా నిన్ను పరీక్షించి, నీవా పరీక్షలో నెగ్గినప్పుడు నీవు జరిపే నిత్యకృత్యాలు, విశేషక్రియల యొక్క ఫలాన్ని నీకందించి నీకు పాఠాలను బోధించే గొప్ప గురువే ఈ అనుభవం కూడా.

**శిష్యుడు** :

**కం.** **'కూడుచుఁ గష్టములన్నియు**
**నోడింపగ నెటులఁ దెలియు నొరవిల ననఁగన్**

**గురుడు:**

**చూడక లోకము – దృష్టిని**
**జోడింపఁగ డెందమిచ్చు సూచన, శిష్యా!**

**శిష్యుడు**: ముసిరి వేసి బాధలకు గురిచేస్తున్న ఈ కష్టాల కొలిమిలో మాడిపోయే వారికి వివిధ రీతులు, విధానాల గురించి తెలుసుకొనే అవగాహన ఎలా కలుగుతుంది?

**గురుడు** : బాహ్యంలో దృష్టి పెడితే, కష్టాలు, బాధలు, ఓడిపోవడము, మాడిపోవడము లాంటివే తోస్తాయి. కానీ, అదే దృష్టిని హృదయము వైపుకు మళ్ళించినట్లైతే, గమ్యమూ గోచరమౌతుంది, మార్గమూ కనిపిస్తుంది, విధానమూ బోధపడుతుంది సుమా!

**తే. గీ..** **"'చవట వీఁ'డంచు జగమెంతొ చాటఁ దివుర**
**మోక్షమార్గములో నెటు పోవనగును?"**

**గురుడు :**

**"హృదయ మందుఁ దృష్టి కలుగ నితరమేల?**
**లోకరీతి యెటులనున్నరోతయేల?"**

**శిష్యుడు**: ప్రపంచము నా అసఫలతలను, పరాజయాలను బట్ట బయలు చేసి నన్ను క్రుంగదీస్తుంటే, ఎంత ప్రయత్నం చేసిన ప్పటికీ మీరుపదేశిస్తున్న ఈ మోక్షమార్గములోనికి నేనెట్లా వెళ్ళ గలను?

**గురుడు**: నీ హృదయంలో సంతృప్తి భావనలు నిండినప్పుడు, ఇత రులు ఏమంటే నీ కేమిటి? లోకంలోని పోకడలతో నీకు పనేంటి? [ఇతరుల కళ్ళతో చూచి-నిన్ను నీవు బేరీజు వేసుకుంటే, వారు చూపించే పరాజయాలు, అసఫలతలే నీకు కనిపిస్తాయి. అలాకాక, నీవు సాధించిన లేక నేర్చుకొన్న దానితో హృదయంలో నిండిన సంతృప్తి భావనతో నిన్ను బేరీజు వేసుకుంటే, నీకు జయం గోచ రించి ప్రసన్నత కలుగుతుంది!]

**శిష్యుడు:**

**కం. ప్రేరణమెటులగు నేఁకట?**

**గురుడు:**

**సారింపుము దృష్టి లబ్ధసాఫల్యముపై,**
**చేరని వానిని వెదుకఁగ**
**నూరించెడు మాయ విడిచి యొడుపున మనుమా!**

ఏకటన్ = దుర్దశయందు; ప్రేరణ = ఉపాయము; ఎటుల + అగు = ఏవిధముగా కలుగును?

**శిష్యుడు** : మీరు ఎంత చెప్పినా, ఈ కష్టాలు నన్ను మోక్షమార్గానికి ప్రేరేపించ లేక పోతున్నాయి, యేమి చెయ్యగలను?

**గురుడు** : సాధించవలసిన దానిని చూసి చతికిలబడిపోక, సా ధించిన దానిపై శ్రద్ధతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే, నీవు ఎంతో సాధించ గలుగుతావు. అదే నీలోపలి నుండి నీకు అందే ప్రేరణ!

**శిష్యుడు :**

**కం. జనులందున వింతేమగు?**

**గురుడు ::**

**తనకొకనికె యేల కష్టదశయని తలచున్**
**మనుజుం, డేడ్వఁడు సంపద**
**లనయంబుగ దరిని జేర నచ్చెరు వెసగన్!**

**శిష్యుడు:** ఈ ప్రజానీకంలో మిమ్మల్ని అబ్బు పరచే విషయమేమైనా ఉన్నదా?

**గురుడు:** దుఃఖంలో ఉన్నప్పుడు "నాకే ఈ దుఃఖము ఎందుకు కలగాలి?" అని ప్రశ్నించే మానవులు, సంపదలు, సౌఖ్యాలు కలిగినప్పుడు "నాకే ఈ సౌఖ్యం ఎందుకు కలగాలి?" అని ప్రశ్నించక పోవడం నిజంగా వింతే సుమా!

**శిష్యుడు :**

**ఆ.వె. సౌఖ్య జీవనంబు సాగించు టెట్లగుఁ?**

**గురుడు :**

**దప్పిదంపు గతము తలఁపఁ బోక**
**దీక్షతోడ నిపుడె దృఢవైఖరినిఁ బట్ట**
**భయమనునదె లేని భవిత గలుగు!**

**శిష్యుడు** : సుఖమయమైన జీవితాన్ని ఏ విధంగా పొందగలము?

**గురుడు** ::గతంలో జరిగిన తప్పిదాలపై దృష్టి పెట్టి కూర్చుండిపోక, గొప్ప సంకల్పంతో ప్రస్తుతాన్ని నడిపించు, భయము-భీతి లేని భవిష్యత్తు దానంతటదే వచ్చి చేరుతుంది -- అదే సుఖమయమైన జీవితమంటే!

**శిష్యుడు** :

**కం. మొరలెట్లు తీరు నరులకు?**

**గురుడు ::**

**ధరలో లేదట్టి మ్రొక్కు - తలఁపిడి మర్మం**
**బెఱుఁగుము, వీడుము బెరుకున్ -**
**స్థిరబుద్ధినిఁ గనుగొనెదవు తృప్త్యాంతరతన్**

**శిష్యుడు**: చివరిగా, ప్రార్థనలు తీరుతాయని అనడానికి ప్రమాణ మేమిటి?

**గురుడు**: తమకేది నిజంగా కావాలో తెలియని మానవులు, క్షణాని కొక ప్రార్థన చేస్తూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. అలాకాక, సత్సం కల్పముతో చేసే ప్రార్థనలు తీరక పోవడమనేది ఉండనే ఉండదు! ఇది సృష్టిలోని గొప్ప మర్మం! నమ్మకంతో, స్థిరబుద్ధితో చూస్తే, గొప్ప తృప్తితో కూడిన ఆనందము నీకు తప్పక సాక్షాత్కరిస్తుంది.




ప్రయాణాలు ఆగిపోతాయి

ఈ వారంలో మీకు వాహనయోగం వుంది

# ఏమనను

జి.వి.ఆర్.కె. శర్మ

మబ్బులన్నీ ఒక్కసారి చెదరి
భగ్గుమన్న అరుణారుణ సూర్యాస్తమయాన్నీ
ఎప్పుడు పుట్టాయో కానీ
తుప్పల్లో తల దాచుకునే సున్నితపు నీలం పువ్వులనూ
మసక మసక చీకటి వెలుగున
ఏ దూరతీరాలకో బారులు కట్టే అడవి బాతులనూ
చూసీ పట్టించుకోని జనుషాంధుల్ని ఏమనను ?
భావుకత పలువన్నెల పద కదంబమై
హృద్వీధిని వీచిన తిలక్ కవితా సౌరభాన్నీ
హృదయంగమ కథనపు కలైడోస్కోప్ లో
చిత్రవిచిత్ర రంగవల్లుల్ని దిద్దిన చాసో వాస్తవికతనీ
వందేళ్ళయినా నవనవోన్మేషణం గా ఈ నాటికీ
అబ్బుర పరిచే గురజాడ బహుముఖ ప్రజ్ఞనీ
ఇంకా గుర్తించలేని పండితమ్మన్యుల్ని ఏమనను ?

చదువంతా చట్టుబండలై
నిరక్షరాస్యతే నయమనిపించే కుహనా సంస్కృతినీ
పచ్చకాగితాలు పరమావధి కాగా
ఆటవికతే మెరుగనిపించే అధునాతన నాగరికతనీ
మూర్ఖ శిష్యకోటిని మభ్య పెట్టి
అరచేతిలో వైకుంఠం చూపే ఆషాఢభూతులనూ
అందలమెక్కించే సమాజ వైపరీత్యాన్ని ఏమనను ?
నిజమే , Wordsworth చెప్పినట్లు ,
The world is too much with us.
నిర్విరామ ఘన ధనార్జనల యాతనలో సతమతమై
అర్థరహిత స్పర్థలలో అంధభక్తి వరదలలో తలమునకలవుతూ
నిత్యనూతనంగా అనాయాచితంగా అలరించి హాయినిచ్చే
ప్రకృతి అందచందాలకూ సాహిత్య స్పందనలకూ
అంతరంగ క్షాళన చేసే ఆధ్యాత్మిక చింతనకూ
వ్యవధిలేదనే వ్యర్థులనేమనను ?








# శ్రీనాథుని హరవిలాసం

కాశీనాధుని రాధ , డోవర్ (న్యూజెర్సీ )

లోకంలో సాధారణంగా కవి ఒక రాజునో, రాజ్యాన్నో ఆశ్రయించుకుని నిలకడగా సాహిత్య కృషి చెయ్యడం పరిపాటి. కాని శ్రీనాథ మహాకవి అలాంటి కోవకు చెందినవాడు కాదు. పెద కోమటి వేమారెడ్డి, వీరభద్రా రెడ్డి, మైలారరెడ్డి, వినుకొండ వల్లభ రాయడు, విజయనగర ప్రభువైన ప్రౌఢ దేవరాయలు, రాచకొండ ముమ్మిడి (సర్వజ్ఞ) సింగభూపాలుడు వంటి **రాజులు**, మామిడి వేమన, మామిడి సింగన్న, బెండపూడి అన్నయ వంటి **మంత్రులు**, అవచితిప్పయ్య శెట్టి వంటి **మిత్రులు** – వీరంతా ఈ కవి కప్పుకున్న పట్టు కండువా మీద జలతారు పువ్వులై , అతడిని ఒక సార్వ భౌముని చేసి, సన్మానించి, ఆంధ్ర సాహిత్యచరిత్రలో తరతరాలు గుర్తుంచుకునే మహావ్యక్తిగా చేశారు.

చిన్నారిపొన్నారిచిరుతకూకటి నాడు మరుత్తరాట్చరిత్రతో మొదలు పెట్టి, జీవనసంధ్యాసమయం దాకా నిరాటంకంగా కావ్య రచన సాగిస్తూనే వచ్చాడు ఈ మహాకవి. "**వచియింతు వేముల వాడ భీమన భంగి ఉద్దండలీల నొక్కొక్క మాటు** ..." అంటూ ఢంకా దెబ్బ కొట్టినట్టుగా చేప్పుకోవడమే కాదు, ఆ చెప్పిన ఒరవడులని తన కవితలో చూపించిన సమర్థుడు శ్రీనాథ కవి సార్వభౌముడు.

శ్రీనాథుని రచనలన్నీ ఇంచుమించుగా అనువాదాలే అయినా విద్వాంసులు, విమర్శకులు అంతా శ్రీనాథుడు కవి సార్వ భౌముడన్నది నిర్వివాదాంశం అన్నారు. అనువాదం చెయ్యడం అన్నది పూర్వపురోజుల్లో ఆచరణీయమైన సాంప్రదాయం. ఆ మార్గాన్ని అనుసరించి తనకు నచ్చిన మహాకావ్యాలని ఆంధ్రీ కరించాడు. నిజానికి అనువాదం అనేది కత్తిమీది సాములాంటిది. మూలంలో చెప్పిన దాన్ని అనుసరిస్తూ కూడా తనదైన పంథాను ఒక దాన్ని ఆవిష్కరించాలి. అందులోను ఈ కవులు అనువదిం చడానికి ఎన్నుకునేవి మహామహులైన సంస్కృత కవీంద్రుల కావ్యాలు. వీటిని అనువదించి మెప్పు పొందటం అంటే సామాన్య విషయం కాదు. శ్రీనాథుడు తన కావ్యాలలో తన జాతి సంప్రదా యాలని, పలుకుబడిని, సుతారాంగా చొప్పించి, మూలంలో ఉన్న పాత్రలని, వాటి పోకడలని కొత్త పుంతలలో నడిపించి, వాటిని తన సొంతం చేసుకోటం జరిగింది.

ఇప్పుడు మనం మాట్లోడుకోబోయేది శ్రీనాథుని 'హర విలాసకావ్య పరిచయం'. ఒక కావ్యాన్ని పరిచయం చెయ్యడం అంత సులువైన పని కాదు. సంక్షిప్తంగా అన్ని కథావిషయాలను, కవి ప్రతిభని, కవికి సంభందించిన ఇతర విశేషాలని కూడా చెప్పాలి. ముందుగా శ్రీనాథుడు ఈ కావ్యాన్ని ఎప్పుడు రాశాడో, ఎందుకు రాశాడో,దేన్నీ గురించి రాశాడో చూద్దాం.

శ్రీనాథుడు రాజుల ప్రాపకంలో రచనా వ్యాసంగాలు సాగించటమే కాకుండా రాజకీయ వ్యవహారాలు కూడా నడిపిన వాడు. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా ఉండే రోజుల్లో 'విజయనగర రాజులను మంచి చేసుకునే కార్యభారాన్ని' కంచిలో ఉండే తన బాల్య మిత్రుడు అవచితిప్పయ్య శెట్టి సహాయంతో సాధించడానికి శ్రీనాథుడు వెళ్ళడం జరిగింది. ఆ సందర్భంలో అవచితిప్పయ్య శెట్టి కోరిక మేరకు శైవ ప్రబంధం మైన 'హరవిలాసకావ్యం' స్వల్ప వ్యవధిలో రచించి అతనికి అంకితం ఇచ్చాడు. ఈ కావ్యంలో మొదటి రెండాశ్వాసాలు చిరు తొండనంబి కథ. దీనికి ఆధారం ఆయన తమిళదేశంలో విన్న శివ కథలు, పాల్కురికి సోమనాధుని బసవపురాణం. తృతీయా శ్వాసం నుంచి తారకాసురవృత్తాంతం, పార్వతితపస్సు, గౌరీకళ్యాణం ఆదిగాకల కథలన్నీ కాళిదాసు కుమారసంభవాన్ని అనుసరిస్తూ చేసిన అనువాదం. అటు తరువాత దారుకావన విహారం, క్షీర సాగరమధనం ఇది భారతభాగవతాలలో ఉంది. కిరాతార్జునీయం భారవి నాటకం ఉన్నా దాన్ని శ్రీనాథుడు అనుసరించలేదు. ఊర్వశి శాపం, ఇంద్రుని ప్రోద్బలంతో అర్జునుడు నివాతకవచాదులని, పౌలోమ కాలకేయాదులని సంహరించి తిరిగి భూలోకానికి వెళ్ళ డంతో కథ పరిసమాప్తం అవుతుంది. వీటన్నిటికి భారతంలో ఉన్న కథనే అనుసరించడం జరిగింది. ఒక రకంగా చూస్తే హర విలాసం లో గౌరీకళ్యాణం తప్ప తక్కిన భాగాలు అన్ని స్వతంత్రంగా వ్రాసిన వే. కథలో కాస్త హెచ్చు తగ్గులు కనబడినా కవితా ప్రతిభకు మాత్రం తగ్గలేదు.

చిఋతొండ నంబి కథ : ఈ కథ దుర్వాసమహాముని తుంబురుడుఅనే ప్రమధుడిని శపించడంతో మొదలవుతుంది. లేళ్ళకు నీవార పాయసాన్నాన్ని తినిపిస్తున్న మునిని, ఆ లేడి పిల్లల ను చూసి ముచ్చటతో చిటిక వేస్తాడు ఆకాశాన అటుగా వెళుతున్న తుంబురుడు. బెదిరిపోయిన లేళ్ళను చూసి ముక్కోపి అయిన ఆముని ప్రమధుడిని మానవ జన్మ ఎత్తమని శపిస్తాడు. అయ్యో! "నీ సర్వభుతానుకంపకు సంతసిల్లి చిట్ట మిడిచితిని ఇది నాకు చెట్ట యయ్యె"—అని బాధ పడ్డాడు తుంబురుడు. అప్పుడు ముని నొచ్చుకుని " నువ్వు అంత తప్పేం చెయ్యలేదులే కాని ఏం చేస్తాం.

నీ భార్య నాదగ్గర ఉంటుంది. నువ్వు నిద్రపోయి లేచిన వాడిలా వెంటనే వచ్చెయ్యి" అన్నాడు.. షట్కాల లింగార్చనలు చేస్తూ, ఏకామ్రనాథుని ఆరాధించే శుద్ధ వీర శైవాచార పరాయణుడైన చిఱుతొండనంబిగా కంచి పట్టణంలో జన్మిస్తాడు. అనుకూలవతి అయిన తిరువెంగనాంచి భార్య, ఉత్తముడైన సిరియాలుడు కొడుకు.

ఒక సారి ఒక మిండ జంగముడు 'పాటి గట్టు తూమున ' (చేత్తో తిప్పే గానుగ) పట్టిన తూమెడు ఇక్షు రసం హరుడికి అభిషేకం చేయడానికి కావాలి అని అడిగాడు. సరే నన్న చిఱు తొండనంబి తను కొన్న చెరుకుగడలను మోయలేక పోతే శివుడు అతనికి సాయపడి చెమటలు కక్కుతాడు. అప్పుడు పైన కైలాసం లో దేవతల,మునుల సమక్షంలో అప్సరసల నాట్యం చూస్తున్న శివుడు చాంచల్యంతో చెమర్చాడు అనుకుని కలువ పువ్వుతో ఒకటి వేస్తుంది పార్వతి. దానికి శివుడు చెప్పిన చక్కటి సమాధానం చూడండి

**కమలాక్షి! యిది యేమిగాఁ దలంచితి విప్పు**
**డర్ధ దేహంబు నీ యదియ కాదె ?**
**హృదయంబు పొరువున హృదయ ముండుట లేదె**
**ఏకీభవించిన యిరువురకును ?**
**ఏ భావమైన నీ హృదయంబునకు దాప**
**నే భంగి వచ్చు హృదయమునకు**

అంటూ అర్ధనారీశ్వర తత్త్వాన్ని మర్చిపోయిన పార్వతిని అదేం ప్రశ్న అని ప్రశ్నతో నే జవాబు చెప్పి, అసలు కథని "జమ్బూద్వీపే భరతఖండే ..." అన్నట్టుగానే పురాణ ఫక్కీలో శివుడు పార్వతికి చిఱుతొండనంబి కథ చెబుతూ .. "దీవులందెల్ల నేరేటి దీవి లెస్స, భరతఖండంబు మేల్ ..." అని మొదలు పెడతాడు. కథ విన్న ఆదేవి తాను కూడా ఆభక్తుని చూడాలని ముచ్చట పడుతుంది. వీళ్ళ ముచ్చట భక్తులకి ఎప్పుడూ పరీక్షే కదా! రాజు తలుచుకుంటే దెబ్బలకి కొదువలేదన్నారు. ఈయన రాజశేఖరుడాయే. ఇంద్రుడి ని పిలిచి 21 రోజులు వాన కురిపించామన్నాడు. ఇంద్రుడు **"పుష్కలావర్తకాది అంబోధరాలని సంకిలియ లూడ్చి తెప్పించి సత్వరము పంచె కాంచీ పురంబునకు"** ఇంకేముంది ఏనుగు తొండాలంత ధారలతో వాన కురిసింది. వాన వెలిశాక ఉదయం శివార్చన చేసి, జంగమదేవునికై '**భ్రమసి తప్పిన పసరంబు నెమకినట్లు, బెరసి చేదప్పి పడ్డసొమ్మరసినట్లు**' (తప్పిపోయిన పశువునో, పోగొట్టుకున్న సొమ్మునో వెతికినట్లు) వీధుల,వాడల వెతకటం మొదలు పెట్టాడు చిఱుతొండడు. ఎవ్వరు ఎదురుపడలేదు. చివరికి ఒక ముసలి జంగం గుడ్డిదైన భార్యతో కనబడ్డాడు.

అతను '**తల వడంకగ నొయ్య నీరెలుగు పడుచు, నంబి నెమ్మోము తేరుకొనంగ చూచి, బొక్కణము లోన నున్న విభూతి ఇచ్చి , అతని వదనముచే వెలుగిడి చూచి**,' అన్న ఈ వర్ణన చూడండి. తల వణుకుతుండగా, చిఱుతొండని తేరుపార చూసి, తన భరిణలో ఉన్న విభూతి అందిచి, మొహానికి అడ్డంగా చెయ్యి ఎత్తి పెట్టి చూసినట్టు చేసిన ఈ వర్ణన అత్యంత సహజంగా ఉంది. " నేను నీ ఇంటికి వస్తాను కాని నాకు ఒక వ్రతం వుంది. హరుని ఉద్దేశించి చేసిన నా ఉపవాస దీక్ష ఇవాళ ముగుస్తుంది. దానికి ఉద్యాపనగా అన్నివిధాలా శ్రేష్టుడైన బాలుడిని వండి భోజనంగా పెట్టాలి" అంటాడు ముసలి జంగముడు. నంబి 'సరే నా కొడుకుని భోజ నంగా ఇస్తాను' అన్నాక కూడా రకరకాల ప్రశ్నలు, పరీక్షలు పెడతా రు శివుడు, పార్వతి.

**"నీకు చంపగవచ్చుఁబో నియమ నిష్ఠఁ తల్లి కోర్వంగ వచ్చుఁబో,ధైర్య గరిమ మాకు భుజియింప వచ్చుఁబో, మనసు తివుట చిఱుత వానికి చావంగ నఱిది కాదు"** అంటాడు జంగముడు. తిరు వెంగనాంచితో "**ఈ దొంగ జంగముని మాట విని నీ భర్త నీ కుమారుని చంపుతానంటున్నాడు వాడు మగవాడో మానో**"— అంటుం ది పార్వతి. అన్నిటికి ఓర్చి నియమాన్ని పాటిస్తారు ఆ దంపతులు, కుమారుడు. చివరికి శివుని లీల వల్ల తల్లి పిలువగానే సజీవుడై తిరిగి వస్తాడు సిరియాలుడు. ప్రత్యక్షమై ముక్తిని ఇస్తానన్న శివుని తో 'మా ఏడువాడల వారికి కూడా ఇస్తేనే నాకు కావాలి. లేక పోతే నీవు ఇచ్చే మోక్షం నాకు వద్దు' అంటాడు. అలా తన వారందరితో మోక్షం పొందుతాడు చిఱుతొండ నంబి.

తరువాతి రెండు ఆశ్వాసాలలో కథ తారకుడి దుండగా లు,ఇంద్రాదులు బ్రహ్మని ప్రార్థించడం, మన్మధ దహనం, పార్వతి తపస్సు, శివపార్వతులకల్యాణం. ఈ భాగం కాళిదాసు కుమార సంభవానికి అనువాదం. కాళిదాసు ముందుగా పార్వతి జననం మొదలు శివుని పరిచర్యలకై హిమవంతుడు పార్వతిని నియోగిం చడం దాకా ప్రథమ సర్గలో చెప్పి, ద్వితీయ సర్గలో తారకుని కథతో మొదలు పెట్టటం జరిగింది. శ్రీనాథుడు ఈ వరస కొంచం మార్చి తారకాసురుని త్రిలోకాధిపత్యం,అతని దుండగాలతో మొదలు పెట్టడం జరిగింది. "**శబ్దంబు అనుసరించి, అభిప్రాయంబు గుర్తిం చి,భావంబు ఉపలక్షించి ,రసంబు పోషించి, అలంకారంబు భూషించి , ఔచిత్యంబు ఆదరించి,అనౌచిత్యంబు పరిహరించియు**" అన్న అను వాద నియమాలను తానే నిర్ణయించుకున్నాడు శ్రీనాథుడు.

ఈ భాగంలో అనువాదంలో ఉన్న ఇంపులేమిటో, సొంపులేమిటో రెండు మూడు ఉదాహరణల్లో చూద్దాం.

తారకుడు ముల్లోకాలను జయించి అందరిని తనకు సేవకులుగా చేసుకున్నాడు అని చెబుతున్న సందర్భంలో

**జ్వలన్మణిశిఖాశ్చైనం**
**వాసుకిప్రముఖా నిశి**
**స్థిర ప్రదీపతా మేత్య**
**భుజంగాః పర్యుపాసతే ||** కుమారసంభవం. ద్వి.సర్గ. శ్లో. 38

(తమ తలలపై ప్రకాశిస్తున్న మాణిక్యకాంతులు కల వాసుకి మొదలగు నాగ నాయకులు వానికి ఆరని మణి దీపములై సేవించుచున్నారు) దీనికి కవిసార్వభౌముని అనువాదం.

**మ. ప్రకట స్నేహ దశా ధురంధరత పర్వంగా నిశీథంబులన్**
**సకలాంగంబులు నిక్కి దీపకళికా స్తంభంబులై యుండ్రు పా**
**యక చూడామణు లొప్ప రాక్షసుని శుద్ధాంతంబులన్ శేష వా**
**సుకి కర్కోటక తక్షక ప్రముఖ చక్షు శ్శ్రోత్ర బృందారకుల్**

హరవిలాసం. తృతీయాశ్వాసము. ప. 5

రాత్రి వేళల బాగా ప్రకటింప బడే ప్రతిభావంతమైన చమురుతో తడిసి వెలిగే వత్తులకాంతి, ఆ రాక్షసుని భవనాలలో పరచుకోగా, శేషుడు, వాసుకి, కర్కోటకుడు, తక్షకుడు మొదలైన ప్రముఖులైన దివ్య సర్పాలు శిరస్సుల మీద ఉన్న మణులు ప్రకాశిస్తుండగా,ముడుచుకు పోయే తత్త్వం గల తమ శరీరాలని నిక్కబొడిచి నిల్చి, దీపాలను మోసే స్తంభాల వలె విడువకుండా సేవిస్తున్నారు. —దివ్య సర్పాలు అనడం, సకలాంగములు నిక్కి పెట్టి నిల బడ్డారు, పాయక యుండ్రు ( విడువక సేవిస్తున్నారు) అనడం చక్కని చేరుపు, కూరుపు.

తపో వేష ధారణ చేసిన పార్వతిని వర్ణిస్తూ మూలంలో కొన్ని శ్లోకాలలో చెప్పిన వివిధ విశేషాలను, తనకుగా చేర్చిన మరికొన్నిటిని కలబోసి చెప్పిన ఈ సీసపద్యం తనదైన శైలిలో ఊగిసలాడించాడు శ్రీనాధుడు.

**ముత్యాల మొలనూలి మురువు సూపెడునట్టి**
**జఘనంబుపై మౌంజి సవదరించె**
**కందుక క్రీడ పై గారాబు పచరించు**
**హస్తాబ్జముల బూనె అక్షమాల**
**కస్తూరి కాంగ రాగములతో విలసిల్లు**
**తనువల్లి హత్తించె ధవళభూతి**
**బొమ్మ పెండిలి పాట ప్రొద్దుపుచ్చు నెలుంగు**
**నీల కంఠస్తోత్ర నియతి గూర్చె**

...

**పరమ కల్యాణి గిరిసార్వభౌము తనయ**

– హరవిలాసం. చతుర్థాశ్వాసము. ప.11

తపోదీక్షలో ఉన్న గౌరికి, కపట విప్రకుమారునికి జరిగిన సంభాషణ. ఈ సందర్భంలో వటుడు పార్వతితో అన్న మాటలు

**'కియ ఛ్చిరం శ్రామ్యసి గౌరి! విద్యతే**
**మమాపి పూర్వాశ్రమ సఞ్చితమ్ తపః**
**తదర్ధ భాగేన లభస్వ కాంక్షితం**
**వరం త మిచ్ఛామి చ సాధు వేదితుమ్ '**

కుమారసంభవం. ఐదవ సర్గ శ్లో . 50

(ఓ గౌరీ! ఎంతకాలము తపస్సుచేయుచు కష్టపడెదవు? నేను బ్రహ్మచర్యాశ్రమము నందు తపస్సును పోగుచేసితిని. దానిలో సగ భాగము నీ కిచ్చెదను. దానితో నీ కోర్కెను పొందుము. ఇంతకు నేను ఆ వరుడెవరో బాగా తెలుసుకొన గోరుతున్నాను.)

ఇక్కడ మాయా వటువు రూపంలో ఉన్న శివుని కాస్త గడసరిగాను, కొంటెవానిగాను చిత్రించ దలచాడు కవి.

